www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 2-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 3 | వరంగల్

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి: అష్టమి రా. 8.10 తదుపరి నవమి; నక్షత్రం: పూర్వాషాఢ రా. 10.50 తదుపరి ఉత్తరాషాఢ; వర్జ్యం: ఉ.8.39-10.14; దుర్ముహూర్తం: ఉ.8.39-9.28, రా.10.17-11.03; అమృతఘడియలు: సా.6.06-7.41; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.13; సూర్యాస్తమయం: 6.26

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తమిళం నేర్చుకుంటా.. ఐరాసలో మాట్లాడతా



ఆ ప్రాచీన భాష గొప్పతనాన్ని చాటి చెప్పాలి
రాజకీయాల వల్లే ఆ భాష విస్తరించలేదు
ఇంకా నయం ఇడ్లీ, దోసెలను
రాజకీయం చేయలే.. నాకు ఉప్మా, పొంగల్ ఇష్టం
వికసిత్ భారత్ లక్ష్య సాధనలో తమిళనాడే కీలకం
ఎన్డీఏ అన్ని పుష్పాల గుచ్ఛం: ప్రధాని మోదీ
2

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ వాయిదా

జూన్ 2కు రీ షెడ్యూల్ చేసిన ఈసీ
లోక్‌సభ ఎన్నికల కోడ్ వల్లే..
3

వెరీ 'హాట్'..!

ఇటు ఎన్నికల హీటు.. అటు మండుటెండలు
ఈ వేసవిలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మంటలే
దేశంలో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు
తెలుగు రాష్ట్రాల్లోనూ ఎండల తీవ్రత అధికం
ఈసారి ఎక్కువ రోజులు వడగాడ్పులు: ఐఎండీ
రాష్ట్రంలో 43 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు
నేడు, రేపు ఆరెంజ్ అలెర్ట్.. వడగాడ్పులు ఎక్కువే

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తరుణంలో భారతదేశం విపరీతమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కోనుంది. ఒక పక్క ఎన్నికల హీటు.. మరో పక్క మండుటెండలు దేశాన్ని ఉక్కిరిబిక్కిరి చేయనున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ దేశంలో అత్యంత తీవ్ర వేసవి పరిస్థితులు ఏర్పడనున్నాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దీంతో ఈ ఏడాది ఎన్నికల 'వేడి'.. సాధారణ ఎన్నికల 'వేడి'కి సమానంగా ఉండనుందని భావిస్తున్నారు..!
3



ఎండలు మండిపోతుండడంతో హైదరాబాద్‌లోని జింఖానా విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లకు గోనె సంచులు కట్టిన సిబ్బంది

థర్మల్ విద్యుత్తుకు స్వస్తి!

సంప్రదాయేతర ఇంధన వనరులపై దృష్టి
సోలార్, పంప్డ్‌స్టోరేజీ, జల విద్యుత్తు వైపే మొగ్గు
కొత్త విద్యుత్తు పాలసీపై రేవంత్‌రెడ్డి సర్కారు నజర్
14



బాలికపై నీళ్లు పోసి.. నిలదీసిన
తండ్రి గొంతు కోసి..

నార్సింగ్‌లో పోకిరీల ఘాతుకం
ఇద్దరి అరెస్టు.. కత్తులు స్వాధీనం
14



టోల్ బాదుడుకు 2 నెలల విరామం

ఎన్నికల నేపథ్యంలో కేంద్రం నిర్ణయం
ఆ నష్టాన్ని ఎన్‌హెచ్ఏఐ భరిస్తుందంటూ మౌఖిక సందేశం
అధికారిక ఉత్తర్వులు కోరిన జాతీయ హైవే బిల్డర్స్ ఫెడరేషన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: జాతీయ రహదారులపై టోల్ ఫీజు పెంపుదలను రెండు నెలలపాటు నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలోనే గతంలో ఎన్నడూలేని విధంగా పెంపుదలను నిలిపివేస్తూ జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఆదేశాలు జారీ చేసింది. గత వారమే కేంద్రం ఈ మేరకు ఎన్నికల సంఘం అనుమతిని కోరింది. ఈసీ ఆ మేరకు అనుమతి ఇచ్చింది. సాధారణంగా జాతీయ రహదారులపై టోల్ చార్జీలు ప్రతి ఏడాది ఏప్రిల్ 1 నుంచి పెరుగుతాయి. అయితే టోల్ ఫీ పెంపుదలను రెండు నెలలపాటు నిలిపివేయాలంటూ స్థానిక ప్రాజెక్టు డైరెక్టర్లు
మిగతా 2వ పేజీలో...

బీఆర్ఎస్ కోసం స్పెషల్ టాస్క్!

గులాబీ గెలుపు కోసం ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్ స్పెషల్ ఆపరేషన్

ఒకే సామాజిక వర్గ అధికారులతో బృందాలు
నల్లగొండకు ప్రణీత్.. రాచకొండకు భుజంగరావు ఇన్‌చార్జి
తెరపైకి మాజీ అదనపు ఎస్పీ వేణుగోపాల్‌రావు పేరు
సిగ్నల్, వాట్సాప్, స్నాప్‌చాట్‌లోనే సమాచార మార్పిడి
మార్గదర్శకుడు ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు
ఆయన చెప్పినట్లుగా తస్మదీయుల డబ్బు పట్టివేత
అస్మదీయుల నగదు రవాణాకు టాస్క్‌ఫోర్స్ వాహనాలు
ఫోన్ ట్యాపింగ్‌తో ప్రత్యర్థి పార్టీల ఆర్థిక మూలాలపై దాడి
దుబ్బాక ఉప ఎన్నికలో రఘునందన్ బంధువు వద్ద కోటి
మునుగోడు ఉప ఎన్నికలో కోమటిరెడ్డి సొమ్ము 3.5 కోట్లు
2018లో శేరిలింగంపల్లి టీడీపీ అభ్యర్థి డబ్బు 70లక్షలు సీజ్
బాల్య స్నేహితుడైన ఎమ్మెల్సీకి రాజ్‌పుష్ప నుంచి డబ్బు తరలింపు.. రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్టులో వెల్లడి
బీఆర్ఎస్‌లోనూ అనుమానితుల ఫోన్ల ట్యాపింగ్



రాధాకిషన్‌రావు

హైదరాబాద్ సిటీ, హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): "మూడోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టించాలని ఎంతో కృషి చేశాం..! ప్రత్యర్థి పార్టీల నేతల ఫోన్లను ట్యాప్ చేశారు. వారు డబ్బును తరలించే వివరాలను అందజేశారు. ఆ లీడ్స్‌తో మేము దాడులు చేసి, నగదును సీజ్ చేశాం..! ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం. ఆయన మార్గదర్శనంలోనే ఒకే సామాజికవర్గానికి చెందిన పోలీసులతో 'స్పెషల్ ఆపరేషన్' చేపట్టాం. బీఆర్ఎస్‌లో అనుమానిత నేతల ఫోన్లను కూడా ట్యాప్ చేశాం!".. ఇవీ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్(ఎస్ఐబీ) కేంద్రంగా సాగిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో అరెస్టయిన టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు రిమాండ్ రిపోర్టులోని కీలకాంశాలు. పంజాగుట్ట పోలీసులు నాంపల్లి కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో ఫోన్ ట్యాపింగ్ జరిగిన తీరు మొదలు.. బీఆర్ఎస్ కోసం పోలీసులు డబ్బును తరలించడం.. ప్రత్యర్థి పార్టీలకు సంబంధించిన నగదును సీజ్ చేయడం వరకు ప్రభాకర్‌రావు 'స్పెషల్ ఆపరేషన్ టీమ్' విధులను రాధాకిషన్ వివరించినట్లు రిమాండ్ రిపోర్టు స్పష్టం చేస్తోంది. పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును ఇంటెలిజెన్స్ చీఫ్(ఓఎస్డీ)గా నియమించడం గత ప్రభుత్వ పెద్దల వ్యూహాత్మక చర్య అని రాధాకిషన్‌రావు పేర్కొన్నట్లు దర్యాప్తు అధికారులు రిమాండ్ రిపోర్టులో పోలీసులు
మిగతా 14వ పేజీలో...

'కాళేశ్వరం' దోషులెవరో తేల్చండి

విచారణ కమిటీ చైర్మన్ ఘోష్‌ను కలిసేందుకు కోల్‌కతాకు ఇరిగేషన్ అధికారులు
బీఆర్‌కేఆర్ భవన్‌లో విచారణ కార్యాలయం ఏర్పాటు
13



కేజ్రీవాల్ తిహాడ్ జైలుకు

15 వరకూ జ్యుడిషియల్ కస్టడీకి ఆదేశించిన కోర్టు
రామాయణం, భగవద్గీత, హౌ డూ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్ పుస్తకాలకు అనుమతి
అతిషి, సౌరభ్‌తోనే నాయర్ మాట్లాడినట్లు కేజ్రీ చెప్పారు
విచారణను తప్పుదోవ పట్టించేందుకు యత్నిస్తున్నారు
ప్రత్యేక కోర్టులో ఈడీ తరఫు న్యాయవాది ఎస్వీ రాజు
పదవిలో ఉండి జైలుకెళ్లిన తొలి సీఎంగా కేజ్రీ రికార్డు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సోమవారం తిహాడ్ జైలుకు తరలించారు. తద్వారా, పదవిలో ఉంటూనే అరెస్టైన, జైలుకు వెళ్లిన తొలి ముఖ్యమంత్రిగా ఆయన చరిత్రకెక్కారు! అంతకు ముందు.. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఏప్రిల్ 15వ తేదీ వరకూ జ్యుడీషియల్ కస్టడీకి పంపించాలని రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా
మిగతా 2వ పేజీలో...

జైల్లో జపం చేసుకుంటా!

ప్రత్యేక జపమాల కావాలన్న ఎమ్మెల్సీ కవిత
నడకకు స్పోర్ట్స్ షూ.. పుస్తకాలు కూడా
బెయిల్‌పై వాదనలు.. విచారణ ఎల్లుండికి వాయిదా
3



జ్ఞానవాపీలో పూజలు
చేసుకోవచ్చు

నిలుపుదలకు నిరాకరించిన సుప్రీంకోర్టు
నమాజ్‌పై యథాతథ స్థితి కొనసాగింపు
2



బ్లేడ్‌తో కోస్తున్నారు!

కలిసేందుకు వచ్చేవారిలో కిరాయి మూకలు
నన్ను 'సెక్యూరిటీ'ని బ్లేడ్లతో కోస్తున్నారు
ప్రత్యర్థి పార్టీ పన్నాగాలు తెలుసు కదా
పగిలే కొద్దీ గాజు గ్లాసుకు పదునెక్కువ
వైసీపీ ఫ్యాన్‌కు సౌండెక్కువ.. గాలి తక్కువ
జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు
12

వరంగల్ టికెట్ కావ్యకే

ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం.. కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాలపై ఇంకా వీడని సస్పెన్స్
ఖమ్మం రేసు నుంచి వైదొలగిన భట్టి నందిని!



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో మరో లోక్‌సభ స్థానానికి అభ్యర్థిని ప్రకటించింది. ఆదివారమే పార్టీలో చేరిన స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యను వరంగల్ అభ్యర్థిగా నిర్ణయించింది. సోమవారం జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ సమావేశంలో ఆమె పేరును ఖరారు చేశారు. మొత్తం నాలుగు స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయాల్సి ఉండగా.. కేవలం వరంగల్‌కు మాత్రమే ఖరారు చేసి మరో 3 స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. కడియం కావ్య తొలుత వరంగల్ నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపిక కాగా, ప్రస్తుతం
మిగతా 13వ పేజీలో...



కాంగ్రెస్‌పై బలవంతపు
చర్యలు తీసుకోం!

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం
ఆదాయపు పన్ను నోటీసులపై సుప్రీంకోర్టుకు తెలిపిన ఐటీ శాఖ
తదుపరి విచారణ జూలై 24న
2



ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో దాడికి పాల్పడుతున్న ఈటల అనుచరులు, బీజేపీ ఉప్పల్ నాయకులు

ఈటల అనుచరుల వీరంగం

ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో హుజూరాబాద్ దళితుల ప్రెస్ మీట్ సందర్భంగా రగడ
కుర్చీలు, టీవీ చానళ్ల లోగోలు ధ్వంసం
కేసు నమోదు చేసిన పోలీసులు
12

కేటీఆర్‌ను చూసి జాలిపడదాం

సీఎం అయిపోయినట్టు కలలు గన్నారు
ఆయన కలలన్నీ నీటి మూటలయ్యాయి
తండ్రీ కొడుకుల వల్లే తెలంగాణకు నష్టం
ఇంతలోనే బీఆర్ఎస్ కూలుతుందనుకోలే
రుణమాఫీపై సీఎం రేవంత్ మాటతప్పారు
5న జిల్లాల్లో 'రైతు సత్యాగ్రహం'
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): "సీఎం అయిపోయినట్లు కేటీఆర్ కలలు గన్నారు. పోలింగ్ తర్వాత కూడా క్యాబినెట్‌లో ఎవరు హోంమంత్రో... ఎవరు రెవెన్యూ మంత్రో రాసిపెట్టుకున్నారు. కానీ, ఆయన కలలన్నీ నీటి మూటలయ్యాయి. ఇంకా అధికారంలోనే ఉన్నట్లుగా ఫీలవుతూ ఆయన ఏదేదో మాట్లాడుతున్నారు. అందుకే ఆయన పట్ల సానుభూతి చూపడంతోపాటు ఆయన్ను చూసి జాలిపడదాం" అని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. తండ్రీ కొడుకుల తప్పిదాల వల్లే తెలంగాణకు నష్టం జరిగిందని ఆరోపించారు. వారి అహంకారం వల్లే రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో
మిగతా 12వ పేజీలో...





23 టీఎంసీల నీటిని కిందకు వదిలేశారు

కాళేశ్వరం కూలిపోతుందని భయపడి బ్యారేజీలు ఖాళీ చేసి.. మాపై నిందలా..?
రైతు ఆత్మహత్యలపై కేసీఆర్ అబద్ధాలు
ఫోన్ ట్యాపింగ్‌లో పెద్ద తలలూ జైలుకే
నా ఫోను కూడా ట్యాప్ అయింది: ఉత్తమ్
పంటలు ఎండబెట్టింది కేసీఆరే
ఓట్ల కోసం కాల్వల గేట్లు ఎత్తేశారు
రాష్ట్రంలో కరెంటు సరఫరాకు ఢోకాలేదు: భట్టి
నెలాఖరులోగా అందరికీ రైతుబంధు: తుమ్మల
రైతులపై కేసీఆర్ మొసలి కన్నీరు: శ్రీధర్‌బాబు
పదవి పోగానే రైతులు గుర్తొచ్చారా?: సురేఖ

హైదరాబాద్/న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): "కాళేశ్వరం ప్రాజెక్టు ఎక్కడ కూలిపోతుందోనని నీళ్లు వదిలేసింది కేసీఆరే. బ్యారేజ్‌లు కూలిపోతాయనే భయంతోనే 23 టీఎంసీలను విడిచిపెట్టారు. ఇప్పుడు మా మీద నిందలు వేస్తున్నారు. కేసీఆర్ కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు.. ఆయన హయాంలోనే కూలిపోయినందుకు సిగ్గుపడాలి" అని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. గాంధీభవన్‌లో సోమవారం ఉత్తమ్ మీడియాతో
మిగతా 13వ పేజీలో...

రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం

పార్లమెంట్ ఎన్నికల తర్వాత జరిగేది ఇదే
దేశంలో కాంగ్రెస్‌కు 40 ఎంపీ సీట్లు కూడా రావు
రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని మేం కూలగొట్టబోం
ఖమ్మం, నల్లగొండ నేతల నుంచే ప్రమాదం
హామీల అమలుకు సర్కారును నిలదీస్తాం: కేటీఆర్
ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి కాంగ్రెస్
రేవంత్‌రెడ్డిని దొంగతో పోల్చిన కడియం శ్రీహరి
ఆయనతోనే కండువా కప్పించుకున్నారు: హరీశ్
ముసలి నక్కలన్నీ కాంగ్రెస్‌లోకి: రసమయి
ఉత్తమ్ మాటలు బాధ్యతారాహిత్యం: శ్రీనివాస్‌గౌడ్
రైతుల ఉసురుపోసుకుంటున్న కాంగ్రెస్: నిరంజన్
12

జాతీయ భద్రత, ఆర్థిక నేరాలపైనే
సీబీఐ దృష్టి పెట్టాలి



కొన్నేళ్లుగా విభిన్న కేసులను దర్యాప్తు చేయాల్సి వస్తోంది
హక్కులకు, విధివిధానాలకు మధ్య సమతుల్యత పాటించాలి
సీబీఐ ఆవిర్భావ దినోత్సవంలో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యలు
2

బంగ్లాదేశ్‌లో బాయ్‌కాట్ భారత్

- భారత వస్తువుల బహిష్కరణకు ప్రతిపక్షం పిలుపు
- బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటోందని ఆరోపణ
- 'బాయ్‌కాట్ భారత్' అంటే.. ముందు మీ భార్యల చీరలను కాల్చేయండి: హసీనా

బంగ్లాదేశ్.. భారత్ మద్దతుతో ఏర్పడిన దేశం. ఇండియాతో అత్యంత సుదీర్ఘమైన భూసరిహద్దును కలిగి ఉన్న దేశం. వాణిజ్యావసరాలకు మనపైన ఆధారపడమే కాకుండా గతంలో భారత ఉపఖండంలో భాగంగా ఉండి సాంస్కృతికంగానూ భారత్‌కు ఎంతో దగ్గరైన దేశం. అలాంటి దేశంలో ఇప్పుడు 'బాయ్‌కాట్ ఇండియా' నినాదం బయల్దేరింది. బంగ్లాదేశ్ ప్రస్తుత ప్రధాని షేక్ హసీనా జనవరిలో 5వ సారి అధికారంలోకి వచ్చాక.. సోషల్ మీడియా వేదికగా ప్రారంభమైన ఈ ఉద్యమం ఇప్పుడు ఊపందుకుంది. బంగ్లాదేశ్ అంతర్గత వ్యవహారాల్లో భారత్ జోక్యం చేసుకుంటోందని, తమ సొంత ప్రయోజనాల కోసం షేక్ హసీనానే మళ్లీ ప్రధాని అయ్యేలా గత ఎన్నికల్లో అప్రజాస్వామిక చర్యలకు పాల్పడిందని ఐరోపా, అమెరికా దేశాల్లో ఉంటున్న ప్రవాస బంగ్లాదేశీలు తొలుత 'బాయ్‌కాట్ భారత్' ఉద్యమానికి పిలుపునిచ్చారు. భారత్ నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులను కొనవద్దని, వాడవద్దని బంగ్లాదేశ్ ప్రజలను కోరారు. ప్రస్తుతం పారిస్‌లో ప్రవాస జీవితం గడుపుతున్న బంగ్లాదేశీ వైద్యుడు పినాకీ భట్టాచార్య ఈ ఆన్‌లైన్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ప్రవాసీ బంగ్లాదేశీల పిలుపునకు బంగ్లాదేశ్‌లో కొన్ని వర్గాల నుంచి మద్దతు రావడంతో ప్రతిపక్ష బీఎన్‌పీ ఈ 'బాయ్‌కాట్ భారత్' నినాదాన్ని అందిపుచ్చుకొంది. షేక్ హసీనా భారతదేశ అవసరాల కోసం పనిచేస్తున్నారని ఆరోపిస్తోంది. ఈసారి బంగ్లాదేశ్ పార్లమెంటు ఎన్నికలు అత్యంత వివాదాస్పదమైనప్పటికీ, ప్రతిపక్షాలు ఈ ఎన్నికలను బహిష్కరించినప్పటికీ.. హసీనా ప్రధాని అయిన వెంటనే భారత ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలుపడం, మద్దతు ప్రకటించడమే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించింది. అయితే, బంగ్లాదేశ్‌లో 'బాయ్‌కాట్ భారత్' ఉద్యమం జనం నుంచి పుట్టలేదని, కేవలం రాజకీయ ఎజెండానే అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇది సోషల్ మీడియాలోనే ట్రెండింగ్‌లో ఉంది తప్ప, వాస్తవంలో అంతగా జనాదరణ లేదన్నారు.




వాటన్నింటినీ కాల్చివేస్తారా?

'బాయ్‌కాట్ భారత్' నినాదంపై బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా అత్యంత తీవ్రంగా స్పందించారు. ఇండియా నుంచి దిగుమతి చేసుకున్న వస్తువులను బాయ్‌కాట్ చేయాలంటే ప్రతిపక్ష బీఎన్‌పీ నేతలు ముందుగా తమ భార్యల చీరలను వారి నుంచి లాగేసుకొని కాల్చేయాలన్నారు. "బీఎన్‌పీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతల భార్యలు ఇండియాకు వెళ్లి భారీ సంఖ్యలో చీరలు కొనుక్కొని రావడం, వాటిని బంగ్లాదేశ్‌లో అమ్మడం చూశాను. వాటన్నింటినీ కాల్చివేస్తారా" అని హసీనా ప్రశ్నించారు. ఇండియా నుంచి దిగుమతి చేసుకుంటున్న మసాలాలు, ఉల్లిగడ్డం, అల్లం, వెల్లుల్లి ఇవేవీ లేకుండా ఆహారం వండుకొని తినాలన్నారు. కాగా, ఇటీవల మాల్దీవుల్లో కూడా 'ఇండియా అవుట్' ఉద్యమం జరిగిన సంగతి తెలిసిందే. గతంలో ప్రతిపక్షంలో ఉన్న ముయిజ్జు ఈ నినాదంతోనే అధికారంలోకి వచ్చారు. కాగా, రంజాన్ నేపథ్యంలో బంగ్లాదేశ్‌కు 50వేల టన్నుల ఉల్లిగడ్డలను పంపాలని భారత ప్రభుత్వం ఇటీవలే నిర్ణయించింది.

- సెంట్రల్ డెస్క్

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	41.2	25.6
రామగుండం	40.8	23.6
ఖమ్మం	40.0	26.0
నల్లగొండ	40.0	24.0
హైదరాబాద్	39.0	26.0

టోల్ బాదుడుకు 2 నెలల విరామం

(మొదటి పేజీ తరువాయి)

మార్చి 30న మౌఖికంగా టోల్ నిర్వహణ సంస్థలను ఆదేశించారు. దీనిపై హైవే డెవలపర్స్ ఆర్గనైజేషన్, జాతీయ హైవే బిల్డర్స్ ఫెడరేషన్ (ఎన్‌హెచ్‌బీఎఫ్) ఆదివారం స్పందించాయి. 'ఎలాంటి కారణం చెప్పకుండా పెంపుదలను నిలిపివేయాలంటూ జారీ చేసిన మౌఖిక ఉత్తర్వులు గందరగోళానికి దారితీస్తాయి. స్పష్టత కోసం అధికారిక ఉత్తర్వులు జారీ చేయాలి. పెంపుదలను రెండు నెలలపాటు నిలిపివేయడంతో వచ్చే నష్టాన్ని ఎన్‌హెచ్ఏఐ భర్తీ చేస్తుందంటూ ఇచ్చిన హామీని కూడా లిఖితపూర్వకంగా ఇవ్వాలి' అంటూ ఎన్‌హెచ్ఏఐకి ఓ లేఖ రాశాయి. కాగా కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఒక వాహనానికి ఒకే ఫాస్టాగ్ అమల్లోకి వచ్చింది.

36 కోట్ల పెట్రోల్, డీజిల్ వాహనాలకు స్వస్తి

- దశలవారీగా అమలు చేస్తాం: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, ఏప్రిల్1: దేశంలోని 36కోట్ల పెట్రోల్, డీజిల్ కార్లు/భారీ వాహనాలను దశలవారీగా తొలగిస్తామని కేంద్ర ఉపరితల రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఈ విషయంలో వాహనదారులను ప్రోత్సహించేందుకు హైబ్రిడ్, ఫ్లెక్సీ వాహనాలపై జీఎస్టీని తగ్గించే ఆలోచన ఉందన్నారు. హైబ్రిడ్ వాహనాల జీఎస్టీని 5శాతానికి, ఫ్లెక్సీ వాహనాలపై 12శాతానికి తగ్గించాలని కోరుతూ కేంద్ర ఆర్థిక శాఖకు లేఖ రాసినట్లు ఆయన తెలిపారు. ఆర్థికశాఖ త్వరలో దీనిపై సానుకూల నిర్ణయం తీసుకోనుందని అభిప్రాయపడ్డారు. "పెట్రోల్ ఉత్పత్తుల దిగుమతికి మన దేశం రూ.16 లక్షల కోట్లు వెచ్చిస్తోంది. ప్రత్యామ్నాయ ఇంధనాలపై దృష్టి సారిస్తే.. ఆ మొత్తాన్ని రైతులు, వ్యవసాయం కోసం వెచ్చించవచ్చు" అన్నారు. గడ్కరీ నిర్ణయాన్ని పర్యావరణవేత్తలు స్వాగతిస్తున్నారు.

విమానం బయలుదేరడం ఆలస్యమైతే ప్రయాణికులు దిగిపోవచ్చు

న్యూఢిల్లీ, ఏప్రిల్1: బోర్డింగ్ తర్వాత విమానం బయలుదేరడం ఆలస్యమైతే ప్రయాణికులు దిగిపోయి ఎయిర్‌పోర్టు డిపార్చర్ గేట్ ద్వారా బయటకు రావచ్చని బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) పేర్కొంది. ఈ మేరకు మార్చి 30న రూపొందించిన నిబంధనలను సోమవారం నుంచి అమల్లోకి తెస్తున్నట్లు బీసీఏఎస్ డైరెక్టర్ జుల్ఫికర్ అలీ తెలిపారు. వాళ్లు తిరిగి విమానం ఎక్కేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విమానయాన సంస్థలు, భద్రతా ఏజెన్సీలు కలిసి రూపొందిస్తాయని చెప్పారు. ఈ ఏడాది జనవరి 14న ఇండిగో విమానం ఆలస్యమైన కారణంగా ముంబై ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు రన్‌వేపై కూర్చున్న ఘటనను ఆయన గుర్తు చేశారు. ఆ ఘటనకు సంబంధించి ఇండిగో సంస్థపై రూ.1.20 కోట్ల జరిమానా విధించి వసూలు చేశామని తెలిపారు.

జ్ఞానవాపీలో పూజల నిలుపుదలకు సుప్రీం నో

న్యూఢిల్లీ, ఏప్రిల్1: వారాణసిలోని జ్ఞానవాపీ మసీదులో ఉన్న దక్షిణ సెల్లారులో హిందువులు పూజలు చేసుకోవడంపై స్టే ఇవ్వాలన్న వినతిని సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. అదే సమయంలో మసీదు ప్రాంగణంలో ముస్లింలు నమాజ్ చేసుకోవడంపై యథాతథ స్థితి కొనసాగించాలని సూచించింది. మసీదు దక్షిణ సెల్లార్ అయిన వ్యాస్ తెకాణాలో విగ్రహాలకు జరుగుతున్న పూజలను నిలిపివేయాలంటూ మసీదు నిర్వహణ కమిటీ చేసిన పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఈ నెల 30లోగా సమాధానం ఇవ్వాలని కాశీ విశ్వనాథ మందిర ట్రస్టీలను, పూజారి శైలేంద్ర కుమార్ పాఠక్‌లను కోర్టు ఆదేశించింది. ఇదిలా ఉండగా..మధ్యప్రదేశ్‌లోని ధార్ జిల్లాలో ఉన్న భోజశాల కాంప్లెక్స్‌లో ఏఎస్ఐ సర్వేపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరించింది.

రాజ్యాంగ ధర్మాసనానికి కేరళ సర్కారు వ్యాజ్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: రుణాలపై కేంద్రం విధించిన పరిమితికి సంబంధించి కేరళ ప్రభుత్వం దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి సుప్రీం కోర్టు సిఫారసు చేసింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. రుణాలపై పరివిుతి విధించడం ద్వారా రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో కేంద్రం జోక్యం చేసుకుంటోందని ఆరోపిస్తూ సుప్రీం కోర్టులో కేరళ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది.

సుప్రియ, దిలీప్ ఘోష్‌లను మందలించిన ఈసీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ నాయకురాలు సుప్రియ, బీజేపీ నాయకుడు దిలీప్ ఘోష్‌లను ఎన్నికల కమిషన్(ఈసీ) మందలించింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా బహిరంగంగా మాట్లాడే సమయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. నటి కంగనా రనౌత్‌పై సుప్రియ, పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ నేత దిలీప్‌ఘోష్ ఆ రాష్ట్ర సీఎం మమతపై ఇటీవల అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారు. ఇవి దిగజారుడు వ్యాఖ్యలకు కిందకే వస్తాయని స్పష్టం చేసిన ఈసీ ఇకపై అలా మాట్లాడొద్దని మందలించింది.

తోషఖానా కేసులో ఇమ్రాన్ జైలు శిక్ష రద్దు

ఇస్లామాబాద్, ఏప్రిల్ 1: తోషఖానా (విదేశీ బహుమతుల) దుర్వినియోగానికి సంబంధించిన కేసులో పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఆయన భార్య బుష్రా బీబీకి భారీ ఊరట లభించింది. ఈ కేసులో ఇమ్రాన్‌కు ఆయన భార్యకు పడిన 14 ఏళ్ల జైలు శిక్షను రద్దు చేస్తూ సోమవారం ఇస్లామాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది. శిక్షకు సంబంధించిన అప్పీళ్లను రంజాన్ పండుగ తర్వాత విచారిస్తామని పేర్కొంది. గతంలో ఈ కేసును విచారించిన ఇస్లామాబాద్ అకౌంటబులిటీ కోర్టు ఈ ఏడాది జనవరి 31న ఇమ్రాన్‌ను ఆయన భార్యను దోషులుగా నిర్ధారించి 14ఏళ్ల జైలు శిక్షను విధించింది.

సిరియాలోని ఇరాన్ ఎంబసీపై ఇజ్రాయెల్ దాడి

- ఓ ఇరాన్ కమాండర్ సహా 8 మంది మృతి

బ్యూరట్, ఏప్రిల్ 1: సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ ఎంబసీ భవనంపై ఇజ్రాయెల్ సోమవారం క్షిపణి దాడి చేసింది. ఈ దాడిలో ఓ సీనియర్ ఇరాన్ కమాండర్ సహా 8 మంది మృతి చెందారు. ఇజ్రాయెల్ చేసిన క్షిపణి దాడి కారణంగా ఎంబసీ భవనం మొత్తం కుప్పకూలిందని స్థానిక మీడియా పేర్కొంది. ఇరాన్ అంబాసిడర్ ఆయన కుటుంబం ఈ దాడి నుంచి సురక్షితంగా బయటపడినట్లు తెలిపింది.

కేంద్ర సాహిత్య అకాడమీకి రాధాకృష్ణన్ రాజీనామా

మలప్పురం, ఏప్రిల్ 1: కేంద్ర సాహిత్య అకాడమీ ఉత్సవాలను కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ప్రారంభించడాన్ని వ్యతిరేకిస్తూ అకాడమీ సభ్యుడి పదవికి మలయాళ రచయిత సి.రాధాకృష్ణన్ రాజీనామా చేశారు. ఈ మేరకు అకాడమీ కార్యదర్శికి సోమవారం ఆయన లేఖ రాశారు. అసలు సాహిత్యం గురించి ఏ అవగాహన లేని వ్యక్తితో ఉత్సవాలను ప్రారంభించమేంటని లేఖలో ఆక్షేపించారు. స్వయం ప్రతిపత్తి గల అకాడమీ చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారని.. అకాడమీ విషయాల్లో కేంద్రం జోక్యం పెరిగిపోయిందని ఆరోపించారు. తాను ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని.. అకాడమీ స్వతంత్ర ప్రతిపత్తిని దిగజార్చే రాజకీయంపైనే తన నిరసన అని పేర్కొన్నారు. ఇప్పటికైనా రచయితల ఆందోళనలను రాష్ట్రపతి లేదా ప్రధాని పట్టించుకుంటారనే ఆశతోనే రాజీనామా చేశానన్నారు.

కేజ్రీవాల్ తిహాడ్ జైలుకు

(మొదటి పేజీ తరువాయి)

ఆదేశాలు జారీ చేశారు. జైల్లో ఉన్న కాలంలో కేజ్రీవాల్ చదువుకునేందుకు భగవద్గీత, రామాయణంతో పాటు ప్రముఖ జర్నలిస్టు నీరజా చౌధరి రచించిన 'హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్' అన్న పుస్తకాలతోపాటు దేవుడి లాకెట్‌ను అనుమతించాల్సిందిగా ఆయన తరపు న్యాయవాదులు కోరారు. అలాగే, కేజ్రీవాల్ మధుమేహంతో బాధ పడుతుండడం, ఇమ్యూనిటీ తక్కువగా ఉండడంతో ఆయనకు ఇంటి భోజనంతో పాటు బాటిల్ నీళ్లు తెచ్చుకోవడానికి అనుమతించారు. అలాగే, ఆయన తన భార్య సునీతను కలుసుకోవడానికి అనుమతి ఇచ్చారు. షుగర్ లెవల్స్ ఒక్కసారిగా తక్కువైతే తినడానికి టోఫీలను; రగ్గు, దుప్పట్లు, దిండ్లను కూడా అనుమతించారు. కాగా, కోర్టు లోపలికి వెళుతూ కేజ్రీవాల్ విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోదీ చేస్తున్న పని (కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం) దేశానికి మంచిది కాదని వ్యాఖ్యానించారు.

ఆ ఇద్దరు మంత్రులతోనే నాయర్ చర్చలు

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌ను మార్చి 21వ తేదీన అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. గత నెల 22 నుంచి 31 వరకు ఈడీ కస్టడీలో ఉన్నారు. కస్టడీ గడువు ముగియడంతో సోమవారం ఆయనను రౌజ్ ఎవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఆయనను మరో 15 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరింది. విచారణలో కేజ్రీవాల్ ఏమాత్రం సహకరించడం లేదని ఈడీ తరఫున వాదించిన అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. ఆప్ తరఫున మధ్యవర్తిగా వ్యవహరించిన విజయ్ నాయర్ తన ఆదేశాలు తీసుకోలేదని, పార్టీ నేతలు, మంత్రులు అతిషీ మర్లెనా, సౌరబ్ భరద్వాజ్‌ని ఆయన కలుసుకునేవారని కేజ్రీవాల్ చెప్పినట్లు ఆయన వివరించారు. దాంతో, ఈ వాదనలకూ, ఆయనను జ్యుడిషియల్ కస్టడీలో ఉంచేందుకు సంబంధం ఏమిటని న్యాయమూర్తి కావేరీ బవేజా ప్రశ్నించారు. విచారణలో అనేక పొంతన లేని జవాబులు ఇచ్చారని, ఇంటరాగేషన్‌ను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. ఆయనను ఇంకా ప్రశ్నించాల్సి ఉందని, కొద్ది రోజుల తర్వాత ఆయనను మళ్లీ ఈడీ కస్టడీకి కోరతామని చెప్పారు. నిజానికి, ఢిల్లీ మద్యం కుంభకోణం ప్రధాన రూపకర్త, కుట్రదారు కేజ్రీవాల్ మాత్రమేనని, స్కాం ద్వారా వచ్చిన రూ.45 కోట్ల నిధులను గోవాలో ఎన్నికల ప్రచారానికి ఉపయోగించారని ఈడీ తన రిమాండ్ దరఖాస్తులో కోర్టుకు తెలిపిన విషయం తెలిసిందే.



జైలు నంబర్ 2లో కేజ్రీవాల్

కేజ్రీవాల్‌ను జైలు నంబర్ 2లోని ప్రత్యేక బ్యారక్‌లో ఉంచినట్లు తిహాడ్ జైలు అధికార వర్గాలు తెలిపాయి. ఈ బ్యారక్‌లో ఆయన ఒక్కరే ఉంటారని, 24 గంటల సీసీ టీవీ నిఘా ఉంటుందని వివరించాయి. కాగా, ఇక్కడి జైలు నంబర్ 1లో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా ఉండగా.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను జైలు నంబర్ 6లో ఉంచారు. జైలు నంబర్ 2లో ఉన్న ఆప్ నేత సంజయ్ సింగ్‌ను ఐదో నంబర్ జైల్లోకి మార్చారు.

ప్రభుత్వాధినేతగా, ఆప్ పార్టీ అధినేతగా మనీలాండరింగ్ నిరోధక చట్టం సెక్షన్ 70 కింద ఆయన శిక్షార్హుడని ఈడీ వాదించింది. "విజయ్ నాయర్‌తో పెద్దగా మాట్లాడలేదని కేజ్రీవాల్ చెప్పారు. కానీ, నాయర్ ఓ క్యాబినెట్ మంత్రి ఆఫీసు బంగళాలో ఉంటూ సీఎం క్యాంప్ ఆఫీసు నుంచి పనిచేసేవారు. కుంభకోణంలో భాగంగా నిందితులకూ, విజయ్ నాయర్‌కూ మధ్య జరిగిన పది సమావేశాలకు సంబంధించి సాక్ష్యాలను కేజ్రీవాల్‌కు వెల్లడించాం. దినేశ్ అరోరా, అభిషేక్ బోయినపల్లి వంటి మధ్యవర్తులతో జరిగిన సంభాషణల ఆధారాలు కూడా చూపించాం. వీరందరినీ విజయ్ నాయర్ ఎందుకు కలిశారని అడిగినప్పుడు అసలు వారెవరో నాకు తెలియదని కేజ్రీవాల్ బుకాయించారు. పొంతన లేని సమాధానాలు చెప్పడం, అసలు జవాబులు చెప్పడానికి నిరాకరించడంతో మొత్తం డబ్బు ఎలా వెళ్లిందో నిర్ధారించేందుకు ఆయనను మరింత విచారించాల్సి ఉంది" అని ఈడీ వాదించింది. ఆయన పలుకుబడి కలిగిన వ్యక్తి అని, సాక్షులను ప్రభావితం చేస్తారని తెలిపింది. అందుకే ఆయనను 15 రోజుల జ్యుడిషియల్ కస్టడీకి పంపించాలని అభ్యర్థించింది. దీనిని న్యాయమూర్తి కావేరీ బవేజా ఆమోదించారు.

జైలు నుంచి ఆదేశాలపై నోట్ ఇవ్వండి

ఢిల్లీ మద్యం స్కాం కేసులో అరెస్టైన కేజ్రీవాల్.. కస్టడీలో ఉంటూనే పాలనకు సంబంధించిన ఆదేశాలు జారీ చేయడంపై ప్రత్యేక జడ్జికి నోట్ సమర్పించాలని ఈడీకి ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేజ్రీవాల్ ఇటువంటి ఆదేశాలు జారీ చేయకుండా నిలువరించాలంటూ దాఖలైన పిల్‌పై జడ్జి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కాగా, లోక్‌సభ ఎన్నికల వేళ కేజ్రీవాల్‌ను జైల్లో ఉంచాలనే ఏకైక లక్ష్యంతోనే బీజేపీ ఆయనను అరెస్టు చేయించిందని కేజ్రీవాల్ భార్య సునీత ఆరోపించారు. 11 రోజులపాటు కేజ్రీవాల్‌ను ప్రశ్నించారని, విచారణ పూర్తయిందని, కోర్టు ఆయనను దోషిగా తేల్చలేదని, మరి, ఆయనను ఇంకా ఎందుకు జైల్లో ఉంచుతున్నారని ప్రశ్నించారు.

కేజ్రీవాల్ అరెస్టుకు కాంగ్రెసే కారణం

- దుమారం రేపుతున్న విజయన్ వ్యాఖ్యలు

కోజికోడ్, ఏప్రిల్ 1: కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ బీజేపీయేతర పార్టీల కూటమి 'ఇండియా' నేతలు ఢిల్లీలో భారీ సభ నిర్వహించి ప్రకటించుకున్న ఐక్యత 24 గంటల్లోనే బీటలు వారడం మొదలుపెట్టింది. మద్యం పాలసీ వ్యవహారంలో ఆప్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలుత ఫిర్యాదు చేసింది, ఈడీ విచారణకు కారణమైంది కాంగ్రెస్ పార్టీయేనని కేరళ సీఎం, 'ఇండియా' లో భాగస్వామి అయిన సీపీఎం నేత పినరయి విజయన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఆప్ అని మాత్రమే కాకుండా.. రాష్ట్రాల్లోని కాంగ్రెసేతర పక్షాల పట్ల ఆ పార్టీ వైఖరి ఇలాగే ఉంటోందని తీవ్రంగా విమర్శించారు. ఎల్‌డీఎఫ్ అభ్యర్థుల తరఫున సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన విజయన్.. కేరళలోని ప్రధాన ప్రతిపక్షం యూడీఎఫ్‌కు నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు. "ఎక్సైజ్ పాలసీ వ్యవహారంలో సిసోడియా అరెస్టు వేళ కేజ్రీవాల్‌పై కాంగ్రెస్ గురిపెట్టింది. ఆయన్ను ఎందుకు అరెస్టు చేయడం లేదని అప్పట్లో ప్రశ్నించింది. తన పొరపాట్లను కాంగ్రెస్ నాయకత్వం గుర్తించి తీరాలి" అని విజయన్ అన్నారు.

కాంగ్రెస్‌పై బలవంతపు చర్యలు తీసుకోం!

- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం
- సుప్రీంకోర్టుకు తెలిపిన ఐటీ శాఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: కాంగ్రెస్ పార్టీకి ఆదాయపు పన్ను శాఖ భారీ ఊరటనిచ్చింది. రూ.3500 కోట్ల పన్నుకు సంబంధించి ఇచ్చిన డిమాండ్ నోటీసులపై ప్రస్తుతం ఎలాంటి బలవంతపు చర్యలూ తీసుకోబోమని సుప్రీంకోర్టుకు తెలిపింది. పన్ను చెల్లింపులపై ఐటీ శాఖ వరసగా జారీ చేసిన డిమాండ్ నోటీసులను సవాలు చేస్తూ కాంగ్రెస్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ఐటీ విభాగం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. "కాంగ్రెస్ రాజకీయ పార్టీ. ప్రస్తుతం దేశంలో ఎన్నికల ప్రక్రియ జరుగుతున్నందున ఆ పార్టీపై ఎలాంటి బలవంతపు చర్యలకు దిగబోం. రూ.1700 కోట్ల రికవరీపై ఎలాంటి చర్యలూ తీసుకోం. దీనిపై తుది తీర్పు వచ్చేదాకా ముందస్తు చర్యలు చేపట్టం" అని జస్టిస్ బీవీ నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనానికి తెలిపారు. 2016లో ఢిల్లీ హైకోర్టు తీర్పు మేరకు కాంగ్రెస్ పార్టీకి 2021లో ఐటీ శాఖ డిమాండ్ నోటీసు జారీ చేసిందని మెహతా గుర్తుచేశారు. డిమాండ్ నోటీసు ఇచ్చిన మొత్తంలో 20 శాతం చెల్లించాలని అవకాశం ఇచ్చినా, ఆ పార్టీ వినియోగించుకోలేదన్నారు. దాంతో 2021 డిమాండ్ నోటీసుకు సంబంధించి ఐటీ శాఖ రూ.135 కోట్లు వసూలు చేసిందని, తర్వాత రూ.1700 కోట్లకు డిమాండ్ నోటీసులు జారీ చేసిందని వివరించారు. అనంతరం ఈ పిటిషన్‌పై విచారణను న్యాయస్థానం జూలై 24కు వాయిదా వేసింది. ఇటీవల ఐటీ శాఖ కాంగ్రెస్‌కు వరుసగా నోటీసులు పంపిన సంగతి తెలిసిందే. ఈ నోటీసుల ప్రకారం 2014-15 నుంచి 2020-21 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించి పెనాల్టీ, వడ్డీలతో కలిపి కాంగ్రెస్‌పార్టీ మొత్తం రూ.3,567 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది.

తమిళం నేర్చుకుంటా.. ఐరాసలో మాట్లాడుతా

ఆ ప్రాచీన భాష గొప్పతనాన్ని చాటి చెప్పాలి.. రాజకీయాల వల్లే ఆ భాష విస్తరించలేదు

- ఇంకా నయం ఇడ్లీ, దోసెలను రాజకీయం చేయలేదు: మోదీ
- తనకు ఉప్మా, పొంగల్ ఇష్టమని వ్యాఖ్య

చెన్నై, ఏప్రిల్ 1: తమిళనాడుతో తనకు అయిదు దశాబ్దాల అనుబంధం ఉందని, తమిళ భాష అంటే తనకు ఎంతో గౌరవమని ప్రధాని మోదీ అన్నారు. ఎన్నికలను పురస్కరించుకొని ఓ తమిళ టీవీ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ తాను తమిళం నేర్చుకుంటానని, ఐక్య రాజ్యసమితి (ఐరాస)లో ఆ భాషలో ప్రసంగిస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఇంతవరకు తమిళ భాషకు అన్యాయం జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. "వేల సంవత్సరాల చరిత్ర కలిగిన తమిళ భాష భారత దేశంలో ఉందన్న విషయాన్ని ప్రపంచానికి చెప్పలేకపోయాం. గర్వపడలేకపోయాం. ఈ ఘన వారసత్వాన్ని ప్రపంచమంతా చెప్పుకోవాలి" అని అన్నారు. భాషను రాజకీయం చేయడం వల్లనే తమిళం దేశమంతటా విస్తరించలేకపోయిందని మోదీ అభిప్రాయపడ్డారు. "ఇంకా నయం ఇడ్లీ, దోసెలను కూడా రాజకీయం చేయలేద"ని చమత్కరించారు. "ఒకవేళ ఇడ్లీ, దోసెలను కూడా రాజకీయం చేసి ఉంటే అవి తమిళనాడుకే పరిమితమయి ఉండేవి. ఇప్పుడు అన్ని చోట్లా ఎప్పుడంటే అప్పుడు దొరుకుతున్నాయి. తమిళ భాష ప్రపంచమంతా విస్తరించాలి. రాజకీయాల వల్ల అది ఒక ప్రాంతానికే పరిమితమయింది. ఇది తమిళ భాషకు, దేశానికి నష్టం కలిగించింది" అని అన్నారు. ఇడ్లీ, దోసెల మాదిరిగానే తమిళం కూడా ప్రపంచమంతా విస్తరించాలని ఆకాంక్షించారు. తనకు మాత్రం తమిళ వంటకాలయిన ఉప్మా, పొంగల్ అంటే ఇష్టమని చెప్పారు.



తమిళనాడుతో తనకు ఉన్న అనుబంధాన్ని మోదీ వివరించారు. ఎమర్జెన్సీ సమయంలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేయడం కోసం ఇక్కడికి వచ్చానని చెప్పారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు నిర్వహించిన ఏక్తా యాత్రలో పాల్గొన్నానని తెలిపారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఈరోడ్‌లో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కుమరన్ కుటుంబానికి చెందిన 90 ఏళ్ల వృద్ధ మహిళ వచ్చి తనను ఆశీర్వదించడం మరుపురాని అనుభూతి అని అన్నారు. రాష్ట్ర రాజకీయాలపై మోదీ తన అభిప్రాయాలు చెబుతూ ఎన్‌డీఏ కూటమిలో లేకపోవడం వల్ల నష్టపోయింది అన్నాడీఎంకే తప్ప బీజేపీ కాదని అన్నారు. ఈసారి ఎన్‌డీఏ కూటమికి ఓటు వేయాలని రాష్ట్ర ప్రజలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. "ఈ కూటమి సమాజంలోని వివిధ ఆర్థిక, సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీలతో కూడుకున్నది. ఇదొక పూలగుచ్ఛం. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ గుచ్ఛంలో తమ సొంత పుష్పాన్ని చూసుకోవచ్చు. ఇదే మా విజయ రహస్యం" అని వ్యాఖ్యానించారు. అభివృద్ధి అంశాలపై మోదీ తన అభిప్రాయాలు చెబుతూ వికసిత్ భారత్ లక్ష్య సాధనకు తమిళనాడు చోదక శక్తిగా మారిందని ప్రశంసించారు. ఇతర చోట్ల ఘన విజయాలను సాధిస్తున్నా ఇక్కడ మాత్రం అడుగు పెట్టలేకపోతుండడంపై మోదీ సమాధానం ఇస్తూ ఎన్నికల్లో గెలవడం అన్నది తన లక్ష్యం కాదని చెప్పారు.

రాహుల్ 'మ్యాచ్ ఫిక్సింగ్' వ్యాఖ్యలపై ఈసీకి బీజేపీ ఫిర్యాదు

మోదీపై 'మ్యాచ్ ఫిక్సింగ్' వ్యాఖ్యలు చేసినందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మీద బీజేపీ ఎన్నికల కమిషన్(ఈసీ)కు ఫిర్యాదు చేసింది. తప్పుడు ఆరోపణలు చేసినందుకు ప్రధాని మోదీకి, దేశానికి రాహుల్ బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పేలా ఆదేశించాలని ఈసీని బీజేపీ కోరింది. లోక్‌సభ ఎన్నికల్లో 'మ్యాచ్ ఫిక్సింగ్' ద్వారా మోదీ గెలవాలనుకుంటున్నారని, అందులో భాగంగా ఎన్నికల కమిషనర్లు అనే అంపైర్లను మోదీ ఎంపిక చేశారని, ఎన్నికల అనంతరం రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తున్నారని ఆదివారం ఓ బహిరంగ సభలో రాహుల్ వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరమైనవని, రాహుల్ గాంధీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీకి కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం హర్దీప్, అరుణ్ సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ పదేపదే అలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. మరోసారి ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీని కోరినట్లు తెలిపారు. ఇండియా కూటమి నేతలపైనా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

జాతీయ భద్రత ఆర్థిక నేరాలపైనే సీబీఐ దృష్టిసారించాలి

- కొన్నేళ్లుగా విభిన్న కేసులను దర్యాప్తు చేయాల్సి వస్తోంది
- సోదాల సమయంలో అనవసరంగా వ్యక్తిగత వస్తువుల జప్తు
- సీబీఐ ఆవిర్భావ దినోత్సవంలో చీఫ్ జస్టిస్ చంద్రచూడ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1: "దేశంలోని అత్యున్నత దర్యాప్తు సంస్థలు కొన్నేళ్లుగా విభిన్న కేసులను దర్యాప్తు చేయాల్సి వస్తోందని, కానీ, జాతీయ భద్రత, ఆర్థిక నేరాలు, ప్రజా శ్రేయస్సుకు సంబంధించిన అంశాలపైనే అవి దృష్టి సారించాలని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ అభిప్రాయపడ్డారు. ఆధునిక సాంకేతికత నేరాల తీరునే మార్చేసిందని, దర్యాప్తు సంస్థలు ఇప్పుడు సంక్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటున్నాయని చెప్పారు. సీబీఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన డీపీ కోహ్లీ స్మారక సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. దాడులు, సోదాల సందర్భంగా వారెంటు లేకుండానే వ్యక్తిగత హక్కులకు భంగం కలిగేలా వస్తువులను అనవసరంగా జప్తు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యక్తిగత హక్కులకు, విచారణ విధి విధానాలకు మధ్య సమతుల్యత పాటించాల్సిన అవసరాన్ని అటువంటి ఘటనలు తెరపైకి తెస్తున్నాయని చెప్పారు. సీబీఐ వంటి సంస్థల సోదాలు, జప్తు అధికారాలు, వ్యక్తిగత హక్కుల మధ్య పాటించాల్సిన సున్నితమైన సమతుల్యత నిష్పక్షపాత, న్యాయబద్ధ సమాజానికి మూలస్తంభంగా నిలుస్తుందని అభివర్ణించారు. "సీబీఐ అవినీతి నిరోధక దర్యాప్తు సంస్థ. కానీ, దాని పరిధికి మించి విస్తృతమైన క్రిమినల్ కేసులను దర్యాప్తు చేయాలని విజ్ఞప్తి చేయడం పెరుగుతోంది. దాని విస్తృతిని మనం పెంచేస్తున్నాం. జాతీయ భద్రత, ఆర్థిక నేరాలు వంటి వాటిపైనే అది దృష్టి సారిస్తే మంచిది" అని సూచించారు. సీబీఐలో పెద్దఎత్తున డిప్యూటేషన్‌పై వచ్చిన అధికారులు ఉండడాన్ని ఆయన తప్పుబట్టారు. "దర్యాప్తు ప్రక్రియను డిజిటలైజ్ చేయడమే దీనికి మార్గం. ఎఫ్ఐఆర్ నమోదు నుంచే దీనిని ప్రారంభించాలి. కేసులు పెద్దఎత్తున పేరుకుపోతున్నాయి. విచారణలో ఆలస్యాన్ని నివారించాలంటే సాంకేతికతను అందిపుచ్చుకోవాలి" అని సూచించారు. దర్యాప్తు సంస్థల్లో సంస్థాగత సంస్కరణలు చేయాలని తెలిపారు. నేరాల తీరు ఊహాతీతంగా పెరిగిపోతోందని, వాటిని ఎదుర్కోవడానికి సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు తమ సామర్థ్యాలను పెంచుకోవాలని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను గేమ్ ఛేంజర్‌గా అభివర్ణించిన ఆయన.. దర్యాప్తులో సత్ఫలితాలకు దానిని ఉపయోగించాలని సూచించారు. ఇది క్రిమినల్ జస్టిస్ వ్యవస్థనే సమూలంగా మార్చివేస్తుందని అభిప్రాయపడ్డారు.



అమెరికా అధ్యక్షుడి విమానంలో చోరీలు

వాషింగ్టన్ డీసీ, ఏప్రిల్ 1: ఎయిర్ ఫోర్స్ వన్! అమెరికా అధ్యక్షుడు ప్రయాణించే ఈ విమానాన్ని ఎగిరే వైట్ హౌస్‌గా అభివర్ణిస్తారు. సకల సౌకర్యాలు, కట్టుదిట్టమన భద్రత, అత్యాధునిక రక్షణ వ్యవస్థల నడుమ ఎగిరే ఈ విమానంలో చోరీలు జరుగుతున్నాయంటే నమ్ముతారా? అదను చూసి.. గ్లాసులనో, ప్లేట్లనో గుట్టుగా బ్యాగుల్లో వేసుకొని విమానం దిగేసి వెళ్లిపోతున్నారట కొందరు! ఇలా హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్న వారు ఎవరంటారా? అధ్యక్షుడి వెంట ఆ విమానంలో ప్రయాణించే మీడియా ప్రతినిధులే! ఎయిర్ ఫోర్స్‌వన్‌లో తరచూ చోరీలు జరుగుతున్నాయంటూ అక్కడి ఆంగ్లపత్రిక 'పొలిటికో' ఓ ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. విస్కీ, వైన్ గ్లాసులు.. శ్వేత సౌధాన్ని పోలివుండే నమూనాలు, పిల్లోకేసులు.. ఇలా ఏ చిన్న వస్తువు కనిపిస్తే దాన్ని బ్యాగుల్లో వేసుకొని విమానం దిగేస్తున్నారట! ఈ విషయాన్ని వైట్‌హౌస్ కరస్పాండెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు కెల్లీ ఒడేనియల్ వెల్లడించారు. ఇకముందైనా ఇలాంటి చర్యలు మానుకోవాలని మీడియా ప్రతినిధులను ఆయన సున్నితంగా హెచ్చరించారు. ఫిబ్రవరి 5న ఎయిర్‌ఫోర్స్ వన్‌లో చోరీ జరగ్గా.. వైట్ హౌస్ విజ్ఞప్తితో ఓ మీడియా ప్రతినిధి పిల్లోకేస్‌ను తిరిగిచ్చాడు.

జైల్లో కవిత జపం!

» ప్రత్యేకంగా జపమాల కావాలని కోరిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ

» నడకకు స్పోర్ట్స్ షూ.. చదువుకునేందుకు పుస్తకాలు కూడా

» బెయిల్‌పై వాదనలు... విచారణ 4వ తేదీకి వాయిదా



న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో తిహాడ్ జైల్లో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అక్కడ జపం చేసుకోవాలనుకుంటున్నారు. ఇందుకుగాను తనకు జపమాల కావాలని రౌస్ అవెన్యూ కోర్టుకు ఆమె విజ్ఞప్తి చేశారు. మెడిటేషన్‌కు అనుమతి కోరారు. అలాగే స్పోర్ట్స్ షూ, పుస్తకాలు, పెన్నులు, పరుపు, దుప్పట్లు కావాలనీ కోరారు. ఇంటి నుంచి ఆహారానికి అనుమతించాలనీ కోరారు. ఈ మేరకు కవిత తరఫున ఆమె న్యాయవాది నితేశ్ రాణా సోమవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కావేరీ బవేజాను అభ్యర్థించారు. మార్చి 26న ఇచ్చిన ఉత్తర్వుల్లో ఏ ఒక్కటీ అనుమతించలేదని కవిత తరఫు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొన్న అన్నింటినీ తెచ్చుకునేందుకు అనుమతించినట్లు జైలు సూపరింటెండెంట్ న్యాయస్థానానికి తెలిపారు. స్పందించిన కోర్టు, మరోసారి లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేసింది. కవిత కోరినట్లుగా జపమాల సహా అన్ని వస్తువులను అనుమతించింది. కొన్నింటిని స్వయంగా సమకూర్చుకునేందుకు అనుమతించింది. గతంలో కోరిన మేరకు ఆభరణాలు ధరించేందుకు అనుమతించింది. లేసులు లేని బూట్లకు అనుమతించాలని ఆదేశాలు జారీ చేసింది.

కాగా కవితకు బెయిల్ ఇవ్వాలని ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వీతో పాటు నితేశ్ రాణా వాదనలు వినిపించారు. ఆ తర్వాత న్యాయమూర్తి విచారణను 4వ తేదీకి వాయిదా వేశారు. మద్యం విధానం కుంభకోణంలో కవితకు వ్యతిరేకంగా ఈడీ పక్షపాత బుద్ధితో, దురుద్దేశపూరితంగా వ్యవహరిస్తోందని, ఒక దర్యాప్తు ఏజెన్సీగా కాకుండా శిక్షించే సంస్థగా చర్యలు తీసుకుంటోందని అభిషేక్ సింఘ్వీ వాదించారు. ఈ కేసులో ఈడీ పిల్లి, ఎలుకలాగా ఆటలాడుతోందని పేర్కొన్నారు. ప్రతిరోజు సమన్లు పంపకుండా ఈడీ సంతోషించలేకపోతోందని పేర్కొన్నారు. అసలు ఈ కేసులో కవితను అరెస్టు చేయాల్సిన అవసరమే లేదని వాదించారు. కేసులో నిందితుడైన అరుణ్ పిళ్లై, ఈడీ ముందు తొలుత తొమ్మిదిసార్లు ప్రకటనలు చేశారని, అందులో కవిత పేరే లేదని, పదో ప్రకటనలో కవిత పేరు వెల్లడించినా మళ్లీ దాన్ని వెనక్కు తీసుకున్నారని గుర్తు చేశారు. ఛార్జిషీట్లలో కవిత పేరు ప్రస్తావించలేదని కూడా తెలిపారు. తనను వేధిస్తారని తెలిసినప్పటికీ ఈడీ ఎదుట కవిత హాజరై సహకరించారని చెప్పారు. ఒకేరోజు పలు సమన్లు జారీశారని, ఇలా చేయడం ఉద్దేశపూర్వక వేధింపులు కాక మరేమిటి? అని ప్రశ్నించారు. ఈడీ ఒక సర్వశక్తివంతమైన సంస్థగా మారిందని, ఈడీ అధికారులు న్యాయస్థానాలకేకాక దేశానికి, రాజ్యాంగానికి కూడా అతీతులుగా మారారని విమర్శించారు. కవిత పట్ల ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టబోమని సుప్రీంకోర్టుకు ఇచ్చిన అండర్ టేకింగ్‌ను కూడా ఈడీ ఉల్లంఘించిందని, ఇది సరైంది కాదని చెప్పారు. కోర్టుకిచ్చిన అండర్ టేకింగ్‌ను వెనక్కు తీసుకుంటున్నట్లు మార్చి 15న చెప్పారని, కోర్టు అనుమతించకపోయినప్పటికీ గంటలోపు కవిత ఇంటికి వచ్చి అరెస్టు చేశారని తెలిపారు. కాగా, సింఘ్వీ వాదనలు విచిత్రంగా ఉన్నాయని ఈడీ తరఫు న్యాయవాది జోహెబ్ హుస్సేన్ పేర్కొన్నారు. అసలు కవితకు మధ్యంతర బెయిల్ కావాలో- రెగ్యులర్ బెయిల్ కావాలో తేల్చుకోవాలన్నారు. రెగ్యులర్ బెయిల్ కోసం వాదిస్తూ మధ్యంతర ఊరట కోరకూడదని, ఏదో ఒకదానికి పరిమితం కావాలని అన్నారు.



నీరులేక వెలవెలబోతున్న మిడ్‌మానేరు ప్రాజెక్ట్

మిడ్‌మానేరు వెలవెల

» ప్రాజెక్ట్ సామర్థ్యం 27.50 టీఎంసీలు..
ప్రస్తుత నిల్వ 8.27 టీఎంసీలు

సిరిసిల్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అత్యంత కీలకమైన మిడ్‌మానేరు ప్రాజెక్టు నీళ్లు లేక వెలవెలబోతుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద మానేరువాగుపై నిర్మించిన రాజరాజేశ్వర మిడ్ మానేరు ప్రాజెక్ట్ సామర్థ్యం 27.50 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.27 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నాయి. మేడిగడ్డ ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసిన నీళ్లతో గతంలో మిడ్ మానేరు నిత్యం జలకళతో ఉండేది. కానీ, మేడిగడ్డ వద్ద ప్రాజెక్టు కుంగిపోవడంతో ఆ ప్రభావం మిడ్‌మానేరుపై పడింది. నీటి నిల్వలు లేక మిడ్‌మానేరు వద్ద ఎత్తిపోతలు ఆపేయడంతో జిల్లాలోని 3.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన అన్నపూర్ణ ప్రాజెక్టులో నీటి నిల్వలు 0.83 టీఎంసీలకు పడిపోయాయి. దీంతో సమీపంలో చెరువులు, కుంటలు కూడా ఎండిపోయాయి. మరోపక్క, మిడ్ మానేరు ప్రాజెక్ట్‌లో నీటి మట్టం పడిపోవడంతో ఒక్కొక్కటిగా బయటపడుతున్న ముంపు గ్రామాల శిథిలాలు నిర్వాసితులను కంటతడి పెట్టిస్తున్నాయి.

సరిపోని సరుకుల లెక్క!

» బాసర గుడిలో రికార్డుల ప్రకారం లేని నిల్వలు

» విజిలెన్స్ తనిఖీల్లో బయల్పడిన మరో అవినీతి

» సరుకులు పక్కదారి పట్టినట్లు అనుమానం

బాసర, ఏప్రిల్ 1: నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ దేవస్థానంలో సరుకుల కొనుగోలులో భారీ అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. తీగ లాగితే డొంక కదిలినట్లు.. ధరల విషయంలోనే కాదు సరుకుల లెక్కలతో మాయ చేసి అక్రమాలకు తెరతీసినట్లు విచారణలో వెలుగుచూస్తోంది. నిత్యావసరాల ధరల విషయమై మార్చి 30న 'ఆంధ్రజ్యోతి' మెయిన్‌లో ప్రచురితమైన 'బాసరలో భోంచేస్తున్నారు' అనే కథనంతో దేవాదాయ శాఖ విజిలెన్స్ విభాగం చేపట్టిన విచారణలో కొత్త విషయాలు వెలుగుచూస్తున్నాయి. ఆదివారం దేవాదాయ శాఖ అదనపు కమిషనర్, ఆ శాఖ విజిలెన్స్ విభాగం రాష్ట్ర అధికారి కృష్ణవేణి విచారణ సందర్భంగా ఆలయంలోని ప్రధాన నిల్వ కేంద్రంలో సరుకులు.. రికార్డుల లెక్కల ప్రకారంకాకుండా తక్కువ ఉన్నట్టు తేలింది. లక్షల రూపాయల సరుకు రికార్డు కంటే తక్కువగా ఉన్నట్లు దేవస్థానవర్గాలు చర్చించుకుంటున్నాయి. లడ్డూ ప్రసాదం తయారీకి వాడే ఖాజు, యాలకులు, కిస్‌మిస్, చక్కెర, నెయ్యి వంటివి లెక్కకన్నా భారీగా తక్కువున్నట్లు తెలిసింది. తక్కువ బరువుతో లడ్డూ ప్రసాదం తయారుచేసి మిగిలిన సరుకులను పక్కదారి పట్టించి అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో కింది నుంచి పైస్థాయి సిబ్బంది వరకు పాత్ర ఉన్నట్లు సమాచారం.

'ఆంధ్రజ్యోతి' కథనంపై జిల్లా కలెక్టర్ ఆరా

దేవస్థానం కొనుగోలు చేసే నిత్యావసర సరుకుల ధరల విషయంలో 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆరా తీశారు. ఆలయ ఈవో విజయ రామారావును సోమవారం జిల్లా కేంద్రానికి పిలిపించుకొని విచారించారు. కొనుగోలు వస్తు ధరల పట్టికను పరిశీలించి ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు కొనుగోలు చేయడంపై ఆయనను ప్రశ్నించినట్లు సమాచారం.

దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదిస్తాం

ఆలయంలో సరుకుల కొనుగోలు వ్యవహారంపై విచారణ చేపట్టాం. సరుకుల నిల్వ కేంద్రం, రికార్డులు తనిఖీ చేశాం. పూర్తి వివరాలతో దేవాదాయ శాఖ కమిషనర్‌కు నివేదిస్తాం.

- కృష్ణవేణి, దేవాదాయ శాఖ అదనపు కమిషనర్

భగ్గుమన్న సూరీడు

43 డిగ్రీలకు చేరిన ఉష్ణోగ్రతలు.. రాష్ట్రంలో నేడు, రేపు ఆరెంజ్ అలెర్ట్

ఈ సారి వడగాడ్పుల తీవ్రత ఎక్కువే

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)



సూర్యాపేట జిల్లా వెలుగుపల్లి చెరువులో దాహం తీర్చుకుంటున్న మూగజీవాలు

ఎండ వేడిమితో రాష్ట్రం ఉడికిపోతోంది. రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం సూరీడు భగ్గుమన్నాడు. పగటి ఉష్ణోగ్రతలు ఏకంగా 43 డిగ్రీలకు చేరాయి. నల్లగొండ జిల్లా మాడుగులపల్లి, సిద్దిపేట జిల్లా చిట్యాల్‌లలో గరిష్ఠంగా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నల్లగొండ జిల్లా తిమ్మాపూర్, సిద్దిపేట జిల్లా దూల్‌మిట్ట, పెద్దపల్లి జిల్లా ఎక్లాస్‌పూర్‌లో 42.9, నిర్మల్ జిల్లా దస్తూరాబాద్, నల్లగొండ జిల్లా తెల్లదేవరపల్లి, భద్రాద్రి జిల్లా గరిమెళ్లపాడు, సుజాతనగర్‌లో 42.7, సూర్యాపేట జిల్లా మునగాల, యాదాద్రి జిల్లా మల్యాలలో 42.2, మేడ్చల్ జిల్లా పరిధిలోని కేపీహెచ్‌బీలో 41.9, రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లిలో 41.7, వికారాబాద్ జిల్లా మర్పల్లిలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత ఉంటుందని పేర్కొంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. అన్ని జిల్లాల్లో 40-42 డిగ్రీల మధ్య గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని హెచ్చరించింది. అలాగే, రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో ఏప్రిల్ నెల వారీ గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. దీంతో సాధారణం కంటే ఎక్కువ రోజుల పాటు వడగాడ్పులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. మూడు నుంచి నాలుగు రోజుల పాటు వడగాడ్పుల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని పేర్కొంది.

సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాల్వ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని సోమవారం ప్రాజెక్టు అధికారులు నీటిని విడుదల చేశారు. మిషన్ భగీరథ ట్యాంకులు నింపి గ్రామాల్లో తాగునీటిని అందించేందుకు, నల్లగొండ జిల్లాలో పెద్దదేవులపల్లి, ఖమ్మం జిల్లాలో పాలేరు జలాశయాన్ని నింపడానికి 2500 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. అయితే నీటి విడుదల ఎన్ని రోజులు, ఎన్ని టీఎంసీలు అనేది ఇంకా నిర్ణయించలేదని వారు పేర్కొన్నారు.



బావి ఒక్కటే...మోటార్లు 20

ఎండల తీవ్రతకు అద్దం పడుతున్న ఈ దృశ్యం వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం నాగారం గ్రామంలోనిది. ఇక్కడ మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. తాగునీటిని అందించే చేతి పంపుల్లోనూ నీరు అడుగంటి పోయింది. దీంతో గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దశాబ్దం క్రితం గ్రామంలో తవ్విన చేద బావిలో 20 మోటార్లు ఏర్పాటు చేసుకొని, సమీప ఇళ్ల ప్రజలు నీటిని తరలించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మిషన్ భగీరథ నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. - కొడంగల్ రూరల్

పెబ్బేరు మార్కెట్ గోదాములో అగ్ని ప్రమాదం

» 12.80 లక్షల గన్నీ బ్యాగులు, ధాన్యం బస్తాలు దగ్ధం.. 10 కోట్ల మేర ఆస్తి నష్టం



దగ్ధమవుతున్న గన్నీ బ్యాగులు, ధాన్యం బస్తాలు

పెబ్బేరు: వనపర్తి జిల్లా పెబ్బేరు వ్యవసాయ మార్కెట్ యార్డులోని గోదాములో సోమవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. గోదాంలో నిల్వ ఉన్న 12,80,000 గన్నీ బ్యాగులతో పాటు ధాన్యం బస్తాలు దగ్ధమయ్యాయి. బస్టాండ్ సమీపంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాములో ఒక్క సారిగా మంటలు ఎగిసిపడి, పొగ కమ్ముకోవడంతో భయాందోళనకు గురైన ప్రజలు అధికారులకు సమాచారం ఇచ్చారు. మూడు ఫైర్ ఇంజన్లను వినియోగించినా.. రాత్రి 9 గంటల వరకూ మంటలు అదుపులోకి రాలేదు. గన్నీ బ్యాగులు ఎక్కువగా ఉండటం వల్ల మంటలు అదుపులోకి రాలేదని తెలుస్తోంది. గోదాముకు విద్యుత్తు సరఫరా లేనందున షార్ట్ సర్క్యూట్ జరిగే పరిస్థితి లేదని, ప్రమాదానికి గల కారణాలు తెలియడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ ఘటనలో రూ.10కోట్ల మేర ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు. ఘటనా స్థలాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి పరిశీలించి, అధికారులతో మాట్లాడారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ వాయిదా

» జూన్ 2కు రీ షెడ్యూల్ చేసిన ఎన్నికల సంఘం

» లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందుకే..

హైదరాబాద్, మహబూబ్‌నగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠగా సాగిన ఉమ్మడి పాలమూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కౌంటింగ్ వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం మంగళవారం కౌంటింగ్ నిర్వహించి, విజేతను ప్రకటించాల్సి ఉండగా లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) కౌంటింగ్‌ను రీషెడ్యూల్ చేస్తూ.. దీన్ని జూన్ 2న నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, మార్చి 28న ఈ ఎన్నిక పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికలో కాంగ్రెస్ నుంచి మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ తరఫున నవీన్‌కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్ గౌడ్ బరిలో ఉన్నారు. ఇందులో ఆయా పురపాలక సంఘాల కౌన్సిలర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎక్స్ అఫిషియో సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ స్థానం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డి గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. దీంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక వచ్చింది.

అక్క, తమ్ముడి అనుమానాస్పద మృతి!

» ఉబ్బిపోయి.. పురుగులు పట్టి ఉన్న స్థితిలో మృతదేహాలు




రాజశ్రీ; సాయి (ఫైల్)

యూసు‌ఫ్‌గూడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పరిధిలోని రహ్మత్‌నగర్ సంతోష్‌గిరిలో అక్క, తమ్ముడు అనుమానస్పద స్థితిలో మృతి చెందారు. ఇంట్లోంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారమివ్వడంతో వారొచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడగా లోపల ఉబ్బిపోయి, పురుగులు పట్టి ఉన్న స్థితిలో మృతదేహాలు కనిపించాయి. మృతులను రాజశ్రీ, ఆమె పెద్దమ్మ కుమారుడు సాయిగా గుర్తించారు. రాజశ్రీ తల్లిదండ్రులు చనిపోవడంతో అప్పటి నుంచి తన పెద్దమ్మ కుమారుడైన సాయితో కలిసి సంతోష్‌గిరిలో నివాసం ఉంటోంది. రాజశ్రీకి పెళ్లయింది. భర్త నర్సింగరావు అప్పుడప్పుడూ వచ్చిపోతుంటాడు. కొన్నాళ్లుగా రాజశ్రీ, సాయి ఇంట్లోంచి బయటకు రావడం లేదు. ఇంట్లోంచి దుర్వాసన వస్తోందంటూ స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో ఘటన వెలుగుచూసింది. ఇంట్లో సూసైడ్ నోట్ లభ్యమైంది. అందులో 'నాకు ఎవరూ లేరు, మా తమ్ముడేమో నీ మొగుడి వద్దకు పో అంటున్నాడు. కట్టుకునేందుకు బట్టలు కూడా లేవు, నాకు బతకాలని లేదు. నేను చనిపోతే అందుకు కారణం నా భర్త, నా తమ్ముడు' అని రాసి ఉంది. ఆమె మృతదేహం పక్కనే సాయి మృతదేహం ఉంది. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు.

జగన్ అక్రమాస్తుల కేసులో ఎందుకింత జాప్యం?

» సీబీఐని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసు విచారణలో జాప్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తికి సంబంధించిన కేసులో నిర్లక్ష్యం ఎందుకని సీబీఐని ప్రశ్నించింది. ఈ కేసులో జాప్యం ఎందుకు చేస్తున్నారో వివరణ ఇస్తూ నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. అక్రమాస్తుల కేసుకు సంబంధించి జగన్‌కు గతంలో మంజూరుచేసిన బెయిల్‌ను రద్దుచేయాలని కోరుతూ నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. సీబీఐ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదనలు వినిపించారు. జగన్ బెయిల్ రద్దు పిటిషన్‌తో పాటు హైదరాబాద్ నుంచి విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని దాఖలైన పిటిషన్‌పైనా ఆగస్టు 5న విచారణ జరుపుతామని ధర్మాసనం తెలిపింది.

ఎన్నికల వేళ వెరీ 'హాట్'!

ఇటు ఎన్నికల హీటు.. అటు మండుటెండలు.. ఈ వేసవిలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మంటలే

దేశంలో సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు



విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎల్‌నినో బలహీనపడుతున్నా... దాని ప్రభావం మరో మూడు నెలల వరకూ ఉంటుందన్న వాతావరణ నిపుణుల హెచ్చరికల నేపథ్యంలో జూన్ వరకూ దేశంలో అత్యంత తీవ్ర వేసవి పరిస్థితులు ఏర్పడనున్నాయి. గత నెల రెండో వారం నుంచే దేశంలో ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మార్చి చివరి వారం నుంచి దక్షిణ, మధ్య, పశ్చిమ భారతంలో పలుచోట్ల వడగాడ్పులు వీయడంతోపాటు పగటి ఉష్ణోగ్రతలు 40-42 డిగ్రీల వరకు నమోదవుతుండడంతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. మార్చిలోనే తీవ్రంగా ఉన్న ఎండలు ఏప్రిల్ నుంచి జూన్ వరకూ భరించలేనంతగా ఉండనున్నాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. ఇంకా వడగాడ్పులు సాధారణం కంటే ఎక్కువ రోజులు వీయనున్నాయి. ప్రధానంగా మధ్య భారతం, దానికి ఆనుకుని దక్షిణ, పశ్చిమ, తూర్పున ఉన్న పలు రాష్ట్రాల్లో వేసవి అత్యంత దారుణంగా ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకూ ఎండలు, వర్షాలపై బులెటిన్ విడుదల చేసింది. ఈశాన్య, వాయవ్య భారతంలో కొన్నిప్రాంతాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. 3నెలల వేసవి సీజన్‌లో దక్షిణ, మధ్య, తూర్పు భారతంలో నెలకు సగటున 3 రోజులు వడగాడ్పులు వీస్తుంటాయని, ఈ ఏడాది మాత్రం 4 నుంచి 8 రోజులు వీయనున్నాయని అంచనా వేస్తున్నారు. గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తర కర్ణాటక, ఏపీ, రాజస్థాన్, మధ్య మహారాష్ట్ర, ఒడిశా, ఉత్తర ఛత్తీస్‌గఢ్‌లలో వడగాడ్పుల ప్రభావం అసాధారణంగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది.

ఆరోగ్యంపైనా ప్రభావం...

ఏప్రిల్ నెలకు సంబంధించి ఎండలు, వడగాడ్పులపై వాతావరణ శాఖ బులెటిన్ విడుదల చేసింది. ఈశాన్య, పశ్చిమ హిమాలయ ప్రాంతాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదుకానున్నాయి. మధ్య, దక్షిణ భారతంలో ఎండలు ఎక్కువగా ఉంటాయి. మధ్య భారతం దానిని ఆనుకుని దక్షిణాది రాష్ట్రాల్లో సాధారణం కంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. కాగా, ఏప్రిల్‌లో దేశంలో సగటు కంటే ఎక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే వాయవ్య, మధ్య దక్షిణ భారతంలో కొన్నిచోట్ల మాత్రం తక్కువ వర్షాలు కురుస్తాయి. ఇదిలావుండగా వడగాడ్పుల సీజన్ ప్రధానంగా వృద్ధులు, పిల్లలపై ఎక్కువ ప్రభావం చూపుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాగా ఈనెల 19వ తేదీ నుంచి దేశంలో ఏడు దశల్లో పోలింగ్ జరగనుంది. కాబట్టి తీవ్ర ఎండలను దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్రా సూచించారు.



ఇళ్లల్లోకి చేరిన వరద నీరు

నిజాంసాగర్ కెనాల్‌కు గండి

» ఇళ్లల్లోకి భారీగా వరద నీరు.. కొట్టుకుపోయిన సామగ్రి

» తీవ్ర ఇబ్బందులు పడ్డ ఆర్మూర్ జర్నలిస్టు కాలనీ వాసులు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 1 : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో గల నిజాంసాగర్ కాలువ కట్టకు సోమవారం తెల్లవారుజామున గండి పడింది. దీంతో కాలనీలోని ఇళ్లల్లోకి నీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గండిపడిన ప్రదేశంలో విద్యుత్ స్తంభం వంగిపోవడంతో తెల్లవారుజాము 3 గంటల నుంచి కరెంటు సరఫరా నిలిచిపోయింది. ఒక్కసారిగా ఇళ్లల్లోకి నీరు చేరడంతో.. నిత్యావసర సరుకులు, సామగ్రి కొట్టుకుపోయింది. దీంతో చిమ్మచీకట్లో ఏం జరుగుతుందో తెలియక స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆర్మూర్ మునిసిపల్ చైర్‌పర్సన్ వన్నెల్ దేవి గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. అధికారులకు ఆదేశాలివ్వడంతో వారు వెంటనే గండిని పూడ్చివేశారు. కాలువ కట్ట పైన, కట్టను ఆనుకొని పలువురు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోలేదు. అదీగాక, గత కొన్నేళ్లుగా పూడిక కూడా తీయకపోవడం, కాలనీ వాసులు వేసిన చెత్త పేరుకుపోవడంతో నీరు నిలిచి కట్ట బలహీనపడింది. దీనికి తోడు యాసంగి పంటను దృష్టిలో పెట్టుకొని కొద్దిరోజులుగా గుత్ప ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు నింపడానికి నీటిని వదులుతున్నారు. వెరసి కాలువ కట్ట ఒక్కసారిగా తెగిపోయింది.

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర తగ్గింపు

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గృహ వినియోగ గ్యాస్ ధరను తగ్గించిన కేంద్ర ప్రభుత్వం... ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వాణిజ్య గ్యాస్ సిలిండరు ధరను కూడా తగ్గించింది. నిన్న మొన్నటివరకు 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 2,027 ఉండగా... ఇప్పుడు రూ. 1,994.50కు తగ్గింది.. హైదరాబాద్‌లో ఒక్కో సిలిండరుపై రూ. 32.50 పైసల చొప్పున ధర తగ్గటం గమనార్హం. అదే 47.5 కిలోల సిలిండరు ధర రూ. 80 తగ్గింది. ప్రస్తుతం 47.5 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండరు ధర రూ. 4,983.50కు చేరింది. ఏపీలోని విజయవాడలో 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ. 1,926.50కు తగ్గింది. తిరుపతిలో రూ. 1,963, విశాఖపట్నంలో 1,826.50కు చేరటం గమనార్హం. ఢిల్లీలో ఈ ధర రూ.1,764.50 పైసలు ఉంది. గత ఆర్థిక సంవత్సరం(2023- 24) లెక్కల ప్రకారం ఏపీలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సంఖ్య 1.41 లక్షలు ఉండగా, తెలంగాణలో 1.16 లక్షలు ఉన్నాయి. దేశవ్యాప్తంగా వాణిజ్య గ్యాస్ కనెక్షన్ల సంఖ్య 35.89 లక్షలుగా ఉంది. తగ్గిన ధరను సోమవారం నుంచి అమలులోకి తెచ్చినట్లు ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి.

కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతుల్లేవ్!

» ఎల్‌వోపీ నిలిపివేసిన ఎన్ఎంసీ

» ఈసారి తనిఖీలుకూడా చేయని వైనం

» కర్ణాటక వేసిన కేసు కారణంగానే..

» రాష్ట్రంలో 8 కాలేజీల పరిస్థితి ఏంటో?

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ ఏడాది కొత్త మెడికల్ కాలేజీలు మంజూరు కావడం లేదు. జాతీయ వైద్య కమిషన్ కొత్త కళాశాలలకు అనుమతులను నిలిపివేసింది. నూతన వైద్య కళాశాలల్లో తరగతులు ప్రారంభించుకునేందుకు అవసరమైన లెటర్ ఆఫ్ పర్మిషన్(ఎల్‌వోపీ) కూడా ఇవ్వలేదు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల తరఫున కాలేజీల కోసం ఎన్ఎంసీకి 142 దరఖాస్తులు అందాయి. తెలంగాణ నుంచి 8 కళాశాలల ఏర్పాటు కోసం గత సర్కారు దరఖాస్తు చేసింది. వాస్తవానికి ఇప్పటికే కొత్త కాలేజీల్లో ఎన్ఎంసీ తనిఖీలు పూర్తి చేయాల్సి ఉంది.ఇంత వరకు తనిఖీలకే రాలేదు. దేశవ్యాప్తంగా ఇప్పటి వరకు ఒక్క మెడికల్ కాలేజీ ఏర్పాటుకు కూడా అనుమతి లభించలేదు. నూతన వైద్య కళాశాలల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ గత ఆగస్టులో ఎన్ఎంసీ నోటిఫికేషన్ ఇచ్చింది. కొత్త (2023) డాక్యుమెంట్ ప్రకారమే నూతన వైద్య కళాశాలలకు దరఖాస్తు చేయాల్సి ఉంటుందని ఆ ప్రకటనలో స్పష్టం చేసింది. దీని ప్రకారం కొత్తగా కాలేజీ ఏర్పాటు చేయాలంటే ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యకు అనుగుణంగా నాలుగున్నరేళ్లకు సరిపడా మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచుకోవాలి. ఉదాహరణకు 50 ఎంబీబీఎస్ సీట్ల కోసం దరఖాస్తు చేసుకునే కాలేజీలో రోజువారీ ఓపీ 400, మేజర్ ఓటీ 4, అధ్యాపకులు 59 మంది ఉండాలి. వీరికి అదనంగా ట్యూటర్స్ 15 మంది, సీనియర్ రెసిడెంట్స్ 23 మంది ఉండాలి. అలాగే కచ్చితంగా 21 విభాగాలతో పాటు అనుబంధ బోధనాస్పత్రిలో 320 పడకలుండాలి. నాలుగున్నరేళ్లకు సరిపడా అధ్యాపకులు, భవనాలు, ఇతర సౌకర్యాలన్నీ ముందే ఏర్పాటు చేసుకోవాలని డాక్యుమెంట్‌లో స్పష్టం చేసింది. ఇప్పటిదాకా 2020 డాక్యుమెంట్ ప్రకారం కొత్తగా కాలేజీ ఏర్పాటు చేయాలనుకుంటే ఆ ఏడాదికి సరిపడా మౌలిక సదుపాయాలను కల్పించుకుంటే సరిపోయేది. ఎంబీబీఎస్ కోర్సు నాలుగున్నరేళ్ల పూర్తయ్యేనాటికి భవనాలు, ఇతర సౌకర్యాలన్నీ అందుబాటులో ఉంచుకోవాలని ఉండేది. దాన్ని పక్కనపెట్టి 2023 డాక్యుమెంట్ ప్రకారమే కొత్త కాలేజీలను మంజూరు చేస్తామని ఎన్ఎంసీ చెప్పడంతో పలు రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఎన్ఎంసీ కొత్త మెడికల్ కాలేజీల కోసం గత ఆగస్టులో దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిశీలన కూడా పూర్తి చేసింది. అయితే ఎన్ఎంసీ తీసుకొచ్చిన ఎంఎస్ఆర్-2023 డాక్యుమెంట్‌పై కర్ణాటక ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించింది. ఒకేసారి నాలుగున్నరేళ్లకు సరిపడా అధ్యాపకులు, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలన్న నిబంధనను సవాల్ చేసింది. పాత డాక్యుమెంట్ ప్రకారమే అనుమతులు ఇవ్వాలని కోరింది. దీంతో ఎన్ఎంసీ డాక్యుమెంట్‌పై కోర్టు స్టే విధించింది.

మన కాలేజీల పరిస్థితి ఏంటో..

గద్వాల, నారాయణపేట, ములుగు, వరంగల్, మెదక్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటు కోసం గత ప్రభుత్వం 2023 ఆగస్టులో దరఖాస్తు చేసింది. తొలుత వీటిని 100 ఎంబీబీఎస్ సీట్ల చొప్పున ఏర్పాటు చేయాలనుకున్నా.. చివరి నిమిషంలో 50 సీట్ల కోసం దరఖాస్తు చేశారు. ప్రస్తుతం ఈ కాలేజీల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సభ-సందేశం

లోక్‌సభ ఎన్నికలు వేగంగా సమీపిస్తున్న తరుణంలో, ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో ఆదివారం 'ఇండియా' కూటమి తన బలప్రదర్శన నిర్వహించింది. బీజేపీని ఓడించి దేశాన్ని గెలిపించాలని ప్రజలకు ఈ ప్రజాస్వామ్య పరిరక్షణ సభ పిలుపునిచ్చింది. మోదీ నియంతృత్వపాలన అంతం కానిదే ఈ దేశంలో ప్రజాస్వామ్యం మనుగడసాధించలేదని అంటూ రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ఐక్య పోరాటానికి సిద్ధమైంది. క్రికెట్ తరహాలో మోదీ మ్యాచ్‌ఫిక్సింగ్ చేయబట్టే ఇన్నేసి స్థానాలు గెలుస్తున్నారని లేకుంటే బీజేపీకి 180సీట్లు కూడా దాటవని రాహుల్ లెక్కవేశారు. జేబులో కొందరు బిలియనీర్లను పెట్టుకొని, ఐటీ, సీబీఐ, ఈడీ ఇత్యాది కేంద్రప్రభుత్వ సంస్థలను విపక్షనేతలమీద ఆయుధాలుగా వాడుతూ, మీడియాను నియంత్రిస్తూ, ఈవీఎంలను వాడుతూ అధికారంలో కొనసాగుతున్నారే తప్ప మోదీకి నిజంగా అంతటి ప్రజామోదం లేదన్నది సారాంశం. రామ్‌లీలా మైదానంలో విపక్షనేతలు రాముడిని కూడా తలుచుకున్నారు. అధికారం, అపార వనరులు అండగా ఉన్న రావణుడిని యుద్ధంలో అవేమీలేని రాముడు ఓడించినట్టుగా, మోదీ నాయకత్వంలోని బీజేపీని గద్దెదించాలన్నారు. విపక్షపార్టీలకు చెందిన ఇద్దరు ముఖ్యమంత్రుల అరెస్టులు పదిహేడు పార్టీల ఈ ర్యాలీ ఊహించినకంటే బలంగా జరగడానికి ఓ కారణం కావచ్చు. హేమంత్ సోరేన్, అరవింద్ కేజ్రీవాల్ అరెస్టులకు వ్యతిరేకంగా మాత్రమే ఈ సభ జరుగుతున్నట్టుగా కనిపించకూడదని, ప్రమాదంలో పడిన ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమి కట్టుబడినట్టుగా సందేశం ఉండాలని కాంగ్రెస్ చెప్పిన హితవు మేరకు, కటకటాల వెనుక ఉన్న కేజ్రీవాల్ కటౌట్లను తీసివేయడం సహా ఆమ్ ఆద్మీ పార్టీ ఈ సభా నిర్వహణలో చాలా ప్రజాస్వామికంగా వ్యవహరించిందట.

ఇండియా కూటమికి పునాదులు పడి దాదాపు తొమ్మిదినెలలు అవుతున్నది. ముంబైలో జరిగిన సభకు విపక్షనేతలు అనేకమంది హాజరైనప్పటికీ, అది ప్రధానంగా రాహుల్ న్యాయ యాత్రతో ముడిపడిన వ్యవహారంగా ప్రజలకు కనిపించింది. ఇప్పటి సదస్సులో కూటమిలోని అన్ని పార్టీల ప్రాతినిధ్యమూ ఉన్నట్టే. మమతాబెనర్జీ స్వయంగా రాకపోయినప్పటికీ, ఆమె సందేశాన్ని ఆ పార్టీ ప్రతినిధి చదివి వినిపించారు. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్‌తోనూ, వామపక్షాలతోనూ సీట్ల సర్దుబాటుకు ససేమిరా అంటున్న తృణమూల్ పార్టీ ఈ సదస్సు ద్వారా తాను ఇప్పటికే, ఎప్పటికీ కూటమిలో భాగస్వామినేనంటూ ప్రకటించడం ఓ విచిత్రం, విశేషం. జైళ్ళలో ఉన్న కేజ్రీవాల్, హేమంత్ సొరేన్ తరఫున వారి భార్యలు ఈ ర్యాలీలో పాల్గొని, తమ తమ పార్టీల అజెండాలకు అనుగుణంగా సందేశాలు, ఎన్నికల హామీలు ఇవ్వడం అటుంచితే, ముందువరుసలో రెండు ఖాళీ కుర్చీలు ఉంచడం ద్వారా ఈ సభ తన నిరసనను వినూత్నంగా ప్రకటించింది. మోదీ నిరంకుశ విధానాల కారణంగా ఇద్దరు ముఖ్యమంత్రులు ఎన్నికల వేళ ప్రజలకు దూరంగా ఉండిపోవాల్సి వచ్చిందని చెప్పేందుకు ఇది ఉపకరిస్తుంది.

పదేళ్ళుగా అధికారంలో ఉన్నపార్టీ నిజానికి ఈపాటికే అవినీతి విషయంలో ఆత్మరక్షణలో పడాలి. కానీ, మోదీ ప్రభుత్వం ఇందుకు భిన్నంగా అవినీతిని ఎన్నికల ఆయుధంగా మార్చుకొని విపక్షనేతలమీద కేసులు పెడుతోంది, వారిని జైళ్ళలోకి నెడుతోంది, అందుకు తన అధీనంలో ఉన్న సంస్థలను వాడుతోంది. విపక్షపార్టీలు ఇంకా ఆత్మరక్షణలోనే ఉంటూ అవినీతి ఆరోపణలను ఖండించాల్సివస్తున్నది.

సభలో కూటమి నేతలు అధికారపక్షంమీద చేసిన రాజకీయ విమర్శలను అటుంచితే, దాదాపు నేతలందరూ ప్రజల దైనందిన జీవితాలకు ఉపకరించే చాలా అంశాలను ప్రస్తావించారు, నిర్దిష్టమైన హామీలు కూడా ఇచ్చారు. ఉపాధిలేమి, రైతులకు కనీస మద్దతుధర, ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు ఇత్యాదివి ప్రస్తావనకు రావడం, కూటమి ఉమ్మడి ఎజెండాగా కనిపించడం బాగుంది. ఢిల్లీ పోలీసులు ఎన్ని ఆంక్షలు పెట్టినప్పటికీ, పరిమితులు విధించినప్పటికీ, ర్యాలీలో ప్రజలు లక్షలాదిగా పాల్గొన్నారని విపక్షనేతలు సంతోషిస్తున్నారు. ర్యాలీ విజయవంతమైనప్పటికీ, కొన్ని చోట్ల సీట్ల సర్దుబాటు సహా చాలా అంశాలను ఇండియా కూటమి ఇంకా పరిష్కరించుకోవాల్సి ఉంది. ఖర్గే హెచ్చరించినట్టుగా, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో, విభేదాలన్నింటినీ పక్కనబెట్టి కలిసికట్టుగా కదులుతున్నట్టు కనిపించడం ఎంతో ముఖ్యం.

మోదీకే అన్ని వర్గాల మద్దతు!

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశ పాలనా బాధ్యతలు చేపట్టి మరో నెలకు పదేళ్లు పూర్తి అవుతుంది. ఈ పదేళ్లలో ఆయన ఎన్నో ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. కాని ఏ వ్యక్తి పాలన గురించి అయినా సమగ్రంగా అన్ని కోణాలతో సమీక్షించిన తర్వాతే సరైన విధంగా అంచనాకు రావడం సరైంది. ఈ దృష్ట్యా చూస్తే అత్యధిక ప్రజలు మోదీ నాయకత్వం కొనసాగడం వల్లే భారతదేశం పటిష్టంగా మారుతుందని, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట ఇనుమడిస్తుందని, తమ జీవితాలు బాగుపడతాయని భావిస్తున్నారు.

సాధారణంగా చదువుకున్నవారు, దేశ సంపదను పెంచేవారు ఆ దేశ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తారు. కాని ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే మోదీ నాయకత్వాన్ని ఈ దేశంలో విద్యావంతులు, మధ్యతరగతి, సంపన్న వర్గాలు కూడా సమర్థిస్తున్నారు. 'వై ఇండియాస్ ఎలైట్స్ బ్యాక్ నరేంద్ర మోదీ' అన్న శీర్షికతో తాజాగా బ్రిటన్‌కు చెందిన అంతర్జాతీయ పత్రిక ద ఎకనమిస్ట్‌లో ప్రచురించిన ఒక వ్యాసంలో మోదీ ప్రజాదరణలో ప్రపంచ దేశాధినేతలందరిలోనూ విభిన్నమైన వ్యక్తి అని ఈ పత్రిక తెలిపింది.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

సబ్ కాసాథ్, సబ్ కా వికాస్ అన్న నినాదంతో పరిపాలన ప్రారంభించిన మోదీ ఇవాళ మహిళలు, రైతులు, యువకులు, పేదలు అని నాలుగు వర్గాలుగా సమాజాన్ని విభజించి వారికి ప్రయోజనాలు నిర్దిష్టంగా చేరేలా కృషి చేస్తున్నారు. దేశ ఆర్థిక విధానాలు సంపన్నుల నుంచి సామాన్యుల వరకూ అన్ని వర్గాలను దృష్టిలో ఉంచుకుని, అభివృద్ధి, ఆర్థిక పటిష్టతే ప్రధాన లక్ష్యాలుగా ఒక సమతుల్య దృక్పథంతో పనిచేస్తున్నారు.

నిజానికి ప్రపంచంలోని చాలా దేశాల్లో ప్రజాదరణ గల నేతల్ని అక్కడి ఉన్నత స్థాయి వర్గం వ్యతిరేకిస్తుంది. అమెరికాలో ట్రంప్ కూడా ఈ పరిస్థితి ఎదుర్కొన్నారు. విద్యావంతుల్లో కేవలం 26 శాతం మంది మాత్రమే ట్రంప్‌కు మద్దతిచ్చారు. సామాన్య జనంలో 50శాతం ఆయనకు మద్దతు పలికారు. కాని మోదీకి విద్యావంతుల్లో 80శాతం, ప్రాథమిక విద్యా స్థాయిని కూడా దాటని సామాన్యుల్లో 66 శాతం మద్దతు ఉన్నదని గ్యాలప్ సర్వేలో వెల్లడైంది. 'వివిధ దేశాల్లో నేతలు రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొన్నారు. కాని భారత్‌లో మోదీకి ఆ పరిస్థితి లేదు. అందుకే మూడోసారి తిరుగులేని విజయం సాధిస్తున్న మోదీని అత్యంత శక్తివంతుడైన నేతగా అభివర్ణించవచ్చు' అని ఎకనామిస్ట్ అభిప్రాయపడింది. 'ఉన్నత స్థాయి వర్గాల మద్దతు పొందే క్రమంలో ఆయనేమీ సామాన్యుల మద్దతును కోల్పోలేదు' అని వివరించింది. 2019 ఎన్నికల్లో డిగ్రీ చదువుకున్న వారిలో 42 శాతం మోదీకే ఓటువేశారని లోక్‌నీతి – సిఎస్‌డిఎస్ సర్వే కూడా వివరించింది.



మోదీ హయాంలో ఒక సమైక్య జాతీయవాద శక్తిగా భారతదేశం రూపొందిందని, తమ నమ్మకాలకు, విశ్వాసాలకు సరైన విలువ దక్కిందని భారతీయులంతా భావిస్తున్నారు. ఇక మోదీ సారథ్యంలో బీజేపీ మూడోసారి అప్రతిహతంగా అధికారంలోకి రావడానికి ప్రతిబంధకాలేమున్నాయి?

ఆర్థిక వ్యవస్థే మోదీకి ఉన్నత వర్గాల్లో ఆదరణ పెరగడానికి ప్రధాన కారణం అని ద ఎకనామిస్ట్ పత్రిక పేర్కొంది. మోదీ హయాంలో భారత్ ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు అంతర్జాతీయంగా తన ప్రత్యేకతను, విశిష్టతను నిరూపించుకోవడంలో మోదీ విజయం సాధించారు. దీనివల్ల ప్రపంచ వ్యాప్తంగా భారతీయులందరూ భారత్ ఆర్థిక వ్యవస్థ చైనాను ఢీకొనాలంటే మోదీ లాంటి నాయకుడు అవసరమని భావిస్తున్నారు. అంతేగాక, మోదీ లాంటి బలమైన నేత ఎవరూ ప్రతిపక్షాల్లో కనుచూపుమేర కనపడడం లేదు. ఒక విశ్వసనీయ ప్రతిపక్ష పార్టీ అవతరించేంతవరకూ మోదీ ప్రాబల్యానికి ఢోకా లేదని ద ఎకనమిస్ట్ ప్రతినిధులతో పాటు ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు.

అమెరికాకు చెందిన న్యూయార్క్ టైమ్స్ కూడా మోదీ హయాంలో భారతదేశం ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా మారిందని, ఎన్ని సంక్షోభాలు వచ్చినా భారతదేశ అభివృద్ధి వేగం తగ్గకుండా ఆయన చూశారని తాజా సంచికలో ప్రశంసించింది. మోదీ పాలనలో కోట్లాది మంది భారతీయుల జీవన పరిస్థితులు మెరుగుపడ్డాయని తెలిపింది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోదీ మూడోసారి అఖండ విజయం తప్పక సాధిస్తారని చెప్పేందుకు భారతీయ స్టాక్ మార్కెట్ ఆయన అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ మూడు రెట్లు అభివృద్ధి చెందడమే నిదర్శనమని తెలిపింది.

ఎక్కడైతే గ్రామీణ సంక్షోభం, పేదరికం ఉన్నదో అక్కడ మోదీ ప్రభుత్వం జోక్యం చేసుకుని పరిస్థితి మెరుగుపరుస్తున్నదని ఈ పత్రిక తెలిపింది. ఉచిత ఆహార ధాన్యాలు, శౌచాలయాలు, గ్యాస్ సిలిండర్లు, గృహనిర్మాణం, ఎల్‌ఇడి విద్యుద్దీపాలు, ప్రతి ఒక్కరి చేతుల్లో స్మార్ట్ ఫోన్లు, దాదాపు ఉచితంగా మొబైల్ డాటా లభ్యం కావడం ఇవన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇవాళ గ్రామీణ జీవితమే మారిపోయింది. భారతదేశంలో వినియోగదారుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, 2027 నాటికి ఇండియా ప్రపంచంలో అతి పెద్ద వినియోగ మార్కెట్‌గా అవతరిస్తుందని సిఎన్‌బిసి ఒక వార్తాకథనంలో పేర్కొంది. గ్రామాలకు, పట్టణాలకూ మధ్య వ్యత్యాసాలు తగ్గిపోవడం వల్ల వినియోగదారులు పెరిగిపోతున్నారని, మార్కెట్ గ్రామాలకు కూడా విస్తరిస్తోందని తెలిపింది. దేశంలో అత్యధికంగా ఉన్న యువ జనాభా కూడా వినియోగదారులు పెరిగేందుకు కారణమని, యువత ఎలక్ట్రానిక్స్‌తో సహా వివిధ పరికరాలను కొనుగోలు చేస్తున్నారని తెలిపింది. బ్యాంకింగ్, వ్యాపార వ్యవహారాల్లో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడం, మొబైల్, ఆధార్, బ్యాంకు ఖాతాలను సాఫ్ట్‌వేర్ ప్లాట్ ఫారమ్‌లలో విలీనం చేసి ఆర్థిక లావాదేవీలను సులభతరం చేయడం, జీఎస్టీని ప్రవేశపెట్టి పన్నుల వ్యవస్థను ప్రక్షాళనం చేయడం, కార్పొరేట్ పన్నులను తగ్గించి ఆ రంగానికి భారతదేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కల్పించడం, ఆత్మనిర్భర్ భారత్ ద్వారా స్వదేశీ పరిశ్రమను ప్రోత్సహించడం, బ్యాంకు రుణాల ద్వారా స్వయం ఉపాధికి చేయూతనివ్వడం ఇవన్నీ భారతదేశ ఆర్థిక పురోగతి ప్రయాణంలో మనకు కనిపిస్తాయి.

మోదీ ఈ ఎన్నికల్లో విజయం సాధించకపోతే భారతీయ మార్కెట్‌లు 25 శాతం మేరకు పడిపోతాయని ఆసియాలో అతిపెద్ద మార్కెట్ వ్యూహకర్తల్లో ఒకటైన క్రిస్‌వుడ్ ఆందోళన వ్యక్తంచేసింది. కాని మోదీ ఆ పరిస్థితి రానివ్వరని, ప్రజల్లోనే కాక, అధికారంలో అన్నిస్థాయిల్లో మోదీ పట్టు బలంగా కనిపిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ హయాంలో భారత ప్రభుత్వం పరిపాలనాపరంగా విఫలమైతే మోదీ హయాంలో ఆర్థిక వ్యవస్థతో పాటు పరిపాలనా వ్యవస్థలను కూడా నియంత్రణలో ఉంచుకోవడం ఇందుకు కారణం.

ఇవాళ భారతదేశంలో మోదీ విశ్వరూపం తప్ప మరేమీ కనపడడం లేదు. జీ–20 సమావేశాలు మాత్రమే కాదు, దేశంలో ఏ సానుకూల పరిణామం జరిగినా అందుకు మోదీయే కారణం అని ప్రజలు విశ్వసిస్తున్నారు. తమకు సంక్షేమ పథకాలు ఎలాంటి మధ్య దళారీలు లేకుండా చేరుతున్నాయని సామాన్యులు భావిస్తుంటే, సంపద పెంచేందుకు తమకు అవకాశం కల్పిస్తున్నారని పారిశ్రామికవేత్తలు గ్రహించారు. మోదీ హయాంలో ఒక సమైక్య జాతీయ వాద శక్తిగా భారతదేశం రూపొందిందని, తమ నమ్మకాలకు, విశ్వాసాలకు సరైన విలువ దక్కిందని భారతీయులంతా భావిస్తున్నారు. ఇక మోదీ సారథ్యంలో బీజేపీ మూడోసారి అప్రతిహతంగా అధికారంలోకి రావడానికి ప్రతిబంధకాలేమున్నాయి?


అసలు సమస్య ఆశ్రిత గుజరాతీవాదం!

ఆధునిక భారతదేశ రాజకీయ పరిణామాలకు పునాది 1857. బ్రిటీష్ వలస పాలనకు వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య ప్రథమ పోరాటం సాగిన సంవత్సరమది. ఆ పోరాటం విజయవంతం కాకపోయినప్పటికీ, సామాజిక రంగంలో అదొక కొత్త సమీకరణల్ని ముందుకు తీసుకుని వచ్చింది. బ్రిటీష్ వలస వ్యతిరేక పోరాట కాలంలో హిందూ ముస్లింల మధ్య ప్రగాఢ ఐక్యత ఏర్పడింది. ప్రాదేశిక జాతీయవాదం (Territorial Nationalism) అనే భావన బలంగా ముందుకు వచ్చింది. భారతదేశ సరిహద్దుల లోపల నివసించేవారందరూ ఒకే జాతి అనేది దీని సారాంశం. దాని పేరు భారతజాతి / హిందూజాతి.

హిందూ ముస్లిం సమూహాలు భారీ సంఖ్యలో ఢిల్లీ ఎర్రకోట ముందు నిలబడి, 80 యేళ్ళు దాటిన వృద్ధ చక్రవర్తి రెండవ బహదూర్ షా జాఫర్‌ను స్వాతంత్ర్య ఉద్యమంలో తమకు నాయకత్వం వహించమని ముక్తకంఠంతో కోరడం ఒక గొప్ప చారిత్రాత్మక ఘట్టం. ప్రజల కోరిక మేరకు జాఫర్ ఆ తిరుగుబాటుకు నాయకత్వం వహించాడు. అందుకు శిక్షగా రంగూన్‌లో హౌస్ అరెస్టులో ఉండి 1962లో చనిపోయాడు. ఆ తరువాత ఆరంభమైన జాతీయోద్యమం భారత స్వాతంత్ర్య ప్రథ పోరాటం నుంచి 'ప్రాదేశిక జాతీయవాదం'ను ఆదర్శంగా స్వీకరించింది.

గతంలో ఎవరు ఎక్కడ నివాసం వున్నా ప్రస్తుతం భారతదేశంలో విలీనమై నివసిస్తున్నారు కనుక వీరందరూ భారతీయులే అనేది ప్రాదేశిక జాతీయవాదం అవగాహన. ఉర్దూ మహాకవి ముహమ్మద్ అల్లమా ఇక్బాల్ 1904లో 'సారే జహాసే అచ్చా హిందూసితా హమారా' (ప్రపంచంలో మహోన్నతమైనది మన హిందూదేశము) అనే పల్లవితో సుప్రసిద్ధ జాతీయ గీతాన్ని రాశారు. అందులోని ఒక చరణంలో 'మనం హిందువులం మనది హిందూదేశము' (హిందూ హై హమ్ – వతన్ హై హిందూస్తాన్ హమారా) అంటారు. ఇందులోని హిందూ, హిందూస్తాన్ వగయిరా పదాల్ని ప్రాదేశిక జాతీయవాద దృక్పథంతో రాశారు. ఇప్పుడు హిందూమతంగా ప్రచారంలో వున్నది అప్పట్లో సనాతనధర్మం పేరుతో వుండేది. హిందూ పదం జాతి పేరుగా వుండేది. ప్రాదేశిక జాతీయవాదం ప్రకారం దేశంలోని ముస్లింలు, క్రైస్తవులు అందరూ హిందువులే!

వినాయక్ దామోదర్ సావర్కర్ 1922లో 'హిందూత్వ ఆవశ్యకతలు' పేరుతో ఒక సిద్ధాంత గ్రంథాన్ని రాశారు. దీన్ని 1923లో 'హిందూత్వ – హిందువు అంటే ఎవరు?' అనే పేరుతో ప్రచురించారు. సావర్కర్ పుస్తకానికి రెండు ప్రత్యేకతలున్నాయి. మొదటిది: హిందూ పదానికి ప్రాదేశిక అర్థాన్ని తొలగించి మతపరమైన అర్థాన్ని ఇచ్చారు. రెండోది: హిందూమత సమూహపు రాజకీయార్థిక సాంస్కృతిక ఆధిపత్యాన్ని సూచించడానికి 'హిందూత్వ' అనే కొత్త పదాన్ని ప్రయోగించారు. ఆ పదం సావర్కర్ స్వీయసృష్టి. అక్కడి నుండి మన రాజకీయాల్లో సాంస్కృతిక జాతీయవాదం (Cultural Nationalism) ప్రవేశించింది. హిందూమత ప్రాతిపదికగా జాతి నిర్మాణం దీని లక్ష్యం. అంచేత దీన్ని హిందూ జాతీయవాదం అనవచ్చు.



ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టుల్ని సామాజికంగా వెలివేస్తున్నాం, ఆర్థికంగా అణచివేస్తున్నాం, రాజకీయంగా దూరంగా పెడుతున్నాం అని చెప్పడం ద్వారా కరడుగట్టిన హిందూత్వవాదుల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు సంఘపరివారం చేస్తున్నది. అయోధ్యలో రామాలయ నిర్మాణం ద్వారా సామరస్య హిందువులని సంతృప్తిపరచే ప్రయత్నం చేస్తున్నది. ఇలాంటి ముసుగులు ఎన్ని కప్పినా కేంద్ర ప్రభుత్వ గుజరాతీ పక్షపాతం అందరికీ స్పష్టంగానే కనిపిస్తున్నది. జాగ్రత్తగా గమనిస్తే ఉత్తర – దక్షిణ వివాదంకన్నా, గుజరాతీ వ్యతిరేక వివాదం వేగంగా రగులుకుంటున్నది.

వి.డి. సావర్కర్ ప్రతిపాదించిన ద్విజాతి సిద్ధాంతం, హిందూ జాతీయవాదం ప్రేరణతో హిందువులకు రాజ్యాధికారాన్ని సాధించే లక్ష్యంతో 1925లో ఆరెస్సెస్ ఏర్పడింది. ఆ సంస్థ రెండవ సర్సంగ్ ఛాలక్ గురూజీ ఎంఎస్ గోల్వాల్కర్ 'బంచ్ ఆఫ్ థాట్స్' అనే గ్రంథంలో హిందూదేశానికి మిత్రులు ఎవరో శత్రువులు ఎవరో వివరించారు. తలనుండి పుట్టినా, ఛాతీ నుండి పుట్టినా, ఉదరభాగం నుండి పుట్టినా కాళ్ళ నుండి పుట్టినా నాలుగు వర్ణాలూ ఒకే విరాట్ పురుషుని దేహం నుండి పుట్టాయి కనుక అవన్నీ పవిత్రమైనవే అనేది వారి వివరణ. వర్ణాల్లో ఒకటి ఎక్కువ అనీ మరొకటి తక్కువ అని భావించడం, హిందూ సమాజంలో నిచ్చెనమెట్ల వ్యవస్థ వుందని చెప్పడం తప్పు అంటూ వారు హిందూ ఐక్యతను బోధించారు.

మరోవైపు, ముస్లింలు భారతదేశంలో పుట్టి, ఇక్కడే బతికి, ఇక్కడే చనిపోయినా భారతదేశం వారికి పితృభూమి, కర్మభూమి మాత్రమే అవుతుంది గానీ పుణ్యభూమి మాత్రం కాదు. కాబట్టి వారు 'అన్యులు' అనేది గోల్వాల్కర్ వర్గీకరణ. ఇదే ప్రమాణం క్రైస్తవులు, కమ్యూనిస్టులకు కూడ వర్తిస్తుందని వారొక సిద్ధాంతాన్ని అభివృద్ధి చేశారు. అక్కడితో ఆగకుండా 'ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు హిందూదేశానికి అంతర్గత ముప్పు' అని ప్రకటించారు.

సమాజంలో వ్యష్టి ప్రయోజనాలని పరిరక్షించాలనే ప్రజాస్వామ్యం, సమిష్టి ప్రయోజనాలను కాపాడాలనే సామ్యవాదం రెండూ భారత సమాజానికి పనికిరావని ఎంఎస్ గోల్వాల్కర్ ప్రగాఢ అభిప్రాయం. యజమానులు – శ్రామికులు అనే సామాజికార్థిక విభజన వారికి నచ్చేది కాదు. నాలుగు వర్ణాలవారు ఎవరి హక్కుల్ని వారు ఆస్వాదిస్తూ, ఎవరి బాధ్యతల్ని వారు నిర్వర్తించే వర్ణవ్యవస్థే ప్రపంచంలో నిలిచి వెలుగుతుందని వారు ప్రవచించారు.

దేశం బలపడడానికి ఆర్థిక రంగంలో హిందూ పెట్టుబడిదారుల్ని ప్రోత్సహించాలనే మాట గోల్వార్కర్ నాటికే వుంది. అయితే, దేశంలో సామ్యవాద భావాలు, కమ్యూనిస్టు పార్టీల ప్రభావం బలంగావున్న కారణంగా అప్పట్లో ఆరెస్సెస్ దాని రాజకీయ విభాగాలయిన జనసంఘ్, బీజేపీలు పెద్దగా ప్రభావాన్ని చూపలేకపోయాయి. 1990వ దశకం ఆరంభంలో తూర్పు యూరప్, రష్యాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు పతనం అయ్యాక, గ్యాట్ ఒప్పందాలు కుదిరాక, సరళీకృత ఆర్థిక విధానం రంగప్రవేశం చేశాక సాంస్కృతిక జాతీయవాదానికి ఆర్థిక జాతీయవాదాన్ని జత చేశారు. ఈ ఘనత లాల్ కిషన్ ఆడ్వాణీకి దక్కుతుంది. బడా పెట్టుబడిదారీ సంస్థలు ఆరెస్సెస్, బీజేపీలను ప్రోత్సహించడం మొదలెట్టాయి. ఈ ఫార్ములా రెండు పక్షాలకూ ప్రయోజనకారిగా మారింది. ఇరువురూ ఒక అవగాహనతో ఒకరినొకరు సమర్థించుకుంటూ ఒకరు ఆర్థిక రంగంలో, మరొకరు రాజకీయ రంగంలో బలపడ్డారు.

నరేంద్ర దామోదర్ దాస్ మోదీజీ 2001 చివర్లో గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యాక సాంస్కృతిక జాతీయవాదం, ఆర్థిక జాతీయవాదం కొత్త పుంతలు తొక్కాయి. నరేంద్ర మోదీజీ చొరవతో గుజరాత్‌లో హిందూ జాతీయవాదం గుజరాత్ జాతీయవాదంగా, గుజరాత్ ఆర్థిక జాతీయవాదంగా కొత్త శక్తిని పుంజుకుంది. గుజరాత్ మోడల్‌నే భారతదేశ మోడల్‌గా మార్చడానికి గుజరాతీ మెగా కార్పొరేట్లు గుజరాత్ ముఖ్యమంత్రిని దేశప్రధానిగా మార్చుకున్నారు.

మోదీజీ ప్రధాని అయ్యాక గుజరాత్ మెగా కార్పొరేట్లకు భారీ మేళ్ళు జరిగాయన్న అభిప్రాయం బలంగా ఉంది. దీనినే చాలామంది ప్రయోజిత పెట్టుబడిదారీ వ్యవస్థ (క్రోనీ కేపిటలిజం) అంటున్నారు. అందుకు భిన్నంగా, గుజరాత్ మెగా కార్పొరేట్లే తమ ధనబలాన్నీ, మీడియా బలాన్నీ ప్రయోగించి తమకు అనుకూలుడైన మోదీజీని దేశప్రధాని కుర్చీలో కూర్చోబెట్టుకున్నారనే వాదనా వుంది. దీనినే ప్రయోజిత ప్రజాస్వామ్యం (క్రోనీ డెమోక్రసీ) అంటున్నారు.

రాజకీయార్థిక రంగాల్లో ఇటీవలి పరిణామాల్ని లోతుగా గమనిస్తే దేశంలో ప్రయోజిత ప్రజాస్వామ్యం కొనసాగుతున్నదనే వాదనకే బలం చేకూరుతోంది. క్రోనీ డెమోక్రసీ అంటే ప్రజాస్వామ్యానికి నాలుగు మూల స్థంభాలయిన శాసన, కార్యనిర్వాహక, న్యాయ, మీడియా వ్యవస్థల పనితీరు ప్రాయోజిత కార్యక్రమాలుగా మారిపోయాయని అర్థం. క్రోనీ డెమోక్రసీ అనేది కొత్త సిద్ధాంతం ఏమీకాదు. మనం పెద్దగా పట్టించుకోలేదుగానీ మార్క్సిస్టు మూల సూత్రాల్లోనే ఈ ప్రస్తావన వున్నది. 'పెట్టుబడిదారీ వ్యవస్థ తన ప్రయోజనాలకు అనుకూలమైన పార్లమెంటరీ వ్యవస్థను రూపొందించుకున్నది' అని కార్ల్ మార్క్స్ అన్నాడు. పెట్టుబడిదారులు తమ ప్రయోజనాలను నెరవేర్చిపెట్టే రాజకీయ నాయకుల్ని దేశాధినేతలుగా నియమించుకునేందుకు ఇది అవకాశం ఇస్తుంది. గుజరాతీ మెగా కార్పొరేట్లు తమ ప్రతినిధిని దేశాధినేత స్థానంలో పెట్టుకునే స్థాయికి ఇప్పుడు ఇది అభివృద్ధి చెందింది.

ఉత్తర భారతదేశం, దక్షిణ భారతదేశాన్ని అణిచివేస్తున్నదనే వాదనలు గోల్వార్కర్ నాటికే వున్నాయి. దక్షిణాదికి చెందిన ఆదిశంకరాచార్యను తాము ఎంతగా గౌరవిస్తారో వారు చాలా వివరంగా చెప్పుకొచ్చారు. అయినప్పటికీ ఆ వివాదం మళ్ళీ రాజుకుంది. దక్షిణాది ఆరు రాష్ట్రాల్లో ఎక్కడా ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం లేకపోవడం దీనికి ఒక సంకేతం. ఇప్పుడు ఉత్తరాది వ్యతిరేకతతోపాటూ గుజరాతీ వ్యతిరేకత కూడా దేశమంతటా క్రమంగా పుంజుకుంటున్నది.

ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టుల్ని సామాజికంగా వెలివేస్తున్నాం, ఆర్థికంగా అణచివేస్తున్నాం, రాజకీయంగా దూరంగా పెడుతున్నాం అని చెప్పడం ద్వారా కరడుగట్టిన హిందూత్వవాదుల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు సంఘపరివారం చేస్తున్నది. అయోధ్యలో రామాలయ నిర్మాణం ద్వారా సామరస్య హిందువులని సంతృప్తిపరచే ప్రయత్నం చేస్తున్నది. ఇలాంటి ముసుగులు ఎన్ని కప్పినా కేంద్ర ప్రభుత్వ గుజరాతీ పక్షపాతం అందరికీ స్పష్టంగానే కనిపిస్తున్నది. జాగ్రత్తగా గమనిస్తే ఉత్తర – దక్షిణ వివాదంకన్నా, గుజరాతీ వ్యతిరేక వివాదం వేగంగా రగులుకుంటున్నది.

• ఉషా ఎస్ డానీ
సామాజిక విశ్లేషకులు

నేటి సందర్భంలో వైకోమ్ స్ఫూర్తి

'దేవాలయానికి వెళ్ళే దారిలో అంటరాని జనం నడిస్తే, ఆ దారులు మైల పడిపోతాయని వాళ్ళు అంటున్నారు. వైకోమ్ ఆలయంలో దేవుడు గానీ, బ్రాహ్మణులు గానీ అంటరాని జనం ఉనికితోనే మైలపడిపోతారా అని నేను అడుగుతున్నాను. వైకోమ్ ఆలయంలో దేవుడు మైల పడేమాట నిజమే అయితే, అది దేవుడే కాదు. వట్టి రాయి మాత్రమే. మాసిన బట్టలు ఉతకడానికి మాత్రమే పనికి వచ్చే రాయి అని నేనంటాను.'
– పెరియార్

వంద సంవత్సరాల క్రితం, 1924 మార్చి 30వ తేదీన, ఈళవ, నాయర్, పులయ కులాలకు చెందిన ముగ్గురు వాలంటీర్లు, వేలాది మందితో కలిసి వైకోమ్ దేవాలయ వీధులలోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. నాటి ట్రావెన్‌కూర్ సంస్థాన పోలీసులు అందరినీ అరెస్టు చేశారు. ఆనాటి నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకూ వరసగా రోజూ ఇదే విధంగా ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఈ సత్యాగ్రహ పోరాటం సుదీర్ఘంగా కొనసాగింది. జాతీయోద్యమంలో 1924 మార్చి 30 నుంచి 1925 నవంబరు 23 వరకూ, 600 రోజులకి పైగా జరిగిన చారిత్రాత్మక పోరాటం ఇది. వందేళ్ళ వైకోమ్ సత్యాగ్రహాన్ని మళ్ళీ గుర్తు చేసుకోవాల్సి ఉంది.

1920లలో అంటరానితనాన్ని హిందూయిజానికి కళంకంగా భావించడం మొదలయింది. అంటరానితనాన్ని రద్దు చేస్తే హిందూయిజాన్ని శుద్ధి చేయవచ్చనీ, అప్పుడు ప్రతి ఒక్కరూ అందులో సమానులుగా చేరవచ్చుననీ భావించారు. 1909లో దాదాపు ఐదువేలమంది ఈళవ కులస్థుల సమావేశమొకటి ప్రభుత్వం నడిపే ఆలయాన్నింటిలో ప్రవేశం కావాలని కోరింది. నారాయణగురు సన్నిహిత సహచరుడు అయిన టి.కె. మాధవన్ దీనిని జాతీయ స్థాయికి తీసుకెళ్ళాడు. దేవాలయ ప్రవేశం హిందువులందరి జన్మహక్కనీ, అంటరానితనాన్ని నిర్మూలించడానికి కృషి చేయాలనీ టి.కె. మాధవన్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని 1923లో జరిగిన కాకినాడ కాంగ్రెస్ సదస్సు ఆమోదించింది. 1924లో కేరళ కాంగ్రెస్ కమిటీలో ఒక అస్పృశ్యతా కమిటీని కె.కేలప్పన్ ఏర్పాటు చేశాడు. వైకోమ్ ఆలయం చుట్టూ వుండే వీధులని ఇతర కింది కులాల ప్రజలు ఈళవ కులస్థులు ఉపయోగించుకునే హక్కుల కోసం కాంగ్రెస్ పోరాడాలని నిర్ణయించారు.



వైకోమ్ ఉద్యమం జరిగి వందేళ్ళు గడిచిపోయాయి. అవే ప్రవర్తనలు, అవే గొంతులు, అలాంటి వాదనలే ఇవాళ మత విశ్వాసాలు, ఆచారాలు, సనాతన ధర్మం పేరుతో మరింత బలంగా, అధికారం అండతో మళ్ళీ వినిపిస్తున్నాయి. రాజకీయ ఉద్యమంలో సామాజిక సమానత్వాన్ని ఒక ప్రశ్నగా ఎజెండా మీదకు తెచ్చిన ఉద్యమంగా వైకోమ్ ఉద్యమానికి ప్రాధాన్యత ఉంటుంది.

వైకోమ్ పోరాటం మొదలు కాగానే ఆనాడు తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న పెరియార్‌కి పిలుపు వచ్చింది. వైకోమ్‌లో ఉన్న స్థానిక నాయకులు అందరూ అరెస్టవడంతో, గాంధీ సహచరుడూ, యంగ్ ఇండియా సంపాదకుడూ అయిన జార్జి జోసెఫ్ ఆహ్వానం మేరకు పెరియార్ వైకోమ్ పోరాటంలో పాల్గొనడంతో వైకోమ్ పోరాటానికి ఊపు వచ్చింది. పెరియార్ ఈ ఉద్యమంలో కీలక పాత్ర వహించాడు. రెండుసార్లు అరెస్టయ్యాడు. పెరియార్ వైకోమ్ పోరాటంలో మొత్తం 141 రోజులపాటు పాల్గొన్నాడు. 74 రోజులపాటు నిర్బంధంలో ఉన్నాడు. 67 రోజులు కేరళలో వివిధ ప్రాంతాల్లో పర్యటించి వైకోమ్ ఉద్యమానికి మద్దతు కూడగట్టాడు. 'నేను దేవుణ్ణి చూడాలనుకోవడం లేదు. కుక్కలు, పందులు సైతం స్వేచ్ఛగా నడయాడే వీధులలో మనుషులు నడిచే హక్కు కోసం పోరాడుతున్నాను' అన్న పెరియార్ మాటలు ప్రజలను కదిలించాయి. వైకోమ్ ఉద్యమంలో పాల్గొనకుండా కట్టడి చేయడానికి పెరియార్‌ను రాజద్రోహ నేరం కింద నిర్బంధించారు. క్రమంగా ఇది దేశవ్యాపితంగా అందరి దృష్టి ఆకర్షించింది. 1924 ఏప్రిల్ నెలలో అమృత్‌సర్ నుంచి వచ్చిన సిక్కుల జాతా ఒకటి సత్యాగ్రహ వాలంటీర్ల కొరకు ఒక ఉచిత వంటశాలను ఏర్పాటు చేసింది.

600 రోజులకి పైగా సత్యాగ్రహ పోరాటం కొనసాగినాక, అది ఒక విధమైన రాజీతో ముగిసింది. దేవాలయానికి మూడు వైపులా నిర్మించిన కొత్త రోడ్లపై అవర్ణులని అనుమతించారు, అయితే, నాలుగవ వైపున ఉన్న ప్రధానమైన రహదారిలోకి మాత్రం అవర్ణులను అనుమతించలేదు. కొత్తగా నిర్మించిన మూడు రహదారులు కూడా దేవాలయానికి కొంచెం దూరంలోనే ఉన్నాయి.

వైకోమ్ సత్యాగ్రహం తర్వాత కేరళలో ఇతర ఉద్యమాలకు పునాది వేసింది. గాంధీ వైఖరి అసంతృప్తికి దారితీసింది. గాంధీ దీనిని మొదటి నుంచీ 'హిందువుల సమస్య'గానే చూశాడు. వైకోమ్ సత్యాగ్రహంతో ప్రారంభం నుంచీ సంబంధం ఉండి, తన సహచరుడు, యంగ్ ఇండియా సంపాదకుడుగా పనిచేసిన జార్జి జోసెఫ్ సిరియన్ క్రిస్టియన్ కావడంతో, తనని ఈ ఉద్యమానికి దూరంగా ఉండమని గాంధీ ఆదేశించాడు. అదే విధంగా సిక్కుల బృందం ఏర్పాటు చేసిన వంటశాలను తక్షణమే మూసివేయాలని ఆదేశించాడు. ఈ ఉద్యమం తర్వాత పెరియార్ కాంగ్రెస్‌తో తెగతెంపులు చేసుకున్నాడు. అంబేద్కర్ మహద్ సత్యాగ్రహం సందర్భంగా వైకోమ్ ఉద్యమం స్ఫూర్తినిచ్చిందని పేర్కొన్నాడు. తదనంతర కాలంలో పెరియార్, అంబేద్కర్ వంటి నాయకులు దీనిని దేవాలయ ప్రవేశానికి మించిన సమస్యగా పరిగణించారు. కాగా, గాంధీ, దేవాలయ ప్రవేశం అంటరానితనాన్ని తొలగించే మార్గమని భావించాడు.

'ఒక మతం, సామాజిక సమానత్వం మీద ఆధారపడిన మతంగా ఉండాలంటే, దేవాలయ ప్రవేశాన్ని అనుమతించే విధంగా స్మృతిని వారిస్తే సరిపోదు. అది చాతుర్వర్ణ సిద్ధాంతాన్ని సమూలంగా నిర్మూలించాలి. సకల అసమానతలకు, కులవ్యవస్థకు మూలం చాతుర్వర్ణ సిద్ధాంతంలో ఉంది. అంటరానితనం అసమానతకు ఒక రూపం మాత్రమే. చాతుర్వర్ణ వ్యవస్థను సమూలంగా నిర్మూలించకుంటే దళితులూ దేవాలయ ప్రవేశాన్ని తిరస్కరిస్తారు, హిందూమతాన్ని తిరస్కరిస్తారు' అని అంబేద్కర్ అంటాడు.

జాతీయోద్యమంలో వలసవాదంపై పోరాటంలో ఎంచుకున్న మార్గంపై అనేక చర్చలు, భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మరొకవైపు, అంబేద్కర్ వంటివారు స్వాతంత్రోద్యమం దళితుల హక్కులకు ఎటువంటి హామీ ఇస్తుందనే ప్రశ్నను సూటిగా ముందుకు తెచ్చారు.

సామాజిక వైరుధ్యాలు, సమస్యల పట్ల జాతీయోద్యమంలో వ్యక్తమైన వైఖరులకీ, నాయకత్వ స్వభావం, దానికి ఉన్న పరిమితులకీ అద్దం పట్టిన ఉద్యమం వైకోమ్ ఉద్యమం. వైకోమ్ ఉద్యమం జరిగి వందేళ్ళు గడిచిపోయాయి. మారిన పరిస్థితులు, మారని విషయాలు రెండూ ఉన్నాయి. ఇప్పటికీ, దేవాలయాలలో ప్రవేశం కోసం వివిధ ప్రాంతాలలో దళితులు పోరాడుతున్న సంఘటనల గురించి చదువుతూనే ఉన్నాము. బాల్య వివాహాలు లేకుంటే సనాతన ధర్మాన్ని కాపాడలేమని, మహిళల స్థితి అధోగతిపాలవుతుందని 1928లో వాదించిన టి.కె. ఆచార్య వంటి సనాతనవాదుల వాదనలని వేరు వేరు రూపాలలో మనం వింటూనే ఉన్నాము. వైకోమ్ సత్యాగ్రహుల డిమాండ్ విషయమై నంబూద్రి బ్రాహ్మణులని ఒప్పించడానికి వెళ్ళిన గాంధీని దూరంగా బయట నిలబెట్టి అవమానించారు. ఆదిశంకరాచార్య బోధనల ప్రకారమే తాము నడుచుకుంటున్నామనీ, దేశమంతటా ఉన్న అంటరానితనాన్ని ఇంకొంచెం పొడిగిస్తున్నామనీ, గతజన్మల పాపఫలమే అవర్ణుల దుర్గతికి కారణమనీ నీలకంఠన్ నంబూద్రి పొగరుగా సమాధానమిచ్చాడు. అవే ప్రవర్తనలు, అవే గొంతులు, అలాంటి వాదనలే ఇవాళ మత విశ్వాసాలు, ఆచారాలు, సనాతన ధర్మం పేరుతో మరింత బలంగా, అధికారం అండతో మళ్ళీ వినిపిస్తున్నాయి. వైకోమ్ ఉద్యమం సాధించిన (పాక్షిక) విజయం, అది సాధించలేకపోయిన అంశాలని, చర్చలోకి రాని ఇతర అంశాలని అటుంచితే, రాజకీయ ఉద్యమంలో సామాజిక సమానత్వాన్ని ఒక ప్రశ్నగా ఎజెండా మీదకు తెచ్చిన ఉద్యమంగా వైకోమ్ ఉద్యమానికి ప్రాధాన్యత ఉంటుంది. ఆ ప్రశ్న ఇప్పటికీ విలువైనదే.

■ సుధా కిరణ్

ఎలెక్టోరల్ బాండ్లు అవినీతి రూపం కాదా?

'కేజ్రీవాల్ అరెస్ట్‌పై యాగీ ఎందుకు?' అంటూ మార్చి 26 ఆంధ్రజ్యోతి ఎడిట్ పేజీలో సత్యకుమార్ పలికిన అసత్య పలుకులు చూసిన తర్వాత ఈ వివరణ రాయాలనిపించింది. బీజేపీ ఎలెక్టోరల్ బాండ్లు పొందడం అవినీతి ఎలా అవుతుంది? అంటూ ఆయన వితండవాదం చేస్తున్నారు. అవినీతిని తెలివిగా చట్టబద్ధం చేసినంత మాత్రాన అవినీతి కాకుండా పోతుందా? ఒకప్పుడు పార్టీ సభ్యుల సభ్యత్వం, చందాలపై ఆధారపడ్డ రాజకీయ పక్షాలు ఇవాళ కార్పొరేట్ సంస్థలపై ఎందుకు ఆధారపడుతున్నాయి? ఎలెక్టోరల్ బాండ్ల పంపకం క్విడ్ ప్రొ కో కాకపోతే అధికారపక్షం బీజేపీకే ఎందుకు 47శాతం నిధులు ముట్టాయి. బాండ్ల అవినీతి రూపం కాకపోతే 2019 నుంచి పొందిన విరాళం సుప్రీంకోర్టు ఆదేశించే వరకు ఎందుకు రహస్యంగా ఉంచారు? కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించిన సంస్థ బీజేపీ, బీఆర్ఎస్‌కు మాత్రమే వందలకోట్లు ఇవ్వడంలో మతలబు చెప్పగలరా? లిక్కర్ కుంభకోణంలో ముద్దాయిగా అరెస్టయిన శరత్ చంద్రారెడ్డి జైలు నుంచి విడుదల అయిన రెండవ రోజే రూ.5కోట్లు ఇవ్వడాన్ని ఎలా సమర్థించుకుంటారు? శరత్ చంద్రారెడ్డిని ఈడీ, సీబీఐ అప్రూవర్‌గా మార్చి, ఆయన్ను ముద్దాయి నుంచి లిక్కర్ కుంభకోణంలో సాక్షిగా మార్చిన నెలరోజులుకు ఆయన కంపెనీ బీజేపీకి రూ.50కోట్లు సమర్పించుకోవడం చట్టబద్ధమా? కేజ్రీవాల్ ప్రధాన భాగస్వామిగా మొదలైన అవినీతి వ్యతిరేక ఉద్యమం బీజేపీ అధికారంలోకి రావడానికి తోడ్పడింది అనే విషయం మర్చిపోయి గొంగడిలో బువ్వతింటూ ప్రతిపక్షాలపై అవినీతి విమర్శ చేయడం గురివింద సామెతను గుర్తుకు తెస్తుంది? ఇటు కేజ్రీవాల్‌ను అబద్ధపు సాక్ష్యాలతో, రాజకీయ లబ్ధి కోసం జైలులో పెట్టించిన బీజేపీ వెనువెంటనే కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి యడ్యూరప్ప సారథ్యంలో మైనింగ్ మాఫియా గాలి జనార్దన్ రెడ్డికి బీజేపీ తీర్థం ఇవ్వడంలోనే మీ నిజాయితీ ఎంతో వెల్లడయ్యింది. ఇప్పటికీ ఓ సవాలు విసురుతున్నాను సత్యకుమార్ గారికి. ఎక్కడో కాదు, అరబిందో ఫార్మా ఇచ్చిన ఎలెక్టోరల్ బాండ్లపై సీబీఐ ఈడీలతో స్వచ్ఛందంగా విచారణకు ఆదేశించుకోండి? మీ నిజాయితీ బయటపడుతుంది!

– నల్లమోతు తిరుమలరావు
ఆమ్ ఆద్మీ పార్టీ కోర్ కమిటీ సభ్యులు

అధికారం వేటలో



వేటాడి జీవించిన ఆదిమ దశలోంచి
ఎదిగి ఎదిరించి వొదిగి
రాటుదేలిన పరిణామక్రమంలో
ఇప్పుడు వోట్లను వేటాడుతున్న
ఎన్నికల జూదంలో
ప్రలోభాల వలయంలో
పావులుగా మారిన జనమంతా,

కులాలవారీగా మతాలవారీగా
ముద్రలు పడిన మనమంతా
బహురూపుల మూకస్వామ్యంలో
గొణుగుతూనే వున్నాం రోజంతా –

"ఎవరికి దక్కిన ఆధిపత్యం?
ఎవరనుభవిస్తున్న అధికారం?"
బదులుగా బరితెగించి
సాగుతున్న అధికారం వేటలో
ఆధిపత్య హోరులో
నీతిన్యాయం జనస్వామ్య విధ్వంసం!

మహామహుల సిద్ధాంతాలన్నీ
వాళ్లకు మేలి ముసుగు వ్యాపారం,
శ్రామికవర్గ రాజ్యాధికారాన్ని
కాలరాస్తున్న
అనైతిక ధనార్జన దౌర్జన్య
రాజ్యతంత్రంలో
తరతరాలకు తరగని అర్జనే
అంతిమలక్ష్యం
నేతల వారి దాతల
నేటి ప్రత్యక్ష పురాణం!!

– నిఖిలేశ్వర్



ఆ 452 మంది ఎక్కడ?

- విధులెక్కడ నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి
- పరకాల నుంచి వచ్చిన మరో 30 మంది పనిచేసేదెక్కడో?
- కార్పొరేటర్ల సేవలో శానిటేషన్ సిబ్బంది
- కొందరి ఇళ్ల వద్దకే బయోమెట్రిక్ మిషన్లు
- అంగట్లో సరుకుగా పారిశుధ్య కార్మికుల ఉద్యోగాలు
- లక్షలు దండుకుని అమ్ముకుంటున్న కొందరు ఉద్యోగులు, నాయకులు

క్షేత్రస్థాయిలో కనిపించని పారిశుధ్య సిబ్బంది

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 1: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిస్థితి 'పైన పటారం.. లోన లొటారం' అన్నట్టు ఉంది. ముఖ్యంగా పారిశుధ్య విభాగమైతే మరీ అధ్వానంగా తయారైంది. బల్దియా పారిశుధ్య విభాగంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు అంగట్లో సరుకుగా మారాయి. ఇటీవల జరిగిన పీహెచ్ వర్కర్లు (పారిశుధ్య కార్మికులు) నియామకాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరిగినట్టు ప్రచారం జరుగుతుండగా.. ఈ పారిశుధ్య కార్మికుల పోస్టులను కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు డబ్బులకు అమ్ముకున్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సదరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రూ.లక్షల్లోనే దండుకున్నట్టు తెలుస్తోంది. ఇక ఇలా నియమితులైన 452మంది సిబ్బందితో పాటు పరకాల నుంచి వచ్చిన మరో30మంది అసలు ఎక్కడున్నారో.. ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారో తెలియడం లేదు. కొందరు ప్రజాప్రతినిధుల సేవలో తరిస్తుంటే.. మరికొందరు హాజరుమాత్రమే వేసి దర్జాగా జీతాలు తీసుకుంటున్నారు. ఇది తెలిసికూడా ఉన్నతాధికారులు చోద్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

బతుకు దెరువు కోసం..

వరంగల్ నగరంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన నిరుపేద దళితులు వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో బతుకుదెరువు కోసం ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్నారు. 25ఏళ్ల కిందట నెలకు రూ.500 జీతానికి చేరిన వారు.. ఇప్పుడు రూ.17,500 జీతం తీసుకుంటూ చెత్తా చెదారంతో సహవాసం చేస్తూ వృద్ధాప్యానికి దగ్గరయ్యారు. బల్దియా పరిధిలోని 66 డివిజన్లలో ప్రభుత్వ, ఔట్‌సోర్సింగ్ జవాన్లు, పీహెచ్ వర్కర్లు కలుపుకొని మొత్తంగా 2,800 మంది పనిచేస్తున్నారు. వీరంతా సీఎంహెచ్‌వో పర్యవేక్షణలో పని చేస్తారు. గతంలో బల్దియా పరిధిలో పారిశుధ్య పనులకు సిబ్బంది సరిపడా లేకపోవడంతో 2021లో అప్పటి కమిషనర్, మేయర్ నేతృత్వంలో ఎలాంటి విధివిధానాలు, నోటిఫికేషన్ లేకుండా 452మందిని పీహెచ్ వర్కర్లను తీసుకున్నట్టు తెలుస్తోంది. బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు.. స్థాయిల వారీగా పోస్టులు పంచుకుని ఒక్కో వ్యక్తి వద్ద రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు వసూలు చేసి ఉద్యోగాలను అమ్ముకున్నట్టు ఆరోపణలున్నాయి. అయితే ప్రస్తుతం ఆ 452మంది సిబ్బందితో పాటు పరకాల నుంచి వచ్చిన మరో30 మంది ఎక్కడ డ్యూటీలు చేస్తున్నారో అధికారులకు తెలియడం లేదు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ అడిగితే పొంతన లేని సమాధానం వస్తోంది.

డ్రాప్ ఆఫ్ వర్కర్ల ఉద్యోగాలు..

ఆరోగ్యం సహకరించక కొందరు, దుర్వాసనతో అనారోగ్యానికి గురై కొందరు, వృద్ధాప్యంతో కొందరు పారిశుధ్య కార్మికులు పని చేయలేకపోతున్నారు. విధులకు హాజరుకాకుండా డ్రాప్ ఆఫ్ వర్కర్లుగా మిగిలిపోతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు బల్దియా పర్మినెంట్ ఉద్యోగులు, కొందరు కార్మిక సంఘాల నాయకులు అందినకాడికి దండుకుటుంన్నారు. కమిటీ నిర్ణయం లేకుండానే అధికారుల కనుసన్నల్లో ఒకరికి బదులు మరొకరిని నింపి రూ.2 నుంచి రూ.3లక్షలు తీసుకుని సంబంధిత అధికారులతో పంపకాలు చేసుకుంటున్నట్టు సమాచారం.

విధులెక్కడ?

పారిశుధ్య కార్మికులు రోడ్లు శుభ్రం చేయడం, కాలువలు తీయడం, ఇళ్ల నుంచి చెత్త సేకరించడం, చెత్త ట్రాక్టర్లపై చెత్త మోపు చేయడం, వాహనాలు, ట్రాక్టర్లపై డ్రైవర్లుగా పని చేయాల్సి ఉంది. కానీ వీరిలో చాలా మంది బీసీ, ఓసీ సామాజికవర్గానికి చెందిన వారు ఉండగా.. చాలామంది ఈ పారిశుధ్య పనులు చేయలేక నెలవారీగా కొంత ఇస్తూ నడిపిస్తున్నట్టు తెలిసింది. అంతేకాకుండా ఐదుగురు కార్పొరేటర్లు వారికి చెందినవారిని నియమించుకుని ఇంటికే బయోమెట్రిక్ మిషన్ తెప్పించుకుని దర్జాగా హాజరు వేయించుకుంటున్నారనే విమర్శలున్నాయి. మరో నలుగురు కార్పొరేటర్ల బంధువులు ఉదయం లేచి ఆయా అడ్డాల వద్దకు వెళ్లి విధులకు హాజరైనట్టు మిషన్‌లో వేలిముద్రలు వేసి ఇంటికి వెళుతున్నట్టు తెలుస్తోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు 452 మందిలో 300మంది అడ్డదారిలో నెలవారీగా బ్యాంకుల నుంచి జీతాలు తీసుకుని కమిషనర్‌ను తప్పుదారి పట్టిస్తున్నారు. ఇదంతా ఎంహెచ్‌వోకు తెలియకుండా జరుగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అడ్డదారిలో జీతాలు పొందుతున్న వ్యక్తుల నుంచి కొందరు జవాన్‌లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సూపర్‌వైజర్లు నెల వారిగా డబ్బులు దండుకుంటున్నట్టు ప్రచారం జరుగుతోంది. ఇదంతా దీనిపై కొత్తగా వచ్చిన కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ప్రత్యేక దృష్టి సారించాలని కార్మికులు కోరుతున్నారు.

ట్రాక్టర్లపై మహిళలకు విధులు

ఇటీవల అధికారుల నిర్లక్ష్యం, కమిషనర్ పర్యవేక్షణలోపంతో వృద్ధ మహిళలని కూడా చూడకుండా కొందరు జవాన్లు క్రూరత్వాన్ని చూపినట్టు తెలుస్తోంది. రోడ్లు ఊడ్చే మహిళా పీహెచ్ వర్కర్లను ట్రాక్టర్లపై ఎక్కించి చెత్త సేకరించాలని బలవంతం చేస్తున్నారు. రెండేళ్ల కిందట నగరంలోని ఖిలావరంగల్, హనుమకొండ, విష్ణుపురిలో ట్రాక్టర్ నుంచి మహిళా పారిశుధ్య కార్మికులు కిందపడి ప్రాణాపాయం నుంచి బయటపడ్డ ఘటనలున్నాయి. దీనిపై అప్పటి అధికారులు స్పందించి మహిళా కార్మికులకు ట్రాక్టర్లలో చెత్త సేకరణ విధుల నుంచి ఉపశమనం కలిగించారు. అయితే ప్రస్తుతం కొందరు జవాన్లు నాటి అధికారులు ఆదేశాలు విస్మరించి మహిళలకు ట్రాక్టర్ల డ్యూటీలు కేటాయిస్తూ.. ఒక వేళ ఈ విధులు నిర్వర్తించమని ఎవరైనా అంటే.. నెలకు రూ.2వేలు ఇస్తే ఈ పని నుంచి మినహాయిస్తామని కొందరు జవాన్లు వారితో బేరమాడుతున్నట్టు ఆరోపణలున్నాయి.



కావ్యకే టికెట్

ఉత్కంఠకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం

- పార్టీలో చేరిన రెండు రోజుల్లోనే ఖరారైన అభ్యర్థిత్వం
- బీఆర్‌ఎస్‌ను తిరస్కరించి అనూహ్యంగా టికెట్ సొంతం
- పోటీపడ్డ కాంగ్రెస్ నేతలకు చుక్కెదురు.. పార్టీ శ్రేణుల్లో తీవ్ర నిరాశ

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: నెలరోజులుగా ఉత్కంఠ రేపిన వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి ఎవరనే అంశానికి తెర పడింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సోమవారం రాత్రి వరంగల్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్యను అధికారికంగా ప్రకటించారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూతురు కడియం కావ్య రాజకీయ అరంగ్రేటంతోనే ఊహించనిరీతిలో లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలిచారు. కడియం వర్గంలో ఈ పరిణామం ఆనందం నింపగా, మరోవైపు కాంగ్రెస్‌లోని ఆశావహులను తీవ్ర నిరాశకు గురి చేసింది. పార్టీ అధిష్ఠాన నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

పార్టీలో చేరిన రెండు రోజుల్లోనే..

రెండు రోజుల కిందటే కడియం శ్రీహరి, కావ్య హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకారం తీసుకొని ఆ తరువాత తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో కాంగ్రెస్ కండువాలను కప్పుకున్నారు. వరంగల్ లోక్‌సభ టికెట్ డిమాండ్‌తోనే శ్రీహరి, కావ్యలు పార్టీలో చేరారు. అయితే ఒక దశలో శ్రీహరి ఎమ్మెల్యే పదవిని వదులుకొని ఎంపీగా రంగంలో దిగుతారనే ప్రచారం జరిగింది. కానీ కూతురు కావ్యను ఎంపీగా బరిలో దింపే డిమాండ్‌తోనే శ్రీహరి కాంగ్రెస్ పెద్దలను ఆశ్రయించారు. మొత్తంగా శ్రీహరి వ్యూహం ఫలించి కావ్యకు టికెట్ దక్కింది. మొత్తంగా వరంగల్ లోక్‌సభ అభ్యర్థి ఎపిసోడ్‌కు

కడియం కావ్య బయోడేటా	
తండ్రి పేరు	: కడియం శ్రీహరి
తల్లి పేరు	: వినయరాణి
జన్మస్థలం	: హనుమకొండ
భర్త పేరు	: డాక్టరు ఎండీ నజీరుల్లా షేక్
సంతానం	: కూతుళ్లు దివ్య, మిహిరా
విద్యార్హతలు	: ఎంబీబీయస్, ఎండీ(పాథాలజీ)
వృత్తి	: అసిస్టెంట్ ప్రొఫెసర్ (ప్రతిమ రిలీఫ్ మెడికల్ కాలేజీ హనుమకొండ)

మిగతా 8వ పేజీలో..

వరంగల్ ప్రజలు ఆశీర్వదించండి..

- ఎంపీగా గెలిపిస్తే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి
- ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి బాబుమోహన్

7



బీజేపీని అడ్డుకునేందుకే కాంగ్రెస్‌లో చేరా..

- స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు నాయిని, నాగరాజును కలిసిన కడియం

7



వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్దపీట

- పలు స్కీమ్‌ల కింద వందల కోట్లు మంజూరు
- బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

7



కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా...

- ఎర్రబెల్లి దయాకర్‌రావు స్క్రిప్ట్ మేరకే పర్యటన
- మీడియా సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

7





వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఇతర అధికారులు

తాగునీటి కొరత లేకుండా చొరవ తీసుకోవాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 1: వేసవికాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి కొరత రాకుండా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి సీఎస్ సోమవారం రాత్రి రాష్ట్రంలోని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతికుమారి మాట్లాడుతూ.. తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రాకుండా గ్రామాల వారీగా కలెక్టర్లు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలన్నారు. గ్రామాల్లో అవసరం ఉన్న చోట బోర్‌వెల్స్ పైపులైన్లు వేయించాలని సూచించారు. కార్పొరేషన్లు, మునిసిపాలిటీ పరిధిలో తాగునీటి కొరతను అధిగమించేందుకు వాటర్ ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలని కోరారు.

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ధాన్యం కొనుగోళ్లపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని, కేంద్రాలు ఏర్పాటు చేయని చోట వెంటనే ఏర్పాటు చేయించాలని శాంతికుమారి అన్నారు. రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని, అలాగే గన్నీ సంచుల కొరత లేకుం డా చూడాలన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించే విషయంలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, తేమ శాతం విషయంలో రైతులకు అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఆయా జిల్లాలో నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను త్వరగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మారాలి

జూన్ 10లోగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ఉత్తమంగా తీర్చిదిద్దాలని శాంతికుమారి సూచించారు. సెలవులు పూర్తయ్యేలోగా పనులన్నీ పూర్తి కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సరఫరా, టాయిలెట్స్, అదనపు భవనాల నిర్మాణం, విద్యుత్ సరఫరా, ఇతర మౌలికవసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ప్రత్యేకంగా తీర్చిదిద్దడంలో డీఈవోలు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు.

వడదెబ్బ నివారణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలి

ఉష్ణోగ్రత రోజురోజుకూ పెరిగిపోతోందని, వడదెబ్బ నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఆదేశించారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, జనసంచారం ఎక్కువగా ఉన్నచోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో ఆశా కార్యకర్తలతో ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయించాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, వెంకట్ రెడ్డి, డీఆర్‌డీఓ నాగ పద్మజ, డీఈఓ డాక్టర్ అబ్దుల్‌హై, డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దొంగతోనే కండువా కప్పుకొంటివి..

- గతంలో రేవంత్‌రెడ్డిని దొంగ అన్న శ్రీహరి.. నైతిక విలువలుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి
- లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించండి..
- మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు



వరంగల్ పార్లమెంట్ స్థాయి సమావేశంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

రాంనగర్, ఏప్రిల్ 1: 'రేవంత్‌రెడ్డి ఓ మోసకారి, దొంగ అని గతంలో విమర్శలు చేస్తివి.. ఇప్పుడు ఆ దొంగతోనే కాంగ్రెస్ కండువా కప్పించుకుంటివి' అని ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరిని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి.హరీష్‌రావు ఎద్దేవా చేశారు. సోమవారం చింతగట్టు క్యాంపు వద్ద ఓ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ అధ్యక్షతన వరంగల్ లోక్‌సభ నియోజకవర్గస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన హరీష్‌రావు మాట్లాడుతూ.. కడియం శ్రీహరి పార్టీని వీడాడ బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ మరింత పెరిగిందని, పార్టీకి ద్రోహం చేసిన వారికి గుణపాఠం చెప్పాలనే కసి ప్రతీ కార్యకర్తలో వచ్చిందన్నారు. ఆయనకు బీఆర్ఎస్ ఎంతో చేసిందని, నైతిక విలువలుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఇక ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌వి ఉద్దెర వాగ్దానాలే తప్ప ఉద్ధరించిందేం లేదని ధ్వజమెత్తారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వినహా నిరుద్యోగ భృతి, రుణమాఫీ, కల్యాణలక్ష్మి తులం బంగారం, రైతుబంధు, రూ.4వేల పింఛనును సీఎం గాలికి వదిలేశాడని, రేవంత్‌రెడ్డివి తుపాకీరాముడి మాటలని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ వైఫల్యాలను బీఆర్ఎస్ శ్రేణులు ఎండగట్టాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడంలో భాగంగానే రాష్ట్ర అధికార చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం తొలగించాలనే నిర్ణయం తీసుకున్నారని,ఈ కళాతోరణం వరంగల్ ఆత్మగౌరవ ప్రతీకని, తొలగిస్తే వరంగల్ అగ్నిగుండమవుతుందని హెచ్చరించారు. ఇక బీజేపీ మాట వింటే జోడీ.. లేదంటే ఈడీ.. అని, నల్లధనం డబ్బులు వెలికితీసి ప్రతీ ఒక్కరి అకౌంట్లో రూ.15 లక్షలు వేస్తానని, ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని అధికారంలోకి వచ్చి దశాబ్దకాలం అవుతు న్నా బీజేపీ ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. దేవుడి పేరు చెప్పుకుని రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. అందరికీ దేవుడంటే భక్తి ఉంటుందంటూ వేదికపైనే హనుమాన్ చాలీసా చదివారు. పార్టీని వీడిన వారిని తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదన్న ఆయన ఉద్యమకారులకు అవకాశాలు కల్పిస్తామని, మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని శ్రేణులకు భరోసానిచ్చారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. పైరవీకారులు, బ్రోకర్లు పార్టీని వీడుతున్నారని మండిపడ్డారు. కడియం కూతురుకు ఎంపీ టికెట్ ఇస్తే మూడో స్థానంలో వస్తుందని తాను కేసీఆర్‌కు చెప్పానని, అయినా అందరినీ కాదని ఇస్తే పార్టీ మారడం ఎంతవరకు సమంజసమన్నారు. కడియం ఈ స్థాయిలో ఉండటానికి తానే కారణమని.. నాడు ఎన్టీఆర్‌కు చెప్పి ఎమ్మెల్యే, మంత్రి పదవులు ఇప్పించానని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో కడియం ఉన్నా, ఆయన కూతురు ఉన్నా ఓడించడంలో ముందుంటానని దయాకర్‌రావు పేర్కొన్నారు. శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ మాట్లాడుతూ పార్టీ మారిన కడియం శ్రీహరిపై అనర్హత వేటు కోసం పార్టీ పక్షాన స్పీకర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎమ్మెల్సీ మధుసూధనాచారి మాట్లాడుతూ కూతురును అడ్డుపెట్టుకుని కడియం శ్రీహరి రాజకీయం చేస్తున్నాడని, ఆయనకు తగిన గుణపాఠం తప్పదన్నారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కడియం శ్రీహరి లాంటి ముసలోళ్లు పోయినంత మాత్రాన పార్టీకి నష్టం లేదని, తమతో కావ్యను గెలిపించాలని చెప్పి.. తెల్లారే ప్లేట్ ఫిరాయించాడని ఆరోపించారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడు నెలలుగా కడియం శ్రీహరి పార్టీ మారేందుకు ప్రయత్నిస్తున్నాడని, బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన కడియం చస్తే.. ఆయన ముగ్గురు బిడ్డలు మాత్రమే పాడె మోయాల్సి వస్తుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. నీతి గురించి చెప్పే కడియం.. దేవునూరులో భూమి ఎలా కొన్నాడో.. ఇల్లు ఎలా కట్టాడో అందరికీ తెలుసన్నారు. నాడు ఎన్టీఆర్, చంద్రబాబుకు ఈరోజు కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచాడని

మిగతా 8వ పేజీలో..

ఎంపీ అభ్యర్థి ఎంపికపై సమాలోచనలు

- ఎర్రబెల్లి నివాసంలో నేతలతో హరీష్‌రావు భేటీ

6

ఆస్పత్రులకు బెదిరింపులు

- సీసీఎస్ పోలీసుల అదుపులో నకిలీ మావోయిస్టు?

హనుమకొండ టౌన్, ఏప్రిల్1: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధి ములుగు రోడ్డులోని అజర ఆస్పత్రి, బస్టాండ్ సమీపంలోని దీపక్ శోధన్ ఆస్పత్రి నిర్వాహకులకు మావోయిస్టుల పేరుతో విరాళాల కోసం ఫోన్‌లో బెదిరించిన వ్యక్తి నకిలీ మావోయిస్టుగా పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ఈ నెల 29న గుర్తు తెలియని వ్యక్తి ఈ రెండు ఆస్పత్రులకు వచ్చి చర్ల శబరీ మావోయిస్టు కమిటీ పేరుతో ఉన్న లెటర్‌ప్యాడ్‌ను ఆస్పత్రి రిసెప్షన్‌కు ఇచ్చి వెళ్లాడు. అదే రోజు రాత్రి 9గంటల నుంచి ఆస్పత్రి నిర్వాహకులకు ఫోన్ చేసి విరాళాలు ఇవ్వాలని బెదిరించాడు. దీంతో ఆస్పత్రుల నిర్వాహకులు హనుమకొండ పోలీసులకు అదివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఫోన్‌నెంబర్ ఆధారంగా నిందితుడిని సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లుగా తెలిసింది. నల్లబెల్లి మండలానికి చెందిన సదరు వ్యక్తి పెస్టిసైడ్స్ కంపెనీలో పనిచేస్తున్నట్లుగా ప్రాథమిక సమాచారం. న్యూరో సమస్యతో బాధపడుతున్న నిందితుడు.. ఆస్పత్రులపై విరక్తితో ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే ఒక్కడే బెదిరింపులకు ఒక్కడే పాల్పడ్డాడా..? ముఠాగా ఏర్పడి ప్లాన్ చేశాడా..? లేదా ఇంతకుముందు ఎక్కడైనా ఇదే తరహా బెదిరింపులకు పాల్పడ్డాడా? అనే అనేక విషయాలపై విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

సోమవారం ఉష్ణోగ్రతలు	
గరిష్ఠం : 39.0° C	కనిష్ఠం : 22.5° C

రంజాన్ వేళలు		
ఇఫ్తార్ :	మంగళవారం	సా : 6.35 గం..
సహర్ :	బుధవారం	ఉ : 4.46 గం..



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

కేసీఆర్ పాలన.. దోపిడీ మయం

- విద్యుత్, నీటి ప్రాజెక్టుల్లో అక్రమాలు
- అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

వరంగల్ సిటీ, ఏప్రిల్ 1: పదేళ్ల కేసీఆర్ పాలన దోపిడీమయమని, విద్యుత్, నీటి ప్రాజెక్టుల్లో ఎన్నో అక్రమాలు జరిగాయని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షలు చేసి గత ప్రభుత్వ దోపిడీపై విచారణకు ఆదేశించడంతో కేసీఆర్ ఒంట్లో వణుకు మొదలైందని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. సోమవారం వరంగల్ ఓసిటీలోని క్యాంపు కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పదేళ్ల పాలనలో రైతులను పట్టించుకోని కేసీఆర్‌కు.. పదవి పోగానే రైతులు గుర్తుకు వచ్చారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 117 రోజులే అవుతోందని, కానీ కాంగ్రెస్ తప్పిదాల వల్లే కరువుకాలం వచ్చిందని ప్రచారం విడ్డూరంగా ఉందన్నారు. అసలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వానాకాలమే రాలేదని, ఇది గుర్తించకపోవడం ఆయన అవివేకానికి నిదర్శమన్నారు. ప్రజల సొమ్మును దుర్వినియోగం చేసింది కేసీఆర్ అండ్ కో అన్నది జగమెరిగిన సత్యమన్నారు. కవిత లిక్కర్ స్కాం, కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్‌లు, సినీహీరోయిన్లను బ్లాక్‌మెయిల్ చేయడం అందరికీ తెలిసిందేనన్నారు. రాబోయే ఎన్నికలలోపే బీఆర్ఎస్ ఖాళీ అయ్యే పరిస్థితి కనబడుతుంటే కేసీఆర్ అభద్రతాభావానికి గురవుతున్నారన్నారు. ప్రాజెక్టుల పేరుతో కమీషన్లకు కక్కుర్తి పడి ప్రజాసంపదను దోచుకున్నారన్నారు. కేటీఆర్‌కు పోయే కాలం దగ్గరపడ్డటుందని, ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణతో వారు చేసిన దందాలన్నీ బయటపడుతున్నాయన్నారు. ఇప్పటికే చెల్లి లోపటికి పోయిందని, తప్పులు చేసిన వారు ఎవరైనా ఫలితం అనుభవించక తప్పదన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు, కడియం కావ్య పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థి ఎంపికపై సమాలోచనలు

ఎర్రబెల్లి నివాసంలో నేతలతో హరీష్‌రావు భేటీ

రాంనగర్, ఏప్రిల్ 1: వరంగల్ లోక్‌సభ అభ్యర్థి ఎంపికపై మాజీ మంత్రి హరీష్‌రావు వరంగల్ నేతలతో సమాలోచనలు చేశారు. సోమవారం నగరంలో నిర్వహించిన బీఆర్ఎస్ సమావేశంలో పాల్గొన్న హరీష్‌రావు హనుమకొండలోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో వరంగల్ లోక్‌సభ పరిధిలోని నేతలతో భేటీ అయ్యారు. బీఆర్ఎస్ నుంచి బలమైన అభ్యర్థిని బరిలో నిలపాలని నిర్ణయించి జిల్లా నేతలతో చర్చించారు. వరంగల్ అభ్యర్థిత్వం కోసం నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సతీమణి పెద్ది స్వప్నతోపాటు పార్టీని వీడిన డాక్టర్ రాజయ్య పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. రాజయ్యతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకునేది ఖరారు కాలేదు.

కాగా, పెద్ది స్వప్నవైపు పలువురు నేతలు మొగ్గు చూపినట్లు తెలిసింది. పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా మంచి పేరు ఉండటంతో స్వప్నకు టికెట్ ఇస్తే కలిసివచ్చే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమైనట్లు తెలిసింది. స్వప్న ఎస్సీ సామాజికవర్గం మద్దతుతో పాటు భర్త పెద్ది సామాజికవర్గమైన ఓసీల మద్దతు లభించే అవకాశం ఉంటుందనే విషయాన్ని నేతలు హరీష్‌రావు దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిసింది. పెద్ది సుదర్శన్‌రెడ్డి సైతం తన సతీమణికి అవకాశం ఇవ్వాలని అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. వీరితోపాటు ఉద్యమకారులు బోడ డిన్నా, జోరిక రమేశ్, వీరేందర్, నిరంజన్, సిరిమల్ల సదానందం, విక్టర్‌బాబు, బండి రజనీకుమార్, చింతల యాదగిరి సైతం తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. వీరు మాజీ మంత్రి హరీష్‌రావును కలిసి తమలో ఒకరికి అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారులతో ప్రత్యేక భేటీ అయిన హరీష్‌రావు.. అధిష్ఠానం ప్రకటించిన అభ్యర్థికి మద్దతు తెలపాలని కోరారు. ఉద్యమకారులకు సముచిత స్థానం కల్పించేలా చూస్తామని ఆయన తెలిపారు. సుదీర్ఘంగా చర్చించిన హరీష్‌రావు.. అధిష్ఠానంతో మాట్లాడి ఒకటిరెండు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేద్దామని నేతలకు తెలిపినట్లు సమాచారం.

నలుగురు భూ కబ్జాదారుల అరెస్టు

వరంగల్ క్రైం, ఏప్రిల్ 1: నకిలీ పత్రాలు సృష్టించి భూ కబ్జాకు యత్నించిన నలుగురిపై కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. సోమవారం వారిని అరెస్టు చేశారు. ఎస్ఐ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. పారుపాటి శ్రీదేవితోపాటు మరో ఆరుగురు వ్యక్తులు 15 యేళ్ల కిందట కోమటిపల్లి శివారులో స్థలం కొనుగోలుచేసి పర్మిషన్‌లు తీసుకుని షెడ్లు వేసుకుని కబ్జాలో ఉంటున్నారు. కిందటేడు శివప్రసాద్ అనే వ్యక్తి ఈ స్థలం కబ్జా చేసేందుకు యత్నించగా కేసు పెట్టారు. శివప్రసాద్ నుంచి స్థలం తీసుకున్నట్లు పేపర్లు సృష్టించిన హైదరాబాద్‌కు చెందిన ఘట్టమనేని సతీష్‌చంద్రతోపాటు వరంగల్ నగరానికి చెందిన కర్నే వేణు, గూగుల్ నరేష్, కారం ప్రభాకర్‌లు కబ్జా చేసే ప్రయత్నం చేశారు. 15 యేళ్ల కిందట కొనుగోలు చేసిన వారిని బెదిరింపులకు గురిచేసి వారు నిర్మించుకున్న షెడ్లను నేలమట్టం చేసి స్థలం చదును చేశారు. ఈ స్థలం వేరే వ్యక్తులకు అమ్మడానికి ప్రయత్నిస్తున్నారు. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు నకిలీపత్రాలు సృష్టించి కబ్జాకు యత్నించిన నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కాగా, ఈ నలుగురు భూకబ్జాదారులుగా గుర్తించి రౌడీషీట్లు ఓపెన్ చేశారు.

నేడు మందబుద్ధిపై అవగాహన సదస్సు

వడ్డెపల్లి, ఏప్రిల్ 1: హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో ప్రపంచ మందబుద్ధి (ఆటిజం)పై అవగాహన సదస్సును మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించనున్నట్లు మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకురాలు బండ రామలీల తెలిపారు. సోమవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు, మానసిక దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొనాలని ఆమె కోరారు.

వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ఆశీర్వదించండి

ఎంపీగా గెలిపిస్తే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి : ప్రజాశాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ మంత్రి బాబుమోహన్

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 1: వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రజాశాంతి పార్టీ నుంచి బరిలో నిలుస్తున్న తనను వరంగల్ ప్రజలు ఆశీర్వదించి విజయం కట్టబెట్టాలని ప్రజాశాంతి పార్టీ లోక్‌సభ అభ్యర్థి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీమంత్రి బాబుమోహన్ కోరారు. సోమవారం హనుమకొండ ములుగురోడ్‌లోని ఓహో టల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాబు మోహన్ పాల్గొని మాట్లాడారు. ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ ఆశీస్సులతో త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రజాశాంతి పార్టీ నుంచి వరంగల్ లోక్‌సభ బరిలో ఉంటానన్నారు. ప్రజాశాంతి పార్టీ తరఫున కేఏ పాల్ విశాఖపట్నం లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నాడని, అక్కడికి తనను పిలిపించి శాలువా కప్పి ప్రజాశాంతి పార్టీలోకి ఆహ్వానించారన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా, వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించారన్నారు. వరంగల్ బిడ్డగా, 25 యేళ్ల రాజకీయ అనుభవం కలిగిన తనను వరంగల్ ప్రజలు లోక్‌సభకు ఆశీర్వదించి పంపితే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కృషి చేస్తానన్నారు.

లోక్‌సభ అభ్యర్థిగా విజయం కట్టబెడితే ప్రజాశాంతి పార్టీ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యంతోపాటు వితంతువులకు, వృద్ధులకు పెన్షన్లను కేఏ పాల్ సొంత నిధులతో అందిస్తామని బాబుమోహన్ హామీ ఇచ్చారు. ప్రపంచ దేశాల అధ్యక్షుల మన్ననలు పొందిన వ్యక్తిగా, సేవాగుణం కలిగిన వ్యక్తిగా, రాష్ట్రానికి పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలకు తీసుకవచ్చిన గొప్ప మేధావి అయిన కేఏ పాల్ పట్ల కొందరు వక్తలు తప్పుడు కూతలు కూయడం సరికాదన్నారు. మాజీ సీఎం కేసీఆర్ లాగా అబద్ధాలు చెప్పడంగానీ, మోసాలకు పాల్పడటం తెలియని వ్యక్తి కేఏ పాల్ అని కొనియాడారు. కేసీఆర్‌తో తాను టచ్‌లో ఉన్నానని కొందరు పుట్టిస్తున్న పుకార్లు అవాస్తవమని, తాను ఎవరికో కొమ్ముకాస్తున్నానని వస్తున్న ఆరోపణలు సరికాదన్నారు. తనను కొనే మొనగాడు ఈ భూమి మీద ఇంకా పుట్టలేదన్నారు. చౌకబారు రాజకీయలు చేయకుండా నిజాయితీతో కూడిన రాజకీయలు చేయాలని హితవు పలికారు.



హనుమకొండలో మీడియాతో మాట్లాడుతున్న బాబుమోహన్

25 యేళ్ల రాజకీయ జీవితంలో ఏనాడూ కాంట్రాక్టులు, అవినీతి, అక్రమాలకు, కబ్జాలు పాల్పడలేదన్నారు. మాజీ సీఎం ఎన్‌టీఆర్ ఆశీస్సులతో రాజకీయ అరంగ్రేటం చేశానన్నారు. వరంగల్ గడ్డపై పుట్టి ఖమ్మంలో పెరిగి సినిమా ఇండస్ట్రీలో అంచెలంచెలుగా ఎదిగి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చానన్నారు. గతంలో ముక్కు, మొఖం తెలియని జిల్లాలో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా అక్కడి ప్రజలకు విశేష సేవలు, అభివృద్ధి పనుల చేసిన తాను.. జన్మనిచ్చిన జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. లోక్‌సభ బరిలో నిలుస్తున్న తనను వరంగల్ ప్రజలు పెద్ద మనస్సుతో దీవించి భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సింగారపు సుజాత , పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, తరాల శంకర్, అర్ల శంకర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ వార్షిక ఆదాయం

రాంనగర్, ఏప్రిల్ 1: జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు ఆస్తుల రిజిస్ట్రేషన్‌ల ద్వారా కిందటేడు కంటే ఎక్కువ ఆదాయం వచ్చింది. కిందటేడు (2022-23) ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 13 కార్యాలయాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించి 103646 డాక్యుమెంట్స్ కాగా ఫీజు రూపేనా రూ.404కోట్ల 42లక్షల 93వేల ఆదాయం రాగా, ఈవార్షిక సంవత్సరం (2023-24) 106016 డాక్యుమెంట్లు కాగా ఫీజు రూపేనా రూ.415కోట్ల 63 లక్షల 61వేలు ఆదాయం సమకూరింది. గత సంవత్సరం కంటే రూ.11కోట్ల 20లక్షల 68వేలు ఆదనంగా ఆదాయం వచ్చింది. ఈ యేడు 13 కార్యాలయాల్లో హనుమకొండ వడ్డెపల్లి జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అత్యధికంగా 29557 డాక్యుమెంట్‌లు నమోదు కాగా రూ.201కోట్ల 22లక్షల 18వేల ఆదాయం రావడం విశేషం. ఈ యేడు వచ్చిన ఆదాయంలో సగం జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి రావడం గమనార్హం.

ఒడిస్సా కూలీ మృతి

బయ్యారం, ఏప్రిల్ 1:జీవనోపాధి నిమిత్తం ఒడిస్సా రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఓ కూలీ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బయ్యారం మండలం కాచనపల్లి ఇటుక బట్టీలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం నవరంగ్ జిల్లా కందిగూడ గ్రామానికి చెందిన బోయి సంపత్ (56) నెల కిందట ఇటుక బట్టీలో దినసరి కూలీగా పనిచేసేందుకు కొందరు కూలీలతో బయ్యారం మండలం వచ్చాడు. కాచనపల్లి సమీప ఓ ఇటుక బట్టీ నందు పనిలో చేరిన సంపత్.. తోటి కూలీలతో కలిసి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే సంపత్ బట్టీలో ఆదివారం రాత్రి భోజనం చేసి నిద్రించాడు. తెల్లవారుజామున తోటి కూలీలు చూసే సరికి సంపత్ మృతి చెంది ఉన్నాడు. సంపత్ ఎలా మృతి చెందాడనదే ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. కానీ బట్టీ యజమాని మాత్రం సంపత్‌ది సహజ మరణమేనని పేర్కొంటున్నాడు. సంపత్ కొంత మద్యం సేవించి నిద్రించినట్లు బట్టీ యజమాని వెల్లడించారు. అటవీ ప్రాంతంలో గల బట్టీలో నిద్రించడంతో ఏదైన విష పురుగు కుట్టి చనిపోయాడా.. లేక మద్యం సేవించిన మత్తులో నిద్రించి దాహార్తికి లోనై మృతి చెంది ఉంటాడా.. అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

యువకుడిపై దాడి కేసులో ఏడుగురి అరెస్టు

కొత్తగూడ, ఏప్రిల్ 1 : కొత్తగూడ మండలం పొగుళ్లపల్లిలో యువకుడిపై దాడి చేసిన ఘటనలో ఏడుగురిపై కేసు నమోదుచేసి అరెస్టు చేశారు. కొత్తగూడ మండలం చిట్యాలగడ్డకు చెందిన వంకాయల కార్తీక్ అనే యువకుడిని ఈ నెల 19న పొగుళ్లపల్లిలో తొమ్మి ది మంది కలిసి విచక్షణ రహితంగా దాడి చేశారు. కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొమ్మిదిమందిపై అపహరణ, గాయపరిచిన, కు లం పేరుతో దూషించినందుకు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు సోమవారం పొగుళ్లపల్లికి చేరుకుని విచారణ చేప ట్టారు. అనంతరం కేసు నమోదైన గద్ద అశోక్, ఎటుకూరి హరీష్, చవ్వ శివ, వట్టం నాగరాజు, గుగ్గిళ్ల నర్సయ్య, బైరబోయిన అశోక్, గాజుల వెంకటేశ్వర్లులను అరెస్టు చేశారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు ఎస్సై దిలీప్ తెలిపారు.

వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్ద పీట

బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 1: వరంగల్ అభివృద్ధికి వందల కోట్ల నిధులు కేటాయించి దేశంలోనే వరంగల్‌కు ప్రధాని మోదీ పెద్దపీట వేశాడని బీజేపీ వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. వరంగల్ లోక్‌సభ సీటు గెలుపు కోసం ఏవిధంగా సిద్ధం కావాలనే అంశంపై పశ్చిమ నియోజకవర్గంలోని బూత్‌స్థాయి నాయకులతో సోమవారం హంటర్‌రోడ్డులో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆరూరి రమేశ్ మాట్లాడుతూ.. 2014 కంటే ముందు తెలంగాణలో 2,511 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు ఉంటే.. మోదీ 9 ఏళ్ల పాలనలోనే 2,500 కిలోమీటర్ల జాతీయ రహదారులు నిర్మించారని గుర్తు చేశారు. మరో 2,269 కిలోమీటర్ల జాతీయ రహదారులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. స్మార్ట్‌సిటీ ద్వారా వరంగల్ నగరంలో మెరుగైన సదుపాయాల కోసం రూ.2,500 కోట్ల నిధులు మోదీ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. హెరిటేజ్ సిటీ కింద రూ.32కోట్లను విడుదల చేశారన్నారు.

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన స్కీమ్‌లో భాగంగా వరంగల్‌కు 7,096 ఇళ్లను మంజూరు చేశారన్నారు. అమృత్ పథకం కింద 273.58కోట్ల నిధులను ఇచ్చారన్నారు. ఆదర్శ రైల్వేస్టేషన్స్‌లో భాగంగా వరంగల్ రైల్వేస్టేషన్ ఆధునీకరించడం, కాజీపేట నుంచి విజయవాడకు మూడో లైన్ పనులను చకాచకా జరుగుతున్నాయన్నారు. రూ.521కోట్లతో నిర్మించబోతున్న రైల్వే తయారీ యూనిట్ ద్వారా ఎంతోమందికి ఉపాధి లభించబోతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కిరోసిన్‌తో దీపాలు వెలిగించుకొని జీవితాలు వెళ్లదీసేదని, అలాంటిది మోదీ ప్రభుత్వంలో ప్రధానమంత్రి సౌభాగ్య యోజన స్కీమ్‌లో భాగంగా తెలంగాణలో ఐదు లక్షల 15వేల విద్యుత్ కనెక్షన్‌లను ఇచ్చారని అరూరి అన్నారు. కాకతీయులు నిర్మించిన వారసత్వ సంపదకు యునెస్కో గుర్తింపు రావడానికి మోదీ కృషి మరువలేనిదన్నారు. అన్నీ విధాలుగా వరంగల్‌ను అక్కున చేర్చుకున్న మోదీ నాయకత్వాన్ని వరంగల్ బలపర్చాలని కోరారు.



పశ్చిమ నియోజకవర్గ బూత్ స్థాయి నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న అరూరి రమేశ్

బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. 1984లో వరంగల్ వచ్చిన ఫలితాలే మళ్లీ పునరావృతం అవుతాయన్నారు.

ఈ సమావేశంలో హనుమకొండ లోక్‌సభ నియోజకవర్గ ప్రభారీ డాక్టర్ వి.మురళీధర్‌గౌడ్, పార్టీ క్రమశిక్షణ సంఘం కమిటీ చైర్మన్ దర్మారావు, మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, శ్రీరాములు, రాష్ట్ర నాయకులు ఆర్.కిషన్, సీహెచ్. శ్రీనివాస్‌రెడ్డి, డి.దేవేందర్ రెడ్డి, కార్పొరేటర్లు ఆర్.కోమల, బి.లక్ష్మీ, సీహెచ్. స్వాతి, డి.అభినవ్ భాస్కర్, జి.వసంత, జిల్లా నాయకుడు కొలను సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొండా దంపతులను వారి నివాసంలో కలిసిన కడియం శ్రీహరి, కావ్య

బీజేపీని అడ్డుకునేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరా..

స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: మతోన్మాద బీజేపీ ఆగడాలను అడ్డుకునేందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి వెల్లడించారు. దేశవ్యాప్తంగా మైనారిటీలు, దళితులపై జరుగుతున్న దాడులను అడ్డుకోవడానికి కాంగ్రెస్ పోరాడుతోందన్నారు. లౌకికవాద పరిరక్షణ కోసం పార్టీలో చేరానన్నారు. హనుమకొండ సుబేదారిలోని ఎమ్మెల్యే నాగరాజును ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసిన అనంతరం కూతురు కావ్యతో కలిసి మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంతి రేవంత్‌రెడ్డి పాలన ప్రజాదరణ పొందుతోందన్నారు. స్వేచ్ఛ కోసం కాంగ్రెస్‌లోకి వచ్చినట్లు చెప్పారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో కూడా కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. మిగతా వివరాలు త్వరలో వివరంగా తెలియచేస్తానని మీడియా ప్రశ్నలకు బదులిచ్చారు. కడియం కావ్య మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో చేరిన తదుపరి ఎమ్మెల్యేలను కలవాలనే ఉద్దేశంతో వచ్చినట్లు చెప్పారు. ప్రత్యక్ష ఎన్నికల్లో మాట్లాడే అవకాశం తనకు ఇంకా రాలేదని, వచ్చాక చెబుతానంటూ మీడియా ప్రశ్నలకు కావ్య సమాధానంగా చెప్పారు. కాగా, అంతకుముందు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆయన కూతురు కావ్య కలిశారు. సోమవారం ఇద్దరు ఎమ్మెల్యేలను వారి వారి నివాసాల్లో వేరు వేరుగా కలిశారు.

కొండా దంపతులను కలిసిన కడియం శ్రీహరి, కావ్య

వరంగల్ సిటీ: కాంగ్రెస్ పార్టీలో ఇటీవల చేరిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఆయన కుమార్తె కడియం కావ్య సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుల నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి, ప్రస్తుత రాజకీయా పరిస్థితులపై చర్చించారు. అలాగే, పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానాన్ని గెలిపించుకునేందుకు వ్యూహాలపై చర్చించుకున్నారు. తొలిసారి కడియం శ్రీహరి, కావ్య తమ నివాసానికి వచ్చినందున కొండా దంపతులు నూతన వస్త్రాలతో సత్కరించారు.

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి సురేఖ

వరంగల్ కల్చరల్: వేములవాడ రాజరాజేశ్వర స్వామిని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ దర్శించుకున్నారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం సోమవారం తొలిసారిగా వేములవాడ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తన మనవడి పేరుమీద కోడె మొక్కును చెల్లించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని స్వామిని ప్రార్థించినట్లు మంత్రి చెప్పారు. అనంతరం బద్దిపోచమ్మ ఆలయంలో పూజలుచేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.



మంత్రి కొండా సురేఖకు స్వామివారి ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా..

● దయాకర్‌రావు స్క్రిప్ట్ మేరకే పర్యటన ● మీడియా సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కరువు యాత్ర ఓ డ్రామా అని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు విమర్శించారు. డ్రామాకు సంబంధించిన స్క్రిప్ట్ అంతా మాజీ మంత్రి దయాకర్ రావు సిద్ధం చేసి కేసీఆర్‌తో మాట్లాడించారని ఆరోపించారు. సోమవారం హనుమకొండ సుబేదారిలోని క్యాంపు కార్యాలయంలో నాగరాజు కేసీఆర్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. కుంభకర్ణుడు నిద్రలేచినట్లు కేసీఆర్ ఫామ్‌హౌస్ నుంచి రైతుల వద్దకు వచ్చారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడూ రైతులను పట్టించుకోని కేసీఆర్‌కు ఇప్పుడు రైతులు గుర్తుకు రావడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్‌పాలన ఇంకా నాలుగు నెలలు కూడా పూర్తి కాక ముందే కేసీఆర్ అభాండాలు వేస్తున్నారని దుయ్యబట్టారు. వర్షాకాలం రాక ముందే సీఎం రేవంత్ రెడ్డి పాలనలో కరువు వచ్చిందంటూ వ్యాఖ్యలు చేయడం కేసీఆర్‌కు మతిభ్రమించినట్లు అర్థమవుతోందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో 200 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని చెబుతున్న కేసీఆర్.. వాస్తవాలతో నిరూపించాలని డిమాండ్ చేశారు. లేకుంటే తరిమికొడతామని హెచ్చరించారు. రైతుల బతుకులను ఛిద్రం చేసింది కేసీఆర్ అన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులు దిక్కుతోచని స్థితికి గురయ్యారన్నారు. ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారని మండిపడ్డారు. రైతుబంధును బూచిగా చూపి రైతులకు సంబంధించిన అనేక సంక్షేమ పథకాలను హరించారని ఆరోపించారు. రైతుబంధు పేరుతో కేసీఆర్ దోపిడీ చేశారన్నారు. ఈ క్రమంలో అర్హత గల రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో రేవంత్‌రెడ్డి భూస్వాములకు రైతుబంధు వర్తించకుండా పరిమితులు విధించి అమలు చేయాలనే ప్రణాళికతో ఉన్నారన్నారు. నాలుగు నెలల కాంగ్రెస్‌పాలనలో విద్యుత్, నీటిసరఫరా నిరంతరాయంగా జరుగుతుందన్నారు.

కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పాలన స్కామ్‌లమయంగా సాగిందని నాగరాజు ఆరోపించారు. కాళేశ్వరం భారీ కుంభకోణమన్నారు. దేశచరిత్రలోనే ఇంతటి కుంభకోణం మరొకటి లేదన్నారు. కేవలం దోచుకోవడానికే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి కేసీఆర్ స్కెచ్ వేశారన్నారు. నిపుణులు డిజైన్ విషయంలో ఎంతగావారించినా 80 వేల పుస్తకాలు చదివిన మేధావి కేసీఆర్ వినలేదని విమర్శించారు. మిషన్‌కాకతీయ పేరిట చెరువుల పూడికతీత చేపట్టిన కేసీఆర్.. వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలో చూపించాలని డిమాండ్ చేశారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, రైతుబంధు ఇలా.. ప్రతీదానిలో కేసీఆర్ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. కూతురు కవిత లిక్కర్ స్కాం, కేసీఆర్ కాళేశ్వరం కుంభకోణం, కుమారుడు మాజీ మంత్రి కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం.. ఇలా కేసీఆర్ కుటుంబం అక్రమాలు తెలంగాణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశాయన్నారు. అక్రమాలు బయటపడుతుండడంతో కేసీఆర్ మతిభ్రమించి కరువు యాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని నాగరాజు పేర్కొన్నారు. గడీల తలుపులు బద్దలు కొట్టి ప్రజాపాలనకు ద్వారాలు తెరిచారన్నారు. కడియం శ్రీహరి, ఆయన కూతురు కావ్యల చేరికపై మీడియా ప్రశ్నలకు సమాధానమిస్తూ.. అధిష్ఠానం అన్ని కోణాల్లో ఆలోచించే నిర్ణయం తీసుకుంటుందన్నారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కిసాన్ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిళి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి శేఖర్ రావు, కిసాన్ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు దేవేందర్‌రావుతోపాటు మహేందర్, వీసం సురేందర్‌రెడ్డి, తిరుపతి, బుచ్చిరెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంపల్లిలో భూ వివాదంలో ఘర్షణ

● భార్యాభర్తలు, కొడుకుపై హత్యాయత్నం ● గొడ్డలి, కర్రలతో దాడి.. తీవ్రగాయాలు

సీరోలు, ఏప్రిల్ 1: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో సోమవారం రెండు కుటుంబాల మధ్య చోటుచేసుకున్న భూ వివాదం ఘర్షణకు దారితీసింది. ఇందులో దంపతులు, వారి కుమారిడిపై ప్రత్యర్థులు కర్రలు, గొడ్డళ్లతో దాడిచేయడంతో వారు తీవ్రంగా గాయపడి జిల్లా ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నారు. బాధితుల కథనం ప్రకారం..కాంపల్లి గ్రామంలో రేపాల కృష్ణ, రేపాల వెంకటనారాయణ కుటుంబాల మధ్య గత కొంత కాలంగా భూవివాదం కొనసాగుతోంది. గ్రామ సమీపంలోని మహబూబాబాద్-ఖమ్మం ప్రధాన రహదారి పక్కన ఉన్న రేపాల కృష్ణ వ్యవసాయ భూమిలో అదే గ్రామానికి చెందిన రేపాల వెంకటనారాయణ, వెంకన్న ఉపేందర్, పెద్ద సత్యంలు కృష్ణ భూమిలో రాళ్లు పాతేందుకు యత్నిస్తుండగా తమ భూమిలో రాళ్లు ఎందుకు పాతుతున్నారని వారిని అడుగగా ఘర్షణ చోటుచేసుకుంది. ఇది నీ భూమి కాదు మా భూమిలో రాళ్లు పాతుకుంటే నీవెవరు అడ్డుకోవడానికి అంటూ కృష్ణతో వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలో వారి వెంట తెచ్చుకున్న గొడ్డల్లు, కర్రలు, గడ్డపారలతో కృష్ణ కుమారుడు అశోక్‌పై దాడి చేస్తుం డగా అడ్డువచ్చిన తల్లి బిక్షమమ్మపై కూడా దాడి చేశారు. . తల్లిని కాపాడేందుకు ప్రయత్నించిన అశోక్‌పై దాడిచేస్తుండగా పక్కనే వరి పొలం కోయిస్తున్న తండ్రి రేపాల కృష్ణ అక్కడికి చేరుకోగానే ముగ్గురిపై ప్రత్యర్థులు దాడి చేశారు. గొడ్డలితో తలపై నరకడంతో తీవ్రగాయమై రక్తస్రావంతో కుప్పకూలిపోవడంతో చుట్టుపక్కల వారు వెంటనే. 108కు సమాచారం ఇచ్చారు. 108 వాహనంలో ఆ ముగ్గురిని మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తండ్రి కృష్ణ పరిస్థితి విషమంగా ఉందని భార్య బిక్షమమ్మ కుమారుడు అశోక్, తెలిపారు. ఈ విషయంపై సీరోలు ఎస్సై విజయ్ రాంకుమార్‌ను వివరణ కోరగా బాధతుడి కూతురు యశోద ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామన్నారు.





ఘర్షణలో గాయపడిన రేపాల కృష్ణ, రేపాల అశోక్

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 1: రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహాను తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులు సోమవారం హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎదుర్కొంటున్న సమస్యలపై రూపొందించిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఇచ్చిన వినతిపత్రంపై మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వి.రాకేశ్, కార్యదర్శి డాక్టర్ హరిప్రకాశ్, డాక్టర్ ఎం.వి.ప్రసాద్, డాక్టర్ రమేశ్, డాక్టర్ మధు, డాక్టర్ రామారావు, డాక్టర్ విజయ్‌కాంత్, డాక్టర్ శ్రీధర్, కిశోర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండ తీవ్రతకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 1: ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హనుమకొండ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు సూచించారు. ఎండ తీవ్ర పెరిగి తీవ్రమైన గాలులు వీచినప్పుడు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, అత్యవసరమైతే బయటకు వెళ్లాలన్నారు. వడదెబ్బకు గురైనప్పుడు ముఖ్యంగా శరీర ఉష్ణోగ్రత తీవ్రంగా పెరగడం, తీవ్రమైన తలనొప్పి, శరీరంలో నీటి శాతం తగ్గి, నాలుక ఎండిపోవడం, మూత్రం పసుపు రంగులోకి మారి మంట రావడం లాంటి జరుతాయని వివరించారు. పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితిలోకి వెళ్లి అన్ని లక్షణాలు గానీ లేక కొన్ని లక్షణాలు గానీ కనిపిస్తాయన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడ ఉన్న ప్రదేశానికి చేర్చి, శరీరాన్ని చల్లని నీటితో ముంచిన గుడ్డతో తుడవాలన్నారు. ఉప్పు కలిపిన మజ్జిగ, చల్ల, కొబ్బరినీళ్లు, నిమ్మరసం, గ్లూకోజ్, ఓఆర్‌ఎస్ ద్రావణం తాగాంచాలన్నారు. సత్వర చర్యల కోసం 108 సేవలను వినియోగించుకోవాలి. ప్రథమ చికిత్స చేసిన తర్వాత దగ్గరలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలన్నారు. అంతేకాకుండా వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై పర్యవేక్షణకు జిల్లాస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలి

- తాగునీటి సమస్యపై అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలి
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్1: వేసవిలో నీటి ఎద్దడి నివారణకు సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ పరిధిలోని ప్రాంతాలు, జిల్లాలోని గ్రామాల్లో తాగునీటి సరఫరా, నిర్వహణపై జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. తాగునీటి సరఫరా నిర్వహణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రాంతాల్లో తాగునీరు సక్రమంగా జరుగుతుందా, ఎక్కడైనా తాగునీటి సమస్యలు ఉన్నాయా, తాగునీటి సమస్యలపై ప్రజల ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు, అధికారుల పర్యవేక్షణ, తదితర అంశాలపై సంబంధిత మునిసిపల్ అధికారులతో కలెక్టర్ చర్చించారు.

అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలి

గ్రేటర్ వరంగల్ మునిసిపల్ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ ఈ వేసవిలో ఎక్కడ కూడా తాగునీటి సమస్యలు రాకుండా అధికారులు సత్వర చర్యలు చేపడుతూ నిరంతర పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. వేసవికాలం దృష్ట్యా తాగునీటికి సంబంధించి యాక్షన్ ప్లాన్ రూపొందించాలని, తాగునీటి సరఫరాలో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. ప్రజలు వడగాల్పుల బారిన పడకుండా ఉండేందుకు షెడ్ నెట్లు, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అడిషనల్ కలెక్టర్ రాధికా గుప్తా, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ఎస్‌ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు కె.రాజయ్య, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్, డీఈలు, ఇతర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు

రాబోయే లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్‌లో డిస్ట్రిక్ట్ గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రూ.50వేల నగదుకు మాత్రమే అనుమతి ఉందన్నారు. అయితే రూ.50వేలకు మించి నగదుతో ఎవరైనా పట్టుబడితే ఆ డబ్బులను అధికారుల బృందం సీజ్ చేస్తారని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అన్నారు.

ఎన్నికల నియమావళిపై అవగాహన కలిగి ఉండాలి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 1: ఎన్నికల నియమావళిపై అధికారులకు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని లోక్‌సభ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. వరంగల్ ఎల్బీ కళాశాలలో ఎన్నికల సందర్భంగా వరంగల్ తూర్పు -106లో పని చేసే పీవో, ఏపీవోలకు సోమవారం నుంచి శిక్షణ తరగుతులు జరుగుతున్నాయి. ఈ శిబిరాన్ని కమిషనర్ అధికారులతో కలిసి సందర్శించారు. అక్కడ శిక్షణ పొందుతున్న అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. శిక్షణ పొందుతున్న వారు అనుమానాలుంటే మాస్టర్ ట్రైనర్లను అడిగి అనుమానాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు. ఎన్నికల ప్రొసీజర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్లపై అధికారులకు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ తర్వాత రోజు చేయవలసిన పనులను పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. పోలింగ్ రోజు నిర్వహించాల్సిన విధులపై కఠినంగా ఉండాలన్నారు. ఎన్నికల విధులు నిర్వర్తించే సిబ్బంది పోస్టల్ బ్యాలెట్‌పై దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ అజీత్‌రెడ్డి, జేడీ బాలకృష్ణ, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావులతో పాటు మాస్టర్ ట్రైనర్లు సందీప్‌కుమార్, కృష్ణ, కనకయ్య వాసు, నాగరాజు, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రానికి నాణ్యతమైన ధాన్యాన్ని తీసుకురావాలి

ధర్మసాగర్, ఏప్రిల్ 1: రైతులు నాణ్యతమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని డీపీఎం అనిల్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జిల్లా పౌరసరఫరాలశాఖ, యమున గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ.. మార్కెట్‌కు తీసుకువచ్చే ధాన్యంలో 17శాతం తేమ ఉండే విధంగా ఎండబెట్టి తీసుకురావాలన్నారు. క్వింటాల్‌కు ఏ గ్రేడు రకానికి రూ.2,203, బి గ్రేడ్ రకానికి రూ.2,183 లను చెల్లించడం జరుగుతుందన్నారు. ధాన్యం డబ్బులు నేరుగా రైతు బ్యాంక్ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో అనిల్ కుమార్, మండల వ్యవసాయ అధికారి పద్మ, ఏపీఎం అనిత తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 1: హనుమకొండ పెద్దమ్మగడ్డకు చెందిన విద్యార్థిని ఎస్.సుమతిశ్రీ (25) అదృశ్యమైంది. ఈనెల 31న అరెపల్లిలో స్నేహితుడి వివాహం ఉందని వెళ్లి.. సాయంత్రం వరకు ఇంటికిరాకపోవడంతో తండ్రి కిరణ్‌కుమార్ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. బంధువులతో పాటు ఇతర ప్రాంతాల్లో ఆరా తీసినా సమాచారం దొరకలేదు. ఇంట్లో నుంచి బయటికి వెళ్తున్నప్పుడు బూడిద రంగు చీర, తెలుపు రంగు జాకెట్ ధరించి ఉందని తండ్రి కిరణ్‌కుమార్ హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్టు షాపులపై దాడి

వరంగల్ క్రైం, ఏప్రిల్ 1: ధర్మసాగర్ మండల కేంద్రంతో పాటు మరో గ్రామంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. ధర్మసాగర్, ఉనికిచర్ల గ్రామంలో మూడుచోట్ల సోమవారం దాడులు నిర్వహించి రూ.62వేల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం విక్రయిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధృవీకరించారు.

ఉద్యోగ విరమణ పొందిన వారి సేవలు మరువొద్దు..

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



రిటైర్డ్ ఉద్యోగులతో సీపీ

వరంగల్ క్రైం, మార్చి 1: ఉద్యోగ విరమణ పొందిన పోలీస్ అధికారుల సేవలు నేటి తరం పోలీసులు మరువద్దని వరంగల్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వరంగల్ పోలీస్ విభాగంలో విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ఇన్‌స్పెక్టర్ సోమయ్య, ఎస్‌ఐ రుక్మాచారి, ఆర్‌ఎస్‌ఐ దాసు నాయక్, ఏఎస్‌ఐ సురేష్, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, ప్రసాద్‌లను సోమవారం కమిషనర్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత కూడా సమాజం నుంచి గౌరవాన్ని పొందేవారు కేవలం పోలీస్ అధికారులు మాత్రమేనన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ బారి, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏఓ రామకృష్ణ, ఏసీపీ అనంతయ్య, ఆర్‌ఐలు శ్రీధర్, శ్రీనివాస్, స్వర్ణన్‌రాజ్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి



రాజు(ఫైల్)

ధర్మసాగర్, ఏప్రిల్ 1: పంటపొలంలో గుండెపోటుతో రైతు మృతి చెందిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. రైతు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉనికిచర్ల గ్రామానికి చెందిన రైతు బజ్జూరి రాజు(44) వ్యవసాయ బావి వద్ద సాగు చేసిన మొక్కజొన్న పంటకు నీళ్లు కట్టడానికి ఉదయం ఆరు గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లాడు. పంటకు నీళ్లు కడుతున్న క్రమంలో అకస్మాత్తుగా రాజుకు గుండెపోటు రావడంతో పొలం వద్దనే కింద పడిపోయి అక్కడికి అక్కడే మృతి చెందాడు. బావి వద్దకు వెళ్లిన రాజుకు భార్య ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. దీంతో అనుమానం వచ్చిన ఆమె బావి వద్దకు వెళ్లి చూడగా రాజు మృతి చెంది ఉన్నాడు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు. విషయం తెలియడంతో గ్రామానికి చెందిన రిటైర్డు ఉపాధ్యాయుడు వంగాల నారాయణరెడ్డి మృతుని కుటుంబానికి పది వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

టీసీఎఫ్ అధ్యక్షుడిగా బిషప్ జీ. జాన్‌మార్కండేయ

కాజీపేట, ఏప్రిల్ 1: ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ (టీసీఎఫ్) అధ్యక్షుడిగా కాజీపేటకు చెందిన బిషప్ జీ. జాన్ మార్కండేయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం రాత్రి హనుమకొండ సీబీసీ చర్చిలో జరిగిన ప్రత్యేక సమావేశంలో కమిటీ ప్రకటించింది. ఈ సందర్భంగా జాన్ మార్కండేయ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యత ఇచ్చినందుకు క్రైస్తవ సంఘాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దైవజనులు పాల్సన్ రాజ్, ఐజక్, కురియన్, జోసఫ్ ప్రభాకర్, స్వర్ణన్ రాజ్, విద్యాకర్, పాల్ తదితరులు పాల్గొన్నారు.

నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న జి.దుర్గాప్రసాద్, మాదాసు బాబు

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 1: హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన నేపాల్ రుద్రాక్షల ఎగ్జిబిషన్‌ను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జి.దుర్గాప్రసాద్, దర్గా కాజీపేట సింగిల్‌విండో వైస్ చైర్మన్ మాదాసు బాబు సోమవారం జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈసందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. ఈ ప్రదర్శనలో ఏకముఖి నుంచి 21 ముఖాల రుద్రాక్షలతో పాటు స్పటిక, తులసీ, నవరత్న మాలలు, పంచముఖి రుద్రాక్ష మాలలు, సాలీగ్రాములు, మర్కట శివలింగాలు, దైవికమైన వస్తువులు సరసమైన ధరలకు లభిస్తాయని అన్నారు. జన్మనక్షత్రాన్ని పరిశీలించి అసలైన రుద్రాక్షలను ఇస్తామని తెలిపారు. ఈప్రదర్శన ఈనెల 9 వరకు ఉంటుందని అన్నారు. రుద్రాక్షలు ధరించడం వలన సకల ఐశ్వర్యాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మేదరి (మహేంద్ర) సంఘం రాష్ట్ర నాయకుడు దీకొండ రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ

జూలైవాడ, ఏప్రిల్ 1: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని గ్రేటర్ 49వ డివిజన్‌లో టీపీసీసీ సోషల్ మీడియా కార్యదర్శి మొహమ్మద్ ముస్తాక్ నేహాల్ ఆధ్వర్యంలో రంజాన్ కిట్లను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ ఏనుగుల మానస రాంప్రసాద్ హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ గిఫ్ట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దీపక్, రాజా మల్లారెడ్డి, ప్రశాంత్, దయాప్రసాద్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ టికెట్ వంగపల్లి శ్రీనివాస్‌కే ఇవ్వాలి

వడ్డెపల్లి, ఏప్రిల్ 1: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ టికెట్‌ను ఉస్మానియా విద్యార్థి నేత ఎమ్మార్పీఎస్ - టీఎస్ రాష్ట్ర ప్రతినిధి వంగపల్లి శ్రీనివాస్‌కే ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ - టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్‌ఖన్నా బీఆర్ఎస్ అధిష్టానాన్ని కోరారు. సోమవారం వడ్డెపల్లిలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్- టీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో వంగపల్లి శ్రీనివాస్ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఉద్యమంలో భాగంగా హైదరాబాద్ నుంచి వరంగల్ వరకు పాదయాత్ర చేసిన ఘనత వంగపల్లి శ్రీనివాస్‌కు ఉందని పేర్కొన్నారు. ఆయన నిరంతరం మాదిగ సామాజిక వర్గం సంక్షేమం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. వంగపల్లి శ్రీనివాస్‌కు వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ టికెట్ కేటాయిస్తే అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ - టీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపెల్లి విజయ్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి కట్టెపోగుల ప్రశాంత్, జిల్లా నాయకులు గంగారపు యశ్వంత్, మధు, అనిల్‌కుమార్, జన్ను సంజీవ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

భీమారం, ఏప్రిల్ 1: ఒకటో డివిజన్ పెగడపల్లి, ముచ్చర్ల, పలివేల్పుల గ్రామాల నుంచి సుమారు 500 మంది బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం పలివేల్పులలో కార్పొరేటర్ వరంగటి అరుణ, కాంగ్రెస్ నాయకులు దేవరకొండ అనిల్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం శివరాం, మార్నేని రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

వరంగల్ కార్పొరేషన్, ఏ ప్రిల్ 1: వరంగల్ దేశాయి పేటలో ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడిన పారి శుధ్య కార్మికుడు చీకటి హ రీష్(35) కుటుంబానికి నగర పాలక సంస్థ సిబ్బంది సోమ వారం ఆర్థిక సహాయం అం దించారు. నగర పాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ మల్లం రాజేశ్ ఆదేశాల మేరకు సూ పర్‌వైజర్లు మాదాసి సాంబయ్య, పసునూరి భాస్కర్‌లు సోమవారం ఎంజీఎం పోస్టు మార్టం వద్దకు వెళ్లారు. నగర పాలక సంస్థ నుంచి దహన సంస్కారాల కోసం ముం దుగా రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు. హరీష్ కుటుంబానికి శాఖాపరంగా వచ్చే బెనిఫిట్స్‌ను సకాలంలో అందే విధంగా కృషి చేస్తామని సూపర్‌వైజర్లు, శానిటరి ఇన్‌స్పెక్టర్ ప్రశాంతి వెల్లడించారు. మృతుడి కుటుంబాన్ని కలిసిన వారిలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ అధ్యక్షుడు పుల్ల రమేష్, నాయకులు జన్ను ప్రకాశ్, ఏకు సుధాకర్, సంఘాల రాజు, రాజేశ్‌లు ఉన్నారు.

విద్యాబోధనను సామాజిక బాధ్యతగా భావించాలి



ఉపాధ్యాయురాలు ఉమాదేవిని సన్మానిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

ఐనవోలు, ఏప్రిల్ 1: ఉపాధ్యాయులు విద్యాబోధనను సామాజిక బాధ్యతగా బోధించి గుర్తింపుపొందాలని ఇన్‌చార్జి ఎంఈవో వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఉడుతగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ ఉపాధ్యాయురాలు ప్రతికంఠం ఉమాదేవి ఉద్యోగ విరమణ సన్మానోత్సవ కార్యక్రమం హెచ్‌ఎం చుంచుకాల లింగారావు అధ్యక్షతన జరిగిన సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో హాజరై మాట్లాడుతూ.. ఉపాధ్యాయురాలైన ఉమాదేవి మూడు దశాబ్దాలకు పైగా విద్యార్థులకు నాణ్యమైన విద్యాబుద్ధులు నేర్పించి ఎందరినో ప్రయోజకులుగా తీర్చిదిద్దారని అభినందించారు. ఉద్యోగ విరమణ తరువాత కుటుంబసభ్యులతో కలిసి ఆయురారోగ్యాలతో శేషజీవితం గడుపాలని అకాంక్షించారు. ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐనవోలు కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, పాక శ్రీ హర్షుడు, అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు రవీందర్, బ్రహ్మాచారి, పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు శ్రీనివాస్‌రాజ్, లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ ఆరోగ్యం, అమ్మా పాఠశాల కమిటీ చైర్మన్ బరిగల సుమలత, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చెక్‌పోస్ట్ వద్ద రూ. 3లక్షలు స్వాధీనం

కాజీపేట, ఏప్రిల్ 1: కాజీపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజిల్ కాలనీ చెక్ పోస్ట్ వద్ద సోమవారం తనిఖీలలో రూ. 3 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో డీజిల్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద సోమవారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వస్తున్న కారులో తనిఖీలు చేయగా రూ.3లక్షలు పట్టుబడ్డాయి. ఈ నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ నగదు సంబంధించిన సరైన పత్రాలు సమర్పించిన తర్వాతే నగదు తిరిగి ఇవ్వనున్నట్లు తెలిసింది. పోలీసులు వివరాలు వెల్లడించాల్సి ఉంది.

కాంగ్రెస్ టికెట్ దళిత క్రైస్తవులకే ఇవ్వాలి

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 1: కాంగ్రెస్ వరంగల్ లోక్‌సభ టికెట్ దళిత క్రైస్తవులకే ఇవ్వాలని ఉమ్మడి వరంగల్ జిల్లా పాస్టర్లు డిమాండ్ చేశారు. వరంగల్ లోక్‌సభ టికెట్ ఆశావహురాలు, కాంగ్రెస్ నాయకురాలు బొడ్డు సునితతో కలిసి సోమవారం హనుమకొండ జేపీఎన్ రోడ్డులోని కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో టీసీఎఫ్ నాయకుడు పోలెపాక ఇమ్మానుయేల్, పాస్టర్లు మోజెస్ నతానియేల్, స్టాలిన్‌కుమార్, రత్నం, థామస్, పాల్ తదితర పాస్టర్లు మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా బొడ్డు సునిత పార్టీ శ్రేయస్సుతోపాటు అనేక సామాజిక కార్యక్రమాల నిర్వహణలో ముందు ఉందన్నారు. సునిత భర్త మోజెస్ అనంద్ కూడా మూడు దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేస్తున్నట్లు చెప్పారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్ ఇవ్వవద్దని కాంగ్రెస్ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. సునిత మాట్లాడుతూ.. 30 ఏళ్లగా వరంగల్ లోక్‌సభ నుంచి మహిళా ప్రాతినిధ్యం లేదన్నారు. పార్టీ శ్రేయస్సు కోసం పని చేసిన తనకు టికెట్ ఇచ్చి న్యాయం చేయాలని అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు.

దొంగతోనే కండువా కప్పుకొంటివి..

5వ పేజీ తరువాయి

విమర్శించారు. స్టేషన్‌ఘనపూర్ ప్రజలకు తాను అండగా ఉంటానన్నారు. దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ కడియం జీవితమంతా నీచ చరిత్రేనని, దళితుడని అని చెప్పుకొనే ఆయన.. ఏరోజు దళితులను చేరదీయలేదన్నారు. కడియం ఇబ్బందులు భరించలేకనే రాజయ్య, అరూరి రమేశ్, పసునూరి దయాకర్ బీఆర్ఎస్‌ను వీడారన్నారు. ఇన్ని పార్టీలు మారిన కడియం.. కేఏపాల్ ప్రజాశాంతి పార్టీకి కూడా పోతాడని ఎద్దేవా చేశారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకటరమణా రెడ్డి, జడ్పీ చైర్మన్‌లు సుధీర్‌కుమార్, గండ్ర జ్యోతి, మాజీ కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, సుందర్ రాజ్, నేతలు నాగుర్ల వెంకటేశ్వర్లు, భీరవెల్లి భరత్‌కుమార్ రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, లలితాయాదవ్, హరిరమాదేవి, ఇండ్ల నాగేశ్వర్ రావు, జనార్ధన్‌గౌడ్, జోరిక రమేశ్, వీరేందర్, రజనీకుమార్, చింతల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాగా, హరీష్ రావు మాట్లాడే క్రమంలో చిట్యాలకు చెందిన కంజర్ల రమణకుమార్ అనే కార్యకర్త ఒక్కసారిగా వేదికపైకి వచ్చి కాళ్లకు మొక్కి సెల్ఫీ తీసుకున్నాడు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను స్క్రీన్‌పై చూపిస్తూ ప్రసంగించినప్పుడు కార్యకర్తలనుంచి మంచి స్పందన వచ్చింది.

కావ్యకే టికెట్

(5వ పేజీ తరువాయి)

తెరపడడంతో ఇక తరువాత పరిణామాలు ఎలా ఉంటాయనే అంశం చర్చంశనీయాంగా మారింది.

అనూహ్యంగా టికెట్ సొంతం

కొన్ని రోజుల కిందట బీఆర్ఎస్ అభ్యర్థిగా డాక్టర్ కావ్యను ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. దీంతో కావ్య పోటీకి రంగం సిద్ధమైంది. ఇక ప్రచారమే తరువాయి అనుకుంటున్న సమయంలోనే కడియం కావ్య బీఆర్ఎస్‌కు కోలుకోలేని షాక్ ఇచ్చారు. కవిత అరెస్టు, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాలను ఉటంకిస్తూ బీఆర్ఎస్ నుంచి పోటీ చేయలేనంటూ స్పష్టం చేయడంతో బీఆర్ఎస్‌కు పెను దెబ్బ తగిలింది.

ఆ వెంటనే కడియం శ్రీహరి కూడా బీఆర్ఎస్‌కు బైబై చెప్పడం.. తండ్రి, కూతురు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సంకేతాలు ఇవ్వడంతో ఊహించని రాజకీయ పరిణామాలు తెరపైకి వచ్చాయి.

ఎమ్మెల్యేలను కలుస్తున్న తరుణంలోనే..

కడియం శ్రీహరి, కావ్య హైదరాబాద్‌లో కాంగ్రెస్‌లో చేరిన తరువాత సోమవారం వరంగల్‌లోనే ఉదయం నుంచి పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలను కలుస్తూవచ్చారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజును వారి వారి క్యాంపుకార్యాలయాల్లో కలిశారు. నాగరాజు కార్యాలయంలో మీడియాతో కూడా శ్రీహరి, కావ్య మాట్లాడారు. టికెట్ విషయాన్ని మీడియా ప్రస్తావించినా ఏ మాత్రం కూడా బయట పడకుండా మాట్లాడారు. ఆ తరువాత సాయంత్రం మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీని వారి నివాసంలో కలిశారు. ఇలా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను కలుస్తున్న తరుణంలోనే కావ్యకు టికెట్ ఖరారైందనే వార్తలు వెలుబడ్డాయి.

పోటీపడ్డ నేతలకు చుక్కెదురు

వరంగల్ లోక్‌సభ టికెట్‌పై పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులతో పాటు ఇతరులు కూడా సీరియస్‌గా ప్రయత్నించారు. ఎందరి పేర్లో తెరపైకి వచ్చాయి. ఒక విధంగా స్థానికేతరుడైన అద్దంకి దయాకర్ పేరు కూడా తొలి నుంచి వినిపించింది.

ఇక జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు దొమ్మాటి సాంబయ్య నమిండ్ల శ్రీనివాస్, డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్, బొడ్డు సునిత, జన్ను పరంజ్యోతి, డాక్టర్ అనిల్, డాక్టరు పెరుమాండ్ల రామక్రిష్ణ.. ఇలా ఎందరో నాయకులు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేయగా నిరాశే ఎదురైంది. కడియం కావ్యకు టికెట్ కేటాయింపు పై ఆశావహులతో పాటు కాంగ్రెస్ శ్రేణుల్లో కూడా అసంతృప్తి నెలకొంది.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

మడికొండ, ఏప్రిల్ 1: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మడికొండలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట మండలం మడికొండ శివారులోని రామన్ స్కూల్ సమీపంలో మతి స్థిమితం సరిగా లేని ఓ గుర్తు తెలియని వ్యక్తి తిరుగుతున్నాడని ఆదివారం 100 డయల్ ద్వారా పోలీసులకు సమాచారం అందింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. ఒంటిపై ప్యాంటు తప్ప ఏమీ లేకుండా ఉన్న వ్యక్తిని గుర్తించారు. వ్యక్తిని విచారించగా ఉర్దూ, తెలుగులో సం బంధంలేని మాటలు మాట్లాడాడు. వెంటనే ఆ వ్యక్తిని పోలీసులు చికిత్స నిమిత్తం ఎం జీఎంకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మృతుడు సుమారు 55 సంవత్సరాల వయస్సు, 5.5 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగుతో కోలముఖం కలిగి ఉన్నాడని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు మడికొండ పోలీస్‌స్టేషన్ సెల్. 87126 85123, 87126 85248 నెంబర్లకు తెలియజేయాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారికి పారితోషికం అందిస్తామని పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

మడికొండ, ఏప్రిల్ 1: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులకు కోర్టు జైలు శిక్ష విధించింది. మడికొండ పోలీస్ ఇన్స్‌పెక్టర్ ప్రతాప్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక చౌరస్తాలో ఆదివారం రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన దీపక్, ఉప్పరపల్లికి చెందిన అన్నారం రవి, చిల్పూర్ గ్రామానికి చెందిన కనకం రఘు అనే ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పోలీసులు ఆపారు. బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లు నిర్ధారించారు. వీరిని కోర్టుకు తరలించగా రెండో తరగతి మెజిస్ట్రేట్ విద్యాసాగర్‌రావు వీరికి రెండు రోజులు జైలుశిక్ష విధించారని పోలీసులు తెలిపారు. అదే విధంగా మరో ముగ్గురికి రూ. రూ.4500లు జరిమానా విధించినట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. వాహనాల తనిఖీల్లో ఎస్సైలు రాజబాబు, దివ్య, హెడ్ కానిస్టేబుల్ రాంనాథం, కానిస్టేబుళ్లు రాజేష్, వెంకట్, శంకర్ పాల్గొన్నారు.

మీకు తెలుసా?

దినుసుల్లో ఏముంది?

జీలకర్ర, దాల్చినచెక్క మొదలైన సుగంధ ద్రవ్యాల్లోని ఆరోగ్య విలువల గురించి మనకు అంతగా అవగాహన ఉండదు. మసాలా దినుసులు అందించే ఆరోగ్య ప్రయోజనాలు ఏవంటే...



- **నల్ల మిరియాలు:** జీర్ణ సంబంధ సమస్యలకు నల్ల మిరియాలు చక్కని విరుగుడు. వీటిలో ఉండే పెపరీన్ కొవ్వును కరిగిస్తుంది. కొత్తగా కొవ్వు కణాలు ఏర్పడకుండా నియంత్రిస్తుంది.
- **జీలకర్ర:** వీటిత మొలల సమస్య తగ్గుతుంది. మతిమరుపు, నిద్రలేమి, రక్తహీనతలు కూడా తొలగిపోతాయి. భోజనంతో పాటు లేదా భోజనం తర్వాత జీలకర్రను తినడం వల్ల రక్తశుద్ధి జరుగుతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది.
- **అల్లం:** అల్లానికి కొవ్వును కరిగించే గుణం ఉంటుంది. కాబట్టి పరగడుపున వేడి నీళ్లతో అల్లం రసం కలిపి తీసుకుంటే స్థూలకాయం రాకుండా ఉంటుంది.
- **పసుపు:** దీన్లోని కర్క్యుమిన్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాలను కలిగి ఉంటుంది.

గుడ్ ఫుడ్

రంగుల్లో హంగులు

పండ్లు, కూరగాయల రంగు వాటిలోని పోషకాలకు ప్రతిబింబాలు. కాబట్టి ఆకట్టుకునే రంగులను కలిగి ఉండే పండ్లు, కూరగాయలను ఎంచుకోవాలి.

- **ఆకుపచ్చ:** ఈ రంగుతో కూడిన పండ్లు, కూరగాయలను తినడం వల్ల జీర్ణశక్తి,



కాలేయ పనితీరు మెరుగవుతుంది. దంతాలు, ఎముకలు బలపడతాయి. రోగనిరోధకశక్తి కూడా పెరుగుతుంది. ఇందుకోసం సొర, బీర, బెండ కూరగాయలతో పాటు, జామ, అవకాడొ, ద్రాక్ష మొదలైన పండ్లు తినాలి.
- **పర్పుల్, నీలం:** జ్ఞాపకశక్తి పెరుగుతుంది. గుండె, రక్తనాళాలు, మూత్రాశయాల ఆరోగ్యం మెరుగవుతుంది. ఇందుకోసం ద్రాక్ష, చిలగడదుంప, క్యాబేజీ, బీట్‌రూట్ తినాలి.
- **ఎరుపు:** గుండె బలపడుతుంది. వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది. కణ ఉత్పత్తి పెరుగుతుంది. అధిక రక్తపోటు తగ్గడంతో పాటు చర్మపు ఆరోగ్యం మెరుగవుతుంది. ఇందుకోసం రెడ్ క్యాప్సికం, టమాటా, పండు మిరప, చెర్రీ తినాలి.
- **పసుపు, నారింజ:** కీళ్లు, కణజాలాలు, మృదులాస్థి మెరుగుపడతాయి. చర్మపు కొల్లాజెన్ వృద్ధి చెందుతుంది. ఇందుకోసం ఎల్లో క్యాప్సికం, ఆరెంజ్, ఎల్లో జుకినీ, అరటి, దోస పండు తినాలి.
- **తెలుపు, గోధుమ రంగు:** పెద్దపేగులు, పొట్ట ఆరోగ్యం మెరుగవుతుంది. అల్సర్లు తగ్గుతాయి. అసిడిటీ అదుపులోకొస్తుంది. ఇందుకోసం వెల్లుల్లి, ఉల్లి, బంగాళాదుంపలు, చామ దుంపలు తినాలి.

సూపర్ ఫుడ్

ఉలవలు... ఉపయోగాలు

ఉలవల్లో పిండిపదార్థాలు, ప్రొటీన్, పీచు పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వాటితో అప్పుడప్పుడూ చారు పెట్టుకుంటూ ఉండాలి. ఉలవలతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏవంటే...

- **జీర్ణశక్తి:** వీటిలో పీచు ఎక్కువ కాబట్టి మలబద్ధకం వదలడంతో పాటు, సుఖ విరోచనం అవుతుంది. అంతే కాకుండా జీర్ణశక్తి కూడా మెరుగు పడుతుంది. అలాగే ఇతరత్రా జీర్ణకోశ సమస్యలు కూడా అదుపులోకి వస్తాయి.



- **కండరాలు:** ఉలవల్లోని మాంసకృత్తుల వల్ల కండరాలు బలపడతాయి. ఐరన్ లోపం తొలగిపోతుంది. సర్జరీలు చేయించుకున్నవాళ్లు త్వరగా కోలుకోవాలంటే తరచూ ఉలవలతో తయారైన పదార్థాలు తింటూ ఉండాలి.
- **పోషకాలు:** వీటిలో క్యాల్షియం, పొటాషియం సమృద్ధిగా ఉంటాయి. కాబట్టి ఉలవలు తినడం వల్ల ఎముకలు దృఢంగా ఉంటాయి.

ఆ మత్తుతో చిత్తే!

ఎండ దంచేస్తుంటే, చిల్డ్ బీర్‌తో చల్లబడాలనిపిస్తుంది. హార్డ్ లిక్కర్ కాదు కాబట్టి ఓ పట్టు పట్టినా ఫర్వాలేదనే ఆలోచనతో బీర్లను వరదల్లా పొంగిస్తున్నారా? అది ఎలాంటి మద్యమైనా పరిమితి మించితే వ్యసనానికీ, అంతిమంగా ఆరోగ్య నష్టానికీ దారి తీస్తుందని హెచ్చరిస్తున్నారు వైద్యులు.



ఆల్కహాలిజం

ఫ్రెండ్స్‌తో సరదాగా చిల్ అవడం కోసం చిల్డ్ బీర్ లేదా, హార్డ్ లిక్కర్‌లను ఆశ్రయించేవాళ్లు ఎక్కువ. ఇలా అరుదుగా సరదా పడేవాళ్లతో పాటు ఆ సరదాను అలవాటుగా మార్చుకున్న వాళ్లు కూడా ఉంటారు. వీళ్లు, తాగిన సమయంలో మత్తులో ఉండే గమ్మత్తుకు అలవాటు పడిపోయి, ప్రతి రోజూ అదే మత్తులో చిత్తైపోదామనుకుంటూ ఉంటారు. ఆ అలవాటు కాస్తా, క్రమేపీ వ్యసనంగా మారి, మందు తాగనిదే రోజు గడవని పరిస్థితి నెలకొంటుంది. మద్యం ముట్టనిదే శరీరం సహకరించని పరిస్థితి నెలకొంటుంది. చివరకు ఈ వ్యసనం ఆర్థిక, ఆరోగ్య పతనాలకు దారి తీస్తుంది. అయితే నిజంగానే మద్యంతో అంతటి ముప్పు ఉంటుందా? ఏ మద్యం, ఎంత మద్యం సురక్షితం?

ప్రతి మద్యం ఆరోగ్యానికి చేటు చేసేదే! కొందరు వారాంతాల్లో తక్కువ మోతాదుల్లో తాగుతారు. ఇంకొందరు ఆ ఒక్కసారే తాగినా, విపరీతంగా తాగేస్తూ ఉంటారు. ఈ రెండు కోవలకు చెందిన వాళ్లకూ రెండు రకాల అపోహలుంటాయి. తక్కువ మోతాదులో తాగాం కాబట్టి తమకేమీ కాదని ఒకరనుకుంటే, ఎంతో అరుదుగా తాగాం కాబట్టి పెద్దగా ప్రమాదం ఉండదని ఇంకొకరు అనుకుంటారు. కానీ ఎలా తాగినా, ఏ లిక్కర్ తాగినా ఆరోగ్యానికి కలిగే చేటు ఒక్కటే! బ్రాందీ, విస్కీ, ఓడ్కాల్లాంటి హార్డ్ లిక్కర్ కంటే బీరు అన్ని విధాలా సురక్షితమనే అపోహలో ఉన్నవాళ్లూ ఉన్నారు. కానీ వాస్తవానికి మద్యం ఏదైనా దాన్లో ఉండే ఆబ్సల్యూట్ ఆల్కహాల్ పరిమాణమే కీలకం. 100 మి.లీ హార్డ్ లిక్కర్‌లో 42% ఆల్కహాల్ ఉంటే, 100 మి.లీ బీరులో 5% ఆల్కహాల్ ఉంటుంది. దీన్ని బట్టి ఒక డ్రింక్‌కు 30 గ్రాముల చొప్పున, ఐదారు డ్రింకుల హార్డ్ లిక్కర్‌తో ఏకంగా 200 గ్రాముల ఆల్కహాల్ శరీరంలోకి చేరుకుంటే, 100 మి.లీ బీరుకు 5 గ్రాముల చొప్పున ఒక బీరుతో 30 గ్రాముల ఆల్కహాల్ శరీరంలోకి చేరుకుంటుంది. అంటే ఒక బీరు 100 మి.లీ హార్డ్ లిక్కర్‌తో సమానం. కాబట్టి ఒక్క బీరుతో ఆపేస్తే ఫరవాలేదు. కానీ అక్కడితో ఆగేదెవరు?

సేఫ్ డ్రింకింగ్

ఆరోగ్యకరమైన ఆల్కహాల్ అనేది లేదు. ఎంత తక్కువ పరిమాణమైనా ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఆరోగ్యానికి హాని కలిగించకుండా ఉండదు. అలాగని మద్యానికి శాశ్వతంగా దూరంగా ఉండిపోకూడదు అనుకునే వాళ్లు, ఒక కచ్చితమైన నియమాన్ని పాటించాలి. వారంలో ఒక్కసారి రెండు డ్రింకులకు (హార్డ్ లిక్కర్: 60 మి.లీ) పరిమితమవగలగాలి. అదే బీర్ అనుకుంటే, రెండు లైట్ బీర్లు లేదా ఒక స్ట్రాంగ్ బీరుకే పరిమితం కావాలి. దీన్ని సేఫ్ లిమిట్‌గా భావించవచ్చు. దీన్నే సోషల్ డ్రింకింగ్‌గా కూడా పరిగణించవచ్చు. కానీ విదేశాల్లో ఎడాపెడా తాగేస్తూ ఉంటారు. వాళ్లందరూ ఆరోగ్యంగానే ఉన్నారు కదా? అని వాళ్లతో మనం పోల్చుకోకూడదు. మన జెనెటిక్ మేకప్‌కు ఇదే సురక్షితమైన మోతాదు. దీన్ని మించితే కాలేయం, గుండె, నాడీ వ్యవస్థల మీద మద్యం ప్రభావం పడే ప్రమాదం ఉంటుంది. తక్కువ సమయంలో ఎక్కువ మద్యం తాగడమే బింజ్ డ్రింకింగ్. వారానికి ఒక్కసారే కదా అని పీకలదాకా తాగేయడమే బింజ్ డ్రింకింగ్. ఇది కచ్చితంగా ప్రమాదకరమే!

వ్యసనాన్ని ఇలా కనిపెట్టాలి

సరదాగా మొదలైన ఈ అలవాటు తెలియకుండా వ్యసనంగా మారుతుంది. ఎవరికి వారు గ్రహించడం కోసం ఈ లక్షణాలను గమనించాలి.


- మద్యం మీదకే పదే పదే మనసు లాగుతూ ఉండడం
- చికాకు, రెస్ట్‌లెస్‌నెస్
- శరీరంలో వణుకు
- నిద్ర పట్టకపోవడం
- ఆల్కహాల్ తీసుకుంటే ప్రశాంతంగా ఉండడం, తీసుకోకపోతే ఆందోళనకు లోనవడం

మానాలంటే ఏం చేయాలి?

ఎవరికి వారు మద్యం మానేయాలని అనుకోనంత వరకూ ఏ మందులతోనూ ప్రయోజనం ఉండదు. మద్యం మానుకోవాలని అనుకోని వాళ్లు, ఆ అలవాటును మాన్పించే మందులతో తాత్కాలికంగా మద్యం మానినా, తిరిగి మళ్లీ అదే అలవాటును కొనసాగిస్తూ ఉంటారు. కాబట్టి ఈ అలవాటును మాన్పించడంతో మద్యం సేవించే వ్యక్తితో పాటు, అతని కుటుంబ సభ్యులు కూడా కీలక పాత్ర పోషిస్తారు. మొదట కౌన్సెలింగ్‌లో భాగంగా ఆ అలవాటు వల్ల కోల్పోతున్న అంశాలను అర్థమయ్యేలా వివరించాలి. ఆల్కహాల్‌తో ఆరోగ్యానికీ, సోషల్ బిహేవియర్‌కూ కలుగుతున్న చేటు, కలుగుతున్న ఆర్థిక, ఆరోగ్య నష్టాల పట్ల అవగాహన కల్పించాలి. ఆ తర్వాతే మద్యం మాన్పించే మందులను సూచించాలి. ఇందుకోసం ప్రత్యేకించి డీఅడిక్షన్ నిపుణులుంటారు. మద్యం వ్యసనపరులుగా మారడానికి వేర్వేరు కారణాలుంటాయి. వాటిని విశ్లేషించి ఆ మూల కారణాలను సరిదిద్దడంతో పాటు, వ్యక్తి మద్య తీవ్రలను బట్టి మందులు మొదలుపెట్టుకోవాలి. ఈ మందులతో తాగాలనే కోరిక తగ్గిపోవడంతో పాటు, విత్‌డ్రాయల్ సింప్టమ్స్ కూడా అదుపులోకొస్తాయి.

నాటు మందులు వద్దు

మద్యం మాన్పించే మందులు వాడుతూ మద్యం తాగడం ప్రమాదకరం. కాబట్టి రోగికి కౌన్సెలింగ్ ఇవ్వకుండా, అతని అనుమతి, ఆమోదం లేకుండా, డీఅడిక్షన్ మందులు వాడకూడదు. చాలా మంది నాటు మందుల మీద ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. వాటిని తెచ్చి, రోగికి తెలియకుండా ఆహారంలో కలిపి ఇచ్చేస్తూ ఉంటారు. ఇది సరి కాదు. ఎలాంటి ఆకులు, అలములూ మద్యం అలవాటను మాన్పించలేవు. నిజానికి ఇలాంటి నాటు మందుల్లో కూడా అల్లోపతి మందులనే కలుపుతూ ఉంటారు. కాబట్టి వాటిని తీసుకున్నప్పుడు మద్యం మీద తాత్కాలిక విరక్తి తలెత్తడం సహజం. దాంతో నాటు మందు పని చేసిందనే భ్రమకు లోనవుతాం. కానీ మందుల వాడకం మానేసిన వెంటనే మళ్లీ మద్యం అలవాటు మొదలవుతుంది. పైగా ఆకు పసర్లు, ఇతరత్రా పదార్థాలతో నాటు మందులు తయారుచేస్తారు కాబట్టి వీటితో అదనపు దుష్ప్రభావాలు కూడా ఉంటాయి. కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోయే ప్రమాదం కూడా ఉంటుంది. కాబట్టి ఆ అలవాటు ఉన్న వ్యక్తి, మద్యం మానాలనే బలమైన నిర్ణయానికి వచ్చిన తర్వాతే, వైద్యుల దగ్గరకు తీసుకువెళ్లి, మొదట కౌన్సెలింగ్, తర్వాత చికిత్స మొదలుపెట్టాలి.



మానసిక సమస్యలు తప్పవు

మద్యానికీ మనసుకూ దగ్గరి సంబంధం ఉంటుంది. బాధ, ఒత్తిడి, ఆందోళనల నుంచి తప్పించుకోవడం కోసం మద్యం తాగితే, మత్తు దిగిన తర్వాత అవే సమస్యలు రెట్టింపవుతాయి. ఆ సమస్యల నుంచి విరుగుడు కోసం మళ్లీ మద్యం మీద ఆధారపడడం, అవే సమస్యలు తిరగబెడుతూ ఉండడం... ఇలా ఇదొక విష చట్రంలా కొనసాగుతూనే ఉంటుంది. మద్యం మానసిక కుంగుబాటును పెంచుతుంది. ఈ కుంగుబాటు మద్యం వ్యసనానికి దారి తీస్తుంది. కాబట్టి మద్యంతో మానసిక సమస్యలను మర్చిపోయే ప్రయత్నం చేయకూడదు. సమస్యలకు పరిష్కారాలను కనిపెట్టి సరిదిద్దుకోవాలి. అవసరమైతే వైద్యుల సలహాలు, చికిత్సలూ పాటించాలి.



పాశ్చాత్య ప్రమాణాలతో సరిపోలిస్తే, మన దేశ స్త్రీపురుషులు తీసుకోదగిన మద్యం మోతాదు తగ్గుతుంది. అలాగే జెనెటిక్ మేకప్, హార్మోన్ల మూలంగా పురుషులతో పోలిస్తే, మహిళల మీదే మద్యం ప్రభావం ఎక్కువ. తక్కువ మద్యంతో కూడా మహిళల ఆరోగ్యం మీద ఎక్కువ ప్రభావం పడుతూ ఉంటుంది. కాబట్టి మరీ ముఖ్యంగా మహిళలు మద్యానికి దూరంగా ఉండడం శ్రేయస్కరం.



డాక్టర్ కె.ఎస్ సోమశేఖర రావు,
సీనియర్ కన్సల్టెంట్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.

ఈ ఏడాది ఎండలు మునుపటికి మించి మండిపోతాయని ముందుగానే వార్తలొచ్చాయి. వాటికి తగ్గట్టే వేడి, ఉక్కపోతలు మార్చి నుంచే వేధించడం మొదలుపెట్టేశాయి. అయితే ఈ వేసవి నుంచి రక్షణ పొందాలంటే చల్లదనాన్ని అందించే జాగ్రత్తలు పాటించాలి.

వేడికి విరుగుడు

సమ్మర్ కేర్



వేసవి వేడితో శరీరంలోనూ వేడి పెరుగుతుంది. దాంతో అలసట, బడలిక, విపరీతమైన చెమట, చర్మం పొడిబారడం, తలనొప్పి, మగత, ఒళ్లు నొప్పులు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. ఎండ వేడిమికి శరీర ఉష్ణోగ్రత క్రమేపీ పెరుగుతూ 104 డిగ్రీలకు చేరుకుంటే ఎండదెబ్బకు గురవుతాం! అత్యధిక ఉష్ణోగ్రతలకు గురయినా లేక వేడి వాతావరణంలో శారీరక శ్రమ వల్ల శరీర ఉష్ణోగ్రత ఆ మేరకు చేరుకున్నా, ఎండదెబ్బకు గురవడం సహజం. అందుకు పలు కారణాలు ఉంటాయి. వాటిలో...

- గాలి ధారాళంగా చొరబడని దుస్తులు, చెమటను పీల్చుకునే వీలు లేని దుస్తులు ధరించడం. వేడిని గ్రహించే వీలున్న నల్ల దుస్తులు ధరించడం.
- మద్యం తీసుకోవడం. మద్యం తాగడం వల్ల ఉష్ణోగ్రతను క్రమబద్ధం చేసే శక్తి శరీరం కోల్పోతుంది.
- చెమట ద్వారా శరీరం కోల్పోయిన నీటిని భర్తీ చేయకపోవడం.

నివారణ తేలికే!

ఎండదెబ్బ బారిన పడి, బాధ పడేకంటే, ఆ స్థితి రాకుండా జాగ్రత్త పడడం మేలు. వేసవి వేడి, ఎండల ప్రభావానికి గురవకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు పాటించాలి.

దుస్తులు: ధరించే దుస్తులు తేలికగా, గాలి చొరబడేలా, చెమట పీల్చేలా సౌకర్యంగా ఉండాలి. వీలైనంతవరకూ తెల్లని దుస్తులే ధరించాలి.

సూర్యరశ్మి: సూర్యరశ్మి నేరుగా సోకితే, శరీరం తనంతట తాను చల్లబడే స్వభావాన్ని కోల్పోతుంది. కాబట్టి ఎండలో బయటకు వెళ్లవలసివస్తే తలకు టోపీ, కళ్లకు చలువ కళ్లద్దాలు, గొడుగు తప్పనిసరిగా వాడాలి. వైద్యులు సూచించే సన్‌స్క్రీన్ వాడడం వల్ల చర్మం కమిలిపోకుండా, పొడిబారకుండా ఉంటుంది.

దాహం వేసేవరకూ ఆగకుండా గంటకొకసారి నీళ్లు తాగుతూ ఉండాలి. నీళ్లతోపాటు కొబ్బరినీరు, మజ్జిగ కూడా తరచుగా తాగుతూ ఉండాలి. ఇలా ఒంట్లో నీరు, ఖనిజలవణాల పరిమాణాన్ని సక్రమంగా ఉంచుకుంటే ఎండ ప్రభావం నుంచి తప్పించుకోగలుగుతాం.

ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ఎండ తీవ్రత ఎక్కువ. కాబట్టి ఆ సమయాల్లో నీడ పట్టున గడపాలి. వ్యాయామానికి ఎండ లేని సమయాలను కేటాయించాలి.

వేసవిలో పసిపిల్లల రక్షణ!

పిల్లల లేత శరీరాలు ఎండ దెబ్బకు తేలికగా గురవుతాయి. కాబట్టి ఎండాకాలంలో... పిల్లలకు వేసే దుస్తుల మొదలు, అందించే ఘన, ద్రవ పదార్థాల వరకూ ప్రతి విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి.

ఆరు నెలల లోపు పిల్లలకు తల్లి పాలు తప్ప విడిగా మరే ద్రవాలు ఇవ్వవలసిన అవసరం లేదు. పాల ద్వారానే వాళ్ల దాహార్తి తీరుతుంది. తల్లి పాలతో వేసవి వేడిమిని తట్టుకునే శక్తి దొరుకుతుంది.

పసికందులు రోజుకి ఆరు నుంచి ఏడుసార్లు మూత్ర విసర్జన చేస్తుంటే వాళ్ల దాహార్తి తీరుతోందని అర్థం చేసుకోవాలి. అంతకంటే తక్కువ సార్లు చేస్తే తల్లి పాలు సరిపోవట్లేదని గ్రహించి పోత పాలు మొదలుపెట్టాలి.

- పిల్లల మూత్రం నీరులా స్వచ్ఛంగా ఉందంటే వాళ్లకు సరిపడా నీరు అందుతోందని గ్రహించాలి.
- ఆరు నెలలు దాటి ఘనాహారం మొదలుపెట్టిన పిల్లలకు కొబ్బరి నీరు, చక్కెర కలపని తాజా పళ్ల రసాలు తాగించవచ్చు.
- పిల్లలకు ఘనాహారంగా బియ్యం నూక, గోధుమలు, రాగులను వేయించి పొడి చేసి డబ్బాల్లో పోసి పెట్టుకుని వాడుకోవాలి.
- పొడికి నీళ్లు చేర్చి మెత్తగా ఉడికించి పప్పు, కూరలతో తినిపించవచ్చు.
- ఘనాహారంతోపాటు తాజా పళ్లు చిన్న ముక్కలుగా కోసి లేదా గుజ్జు చేసి తినిపించాలి.
- ఆహారం తినిపించే ముందు, తినిపించిన వెంటనే స్నానం చేయించకూడదు.

నీరసం ఇలా దూరం

హెల్త్ వెల్త్

పోషకలోపం, శారీరక వ్యాయామం లోపించడం, జీవనశైలి అదుపు తప్పడం లాంటి కారణాల వల్ల నిస్సత్తువ వేధించవచ్చు. కాబట్టి నిరంతరంగా నీరసం వేధిస్తుంటే ఈ కింది అంశాలను గమనించుకోవాలి.

ఆహారం ఇలా: శక్తిని అందించే ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకోసం అరటిపండ్లు, బ్రౌన్ రైస్, చేపలు, చిలగడ దుంపలు, గుడ్లు, ఓట్స్, క్వినోవా, అవకాడోలను ఆహారంలో చేర్చుకోవాలి.

వ్యాయామం: వ్యాయామంతో శరీరం, మనసు చలాకీగా మారతాయి. కాబట్టి ప్రతి రోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం అవసరం.

ప్రొటీన్: ప్రొటీన్ అధికంగా పదార్థాలను స్నాక్స్‌గా తీసుకోవాలి. ఇందుకోసం యాపిల్, పీనట్ బటర్, ఉడకబెట్టిన గుడ్లు, పాప్‌కార్న్, వేయించిన శనగలు తినాలి.

సంగీతం: శ్రావ్యమైన సంగీతంలో శరీరంలో ఎండార్ఫిన్లు విడుదలవుతాయి. ఇవి శరీరాన్ని చలాకీగా ఉంచడానికి తోడ్పడతాయి. కాబట్టి రోజులో కొంత సేపు నచ్చిన సంగీతం వినాలి.

చల్ల నీళ్ల స్నానం: చల్లదనం కండరాలను బలపరుస్తుంది. మెటబాలిజంను పెంచుతుంది. కాబట్టి చల్లనీటితో స్నానం చేస్తూ ఉండాలి.

నవ్వడం: నవ్వడం వల్ల ఒత్తిడి తగ్గి, ఇమ్యూనిటీ పెరుగుతుంది. అలాగే నిస్సత్తువ కూడా దూరమవుతుంది. అందుకోసం స్నేహితులతో సరదా సమయం గడపడం, పిల్లలతో ఆడుకోవడం, కామెడీ సినిమాలు, షోలు చూడడం చేయాలి.

నీళ్లు: సరిపడా నీళ్లు తాగకపోయినా నిస్సత్తువ వేధిస్తుంది. కాబట్టి రోజులో రెండు నుంచి మూడు లీటర్లకు సరిపడా నీళ్లు తాగుతూ ఉండాలి.

వాసనలు: పెప్పర్‌మింట్, దాల్చిన చెక్క, నిమ్మ, రోజ్‌మేరీ ఎసెన్షియల్ నూనెలను డిఫ్యూజర్‌లో వేసి వాసనలు పీల్చడం వల్ల ఫలితం ఉంటుంది.

నిద్ర: 8 గంటలకు తగ్గకుండా నిద్రపోవాలి. నిద్రలేమి బడలికను కలిగిస్తుంది.



విటమిన్ డి: విటమిన్ డి లోపం కూడా నిస్సత్తువకు కారణమే! కాబట్టి వైద్యుల సలహా మేరకు డి విటమిన్ లోపాన్ని పరీక్షించుకుని సప్లిమెంట్ రూపంలో తీసుకోవాలి. అలాగే, ఉదయం, సాయంకాలపు నీరెండలో కనీసం 15 నిమిషాల పాటైనా గడుపుతూ ఉండాలి.



టిల్లు స్క్వేర్ చూసి ఎంజాయ్ చేశా

మెగాస్టార్ చిరంజీవి

ఇటీవల విడుదలై విజయం సాధించిన 'టిల్లు స్క్వేర్' చిత్రాన్ని చూసి మెగాస్టార్ చిరంజీవి బాగా ఎంజాయ్ చేశారు. వెంటనే ఆయన చిత్రబృందాన్ని తన ఇంటికి పిలిపించుకొని ప్రత్యేకంగా అభినందించడం విశేషం. ఆయన ఆహ్వానంపై హీరో సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు మల్లిక్ రామ్, నిర్మాత నాగవంశీ చిరు నివాసానికి వెళ్లారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ 'ఒక సినిమా హిట్ అయి, దానికి సీక్వెల్‌గా మరో చిత్రం వస్తుంటే అంచనాలు భారీ స్థాయిలో ఉంటాయి. వాటిని అందుకోవడం అంత తేలికైన విషయం కాదు. కానీ హీరో సిద్ధు, దర్శకుడు మల్లిక్‌రామ్, నిర్మాత నాగవంశీ. ఇతర టీమ్ అంతా కలసి ప్రేక్షకులు మెచ్చేలా 'డీజె టిల్లు'కు సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్'ను అందించడంలో విజయం సాధించారు. అదే ఉత్కంఠ, అదే సరదా, అదే నవ్వుల జల్లు. నటుడిగా, కథకుడిగా వ్యవహరించి, ఈ సినిమా ఇంత అద్భుతంగా రావడానికి ప్రధాన కారణమైన సిద్ధును అభినందిస్తున్నాను.ఈ సినిమా కోసం ఎంత కష్ట పడ్డామో, నిద్రలేని రాత్రులు ఎన్ని గడిపామో అని సిద్ధు నాతో చెప్పాడు. దర్శకుడు మల్లిక్ రామ్, ఎడిటర్ నవీన్ నూలి సహా అందరి సమిష్టి కృషి ఉందని తెలిపాడు. విజయం సాధించిన దర్శకనిర్మాతలకు నా శుభాకాంక్షలు. 'మ్యాడ్' చిత్రంతో దర్శకుడిగా ఆకట్టుకొన్న కల్యాణ్ ఈ సినిమా రచనలో సహకారం అందించాడని విన్నాను. కేవలం యువతనే కాకుండా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే విధంగా సినిమా తీశారు. ఈ సినిమా చూసి నేను బాగా ఎంజాయ్ చేశా. మీరు చేయండి' అన్నారు.

ఎన్టీఆర్‌కు తండ్రిగా.. ?





స్పై యూనివర్స్ నుంచి వచ్చి హిట్ అయిన చిత్రం 'వార్'. హృతిక్ రోషన్ హీరోగా నటించిన ఆ చిత్రానికి సీక్వెల్ ఇప్పుడు రూపొందుతోంది. ఈ సినిమాతో జూనియర్ ఎన్టీఆర్ బాలీవుడ్‌కు పరిచయమవుతున్నారు. ఒక కొత్త లుక్‌లో కనిపించడం కోసం ఫిన్లాండ్ నుంచి వచ్చిన స్పెషల్ ట్రైనర్ దగ్గర శిక్షణ పొందనున్నారు ఎన్టీఆర్. దాదాపు రూ. 300 కోట్ల బడ్జెట్‌తో యశ్‌రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో జగపతిబాబు కూడా నటిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్ తండ్రి పాత్రను ఆయన పోషిస్తారని సమాచారం. అయితే ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ ధ్రువీకరించాల్సి ఉంది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో అలియా భట్, కియారా అడ్వాణీ హీరోయిన్లుగా నటిస్తారని అంటున్నారు.

ఫ్యామిలీ ఆడియెన్స్ సెలబ్రేట్ చేసుకునేలా ఉంటుంది



విజయ్ దేవరకొండ, మృణాల్‌ఠాకూర్ నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. పరశురామ్ పెట్ల దర్శకత్వం వహించారు. దిల్‌రాజు,శిరీశ్ నిర్మించారు. ఈ నెల 5న 'ఫ్యామిలీ స్టార్' విడుదలవుతోన్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ ఫంక్షన్ నిర్వహించారు. దిల్‌రాజు మాట్లాడుతూ "ఫ్యామిలీ స్టార్ సినిమా విషయంలో ప్రతీ విషయంలోనూ పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది. డైరెక్టర్ కథ చెప్పగానే అందులోని పాయింట్ నన్ను ఎగ్జైట్ చేసింది. ఈ సినిమాకు విజయ్ క్యారెక్టర్ వెన్నెముక లాంటిది. ఇది 30 శాతం ఫ్యామిలీ స్టోరీ, 70 శాతం లవ్ స్టోరీ. మృణాల్ లక్కీ హీరోయిన్. ఈ చిత్రంతో తెలుగులో ఆమె హ్యాట్రిక్ అందుకుంటుంది" అని అన్నారు. విజయ్ మాట్లాడుతూ "మనకు ఏ కష్టం వచ్చినా అండగా నిలబడి నేనున్నా అని చెప్పే వ్యక్తి ఫ్యామిలీలో ఒకరు ఉంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. ఈ సినిమాకు, 'గీతాగోవిందం' సినిమాకు ఏ పోలిక ఉండదు. ఈ కథ వింటున్నప్పుడు మా నాన్న గుర్తొచ్చారు. అందుకే ఈ సినిమాలో నా క్యారెక్టర్‌కి మా నాన్న పేరు గోవర్ధన్ అని పెట్టాం" అని చెప్పారు. మృణాల్ మాట్లాడుతూ "సీతారామం, హాయ్‌నాన్న తర్వాత నా నెక్స్ట్ తెలుగు ప్రాజెక్ట్ కోసం చాలా కథలు విన్నా. ఈ సినిమా కథ నాకు నచ్చడంతో వెంటనే ఒప్పేసుకున్నాను. మన జీవితాల్లోని ఎమోషన్స్, రిలేషన్స్, అచీవ్‌మెంట్స్, స్ట్రగుల్స్ అన్నీ ఈ మూవీలో రిలేట్ చేసుకుంటారు" అని తెలిపారు.

'ఓ భామ అయ్యో రామ'



వైవిధ్యమైన చిత్రాలతో నటుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సుహాస్. ఆయన హీరోగా నటిస్తున్న మరో వైవిధ్యమైన ప్రేమకథా చిత్రం 'ఓ భామ అయ్యో రామ'. మాళవిక మనోజ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రామ్ గోదాల దర్శకత్వం వహిస్తున్నారు. హరీశ్ నల్లా, ప్రదీప్ తాళ్లు నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్రాన్ని ప్రారంభించి టైటిల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సుహాస్ మాట్లాడుతూ "దర్శకుడు మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు" అని తెలిపారు. 'నువ్వు నేను' ఫేమ్ నటి అనిత హస్సనందని మాట్లాడుతూ "నా సెకండ్ ఇన్నింగ్స్‌కు పర్‌ఫెక్ట్‌గా కుదిరిన చిత్రమిది" అని చెప్పారు. దర్శకుడు రామ్ గోదాల మాట్లాడుతూ "ఇదొక బ్యూటిఫుల్ లవ్‌స్టోరి" అని అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమాకు ప్రారంభం నుంచే మంచి పాజిటివ్ వైబ్ కనిపిస్తోంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, డైరెక్టర్స్ వశిష్ఠ, విజయ్ కనకమేడల, శైలేశ్ కొలను పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: భవీన్ ఎమ్.షా, సినిమాటోగ్రాఫర్: మణికందన్, సంగీతం: రథన్, కోప్రొడ్యూసర్: ఆనంద్ గడగోని.

ఈ సినిమాకు ఆ లిమిటేషన్స్ లేవు



'దొరసాని' మూవీతో మంచి డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్నారు కేవీఆర్ మహేంద్ర. ఆయన దర్శకత్వం వహించిన లేటెస్ట్ చిత్రం 'భరతనాట్యం'. సూర్యతేజ ఏలే, మీనాక్షి గోస్వామి హీరో హీరోయిన్లుగా నటించారు. పాయల్‌సరాఫ్ నిర్మించారు. ఈ నెల 5న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా మహేంద్ర మీడియాతో ముచ్చటించారు.

భరతనాట్యం ఒక నృత్య కళ. కానీ ఇక్కడ ఆ పేరుని క్రైమ్ వరల్డ్‌కి పెట్టాం. సరైన కారణంతోనే ఈ టైటిల్ పెట్టాం. సినిమా చూశాక ఈ విషయం మీకే తెలుస్తుంది. 'దొరసాని' తర్వాత ఓ స్టార్ హీరోతో క్రైమ్ డ్రామా ప్లాన్ చేశాను. కొన్ని కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. ఈ సమయంలోనే సూర్యతేజ ఏలే ఓ ఐడియా చెప్పారు. కథలు నెరేట్ చేస్తూ, దర్శకుడు కావాలని కలలు కనే ఓ సహాయ దర్శకుడు..ఆర్థిక ఇబ్బందులతో విచిత్రమైన పరిస్థితిలో క్రైమ్ వరల్డ్‌లో ఇరుక్కుని బయటపడడమే ఆ పాయింట్. ఈ లైన్ బాగా నచ్చడంతో డెవలప్ చేశాం. నా ప్రీవియస్ సినిమా 'దొరసాని'తో పోల్చితే ఈ సినిమాకు లిమిటేషన్స్ లేవు. ఇందులో అన్ని రకాల కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్నాయి. సినిమా చాలా ఫ్రెష్‌గా ఉంటుంది. చాలా మంచి డ్రామా ఇందులో ఉంటుంది. అలాగే పాత్రల మధ్య ఉన్న బలమైన సంఘర్షణ ఈ సినిమాకు ప్లస్ అవుతుంది. వివేక్‌సాగర్ అందించిన సంగీతం ఈ సినిమాకు మరో ప్రధాన ఆకర్షణ" అని చెప్పారు.





అజయ్ దేవగణ్ నటించిన 'మైదాన్' చిత్రం ఈ నెల 10న విడుదలవుతోంది. బోనీకపూర్ నిర్మించారు. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్నప్పటికీ ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

జాన్వీ ప్రేమ విషయంలో
నేను ఇన్‌వాల్వ్ అవ్వను

బోనీ కపూర్


"నా పిల్లల వ్యక్తిగత విషయాలలో నేను ఇన్‌వాల్వ్ అవ్వను. వారికి నచ్చినట్లు ఉండే స్వేచ్ఛను ఇస్తా. ఈ కాలం పిల్లలను మన తరంలోలా కట్టిపడేయలేం కదా. పిల్లల రిలేషన్స్ విషయంలో చాలా రూమర్స్ వస్తున్నాయి. ముఖ్యంగా జాన్వీ, శిఖర్ పహారియా ప్రేమ వ్యవహారం గురించి. నేను ఆ విషయంలో తలదూర్చలేను. నా కూతురికి సలహా అవసరమైన సమయంలోనే నేను తండ్రిగా కలుగజేసుకుంటాను అని చెప్పారు. అలాగే ఈ సందర్భంగా తన భార్య శ్రీదేవిని గుర్తు చేసుకొని భావోద్వేగానికి లోనయ్యారు బోనీ కపూర్. 'నాతో పోల్చితే శ్రీదేవికి ఆధ్యాత్మిక చింతన ఎక్కువ. ఆమె నమ్మకాలు, వ్యక్తిత్వం, ఆధ్యాత్మిక భావాలు నాపై కూడా ప్రభావం చూపి నన్ను ఆధ్యాత్మికత వైపు నడిపించాయి. శ్రీదేవి చేసే పనులు ఎప్పుడూ ప్రత్యేకంగా, ఆశ్చర్యకరంగా ఉండేవి. తన తల్లిలాగే జాన్వీకపూర్‌కు కూడా భక్తి ఎక్కువే" అని చెప్పారు. ఈ మధ్యే జాన్వీకపూర్, తన బాయ్‌ఫ్రెండ్ శిఖర్‌పహారియాతో కలిసి తిరుమల దర్శించడం హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే.

కమల్ హాసన్ మెచ్చుకున్నారు



మలయాళ మూవీ ఇండస్ట్రీలో లేటెస్ట్ సెన్సేషన్ 'మంజుమ్మెల్ బాయ్స్'. మలయాళ బాక్సాఫీస్ వద్ద రూ.200 కోట్లు కలెక్ట్ చేసిన మొట్టమొదటి సినిమాగా నిలిచింది. తమిళనాడులోని గుణ కేవ్స్‌లో జరిగిన ఓ వాస్తవ సంఘటన స్ఫూర్తితో చిదంబరం ఎస్ పొదువల్ దీనిని తెరకెక్కించారు. మైత్రీ మూవీ మేకర్స్ ఏప్రిల్ 6న ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ చిదంబరం మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ మీద ముందు నుంచి అందరికీ నమ్మకం ఉంది. కానీ రూ.200 కోట్లు కలెక్ట్ చేస్తుందని ఎవరూ ఊహించలేదు. నా సెకండ్ సినిమా కథ కోసం అన్వేషిస్తుండగా గుణ కేవ్స్‌లో జరిగిన ఈ సంఘటన గురించి తెలిసింది. నన్ను ఈ కథ ఎంతగానో ఎగ్జైట్ చేసింది. వెంటనే వర్క్ స్టార్ట్ చేసి, రియల్ లైఫ్ మంజుమ్మెల్ బాయ్స్‌ను కలిశా. వారు జరిగిందంతా చెప్పారు. విన్నాక ఇది ప్రజలకు తెలియాల్సిన కథ. సినిమా తీయాలి అని మరింత దృఢంగా నిశ్చయించుకున్నాను. సినిమా చూసిన కమల్ హాసన్ మెచ్చుకోవడం పెద్ద అవార్డు గెలుచుకున్నట్లనిపించింది. మలయాళీలకు తెలుగు సినిమాలు అంటే చాలా ఇష్టం. ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు తప్పకుండా నచ్చుతుందని ఆశిస్తున్నాను. తెలుగులో ఎంతో మంది మంచి నటులు ఉన్నారు. వారితో సినిమా చేసే అవకాశం కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నాను" అని చెప్పారు.

పొలిటికల్ డ్రామా



జగిత్యాల పట్టణంలో 1980ల దశకంలో జరిగిన ఓ యథార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకొన్న 'జితేందర్ రెడ్డి' చిత్రం మే 3న విడుదల కానుంది. రాకేశ్ వర్రే హీరోగా నటించిన ఈ చిత్రాన్ని విరించి వర్మ దర్శకత్వంలో ముదుగంటి రవీందర్‌రెడ్డి నిర్మించారు. యాక్షన్ నేపథ్యంలో పొలిటికల్ డ్రామాగా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు చెప్పారు. అప్పుడు జరిగిన సంఘటలన్నీ, కథను చూసిస్తున్నామనీ, ఎవరినీ కించ పరచాలనే ఉద్దేశం తమకు లేదనీ నిర్మాత తెలిపారు. తన సొంత సినిమాలు మూడు నిర్మాణంలో ఉన్నప్పటికీ 'జితేందర్ రెడ్డి'ని కూడా తన సొంత చిత్రంగానే భావించి హీరో రాకేశ్ వర్రే ఎంతో ఇన్‌వాల్వ్ అయ్యారని రవీందర్‌రెడ్డి చెప్పారు.

కేసు నంబర్ 15లో ఏముంది?



అజయ్, రవిప్రకాశ్, హర్షిణి, మాండవియా సెజల్ ముఖ్యపాత్రలు పోషించిన సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్ 'కేసు నంబర్ 15' అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. తడకల్ వంకర్ రాజేశ్ స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా నిర్మించారు. విడుదల సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో నిర్మాత సి.కల్యాణ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ప్రెసిడెంట్ రామకృష్ణ గౌడ్ టీజర్‌ను, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్ లిరికల్ వీడియోను విడుదల చేశారు. సినిమా విజయం సాధించాలని వారందరూ కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తడకల వంకర్ రాజేశ్ మాట్లాడుతూ 'మా సినిమాకు జాన్ మంచి సంగీతం ఇస్తే, ఆనం వెంకట్ అద్భుతమైన సినిమాటోగ్రఫీ ఇచ్చారు. సినిమాలో ప్రతి సీన్ ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రేక్షకుల్ని కచ్చితంగా అలరిస్తుంది. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వస్తాం' అని చెప్పారు.

క్రేజీ కాంబోలో వైబ్



'ఊరుపేరు భైరవకోన' చిత్రంతో హిట్ ట్రాక్ ఎక్కారు సందీప్ కిషన్. ఇప్పుడు ఆయన కథానాయకుడిగా కొత్త చిత్రం ఖరారైంది. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' చిత్రంతో దర్శకుడిగా అందరి దృష్టిని ఆకర్షించిన స్వరూప్ ఆర్ఎస్‌జే దర్శకత్వం వహిస్తున్నారు. రాహుల్ యాదవ్ నక్కిన నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి వైబ్ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్‌లో సందీప్ కిషన్ యాక్షన్ ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. కాలేజీ బేస్డ్ యాక్షన్ లవ్ స్టోరీ ఇది. 2025 వేసవిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

అంతర్జాతీయ కరెన్సీగా రూపాయి


ఆర్‌బీఐ 90వ వార్షికోత్సవ సందర్భంగా స్మారక నాణేన్ని విడుదల చేస్తున్న ప్రధాని మోదీ, ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

దేశం మరింత ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాల్సిందే..
ద్రవ్యోల్బణ కట్టడిలో ఎంపీసీ పాత్ర భేష్
అభివృద్ధే ఇక ఆర్‌బీఐ ప్రాధాన్యత: ప్రధాని మోదీ

ముంబై: వచ్చే పదేళ్లలో మరిన్ని రంగాల్లో మన దేశం ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే ఇది అత్యంత అవసరమన్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) 90 వసంతాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అలాగే మన రూపాయిని అందరికీ ఆమోదయోగ్యమైన, అందుబాటులో ఉండే అంతర్జాతీయ కరెన్సీగా మార్చేందుకూ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తమ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక ఉద్యోగుల పని భారం మరింత పెరుగుతుందన్నారు. ఉద్యోగులు ఇందుకు సిద్ధంగా ఉండాలని ప్రధాని కోరారు. ఇప్పటి వరకు ద్రవ్యోల్బణ కట్టడిపై ప్రధాన దృష్టి పెట్టిన ఆర్‌బీఐ వచ్చే పదేళ్ళు, జీడీపీ వృద్ధి రేటు పెంచడాన్నే అత్యంత ప్రాధాన్యత అంశంగా తీసుకోవాలని కోరారు. ఇదే సమయంలో ద్రవ్య స్థిరత్వం, విశ్వసనీయతలపైనా ఆర్‌బీఐ దృష్టి పెట్టాలని సూచించారు.

ఆర్‌బీఐ పాత్ర భేష్: జీడీపీ వృద్ధి రేటు వేగంగా, స్థిరంగా పెరగడంలో ఆర్‌బీఐ పోషించిన పాత్రను ప్రధాని మోదీ ప్రశంసించారు. ద్రవ్యోల్బణ కట్టడిలోనూ ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) చురుకైన పాత్ర పోషించిందన్నారు. నిరంతరం ధరల పర్యవేక్షణ, స్థిరమైన ద్రవ్య విధానాల ద్వారా కొవిడ్ వంటి కష్ట సమయంలోనూ ఎంపీసీ ద్రవ్యోల్బణాన్ని పెద్దగా కోరలు చాచకుండా కాపాడిందన్నారు. కొవిడ్ ప్రభావంతో ఇంకా అనేక దేశాలు సతమతమవుతున్నా, భారత్ మాత్రం ఆర్థికాభివృద్ధిలో దూసుకుపోతోందని ప్రధాని అన్నారు.

ఆదుకున్న ఆర్‌బీఐ నైపుణ్యాలు: అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిని ఎదుర్కోవడంలో వృత్తిపరమైన ఆర్‌బీఐ నైపుణ్యాలు దేశానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బ్యాంకుల ఆస్తులు-అప్పుల పట్టికలను మెరుగుపరచడంలోనూ ఆర్‌బీఐ చర్యలు ఎంతో ఉపకరించాయన్నారు. గత పదేళ్లలో ఆర్‌బీఐ, ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగానే బ్యాంకుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందన్నారు.

బలమైన ద్రవ్య వ్యవస్థే మా లక్ష్యం: వచ్చే పదేళ్లలో స్థిరమైన, బలమైన ద్రవ్య వ్యవస్థను ఏర్పాటు చేయడమే ఆర్‌బీఐ లక్ష్యంగా ఉంటుందని ఈ ఉత్సవాల్లో పాల్గొన్న ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. దేశ ఆర్థిక పురోగతికి ఇది పునాది రాయిలా ఉపయోగపడుతుందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్‌బీఐ ఎప్పటికప్పుడు అవసరమైన విధాన మార్పులు తీసుకుంటున్న విషయాన్ని దాస్ గుర్తు చేశారు.

బ్యాంకింగ్ వ్యవస్థ మారాలి

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బ్యాంకుల విధానాలూ మారాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చారు. దేశ భవిషత్ అభివృద్ధికి దోహదం చేసే రంగాలకు అవసరమైన రుణ వితరణపై బ్యాంకులు దృష్టి పెట్టాలని కోరారు. అంతరిక్ష రంగంలో ఉన్న కంపెనీలు, పర్యాటక రంగంలోని కంపెనీలకు మంచి భవిష్యత్ ఉందన్నారు. అయోధ్య ముందు ముందు అతిపెద్ద ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మారనుందన్నారు. బ్యాంకులు ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగాల్లోని కంపెనీల రుణ సాయంపై దృష్టి పెట్టాలన్నారు. డిజిటల్ బ్యాంకింగ్‌తో పాటు సైబర్ నేరాలు పెరిగి పోవడంపైనా ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ బెడదను అరికట్టేందుకు బ్యాంకులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

మార్చి నెల జీఎస్‌టీ ఆదాయం రూ.1.78 లక్షల కోట్లు

» రెండో అత్యధిక వసూళ్లివి.. ఏపీలో వసూళ్లు రూ.4,082 కోట్లు

» తెలంగాణ ఆదాయం రూ.5,399 కోట్లు

న్యూఢిల్లీ: మార్చి నెలకు గాను వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) స్థూల ఆదాయం వార్షిక ప్రాతిపదికన 11.5 శాతం వృద్ధితో రూ.1.78 లక్షల కోట్లకు పెరిగాయని ఆర్థిక శాఖ సోమవారం వెల్లడించింది. 2017 జూలైలో జీఎస్‌టీ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి రెండో అత్యధిక నెలవారీ వసూళ్లివి. దేశీయంగా విక్రయ లావాదేవీలు మరింతగా పుంజుకోవడం ఇందుకు దోహదపడిందని పేర్కొంది. గత నెలలో దేశీయ లావాదేవీల్లో 17.6 శాతం వృద్ధి నమోదైంది. రిఫండ్లు మినహాయించగా గత నెలకు జీఎస్‌టీ నికర ఆదాయం వార్షిక ప్రాతిపదికన 18.4 శాతం వృద్ధితో రూ.1.65 లక్షల కోట్లుగా ఉంది. జీఎస్‌టీ నెలవారీ వసూళ్లలో రెండంకెల వృద్ధి మన ఆర్థిక వ్యవస్థ కార్యకలాపాల జోరుకు సంకేతమని, జీఎస్‌టీలో భవిష్యత్ సంస్కరణలకు ఇవి బాటలు వేయనున్నాయని విశ్లేషకులు పేర్కొన్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో జీఎస్‌టీ ఆదాయం ఆల్‌టైం రికార్డు స్థాయి రూ.1.87 లక్షల కోట్లకు పెరిగింది.

1 గత నెలకు ఏపీలో జీఎస్‌టీ వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 16% పెరిగి రూ.4,082 కోట్లకు చేరుకున్నాయి. గత ఏడాది మార్చిలో వసూళ్లు రూ.3,532 కోట్లుగా ఉన్నాయి.

1 తెలంగాణ జీఎస్‌టీ ఆదాయం గత నెలలో రూ.5,399 కోట్లకు చేరుకుంది. క్రితం ఏడాది మార్చిలో నమోదైన రూ.4,804 కోట్లతో పోలిస్తే వసూళ్లు 12 శాతం పెరిగాయి.

వార్షిక వసూళ్లు రూ.20 లక్షల కోట్లు

ఈ మార్చి 31తో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో జీఎస్‌టీ స్థూల వసూళ్లు రూ.20.18 లక్షల కోట్లకు పెరిగాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2022-23)తో పోలిస్తే 11.7 శాతం వృద్ధి చెందాయి. 2022-23లో రూ.1.5 లక్షల కోట్ల స్థాయిలో నమోదైన నెలవారీ వసూళ్ల సగటు 2023-24లో రూ.1.68 లక్షల కోట్లకు పెరిగింది. ఈ మార్చి నాటికి రిఫండ్లు మినహాయించగా జీఎస్‌టీ నికర ఆదాయం వార్షిక ప్రాతిపదికన 13.4 శాతం వృద్ధితో రూ.18.01 లక్షల కోట్లుగా నమోదైంది.

4 కొత్త ప్లాంట్లు ప్రారంభించిన అరబిందో ఫార్మా

హైదరాబాద్: అరబిందో ఫార్మా.. పెన్సిలిన్-జి, 6-అమినో పెన్సిలానిక్ యాసిడ్ (6-ఏపీఏ), ఇంజెక్షన్లు, గ్రాన్యూల్ ఉత్పత్తుల తయారీ యూనిట్లు నాలుగింటిని సోమవారం ప్రారంభించినట్లు ప్రకటించింది. తమ పూర్తి యాజమాన్య అనుబంధ విభాగాల ద్వారా ఈ యూనిట్లను ఏర్పాటు చేసినట్టు అరబిందో ఫార్మా తెలిపింది. ఇందులో పెన్సిలిన్-జి (పెన్-జి) తయారీ విభాగం కాకినాడ సెజ్‌లో ఉంది. దీని వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 15,000 టన్నులు. ఇది కాకుండా గ్లూకోజ్ ఉత్పత్తి సామర్థ్యం 1.8 లక్షలు, 6-అమినో పెన్సిలానిక్ యాసిడ్ ప్లాంట్ సామర్థ్యం ఏటా 3,600 టన్నులని అరబిందో ఫార్మా తెలిపింది.

కొత్త ఆదాయ పన్ను విధానంలో మార్పులు లేవు

న్యూఢిల్లీ: కొత్త ఆదాయ పన్ను విధానంలో మార్పులు జరిగాయని సోషల్ మీడియాలో వచ్చిన వార్తలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తోసిపుచ్చింది. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. 2023 ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన 2023-24 ఆర్థిక సంవత్సరం నుంచి ఈ కొత్త పన్ను విధానం అమల్లోకి వచ్చింది. వ్యక్తిగత ఆదాయ పన్ను చెల్లింపుదారులు తమ ఐటీ రిటర్న్‌లు ఫైల్ చేసేటప్పుడు పాత లేదా కొత్త ఆదాయ పన్ను విధానాన్ని ఎంచుకోవచ్చు. ఈ కొత్త విధానంలో పన్నుల భారం తగ్గినా, మినహాయింపులు తక్కువ. దాంతో అధిక జీతాలు, ఆదాయం ఉండే వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులు పాత ఆదాయ పన్ను విధానాన్నే ఎంచుకుంటున్నారు.

ఆటో అమ్మకాల్లో కొత్త రికార్డ్

2023-24లో 42.3 లక్షల కార్ల విక్రయం

న్యూఢిల్లీ: స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యూవీ) విక్రయాల జోరుతో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రయాణికుల వాహనాల అమ్మకాలు 42 లక్షలు దాటాయి. ఇది చారిత్రక రికార్డు. 2022-23లో వాహన విక్రయాలు 38.9 లక్షలుండగా 2023-24లో 9% వృద్ధితో 42.3 లక్షలుగా నమోదయ్యాయి. మారుతి సుజుకీ, హ్యుండయ్ మోటార్ ఇండియా, టయోటా కిర్లోస్కర్ మోటార్ కంపెనీలు రికార్డు విక్రయాలు నమోదు చేశాయి. మొత్తం వాహన విక్రయాల్లో ఎస్‌యూవీల వాటా ముందు ఏడాదితో పోల్చితే 43% నుంచి 50.4 శాతానికి చేరింది. దేశంలో ప్రయాణికుల వాహనాల విక్రయాలు 40 లక్షలు దాటడం చరిత్రలో ఇదే ప్రథమం.

షాప్ అండ్ విన్ ఫెస్టివల్ విజేతలకు రూ.5 కోట్ల విలువైన బహుమతులు

» జీఆర్‌టీ జువెలర్స్



హైదరాబాద్: ప్రముఖ ఆభరణాల రిటైలర్ జీఆర్‌టీ జువెలర్స్, పండగల సీజన్‌ను పురస్కరించుకుని నిర్వహించిన షాప్ అండ్ విన్ ఫెస్టివల్ విజేతలను ప్రకటించింది. గత ఏడాది డిసెంబరు 22 నుంచి ఈ ఏడాది జనవరి 31 వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ షాప్ అండ్ విన్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని జీఆర్‌టీ జువెలర్స్ నిర్వహించింది. ఈ ఫెస్టివల్‌లో భాగంగా రూ.5,000 అంతకన్నా ఎక్కువ విలువ కలిగిన ఆభరణాలు కొనుగోలు చేసిన వినియోగదారులకు రూ.5 కోట్ల విలువైన బహుమతులను అందించనున్నట్లు ప్రకటించింది. తాజాగా జీఆర్‌టీ జువెలర్స్ 1,062 మంది విజేతలను ప్రకటించింది. 24 మంది ఖాతాదారులకు మహీంద్రా ఎక్స్‌యూవీలు, 47 మంది విజేతలకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల విలువైన వజ్రాల నెక్లెస్‌లు, 47 మందికి టీవీఎస్ జుపీటర్ 125 సీసీ, 236 మంది ఖాతాదారులకు ఒక్కొక్కరికి 10 గ్రాముల బంగారు నాణేలు, 708 మంది వినియోగదారులకు 100 గ్రాముల వెండి నాణేలను అందించింది.

2023-24లో రూ.199.89 లక్షల కోట్ల యూపీఐ లావాదేవీలు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా లావాదేవీలు సరికొత్త రికార్డు స్థాయికి పెరిగాయి. 2023-24లో మొత్తం రూ.199.89 లక్షల కోట్ల విలువైన యూపీఐ లావాదేవీలు జరిగాయి. 2022-23లో నమోదైన రూ.139.1 లక్షల కోట్ల లావాదేవీలతో పోలిస్తే 44% అధికమిది. అంతేకాదు, 2023-24లో యూపీఐ లావాదేవీల సంఖ్య తొలిసారిగా 10,000 కోట్ల మైలురాయిని దాటి 13,100 కోట్లకు చేరుకున్నాయి. 2022-23లో నమోదైన 8,400 కోట్ల లావాదేవీలతో పోలిస్తే 57% వృద్ధి చెందాయి. కాగా, గత నెలలో రూ.19.78 లక్షల కోట్ల విలువైన 1,344 కోట్ల లావాదేవీలు జరిగాయి.

ఆరంభం అదిరింది..

కొత్త ఆర్థిక సంవత్సరం తొలి రోజే సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు

» 363 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



ముంబై: ఏప్రిల్ 1తో ప్రారంభమైన కొత్త ఆర్థిక సంవత్సరాని (2024-25)కి స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాలతో స్వాగతం పలికాయి. అంతేకాదు, సూచీలు సరికొత్త శిఖరాలను సైతం అధిరోహించాయి. ఆసియా మార్కెట్ల సానుకూల సంకేతాలతో పాటు విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడుల దన్నుతో కొనుగోళ్లు పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. సోమవారం ఆరంభ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 603.27 పాయింట్ల వృద్ధితో 74,254.62 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి సూచీ 363.20 పాయింట్ల లాభంతో 74,014.55 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 203.05 పాయింట్ల వరకు ఎగబాకి 22,529.95 వద్ద సరికొత్త జీవితకాల ఇంట్రాడే గరిష్ఠ స్థాయికి చేరింది. ట్రేడింగ్ నిలిచేసరికి, 135.10 పాయింట్ల లాభంతో 22,462 వద్ద క్లోజైంది. సూచీలు లాభపడటం వరుసగా ఇది మూడో రోజు. ఈ మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,544.25 పాయింట్లు (2.13%) పుంజుకుంది. ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.10.58 లక్షల కోట్ల వృద్ధితో రూ.393.15 లక్షల కోట్లకు చేరుకుంది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 లాభపడ్డాయి.

అదానీ షేర్లకు భారీ డిమాండ్

అదానీ గ్రూప్‌లోని అన్ని లిస్టెడ్ కంపెనీల షేర్లలో సోమవారం జోరుగా కొనుగోళ్లు జరిగాయి. బీఎస్‌ఈలో అదానీ ఎనర్జీ షేరు 8.40 శాతం ఎగబాకగా.. ఎన్‌డీటీవీ 6.16 శాతం, అదానీ విల్మర్ 5.92 శాతం, అదానీ పవర్ 4.99 శాతం, అదానీ టోటల్ గ్యాస్ 4.81 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీ 2.93 శాతం, అదానీ పోర్ట్స్ 2.56 శాతం, ఏసీసీ 2.38 శాతం పుంజుకున్నాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, అంబుజా సిమెంట్స్ షేర్లు ఒక శాతానికి పైగా పెరిగాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,380 ▲	63,600 ▲	81,600 ▲
ముంబై	68,663 ▲	62,895 ▲	75,111 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

2వ తేదీ



హైదరాబాద్	380	విజయవాడ	403
చిత్తూరు	458	విశాఖపట్నం	415
గోదావరి	403	వరంగల్	382

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	127	గోదావరి	126
వరంగల్	127	విజయవాడ	126
కరీంనగర్	127	గుంటూరు	127
మహబూబ్‌నగర్	127	ఒంగోలు	127
కర్నూలు	127	చిత్తూరు	120
విశాఖపట్నం	117		

స్పోర్ట్స్

ఇప్పటికి వీరే..




పరుగులు	వికెట్లు
రియాన్ పరాగ్ (రాజస్థాన్)	ముస్తాఫిజుర్ (చెన్నై)
181 పరుగులు	7 వికెట్లు

జొకోవిచ్..అందరికంటే పెద్దోడు



లండన్: వరల్డ్ నెం:1 ర్యాంక్‌లో నిలిచిన పెద్ద వయస్కుడిగా సెర్బియా ఆటగాడు నొవాక్ జొకోవిచ్ (36 ఏళ్ల 321 రోజులు) అరుదైన ఘనతను అందుకొన్నాడు. తాజాగా విడుదల చేసిన ఏటీపీ ర్యాంకింగ్స్‌లో స్విస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ (36 ఏళ్ల 195 రోజులు) రికార్డును నొవాక్ అధిగమించాడు. కాగా భారత ఆటగాడు సుమీత్ నగల్ కెరీర్ బెస్ట్ ర్యాంక్‌కు ఎగబాకాడు. నగల్ రెండు ర్యాంక్‌లు మెరుగుపర్చుకొని 95వ స్థానంలో నిలిచాడు.

హైదరాబాద్ చేరిన చెన్నై జట్టు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి)/శంషాబాద్ రూరల్: ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్‌తో శుక్రవారం జరిగే మ్యాచ్‌లో తలపడేందుకు చెన్నై సూపర్ కింగ్స్ జట్టు హైదరాబాద్ విచ్చేసింది. ఆటగాళ్లంతా సోమవారం సాయంత్రం విశాఖపట్నం నుంచి ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. ధోనీని చూసి అభిమానులు కేరింతలు కొట్టారు. మహీ ఎయిర్‌పోర్టు నుంచి వెళ్లే వరకు ధోనీ, ధోనీ అంటూ హంగామా చేశారు. చెన్నై జట్టు ఎయిర్‌పోర్టు నుంచి భారీ బందోబస్తు నడుమ తాము బస చేసే హోటల్‌కు చేరుకుంది.

పవర్‌లిఫ్టింగ్‌లో శ్యామ్, సాయికి స్వర్ణాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ పవర్‌లిఫ్టర్లు శ్యామ్‌కుమార్, సాయితేజ పసిడి పతకాలు కొల్లగొట్టారు. ఢిల్లీలో జరిగిన ఈ పోటీల్లోని 82.5 కిలోల విభాగంలో శ్యామ్.. స్క్వాట్‌లో 180, బెంచ్‌ప్రెస్‌లో 120, డెడ్‌లిఫ్ట్‌లో 200, మొత్తంగా 500 కిలోల బరువెత్తి ప్రథమ స్థానంలో నిలిచాడు. 90 కిలోల కేటగిరీలో సాయితేజ.. స్క్వాట్‌లో 72.5, బెంచ్‌ప్రెస్‌లో 55, డెడ్‌లిఫ్ట్‌లో 140, మొత్తంగా 267.5 కిలోల బరువెత్తి అగ్రస్థానంలో నిలిచాడు.

పంత్‌కు జరిమానా

విశాఖపట్నం: చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటుకు పాల్పడినందుకు ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ పంత్‌కు జరిమానా విధించారు. ఇది ఆ టీమ్ తొలి తప్పిదంగా భావించినందున ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం పంత్‌పై రూ.12 లక్షల ఫైన్ పడింది.

ముంబై మూడోసారీ

దెబ్బ కొట్టిన బౌల్ట్, చాహల్
పరాగ్ మరో అర్ధ సెంచరీ

రాజస్థాన్ హ్యాట్రిక్ విజయం

నేటి మ్యాచ్
బెంగళూరు X లఖ్‌నవూ
రా.7.30 నుంచి


బౌల్ట్ (3/22)

ముంబై: వేదిక ఏదైనా రాజస్థాన్ రాయల్స్ దూసుకెళ్తోంది. సొంత మైదానంలో రెండు విజయాలు సాధించిన ఈ జట్టు.. ఈసారి వాంఖడేలోనూ దుమ్మురేపింది. దీంతో ముంబై ఇండియన్స్‌కి ముచ్చటగా మూడో పరాభవం తప్పలేదు. స్పిన్నర్ చాహల్ (3/11), పేసర్ బౌల్ట్ (3/22) తమ బంతులతో ముంబైని మరీ పసికూన జట్టులా మార్చేశారు. ఇక బ్యాటింగ్‌లో రియాన్ పరాగ్ (39 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్సర్లతో 54 నాటౌట్) ఎప్పటిలాగే తన ఫామ్‌ను చాటుకున్నాడు. దీంతో సోమవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం ఆరు పాయింట్లతో ఈ జట్టు టాప్‌లో కొనసాగుతోంది. అటు ముంబై మాత్రం గెలుపనేదే లేకుండా అట్టడుగున ఉంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 9 వికెట్లకు 125 పరుగులు చేసింది. హార్దిక్ (21 బంతుల్లో 6 ఫోర్లతో 34), తిలక్ వర్మ (29 బంతుల్లో 2 సిక్సర్లతో 32) మాత్రమే రాణించారు. చాహల్, బౌల్ట్‌లకు మూడేసి, బర్గర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో రాజస్థాన్ 15.3 ఓవర్లలో 4 వికెట్లకు 127 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బౌల్ట్ నిలిచాడు.

రియాన్ మరోసారి..: స్వల్ప ఛేదనలో రాజస్థాన్‌కు వరుసగా మూడో మ్యాచ్‌లోనూ శుభారంభం దక్కలేదు. అయితే ఈ క్లిష్టమైన పిచ్‌పై రియాన్ సీజన్‌లో రెండో హాఫ్ సెంచరీతో చెలరేగి విజయాన్నందించాడు. ఓపెనర్ జైస్వాల్ (10) తొలి ఓవర్‌లోనే వెనుదిరగ్గా, మూడు ఫోర్లతో ఆకట్టుకున్న కెప్టెన్ శాంసన్ (12), బట్లర్ (13)లను పేసర్ ఆకాశ్ వరుస ఓవర్లలో అవుట్ చేశాడు. 48/3 స్కోరుతో ఆర్ఆర్ కాస్త తడబాటుకు లోనైంది. ఈ స్థితిలో ఫామ్‌లో ఉన్న రియాన్ పరాగ్ క్రీజులో నిలిచాడు. అతడికి అశ్విన్ (16) సహకరించడంతో భారీ షాట్లకు వెళ్లకుండా లక్ష్యం వైపు కదిలారు. బంతికో పరుగు చొప్పున ఆడిన అశ్విన్ నాలుగో వికెట్‌కు 40 పరుగులు జోడించి వెనుదిరిగాడు. ఈ వికెట్‌ను కూడా ఆకాశ్ తీశాడు. అప్పటికే జట్టు పటిష్ఠ స్థితిలో నిలవగా 16వ ఓవర్‌లో రియాన్ 6,6,4తో అర్ధసెంచరీతో పాటు మ్యాచ్‌ను కూడా ముగించాడు.


చాహల్ (3/11)

బౌల్ట్ మెరుపుదాడి: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైని ఆరంభంలోనే పేసర్ బౌల్ట్ ఉక్కిరిబిక్కిరి చేయగా, మధ్య ఓవర్లలో స్పిన్నర్ చాహల్ మూడు వికెట్లతో మరింత దెబ్బతీశాడు. ఇతర బౌలర్లు కూడా విశేషంగా రాణించడంతో ఎంఐ స్వల్ప స్కోరుకే పరిమితమైంది. బౌల్ట్ చక్కటి లెంగ్త్ బాల్స్‌తో ఇన్నింగ్స్ తొలి ఓవర్‌లోనే రోహిత్ (0), నమన్ (0)లను వరుస బంతుల్లో డకౌట్ చేశాడు. అలాగే తన తర్వాతి ఓవర్‌లో బ్రెవిస్ (0)ను సైతం అవుట్ చేయగా.. కాస్త ఊపు మీదున్న ఇషాన్ (16)ను బర్గర్ దెబ్బతీయడంతో ముంబై 20/4 స్కోరుతో దారుణ స్థితిలో నిలిచింది. మరోవైపు తిలక్, కెప్టెన్ హార్దిక్ మాత్రం జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. ప్రేక్షకుల హేళనల మధ్య క్రీజులోకి వచ్చిన పాండ్యా ఆరో ఓవర్‌లో మూడు ఫోర్లు బాది పవర్‌ప్లేలో స్కోరును 46/4కి చేర్చాడు. మధ్య ఓవర్లలో ఇద్దరు అడపాదడపా ఫోర్లతో స్కోరు కుదురుకున్నట్టే కనిపించింది. కానీ చాహల్ ఓవర్‌లో పెద్ద షాట్‌కు వెళ్లిన పాండ్యా.. పోవెల్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో ఐదో వికెట్‌కు 56 పరుగుల కీలక భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత ఆర్ఆర్ బౌలర్లు మరింత కట్టుదిట్టంగా చేయడంతో 10-15 ఓవర్ల మధ్య ఒక్క ఫోర్ కూడా రాలేదు. అదే సమయంలో చావ్లా (5)ను అవేశ్, తిలక్‌ను చాహల్ పెవిలియన్‌కు చేర్చడం దెబ్బతీసింది. 17వ ఓవర్‌లో కొట్జీ (4)ని కూడా చాహల్ అవుట్ చేసి తన కోటాను అద్భుతంగా పూర్తి చేశాడు. భారీ హిట్టర్ డేవిడ్ (17) సైతం విఫలం కాగా.. ఆఖరి ఓవర్‌లో పది రన్స్‌తో ముంబై స్కోరు 120 దాటగలిగింది.

స్కోరుబోర్డు

ముంబై: ఇషాన్ (సి) శాంసన్ (బి) బర్గర్ 16, రోహిత్ (సి) శాంసన్ (బి) బౌల్ట్ 0, ధిర్ (ఎల్బీ) బౌల్ట్ 0, బ్రెవిస్ (సి) బర్గర్ (బి) బౌల్ట్ 0, తిలక్ (సి) అశ్విన్ (బి) చాహల్ 32, హార్దిక్ (సి/సబ్) పావెల్ (బి) చాహల్ 34, పీయూష్ (సి) హెట్‌మయెర్ (బి) అవేశ్ 3, డేవిడ్ (సి) బౌల్ట్ (బి) బర్గర్ 17, కొట్జీ (సి) హెట్‌మయెర్ (బి) చాహల్ 4, బుమ్రా (నాటౌట్) 8, ఆకాశ్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 125/9; వికెట్ల పతనం:** 1-1, 2-1, 3-14, 4-20, 5-76, 6-83, 7-95, 8-111, 9-114; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-22-3, బర్గర్ 4-0-32-2, అవేశ్ ఖాన్ 4-0-30-1, చాహల్ 4-0-11-3, అశ్విన్ 4-0-27-0.

రాజస్థాన్: జైస్వాల్ (సి) డేవిడ్ (బి) మఫాక 10, బట్లర్ (సి) పీయూష్ (బి) ఆకాశ్ 13, శాంసన్ (బి) ఆకాశ్ 12, పరాగ్ (నాటౌట్) 54, అశ్విన్ (సి) తిలక్ (బి) ఆకాశ్ 16, దూబే (నాటౌట్) 8, **ఎక్స్‌ట్రాలు: 14; మొత్తం: 15.3 ఓవర్లలో 127/4; వికెట్ల పతనం:** 1-10, 2-42, 3-48, 4-88; **బౌలింగ్:** మఫాక 2-0-23-1, బుమ్రా 4-0-26-0, ఆకాశ్ 4-0-20-3, కొట్జీ 2.3-0-36-0, పీయూష్ 3-0-18-0.

1 ఐపీఎల్‌లో ఎక్కువసార్లు (17) డకౌట్ అయిన బ్యాటర్‌గా దినేశ్ కార్తీక్‌తో సమంగా నిలిచిన రోహిత్.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	3	3	0	0	6	1.249
కోల్‌కతా	2	2	0	0	4	1.047
చెన్నై	3	2	1	0	4	0.976
గుజరాత్	3	2	1	0	4	-0.738
హైదరాబాద్	3	1	2	0	2	0.204
లఖ్‌నవూ	2	1	1	0	2	0.025
ఢిల్లీ	3	1	2	0	2	-0.016
పంజాబ్	3	1	2	0	2	-0.337
బెంగళూరు	3	1	2	0	2	-0.711
ముంబై	3	0	3	0	0	-1.423

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

ముంబైలో మరీ ఎక్కువగా..


హార్దిక్‌ను వదలని ఫ్యాన్స్

ముంబై: ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యాను క్రికెట్ ఫ్యాన్స్ వదిలేలా లేరు. హిట్‌మ్యాన్ అభిమానులు హైదరాబాద్, అహ్మదాబాద్ మ్యాచ్‌ల సందర్భంగా హార్దిక్ పాండ్యాను తీవ్ర స్థాయిలో గేలి చేశారు. తాజాగా సోమవారం రాజస్థాన్‌తో మ్యాచ్‌కు టాస్‌కోసం వచ్చిన సందర్భంగా హార్దిక్‌ను మరింత గేలి చేశారు. అంతేకాదు..'రోహిత్, రోహిత్..ముంబైకా రాజ్ రోహిత్' అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆ సమయంలో రోహిత్.. కామెంటేటర్ హర్భజన్‌తో ముచ్చటిస్తూ కనిపించాడు. ఇక..ముంబై నాలుగో ఓవర్లో 20/4తో ఉన్న దశలో బ్యాటింగ్‌కు దిగిన సందర్భంగా అభిమానులు హార్దిక్‌ను మరింత గేలి చేశారు.

అందుకే పేరు మార్చుకున్నా!


నేనిక జోష్ బట్లర్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్ వైట్‌బాల్ జట్టు కెప్టెన్ బట్లర్ ఓ వ్యక్తిగతమైన కీలక నిర్ణయం తీసుకున్నాడు. తన పేరును జోష్ బట్లర్‌గా అధికారికంగా మార్చుకున్నట్టు సోమవారం వెల్లడించాడు. దాదాపు మూడు దశాబ్దాలుగా తన పేరును జాస్ బట్లర్‌కు బదులు అంతా జోష్ బట్లర్‌గా తప్పుగా పిలుస్తున్నారని పేర్కొన్నాడు. 'జాస్' అని తాను ఎన్నిసార్లు చెప్పినా..అంతా జోష్‌గానే పిలుస్తున్నారన్నాడు. ఈనేపథ్యంలో గందరగోళానికి తెరదించుతూ తన పేరును జోష్ బట్లర్‌గా మార్చుకుంటున్నట్టు వివరించాడు.

పట్టుబిగించిన లంక

బంగ్లాతో రెండో టెస్ట్

చట్టోగ్రామ్: పేసర్లు వికెట్ల వేటను కొనసాగించి వేళ.. బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్‌లో శ్రీలంక పట్టు బిగించింది. 353 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినా.. ప్రత్యర్థిని ఫాలో ఆన్ ఆడించకుండా రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన లంక 102/6 స్కోరు చేసింది. సోమవారం మూడోరోజు ఆటముగిసే సమయానికి లంక మొత్తంగా 455 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. తొలి రెండు రోజులు బ్యాటింగ్‌కు అనుకూలించిన పిచ్.. పేసర్లకు సహకరించడంతో మూడో రోజు ఏకంగా 15 వికెట్లు నేలకూలాయి. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 55/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా 178 పరుగులకు ఆలౌటైంది. లంక తొలి ఇన్నింగ్స్‌లో 531 పరుగులు చేసింది.



డబుల్స్ విజేత ఆనంద్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల డబుల్స్‌లో రాష్ట్ర ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ జోడీ విజేతగా నిలిచింది. సోమవారం లేక్‌వ్యూ టెన్నిస్ అకాడమీలో జరిగిన ఈ పోటీల ఫైనల్లోని 40 ప్లస్ విభాగంలో సీవీ ఆనంద్-అరుణ్ కుమార్ జోడీ 10-7తో శ్రీనివాస్-రాజ ద్వయంపై నెగ్గి టైటిల్ సొంతం చేసుకుంది. 40 ప్లస్ సింగిల్స్‌లో సీవీ ఆనంద్ రన్నరప్‌గా నిలవగా, 50 ప్లస్ సింగిల్స్ ఫైనల్లో డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి 10-9తో మణికందన్‌పై పోరాడి గెలిచారు. హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడు నరసింహారెడ్డి విజేతలకు ట్రోఫీలు ప్రదానం చేశారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న సీఎస్ శాంతికుమారి

ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించాలి: సీఎస్

- ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లతో నిఘా
- 15 రోజుల్లో రూ.35 కోట్ల పట్టివేత: డీజీపీ

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని నిష్పక్షపాతంగా, పటిష్ఠంగా అమలుచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. ఎలాంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా స్వేచ్ఛగా, ప్రశాంతంగా ఎన్నికలు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై సోమవారం సచివాలయంలో ఆమె ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతలు, చెక్‌పోస్టులలో సీజ్ చేసిన నగదు, ఓటర్లను ప్రభావితం చేసే ఇతర వస్తువుల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. బేగంపేట ఎయిర్‌పోర్టుతో పాటు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో కూడా తనిఖీలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీపీ రవి గుప్తా మాట్లాడుతూ సరిహద్దు రాష్ట్రాలతో అంతర్రాష్ట్ర సమావేశాలు నిర్వహించామని, రాష్ట్రంలో 85 సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామని వివరించారు. ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్విలెన్స్ బృందాలతో నిఘాను పెంచామని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన ఈ పక్షం రోజుల్లోనే సుమారు రూ.35 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమీకృత సరిహద్దు చెక్‌పోస్టులతో వాణిజ్య పన్నుల శాఖ ద్వారా నిఘా పెంచామని, ఇప్పటి వరకు రూ.5.19 కోట్లను స్వాధీనం చేసుకున్నామని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ టీకే శ్రీదేవి వివరించారు.

బీజేపీలోని దద్దమ్మల వల్లే ఆ పార్టీని వీడా

- బాబూమోహన్



హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 1: ఎన్నో ఏళ్లుగా బీజేపీలో వెట్టిచాకిరి చేసినా గుర్తింపు లభించకపోవడంతో పాటు కొందరు దద్దమ్మలు, చవటల పనీతీరు నచ్చకనే ఆ పార్టీకి రాజీనామా చేశానని ప్రజాశాంతి పార్టీ తెలంగాణ అధ్యక్షుడు బాబూమోహన్ అన్నారు. ఆయన పార్టీ బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఏ పాల్ ఆశీస్సులతో లోక్‌సభ ఎన్నికల్లో వరంగల్ నుంచి బరిలో దిగుతున్నానని చెప్పారు. వరంగల్ బిడ్డగా, 25 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన తనను గెలిపిస్తే కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. ప్రజాశాంతి పార్టీ ఆధ్వర్యంలో కేఏ పాల్ సొంత నిధులతో పేద విద్యార్థులకు ఉచిత విద్య, వైద్యంతోపాటు వితంతువులకు, వృద్ధులకు పెన్షన్లను అందిస్తామని హామీనిచ్చారు.

టెట్ ఫీజులు తగ్గించండి లేదంటే నిరుద్యోగుల తరపున పోరాటం

- సీఎం రేవంత్‌కు ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ

హైదరాబాద్, ఏప్రిల్ 1, (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయిలో నిర్వహించే సీటెట్ కన్నా రాష్ట్రంలో నిర్వహించనున్న టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఫీజులు అధికంగా ఉన్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాల అభ్యర్థులకు భారంగా మారిన టెట్ ఫీజులను తగ్గించాలని, రిజర్వేషన్ ఉన్న వారికి రాయితీ కల్పించాలి" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు కోరారు. సోమవారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బీఆర్ఎస్ హయాంలో టెట్‌కు సంబంధించి ఒక పేపర్ రాసినా, రెండు పేపర్లు రాసినా రూ.400 మాత్రమే ఫీజు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పుడు ఒక పేపర్‌కు రూ.1,000, రెండు పేపర్లకు .2,000 ఫీజుగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. సీబీఎస్ఈ నిర్వహించే సీటెట్‌తో పోలిస్తే ఈ ఫీజులు రెట్టింపుగా ఉన్నాయని చెప్పారు. అనేక కష్టాలకోర్చి ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులపై ఫీజుల భారం మోపడం సరికాదన్నారు. ఇప్పటికైనా టెట్ ఫీజులను తగ్గించకపోతే విద్యార్థులు, నిరుద్యోగుల తరపున పోరాడతామని హెచ్చరించారు.

రాష్ట్రపతిని అవమానించిన మోదీ: టీపీసీసీ

రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ప్రధాని మోదీ అవమానించారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ అన్నారు. అద్వానీకి భారతరత్న అవార్డు ప్రదానం సందర్భంగా... రాష్ట్రపతి ముర్ము పక్కనే ఉన్న ప్రధాని ప్రొటోకాల్ ప్రకారం నిలబడకుండా, మదమెక్కిన వాడిలా కుర్చీలోనే కూర్చునే ఉన్నారని విమర్శించారు. ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను కూడా దూరంగా కూర్చోబెట్టి అవమానించారన్నారు. ప్రొటోకాల్‌ను ఉల్లంఘించిన ప్రధాని... రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాగా, పాలమూరు రాజకీయాలతో డీకే అరుణ కుటుంబం బాగుపడిందే తప్ప, జిల్లాకు ఎలాంటి లాభమూ జరగలేదని టీపీసీసీ అధికార ప్రతినిధి కాల్వ సుజాత అన్నారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా సుదీర్ఘ కాలం పనిచేసిన అరుణ... జిల్లాకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

టీపీసీసీ మీడియా విభాగం చైర్మన్‌గా సామ రామ్మోహన్‌రెడ్డి

టీపీసీసీ మీడియా, కమ్యూనికేషన్ విభాగం చైర్మన్‌గా సామా రామ్మోహన్‌రెడ్డిని.. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు సోమవారంనాడు పార్టీ కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.

రైతుల ఆత్మహత్యలు బీఆర్ఎస్ వైఫల్యమే

- తెలంగాణ రైతు రక్షణ సమితి

కొత్త ప్రభుత్వం ఏర్పాటైన వంద రోజుల్లో 200 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారూ అంటే.. అది బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యమేనని తెలంగాణ రైతు రక్షణ సమితి అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు అన్నారు. ఒక్కసారి వచ్చిన నష్టంతో రైతు ఆత్మహత్య చేసుకోడని, వరుస నష్టాలు వచ్చి.. ఆత్మగౌరవంతో బతకలేని పరిస్థితులు వచ్చినప్పుడే బలవన్మరణానికి పాల్పడతాడని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో రైతులకు వరుసగా పంట నష్టాలు జరుగుతుంటే ఆ ప్రభుత్వం సంబంధంలేకుండా వ్యవహరించిందన్నారు. వడగండ్ల వానలతో పంటకు నష్టం వాటిల్లగానే ఎకరాకు రూ. పది వేల చొప్పున పరిహారం ప్రకటించిన రేవంత్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ కుల సంఘాల మద్దతు కాంగ్రెస్‌కే..

- జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు కుమారస్వామి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దండ్రు కుమారస్వామి అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీసీ కుల సంఘాల మద్దతు కాంగ్రెస్‌కేనని ప్రకటించారు. సోమవారం హైదరాబాద్‌లో జాతీయ బీసీ దళ్ ఆధ్వర్యంలో బీసీ కులసంఘాల అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం ప్రజలు హక్కులు పొందడం ప్రజాస్వామిక, సామాజిక న్యాయమని, అది కులగణనతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాజ్యాధికారం దక్కే వరకు బీసీలు పోరాడాలని పిలుపునిచ్చారు.

కార్మికుల కనీస వేతనాలు పెంచాలి: ఐఎన్‌టీయూసీ

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 73 రంగాల్లోని 1.7 కోట్ల కార్మికుల కనీస వేతనాలను పెంచాలని ఐఎన్‌టీయూసీ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి దేవసాని భిక్షపతి, మాజీ ఎమ్మెల్సీ సభవత్ రాములు నాయక్ సోమవారం ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి విజ్ఞప్తి పత్రం సమర్పించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు 200 శాతం, ఇంటి అద్దెలు, పిల్లల చదువులు, వైద్యం ఖర్చులు 150 శాతం పెరిగాయని కార్మికుల జీతాలలో మాత్రం ఎటువంటి పెరుగుదల లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా వెంటనే కార్మికుల కనీస వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని వేం నరేందర్ రెడ్డికి ఐఎన్‌టీయూసీ నేతలు విజ్ఞప్తి చేశారు.

రూ.90 లక్షల బంగారం, వెండి పట్టివేత

రూ.41.09 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో పోలీసులు

సూర్యాపేటరూరల్/ కోదాడ రూరల్/ దేవరకొండ, అడ్డగుట్ట, ఏప్రిల్ 1: ఎన్నికల కోడ్ అమల్లో భాగంగా నిర్వహించిన తనిఖీల్లో రూ.90 లక్షల విలువైన బంగారం, వెండితోపాటు రూ.41.09 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సూర్యాపేట మండలం టేకుమట్ల చెక్‌పోస్టు వద్ద సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి, ఎస్సై బాలు నాయక్ వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న వాహనంలో 1,135 గ్రాముల బంగారం, 17.99కిలోల వెండి గుర్తించారు. ఎలాంటి అనుమతులు, ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసి ఎన్నికల అధికారులకు అప్పగించారు. వీటి విలువ రూ.90,31,038 ఉంటుందని సీఐ తెలిపారు. అలాగే సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని రామాపురం చెక్‌పోస్టు వద్ద విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారులో రూ.65 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. అనంతగిరి మండలం శాంతినగర్ చెక్‌పోస్టు వద్ద ఖమ్మం నుంచి కోదాడకు కారులో వస్తున్న ఓ వ్యక్తి వద్ద రూ.55 వేల నగదును గుర్తించినట్టు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని గొడకొండ్ల రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద రూ.2.39 లక్షల నగదు పట్టుకున్నట్లు చింతపల్లి ఎస్సై బి.యాదయ్య తెలిపారు. ఇక సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేపట్టిన పోలీసులు ఓ ప్రయాణికుడి వద్ద నుంచి రూ.37.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. రైల్వే అదనపు డీజీ మహేష్ ఎం.భగవత్, సికింద్రాబాద్ ఎస్పీ షేక్ సలీమా తెలిపిన వివరాల ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం మధురాంతకం తేరడి వీధి గ్రామానికి చెందిన పి.లక్ష్మణ్ రామ్ సొంతూరు వెళ్లేందుకు ఆదివారం సాయంత్రం రైల్వేస్టేషన్‌కు వచ్చాడు. రైలు కోసం 1వ నంబర్ ప్లాట్ ఫాంలోని మూడో నంబర్ గేట్ సమీపంలో కూర్చుని ఉండగా పోలీసులు అతని బ్యాగును తనిఖీ చేసి డబ్బులున్నట్లు గుర్తించారు. నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు చూపకపోవడంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు.

రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం

పార్లమెంట్ ఎన్నికల తర్వాత జరిగేది ఇదే.. దేశంలో కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా రావు: కేటీఆర్



నల్లగొండ మండలం ముషంపల్లిలో రైతు మల్లయ్యయాదవ్‌తో సంభాషిస్తున్న కేటీఆర్

నల్లగొండ/వరంగల్/హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పార్లమెంటు ఎన్నికల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి బీజేపీలోకి జంప్ అవుతారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ విషయాన్ని తాను ఇప్పటికి పదిసార్లు చెప్పానన్నారు. కానీ, తాను మాట్లాడే ప్రతి అంశంపైనా స్పందించే రేవంత్‌రెడ్డి.. ఈ అంశంపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రధాని మోదీకి భయపడుతున్నారా? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి.. రాహుల్‌గాంధీ కోసం పనిచేస్తున్నారో లేక మోదీ కోసం పనిచేస్తున్నారో తెలియడం లేదని వ్యాఖ్యానించారు. సోమవారం నల్లగొండలో పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. రాహుల్‌గాంధీ గుజరాత్ మోడల్ ఫేక్ అంటుంటే, ఇక్కడేమో రేవంత్‌రెడ్డి తెలంగాణను గుజరాత్ మోడల్‌లా మారుస్తానంటున్నారని విమర్శించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లేనే లేదని, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టును రాహుల్‌గాంధీ ఖండిస్తుంటే, ఇక్కడ రేవంత్‌రెడ్డి ఢిల్లీ లిక్కర్ స్కామ్ జరిగిందని, కవితమ్మ అరెస్టు సబబేనని అంటున్నారని దుయ్యబట్టారు. దేశంలో కాంగ్రెస్‌కు 40 ఎంపీ సీట్లు కూడా రావన్నారు. ప్రభుత్వాన్ని కూల్చితే మానవబాంబులం అవుతామని రేవంత్‌రెడ్డి అంటున్నారని, కానీ.. కూలగొట్టే ఆలోచన బీఆర్ఎస్‌కు లేదని కేటీఆర్ అన్నారు. ఆయన పక్కనే ఉన్న నల్లగొండ, ఖమ్మం బాంబుల నుంచే ఆయనకు ప్రమాదం ఉందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ చేసిన అబద్ధపు ప్రచారాన్ని నమ్మడం వల్ల కొందరు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా ఓట్లు వేశారని కేటీఆర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుకు పట్టుబట్టాలని, ప్రజల్లో నిలదీయాలని సూచించారు. రిజర్వాయర్లలో నీళ్లున్నా కేవలం కేసీఆర్‌ను బద్నాం చేయాలనే దుర్మార్గపూరిత ఆలోచనవల్లే లక్షల ఎకరాల పంటను ఎండబెట్టారని కేటీఆర్ ఆరోపించారు. నల్లగొండ మండలం ముషంపల్లి గ్రామంలో ఎండిన బత్తాయి తోటలను ఆయన పరిశీలించారు. బోర్ల రాంరెడ్డి, కన్నెబోయిన మల్లయ్యయాదవ్ అనే రైతులను కలిసి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. మల్లయ్యయాదవ్‌కు పార్టీ తరపున రూ.లక్ష చెక్కును అందజేశారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. వందరోజుల పాలనలో సీఎం, మంత్రులు విషం కక్కడం తప్ప ఒక్క మంచిమాట కూడా మాట్లాడలేదని దుయ్యబట్టారు. "మాట్లాడితే కేసులంటున్నారు. కొండను తవ్వి ఎలుకను కాదు గదా, ఎలుక తోక మీద వెంట్రుకను కూడా పట్టుకోలేరు. కొత్తగా ఫోన్ ట్యాపింగులంటూ మొదలుపెట్టారు. మీరే పనికిమాలినవాళ్లు.. మీవి పనికిమాలిన మాటలు. నిజంగా వింటే.. మీ దొంగపనులు తెలిసేవి. కానీ, మేం వినలేదు" అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

ఉద్దెర మాటలు చెబుతున్న కాంగ్రెస్..

కాంగ్రెస్ పార్టీ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆరోపించారు. వారేదో తమను ఉద్ధరిస్తారని ప్రజలు అనుకుంటే.. అన్నీ ఉద్దెర మాటలే చెబుతున్నారని, అన్నీ ఫేక్, లీక్ వార్తలేనని విమర్శించారు. సోమవారం హనుమకొండ జిల్లా చింతగట్టులో జరిగిన వరంగల్ లోక్‌సభ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. కడియం శ్రీహరి పలు సందర్భాల్లో రేవంత్‌రెడ్డిని దొంగతో పోల్చారని, ఇప్పుడే అదే వ్యక్తితో కాంగ్రెస్ కండువా కప్పించుకున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, కార్యకర్తలు అధైర్య పడవద్దని సూచించారు. కాగా, ఒకప్పుడు టీడీపీలో కడియం శ్రీహరికి ఎన్టీఆర్‌తో చెప్పి టికెట్ ఇప్పించింది తానేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ఇప్పుడు పార్టీకి ద్రోహం చేసిన శ్రీహరిని ఓడించడంలోనూ తానే ముందుంటానన్నారు.

పిల్లర్లు కుంగడం ప్రకృతి విపత్తు కాదా?

రాష్ట్రంలో రైతుల కష్టాలు పెరుగుతున్నాయని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. రైతుబంధు, రైతుబీమా పథకాలను అమలు చేయకుండా కాంగ్రెస్ సర్కారు.. రైతుల ఉసురు పోసుకొంటోందని ఆరోపించారు. ప్రకృతి విపత్తును రాజకీయం చేస్తున్నారంటున్న మంత్రి తుమ్మలకు.. ప్రకృతి విపత్తుతోనే మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగాయనే విషయం తెలియదా? అని ప్రశ్నించారు. మాదిగలకు ఒక్క ఎంపీ సీటు కూడా ఇవ్వకుండా కాంగ్రెస్ ద్రోహం చేసిందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాల్‌కిషన్ ఆరోపించారు. అలాంటి పార్టీలో చేరిన కడియం శ్రీహరి మాదిగజాతికి ద్రోహం చేశారని అన్నారు. ముసలి నక్కలన్నీ.. కాంగ్రెస్‌లో చేరుతున్నాయని, వారు వెళ్లడం వల్ల బీఆర్ఎస్‌కు కలిగే నష్టమేమీ లేదన్నారు. విపక్షమంటే ఖాళీగా కూర్చోవడం కాదని, ప్రజా సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడమేనని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంత్రి ఉత్తమ్ బాధ్యతారహితంగామాట్లాడుతున్నారని తప్పుబట్టారు



ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో దాడికి పాల్పడుతున్న ఈటల అనుచరులు, బీజేపీ ఉప్పల్ నాయకులు

ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఈటల అనుచరుల వీరంగం

- హుజురాబాద్ దళితుల ప్రెస్‌మీట్ సందర్భంగా రగడ

ఉప్పల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో బీజేపీ నేత ఈటల రాజేందర్ అనుచరులు వీరంగం సృష్టించారు. హుజురాబాద్‌కు చెందిన కొన్ని దళిత కుటుంబాలతో కలిసి ఈటల బాధితుల సంఘం అధ్యక్షుడు తిప్పారావు సంపత్ సోమవారం ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈటల.. తమపై అక్రమ కేసులు బనాయించి, తమ భూములు లాక్కున్నారని సంపత్ ఆరోపించారు. ఈ సమావేశం జరుగుతుండగానే ఈటల అనుచరులు, ఉప్పల్ బీజేపీ నాయకులు దూసుకొచ్చి విధ్వంసానికి పాల్పడ్డారు. తమ నాయకుడికి వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ నిర్వహించే దమ్ము ఎక్కడిదంటూ కుర్చీలు, టీవీ చానళ్ల లోగోలు ధ్వంసం చేశారు. ఈ ఘటనను వీడియో తీస్తున్న ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్‌పై దాడికి పాల్పడ్డారు. దీంతో ఈటల అనుచరులు, బీజేపీ శ్రేణుల వైఖరిని నిరసిస్తూ జర్నలిస్టులు ఆందోళన చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఘర్షణ వాతావరణాన్ని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. ఉప్పల్ ప్రెస్‌క్లబ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దాడి ఘటనను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, ప్రధాన కార్యదర్శి దొంతుల వెంకట్రామిరెడ్డి ఖండించారు. దీన్ని మీడియాపై జరిగిన దాడిగా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు. దాడులకు పాల్పడినవారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నన్ను బ్లేడ్‌తో కోస్తున్నారు!

- కలిసేందుకు వస్తున్నవారిలో కిరాయి మూకలు ఉంటున్నాయి
- వారు సన్నటి బ్లేడ్‌లతో నన్ను నా సెక్యూరిటీ సిబ్బందినీ కోస్తున్నారు
- ప్రత్యర్థి పార్టీ పన్నాగాలు తెలుసుకదా
- జనసేన అధినేత పవన్ కల్యాణ్



ఆంధ్రజ్యోతి, ఏప్రిల్ 1(కాకినాడ): తన భద్రతపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పర్యటనల సమయంలో తనను కలిసేందుకు అభిమానులు, నేతలు, కార్యకర్తల్లో కొందరు కిరాయి మూకలు కలుస్తున్నాయని అనుమానాలు వ్యక్తం చేశారు. వారు జనంతో కలిసిపోయి సన్నని బ్లేడ్‌లతో తనను, తన సెక్యూరిటీని కోస్తున్నారని తెలిపారు. "మన ప్రత్యర్థి పార్టీ పన్నాగాలు తెలుసు కదా.. వాటిని గమనించుకుంటూ జాగ్రత్తగా ముందుకు వెళ్లాలి" అని పరోక్షంగా వైసీపీని ఉద్దేశించి పవన్ వ్యాఖ్యానించారు. ఈ మధ్య కూడా ఇలా బ్లేడుతో దాడి చేశారంటూ ఓ ప్రాంతం పేరు చెప్పబోయి మధ్యలోనే ఆపేశారు. పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న పవన్ మూడు రోజుల నుంచి ఇక్కడ పర్యటిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం పిఠాపురంలోని ఓ హోటల్‌లో పార్టీలో చేరిన న్యాయవాదులు, వైద్యులు, వైసీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 2 లక్షల మంది పైచిలుకు ఉన్న ప్రజలతో తనకూ ఫొటో తీయించుకోవాలని ఉందన్నారు. చేరికల సందర్భంగా జరుగుతున్న సమావేశానికి హాజరైన నేతలు, కార్యకర్తలు కూడా తనతో ఫొటోలు దిగడానికి ముందుకు రావాలని ఉన్నా రాలేకపోతున్నారని చెప్పారు. అందరితో ఒకేసారి ఫొటోలు దిగలేమని, రోజుకు కనీసం రెండు వందల మందితో ఫొటోలు దిగుతానని అన్నారు. ఇందుకు భద్రతాపరమైన సమస్యలు ఉన్నాయని, ఆ నిబంధనలను పాటించాలని కోరారు. తనను కలిసేందుకు భారీగా వస్తున్న వారిలో కొన్ని కిరాయిమూకలు కలిసిపోతున్నాయని, వారు సన్నటి బ్లేడ్లతో తనను, తన సెక్యూరిటీని గాయపరుస్తున్నారని తెలిపారు. దీంతో ఒక్కసారిగా సమావేశంలో నిశ్శబ్దం అలముకుంది. ఇటీవల తనను ఓ చోట ఇలాగే గాయపరిచారని పవన్ తెలిపారు. అందుకే భద్రతాపరమైన జాగ్రత్తలు తీసుకుంటూనే అందరికీ అవకాశం కల్పిస్తానన్నారు. కాగా, గతేడాది జూన్‌లో కాకినాడ జిల్లాలో జరిగిన వారాహి యాత్రలో కూడా తనకు ప్రాణహాని ఎదురైందని పవన్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

బొగ్గు వేబిల్లు @ రూ. 6వేలు

ఇందులో సర్కారుకు అందేది రూ.20.. సుమారు 300 రెట్ల దాకా అ'ధనపు' దోపిడీ

- వే బిల్లుల్లో అటవీ ఉద్యోగుల అక్రమాలు
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఇష్టారాజ్యం
- చెల్లించకుంటే కేసులు, వేధింపులు



నల్లగొండ జిల్లా సరిహద్దులోని ఓ బట్టీలో రవాణాకు సిద్ధంగా ఉంచిన బొగ్గు

నల్లగొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బొగ్గు రవాణాకు సంబంధించిన వే బిల్లుల జారీలో అవినీతి పరాకాష్ఠకు చేరింది. ప్రభుత్వానికి చెల్లించే పర్మిట్ రుసుము కంటే 300 రెట్లు అదనంగా బొగ్గు ఉత్పత్తిదారులు ముడుపులు చెల్లించుకోవాల్సి వస్తోంది. సాధారణంగా బొగ్గు రవాణాకు సంబంధించిన వేబిల్లును జారీ చేయాలంటే అటవీ శాఖకు రూ.20 చెల్లిస్తే సరిపోద్ది. కానీ, ఒక్కో లారీకి రూ.6,000పైనే ముడుపులు సమర్పించుకోవాల్సి వస్తోందన్న ఆరోపణలున్నాయి. నల్లగొండ జిల్లాలో యథేచ్ఛగా సాగుతోన్న ఈ దందాతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతుంటే, బొగ్గు ఉత్పత్తిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లగొండ, నాగార్జునసాగర్ అటవీశాఖ డివిజన్ల పరిధిలో అనుమతి తీసుకున్న బొగ్గు బట్టీలు 620 వరకు ఉండగా, అనధికారికంగా మరో 600 బొగ్గు బట్టీలు కొనసాగుతున్నాయి. ఈ బొగ్గు బట్టీల నుంచి ప్రతి నెలా 10వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది. ఈ బొగ్గును తొలుత హైదరాబాద్‌కు లారీల్లో రవాణా చేసి, అక్కడినుంచి ప్రైవేటు కంపెనీలకు విక్రయిస్తుంటారు. బొగ్గు రవాణాకు సంబంధించిన వే బిల్లులను నల్లగొండ, నాగార్జునసాగర్, సూర్యాపేట, కోదాడ, భువనగిరి, ఆలేరు అటవీశాఖ డివిజన్ అధికారి జారీ చేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఒక్కో వే బిల్లుకు(10 టన్నుల లారీ) రూ.20 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. కానీ, రూ.6,000-6,500 వరకు చెల్లిస్తేనే వేబిల్లులు జారీ చేస్తున్నారని బొగ్గు ఉత్పత్తిదారులు వాపోతున్నారు. ముడుపులు తక్కువ ఇచ్చినా, అసలు ఇవ్వకపోయినా లారీలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నారని, గత్యంతరం లేని స్థితిలో వారు చెప్పిన నగదును చెల్లిస్తున్నామని పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో బొగ్గు లారీలకు వేబిల్లుల జారీ ద్వారా అటవీశాఖకు ప్రతి నెలా రూ.20వేల ఆదాయం వస్తే, ముడుపుల కింద దాదాపు రూ.60లక్షల వరకు ఉద్యోగులకు అందుతోంది. ఏడాదిలో ఎనిమిది నెలలపాటు బొగ్గు దందా సాగుతుందని, వేబిల్లుల ద్వారా అటవీ శాఖకు ఏటా రూ.1.60-2లక్షల వరకు ఆదాయం వస్తే, ముడుపుల కింద రూ.5కోట్లు అధికారుల జేబుల్లోకి వెళుతుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్నీ స్థాయుల సిబ్బంది, ఉద్యోగులు, అధికారులకు.. ప్రతి నెలా వాటాలు వెళ్తుండడంతో ప్రభుత్వాదాయం పెంచే అవకాశాలను పట్టించుకోకుండా అక్రమార్జనపైనే దృష్టి పెడుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులు ఈ దందాపై దృష్టి సారించాలని, వే బిల్లుల మంజూరుకు పారదర్శక విధానం అమల్లోకి తేవాలని బొగ్గు ఉత్పత్తిదారులు కోరుతున్నారు. ఈ అంశంపై జిల్లా అటవీ శాఖాధికారి రాజశేఖర్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా వేబిల్లుల కోసం ముడుపులు డిమాండ్ చేస్తున్న విషయం తమ దృష్టికి రాలేదని, ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డాక్యుమెంట్లు తగ్గినా పెరిగిన రాబడి

- ధరణి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ద్వారా రూ.14,500 కోట్లు
- 209 కోట్లకుపైగా పెరిగిన ఆదాయం

గత నాలుగేళ్లలో నమోదైన డాక్యుమెంట్లు.. వచ్చిన ఆదాయం

సంవత్సరం	డాక్యుమెంట్ల సంఖ్య (లక్షల్లో)	ఆదాయం (రూ.కోట్లలో)
2020-21	12.10	5,260
2021-22	19.72	12,370
2022-23	19.47	14,291
2023-24	17.60	14,500

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి):ధరణి, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌ల ద్వారా ఈ ఏడాది (2023-24) ప్రభుత్వానికి దాదాపు రూ14,500 కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. గత ఏడాదిలో (2022-23)లో రూ.14,291.04 కోట్ల ఆదాయం నమోదైంది. ఈ మేరకు ఈ ఏడాది సుమారు రూ.209 కోట్లకుపైగా అధిక ఆదాయం వచ్చింది. డాక్యుమెంట్ల నమోదు మాత్రం నిరుటితో పోల్చితే తగ్గింది. సుమారు 1.30 లక్షల వరకు డాక్యుమెంట్లు తగ్గాయి. ఈ ఆర్థిక సంవత్సరంలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో కోడ్ నేపథ్యంలో నగదు చలామణిపై ఈసీ ఆంక్షలు విధించింది. కోడ్ అమల్లో ఉన్నన్ని రోజులు రిజిస్ట్రేషన్లపై తీవ్ర ప్రభావం పడింది. ఫలితంగా వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు, ఇతర స్థిరాస్తుల లావాదేవీలు రెండు నెలల పాటు మందగించాయి. ధరణి ద్వారా వ్యవసాయ భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు, పెండింగ్ మ్యూటేషన్లు, సక్సెషన్‌లు, జీపీఏ, నాలా, లీజ్ తదితర ఫీజుల ద్వారా సుమారు రూ.2 వేల కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు పేర్కొంటున్నారు. రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిపార్ట్‌మెంట్ ద్వారా వ్యవసాయేతర భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, అపార్ట్‌మెంట్లు, ప్లాట్లు, వ్యాపార సముదాయాలు, ఇతర స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన ప్రక్రియ, స్టాంప్స్‌లు, ఈ స్టాంప్స్‌ల విక్రయాలు, వివాహాల నమోదు, ఈసీలు, మార్టిగేజ్, లీజ్ ఫీజులు, గిఫ్ట్‌లు, పార్టీషన్ తదితర లావాదేవీలతో 12,500 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది.

కేటీఆర్‌ను చూసి జాలిపడదాం

(మొదటిపేజీ తరువాయి)

పడిందని ధ్వజమెత్తారు. ఇంత తక్కువ సమయంలో బీఆర్ఎస్ కూలిపోతుందని ఎవరూ అనుకోలేదని, ఆ పార్టీని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. ఎన్టీపీసీ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ వస్తే హాజరుకాని కేసీఆర్... కేంద్రాన్ని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కిసాన్ మోర్చా సమావేశంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు రుణమాఫీపై సీఎం రేవంత్ మాట తప్పారని, రైతు భరోసా మాటే మరిచారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 5న అన్ని జిల్లా కేంద్రాల్లో చేపట్టనున్న రైతు సత్యాగ్రహం కార్యక్రమాలను విజయవంతం చేయాలని కిసాన్ మోర్చా పదాధికారులకు పిలుపునిచ్చారు. కాగా, ప్రధానిగా మోదీ మూడో సారి బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశంలో మరిన్ని అద్భుతమైన మార్పులు చోటుచేసుకోబోతున్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రజల సంక్షేమాన్ని, దేశ ప్రతిష్ఠను మరింతగా పెంచేలా ఈ మార్పులు ఉంటాయని చెప్పారు. గత పదేళ్లలో మోదీ సర్కారు నిర్ణయాల కారణంగా నిరర్థక ఆస్తులు గణనీయంగా తగ్గాయని, పన్ను సంస్కరణలతో చాలా మార్పులు వచ్చాయని పేర్కొన్నారు.

ఆదివాసీ మహిళను ప్రధాని అవమానించారు..

» హ్యాష్‌ట్యాగ్ డిక్టేటర్ మోదీ అంటూ సీతక్క ట్వీట్

ములుగు, ఏప్రిల్ 1: దేశ అత్యున్నత పదవిలో ఉన్న ఓ ఆదివాసీ మహిళను ప్రధాని మోదీ అవమానించారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఆదివాసీ మహిళకు గౌరవం ఇవ్వకపోవడం భారతమాతను అవమానపర్చడమేనని అన్నారు. అద్వానీకి భారతరత్న ప్రదానం సందర్భంగా పీఎం మోదీ, అద్వానీ కుర్చీల్లో కూర్చుని ఉండగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నిల్చుని ఉన్న ఫొటోను ఎక్స్‌లో పోస్ట్ చేసి.. డిక్టేటర్ మోదీ అని హ్యాష్‌ట్యాగ్ చేశారు. 'దేశంలో నియంతృత్వ పాలనకు ఈ ఫొటో ఒక ఉదాహరణ.. ఆదివాసీ మహిళకు జరిగిన ఈ అవమానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా' అంటూ ఆమె తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ పోస్టుకు ఎక్స్‌లో విశేష స్పందన లభిస్తోంది. పలువురు నెటిజన్లు సీతక్కకు మద్దతు తెలుపుతూ తమ అభిప్రాయాలను ట్యాగ్ చేస్తున్నారు.

8 నుంచి ఎస్ఏ- 2 పరీక్షలు

హైదరాబాద్, 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలల్లో 8వ తేదీ నుంచి ఎస్ఏ-2 పరీక్షలను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈనెల 8 నుంచి 19వ తేదీ వరకు ఎస్ఏ-2 పరీక్షలను నిర్వహించనున్నారు. 1 తరగతి నుంచి 7వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, 8వ తరగతి వారికి ఉదయం 9 నుంచి 11.45 గంటల వరకు, 9వ తరగతి వారికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు.

70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

» సింగరేణి కొత్త రికార్డు

హైదరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): మార్చి 31తో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి... మొత్తం 70.02 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసింది. అదేసమయంలో 69.86 మిలియన్ టన్నుల బొగ్గును రవాణా చేసింది. 2022-23లో 67 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసిన సంస్థ, 2023-24 సంవత్సరానికి గానూ 70 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంది. ఇక 420.32 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్‌ను తొలగించింది.



ఉచిత ఆన్‌లైన్ శిక్షణను ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నిరుద్యోగ బ్రాహ్మణ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

» ప్రారంభించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రాంనగర్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ బ్రాహ్మణ అభ్యర్థుల కోసం బ్రాహ్మణ ఆఫీషియల్స్ ప్రొఫెషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ శిక్షణాతరగతులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోమవారం బాగ్‌అంబర్‌పేటలో ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగాలను భర్తీ చేయలేదని, నూతన కాంగ్రెస్ ప్రభుత్వం వేలాది ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తోందని పేర్కొన్నారు. మూడు, ఆరు నెలల పాటు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందిస్తామని, బ్రాహ్మణ నిరుద్యోగులంతా ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు బీ.ఆర్.బీ.సుశీల్‌కుమార్, కార్యనిర్వాహక అధ్యక్షుడు బి.నీలకంఠం, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్ సూచించారు. మరిన్ని వివరాలకు 94408 74432 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.



మంత్రి దామోదరకు వినతిపత్రం అందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు చెల్లించండి

» మంత్రి దామోదరకు నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని తెలంగాణ ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ హస్పిటల్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ సభ్యులు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. ఈ సందర్భంగా... నెట్‌వర్క్ ఆస్పత్రులు ఎదుర్కొంటోన్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ బకాయిలు సకాలంలో రావడం లేదని, దాంతో ఆస్పత్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురుకోవాల్సి వస్తుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం ప్రారంభమైనప్పటి ప్యాకేజీలే ఇప్పటికీ ఉన్నాయని, వాటిని కూడా పెంచాలని విజ్ఞప్తి చేశారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

పరామర్శకు వెళ్తే కేసులు పెట్టారు

» కొట్టివేయాలంటూ బండి సంజయ్ హైకోర్టులో పిటిషన్

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): హోలీ సందర్భంగా చెంగిచర్ల పిట్టలబస్తీ వద్ద ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడ్డ బాధితులను పరామర్శించడానికి వెళ్లిన తమపై పోలీసులు నమోదు చేసిన కేసులను కొట్టేయాలని కోరుతూ బీజేపీ ఎంపీ బండి సంజయ్ సహా పలువురు నాయకులు హైకోర్టులో వేర్వేరు పిటిషన్‌లు దాఖలు చేశారు. తమ ఆదేశాలను ధిక్కరిస్తూ బండి సంజయ్ తదితరులు అల్లర్లకు ఆస్కారం ఇచ్చేలా వ్యవహరించారని పేర్కొంటూ మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో వేర్వేరు కేసులు నమోదు చేశారు. పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేశారని.. వీటిని కొట్టేయాలని బీజేపీ నేతలు క్వాష్ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లు జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం ఎదుట విచారణకు రానున్నాయి.

కేసీఆర్ బంధువుకు ముందస్తు బెయిల్ నిరాకరణ

కేసీఆర్ బంధువు కల్వకుంట్ల కన్నారావుకు హైకోర్టులో మరోసారి నిరాశ ఎదురయింది. ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో నమోదైన భూకబ్జా కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది. ఇప్పటికే ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది.

ఎంపీ ఎన్నికల్లో పోటీపై.. జాతీయ నాయకత్వానిదే నిర్ణయం: కూనంనేని

లోక్‌సభ ఎన్నికల విషయంలో రాష్ట్రంలో ఎలాంటి వైఖరి అనుసరించాలన్న అంశాన్ని పార్టీ జాతీయ నాయకత్వానికి అప్పగించామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేయాలనుకున్నా.. ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి స్పందన రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గతంలో తమ పార్టీ ఎమ్మెల్యేను లాక్కున్న బీఆర్ఎస్.. ఇప్పుడు పార్టీ ఫిరాయింపులపై మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత ఆయా రాజకీయ పార్టీలు కనీసం తమ స్థాయిలో కూడా నిలబడలేవని చెప్పారు. పంటలు ఎండిపోతున్నాయని కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు.

కాళేశ్వరం వైఫల్యాలకు దోషులెవరో తేల్చండి..

» విచారణ కమిటీ చైర్మన్ ఘోష్‌ను కలిసేందుకు కోల్‌కతాకు నీటిపారుదల శాఖ అధికారులు..

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణ లోపాలు, అవకతవకలపై విచారణ జరిపి, బాధ్యులను గుర్తించాలని జ్యుడిషియల్ విచారణ కమిటీని కోరేందుకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఈ మేరకు మంగళవారం కోల్‌కతాలో కమిటీ చైర్మన్ అయిన జస్టిస్ పినాకి చంద్రఘోష్‌ను నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా నేతృత్వంలోని అధికారుల బృందం కలవనుంది. ఇప్పటికే రాహుల్‌బొజ్జాతో పాటు ఈఎన్‌సీ (ఓఅండ్ఎం) బి.నాగేంద్రరావు, డిప్యూటీ ఈఎన్‌సీ (పీఅండ్ఎం) కె.శ్రీనివాస్ కోల్‌కతాకు చేరుకున్నారు. మంగళవారం అపాయింట్‌మెంట్ ఉండటంతో ఆయన్ను కలిసి, టీవోఆర్ అందించి, కేసును వివరించనున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి బూర్గుల రామకృష్ణారావు భవన్ (బీఆర్‌కేఆర్)లో విచారణ కమిటీ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేశారు. మొత్తం ఏడు అంశాల ఆధారంగా విచారణ జరిపి, దోషులెవరో గుర్తించి, జూన్ 30లోపు నివేదిక అందించాలని ఘోష్‌ను అధికారులు కోరనున్నారు.

ఆ ఏడు అంశాలేంటంటే...

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంతో పాటు ప్లానింగ్, డిజైనింగ్‌లో లోపాలు, అవకతవకలు, నిర్లక్ష్యంపై విచారణ చేపట్టాలి
- కాంట్రాక్టర్లకు పని అప్పగింత, పనుల అమలు తీరు, అవకతవకలు, ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా కాంట్రాక్టర్లకు పనుల అప్పగింతకు కారకులను గుర్తించాలి
- 3 బ్యారేజీల్లో ఆపరేషన్ మెయింటెనెన్స్‌లో నిర్లక్ష్యానికి బాధ్యులైన వారితో పాటు బ్యారేజీలు దెబ్బతినడానికి గల కారణాలను తేల్చాలి
- క్వాలిటీ కంట్రోల్, పర్యవేక్షణ కోణంలో నిర్లక్ష్యం, కాంట్రాక్టర్లు/ఏజెన్సీలు, శాఖలోని అధికారుల తప్పిదాలపై విచారణ జరపాలి
- నిబంధనలకు విరుద్ధంగా పనులు పూర్తి చేయడానికి పొడిగింపులు (ఎక్స్‌టెన్షన్ ఆఫ్ టైమ్-ఈవోటీ), పనులు పూర్తయినట్లు కాంట్రాక్టర్లకు సర్టిఫికెట్లు ఇవ్వడం, గడువు కన్నా ముందే బ్యాంకు గ్యారెంటీలను విడుదల చేయడం, కాంట్రాక్టర్లకు అనుకూలంగా వ్యవహరించడం వంటి అంశాల్లో బాధ్యులైన అధికారులను గుర్తించాలి
- కోరిన అన్ని అంశాల్లో బాధ్యులను గుర్తించడం, దానివల్ల ఖజానాపై పడిన ఆర్థిక భారం, ఆర్థిక నష్టాలు, ఏజెన్సీల పాత్రను నిగ్గుతేల్చాలి
- ఇంకా ఇతర ఏమైనా అంశాలు ప్రభుత్వం సిఫారసు చేస్తే.. వాటిపై విచారణ చేయాలి..

రైతు బంధుపై తప్పుడు ప్రచారం

ఇప్పటికే ఐదెకరాల్లోపు భూములకు ఇచ్చాం.. నెలాఖరులోగా మిగిలిన వాటికీ పంపిణీ

» వానాకాలం నుంచి వరికి 500 బోనస్
» వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల
» కేసీఆర్ వల్లనే తెలంగాణలో కరువు
» ఎంపీగా బండి సంజయ్ సాధించిందేమిటి: పొన్నం
» కేసీఆర్ మొసలి కన్నీరు: శ్రీధర్ బాబు
» పదవి పోగానే రైతులు గుర్తొచ్చారా..?
» కేసీఆర్‌పై మంత్రి కొండా సురేఖ ధ్వజం



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): రైతుబంధుపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విమర్శించారు. గత ప్రభుత్వం మే నెలాఖరు వరకు యాసంగి రైతు బంధు అందించిందని, ఈసారి ఈ నెలాఖరులోగానే ఇస్తామని తెలిపారు. ఇప్పటికే 5 ఎకరాల్లోపు వరకు రైతు బంధు జమ చేశామని, మిగిలిన రైతులకు నెలాఖరులోగా సహాయం అందిస్తామని వెల్లడించారు. ఇప్పటికే 92.3 శాతం మందికి రైతు బంధు ఇచ్చామని.. ఇంకా 4 లక్షల మందికి మాత్రమే ఇవ్వాల్సి ఉందన్నారు. వానాకాలం రైతుబంధు సాయంపై అసెంబ్లీలో చర్చించి.. విధి విధానాలు రూపొందిస్తామని చెప్పారు. తెలంగాణ-ఏపీ సరిహద్దులోని అశ్వారావుపేట మండలం కొత్తకన్నాయిగూడెం అటవీ ప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ ఆలయాన్ని మంత్రి తుమ్మల సోమవారం దర్శించుకున్నారు. అనంతరం మండలంలోని పాతకన్నాయిగూడెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వరికి రూ.500 బోనస్‌ను వచ్చే వానాకాలం అమలు చేస్తామన్నారు. వ్యవసాయ మార్కెట్లలో ధాన్యం, ఇతర ఉత్పత్తులను కనీస మద్దతు ధర(ఎంఎస్పీ) కంటే తక్కువకు కొనుగోలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. జల విద్యుత్ కోసం ఏపీ ప్రభుత్వం కృష్ణా జలాలను వినియోగించడంతోనే నీటి ఎద్దడి ఏర్పడిందని తుమ్మల వివరించారు. కొన్నిచోట్ల చివరి ఆయకట్టు పంటలు ఎండిపోతే దాన్ని బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారని అన్నారు.

కేసీఆర్ వల్లనే కరువు: పొన్నం



కరువుకు కాంగ్రెస్ కాదు.. కేసీఆరే కారణమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వర్షాకాలం వచ్చిందా..? బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వర్షాకాలం ఉందా..? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో వర్షాలు కురవలేదని.. కరువుకు కేసీఆరే కారణమని విమర్శించారు. సోమవారం సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. సరైన వర్షాలు లేకపోవడంతో వేసవికి ముందే భూగర్భజలాలు అడుగంటిపోయాయని.. ఇది తెలియకుండా కేసీఆర్ మాట్లాడటం ఎంత వరకు సమంజసమన్నారు. రాష్ట్రంలో తాగునీటి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించిందని తెలిపారు. వాటితో నీటి సమస్య ఉన్న పల్లెల్లో బోర్లు వేయిస్తామని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టు ద్వారా హుస్నాబాద్, అక్కన్నపేట, చిగురుమామిడి మండలాలకు సాగునీరు అందనుందని.. దేవాదుల ద్వారా ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు నీరు అందుతుందని పేర్కొన్నారు. ఐదేళ్ల ఎంపీగా ఉండి బండి సంజయ్ ఏం చేశారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంకా కోతలే పూర్తికాలేదని, బండి సంజయ్ మాత్రం రైతుల సమస్యలపై కల్లాల వద్ద పడుకుంటానని అంటున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ ఫొటోతో గెలిచే పరిస్థితి లేదని గ్రహించి రాముడి ఫొటోతో ఎన్నికల ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

కేసీఆర్ మొసలి కన్నీరు: శ్రీధర్ బాబు

గడచిన పదేళ్లలో రైతులను పట్టించుకోని కేసీఆర్, బీఆర్ఎస్ నేతలు.. ఎంపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మొసలి కన్నీరు కారుస్తున్నారని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. ప్రకృతి వైపరీత్యం వల్ల రాష్ట్రంలో కొంత పంట నష్టం జరిగితే ఎన్నికల కోసం బీఆర్ఎస్ రాజకీయం చేయడం సిగ్గుచేటని అన్నారు. పెద్దపల్లిలో సోమవారం శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ సర్కారు రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు.

కేసీఆర్ భయపడుతున్నారు?:సురేఖ .



గత పదేళ్లలో ఏనాడూ రైతులను పట్టించుకోని కేసీఆర్‌కు.. పదవి పోగానే అన్నదాతలు గుర్తుకొచ్చారని మంత్రి కొండా విమర్శించారు. గిట్టుబాటు ధరలు అడిగిన రైతులకు బేడీలు వేసిన చరిత్ర ఆయనదని చెప్పారు. సోమవారం వరంగల్‌లో సురేఖ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ పాలనపై ఉన్న వ్యతిరేకతతో ప్రజలు ఆయనను దూరం పెట్టారని, బీఆర్ఎస్ ఖాళీ అవుతుంటే కేసీఆర్ అభద్రతాభావానికి లోనవుతున్నారని, ఆయన భయపడుతున్నారని అన్నారు.. ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తూ హీరోయిన్లను బ్లాక్‌మెయిల్ చేసిన ఘనత కేటీఆర్‌దన్నారు. అనేక కుంభకోణాల్లో ఇరుక్కున్న కేసీఆర్, కేటీఆర్‌లకు మాట్లాడే హక్కు లేదన్నారు.

వరంగల్ టికెట్ కావ్యకే

(మొదటిపేజీ తరువాయి)

రాజకీయ పరిస్థితులు ఆ పార్టీకి ప్రతికూలంగా మారడంతో పోటీ నుంచి విరమించుకుని తండ్రితో పాటు కాంగ్రెస్‌లో చేరారు. కాగా.. కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాల విషయంలో ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. ఖమ్మం నుంచి రెడ్డి వర్గానికి చెందిన నేతను ఎంపిక చేస్తే.. కరీంనగర్ నుంచి బీసీ వర్గానికి చెందిన నేతను బరిలోకి దించే అవకాశాలున్నాయి. అయితే కరీంనగర్ నుంచి ఇప్పటివరకూ చర్చకు వచ్చిన బీసీ, రెడ్డి, వెలమ సామాజికవర్గాల నేతల పేర్లను సీఈసీ భేటీలో నేతలు తిరస్కరించినట్లు సమాచారం. దీంతో ఆ స్థానానికి బీసీ అభ్యర్థిని ఎంపిక చేసి గెలిపించే బాధ్యతను మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పజెప్పాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. కరీంనగర్‌కు బీసీ అభ్యర్థి ఖరారైతే.. ఖమ్మం నుంచి రెడ్డి సామాజికవర్గం నేతను అభ్యర్థిగా ఖరారు చేయడం ఖాయమని తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. ఖమ్మం రేసు నుంచి ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క తన భార్య నందిని పేరును ఉపసంహరించుకున్నట్లు తెలిసింది. ఈ రీత్యా ఖమ్మం నుంచి పొంగులేటి ప్రసాద్ రెడ్డినే ఖరారు చేసే అవకాశాలు లేకపోలేదని పార్టీ వర్గాలు తెలిపాయి.

మంత్రి కొండా సురేఖను కలిసిన కడియం శ్రీహరి, కావ్య

హైదరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం కడియం శ్రీహరి, ఆయన కూతురు కడియం కావ్య సోమవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, ఆమె భర్త కొండా మురళిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతున్న తీరు, ప్రజల్లో పార్టీకి పెరుగుతున్న ఆదరణ, లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు తదితర అంశాలపై వారు అభిప్రాయాలను పంచుకున్నారు. అనంతరం కొండా దంపతులను శ్రీహరి, ఆయన కూతురు కావ్య సత్కరించారు.

రెరా నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తప్పవు

» రెరా చైర్మన్ సత్యనారాయణ హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుల నిర్వాహకులు రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) నిబంధనలు ఉల్లంఘించి వ్యాపార కార్యక్రమాలు చేపట్టినా, ప్రీ లాంచింగ్ పేరుతో అమ్మకాలు చేసినా రెరా చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని టీఎస్ రెరా చైర్మన్ ఎస్.సత్యనారాయణ హెచ్చరించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, డీటీసీపీ, యూడీఏ, ఇతర స్థానిక సంస్థల అనుమతులతోపాటు రెరాలో రియల్టీ ప్రాజెక్టులు విధిగా రిజిస్టర్ కావాలన్నారు. రిజిస్టర్‌కాకుండా వ్యాపార ప్రకటనలు చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ పొందని ప్రాజెక్టులను సుమోటోగా, ఫిర్యాదుల ద్వారా గుర్తించి షోకాజు నోటీసులు జారీ చేస్తామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ప్రాజెక్టులకు ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 10శాతం వరకు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. ఇటీవల రెరా నిబంధనలు ఉల్లంఘించిన 27 ప్రాజెక్టులకు నోటీసులు జారీ చేసి రూ.21 కోట్ల అపరాధ రుసుం విధించినట్లు గుర్తు చేశారు. రియల్ ఎస్టేట్ మార్కెటింగ్, ఇతర కార్యకలాపాలు నిర్వహించే ఏజెంట్లు రిజిస్టర్ చేసుకోకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు 9,217 ప్రాజెక్టులు దరఖాస్తు చేసుకోగా 8,003 ప్రాజెక్టులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. 3,765 మంది ఏజెంట్లు దరఖాస్తు చేసుకోగా 3,621 మంది రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు. బిల్డాక్స్ రియల్ ఎస్టేట్ సంస్థ విషయంలో వచ్చిన ఫిర్యాదుల మేరకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని, చట్టపరంగా విచారించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కంపెనీ గుండ్ల పోచంపల్లి సర్వే నంబరు 509లో భువి వాసవి బిల్డాక్స్ అనే పేరుతో రెరా రిజిస్ట్రేషన్ కలిగి ఉందని, ఇతర ప్రాంతాల్లో ఇదే కంపెనీకి ఎలాంటి అనుమతులు లేనందున కంపెనీలో ఎలాంటి కొనుగోళ్లు చేయవద్దని అథారిటీ విజ్ఞప్తి చేసింది.

23 టీఎంసీల నీటిని కిందకు వదిలేశారు

(మొదటిపేజీ తరువాయి)





మాట్లాడారు. అధికారం కోల్పోయి తీవ్ర నైరాశ్యంలో ఉన్న కేసీఆర్‌కు.. పార్టీ కూడా పోతుందనే భయం పట్టుకుందన్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ మిగలదన్నారు. ఎప్పుడూ రైతుల దగ్గరకి వెళ్లని కేసీఆర్.. ప్రస్తుతం ఫ్రస్ట్రేషన్‌లో వెళ్లారని తెలిపారు. రైతు ఆత్మహత్యలు, కరెంటు కోతలు సహా ఇతర అంశాలపై ఆయన పచ్చి అబద్ధాలు మాట్లాడారని మండిపడ్డారు. పంటల బీమా పథకాన్ని కేసీఆర్ రద్దు చేసుకున్నారని, అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పైసా పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల ముందు రెండు జిల్లాల్లో డ్రామా చేసి.. అక్కడ కూడా రైతులకు డబ్బులు ఇవ్వలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రతి ధాన్యం గింజనూ కొంటామని ఉత్తమ్ స్పష్టం చేశారు. మద్దతు కంటే తక్కువ ధరకు కొంటే.. మిల్లర్లపైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్రంలో కరెంటు కోతలు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం 24 గంటల కరెంటు ఇస్తోందని చెప్పారు. ఎన్టీపీసీకి కేసీఆర్ సహకరించి ఉంటే.. ఇవాళ 4 వేల మెగావాట్ల విద్యుత్ రాష్ట్రం చేతిలో ఉండేదని వెల్లడించారు. యాదాద్రి విద్యుత్ కేంద్రానికి ఎక్కడ నష్టం జరుగుతుందో అని ఎన్టీపీసీకి కేసీఆర్ సహకరించలేదని తెలిపారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించింది కేసీఆర్ అయితే.. అప్పగించేది లేదని తేల్చి చెప్పింది తమ ప్రభుత్వమని చెప్పారు. పోలీసు శాఖను ఎక్కువగా ఉపయోగించుకున్నది, వారితో ఫోన్లను ట్యాప్ చేయించింది కేసీఆరేనని ఉత్తమ్ విమర్శించారు.

ట్యాపింగ్‌లో పెద్ద తలలకు జైలు..

ఫోన్ ట్యాపింగ్ కేసు చాలా సీరియస్‌గా ఉంటుందని, ఇందులో పెద్ద తలకాయలు జైలుకు పోయే అవకాశం ఉందని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ట్యాపింగ్‌కు ఎవరు అనుమతి ఇచ్చారన్నది తేలాల్సి ఉందన్నారు. గాంధీ భవన్‌లో సోమవారం ఉత్తమ్ మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా తన ఫోన్ కూడా ట్యాప్ అయిందని ఆయన వెల్లడించారు.

పంటలు ఎండబెట్టింది కేసీఆరే: భట్టి

"ఎన్నికల సమయంలో ఉన్న నీళ్లన్నీ కాల్వలకు వదిలేశారు. జలాలన్నీ వృథాగా పోతున్నా.. అవి చూసి ప్రజలు ఓట్లేస్తారని గేట్లన్నీ ఎత్తేశారు. ఫలితంగా జలాశయాలన్నీ ఖాళీ అయ్యాయి. రాష్ట్రంలో నీటి కొరత వచ్చింది. ప్రస్తుతం పంటలు ఎండిపోవడానికి నాటి సీఎం కేసీఆరే కారణం" అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. సోమవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మేడిగడ్డ ప్రాజెక్టు మూడు పిల్లర్లు అక్టోబరులోనే కుంగాయని.. డ్యామ్ ఎక్కడ కూలుతుందోననే భయంతో బీఆర్ఎస్ సర్కారు నీళ్లన్నీ వదిలేసిందని తెలిపారు. కేసీఆర్‌కు నీటిని సద్వినియోగం చేయడం చేతకాలేదని, అందుకే కరువు వచ్చిందని విమర్శించారు. కేసీఆర్ చెప్పేవన్నీ పచ్చి అబద్ధాలని అన్నారు. బీఆర్ఎస్ ఖాళీ అవడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరిగిందో దేశమంతా చూసిందన్నారు. కమీషన్ల కోసమే సబ్ క్రిటికల్ టెక్నాలజీతో భద్రాద్రి పవర్ ప్లాంట్ నిర్మించారని మండిపడ్డారు. యాదాద్రి ప్లాంట్‌ది ఫెయిల్యూర్ డిజైన్ అని చెప్పారు. ప్రజలపై కేసీఆర్ రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పులు మోపారని, వాటిని తీర్చే బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుందని భట్టి తెలిపారు.

విద్యుత్ విషయంలో దుష్ప్రచారం..

విద్యుత్ విషయంలో కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. విద్యుత్ సరఫరా లేకుంటే వినియోగం ఎలా పెరిగిందని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ప్రతి నెలా మార్చిలో వినియోగం కంటే ఈసారి మార్చిలో ఎక్కువ వినియోగం అయిందని పేర్కొన్నారు. ఏప్రిల్, మే నెలల్లోనూ సరిపడా విద్యుత్ ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ఈసారి మే నెలలోనూ విద్యుత్ కోతలు ఉండవని చెప్పారు. సూర్యాపేటలో జనరేటర్‌తో కేసీఆర్ సమావేశం పెట్టారని, మధ్య మధ్యలో మైక్ సరిగా పనిచేయకపోతే.. కరెంట్ పోతోందని కట్టు కథలు చెప్పే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. కేసీఆర్ కంటే ముందే కాంగ్రెస్.. దేశంలో, రాష్ట్రంలో ఎన్నో గొప్ప సంస్కరణలు తీసుకొచ్చిందని తెలిపారు. 2013లోనే దేశమంతా గ్రిడ్ అనుసంధానం చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ మూడు నెలల పాలనపై బురద జల్లుతున్నారని, మరి కేసీఆర్ పదేళ్ల కాలంలో ఎన్ని హామీలు నెరవేర్చారని భట్టి ప్రశ్నించారు.

కొండ పాలైన కొమురవెల్లి సొమ్ము

» సొంత డబ్బుతో గెస్ట్‌హౌస్ నిర్మాణానికి.. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ హామీ
» అనువైన స్థలం అందుబాటులో ఉన్నా.. దాసారం గుట్టపై ఏర్పాటుకు నిర్ణయం
» రోడ్డు కోసం గుడి నిధులు 4కోట్లు ఖర్చు



దాసారంగుట్టపై అసంపూర్తిగా ఉన్న రోడ్డు పనులు

చేర్యాల, ఏప్రిల్ 1: ఆలయ పాలక వర్గం, దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయంతో కోట్లాది రూపాయల కొమురవెల్లి మల్లన్న స్వామి సంపద కరిగిపోతోంది. ఆలయ పరిసరాల్లో కావలసినంత స్థలం అందుబాటులో ఉన్నా.. ఎక్కడో గుట్టపై కాటేజీలు నిర్మించాలనే ప్రణాళిక.. గుడి ఖజానాకు గుదిబండగా మారింది. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో.. దేవస్థానమే రూ.కోట్లు వెచ్చిస్తోంది. అయినా గుట్టపైకి రోడ్డు పూర్తి కాకపోవడంతో.. కాటేజీల నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మల్లన్నను ఇలవేల్పుగా కొలుస్తున్న మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఏటా జాతర సమయంలో ఇంటిల్లి పాదితో ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. స్థలం కేటాయిస్తే సొంత డబ్బుతో అధునాతన వసతులతో గెస్ట్‌హౌస్ నిర్మాణం చేపడతానని చాన్నాళ్ల క్రితం ఆయన హామీ ఇచ్చారు. దీంతో ఆలయ పరిధిలో అనువైన స్థలం ఉన్నప్పటికీ 2018లో సమీపంలోని దాసారం గుట్టపై గెస్ట్‌హౌస్ నిర్మించాలని నిర్ణయించారు. దాసారం గుట్టపైకి రోడ్డు లేకపోవడంతో అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం ముందస్తుగా రూ.1.40 కోట్లు వ్యయం అవుతుందని అంచనా వేసి పనులు ప్రారంభించారు. మట్టి, రాళ్ల రప్పలతో ఉండటంతో పటిష్ఠ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఏర్పడింది. ప్రైవేటు కన్సల్టెన్సీ ద్వారా మరో రూ.6 కోట్ల వ్యయంతో డీపీఆర్ రూపొందించారు. ఈ విషయమై అప్పటి మంత్రి హరీశ్‌రావు పరిశీలించి సంబంధిత అధికారులను మందలించారు. ఆయన ఆదేశాలతో పంచాయతీరాజ్ శాఖ అధికారులు డీపీఆర్ రూపొందించి వ్యయాన్ని కొంతమేర తగ్గించారు. కానీ ప్రభుత్వం నుంచి పైసా నిధులు మంజూరు చేయించకపోగా, భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆలయానికి వచ్చిన సొమ్మును బ్యాంకుల నుంచి తెచ్చి వెచ్చించారు. కొండను తొలిచి కాంక్రీటుతో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టారు. ఇంకా కొంత మేర పనులు చేపట్టాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.4.38 కోట్ల ఆలయ నిధులు చెల్లించారు. గుట్టపైకి సీసీ రోడ్డు వేయాలని ముందస్తుగా భావించినా బీటీ రోడ్డు వేయాలని తర్వాత నిర్ణయించారు. దీంతో మరో రూ.1.90 కోట్లు అదనంగా అవసరమవుతాయని భావిస్తున్నారు. మొత్తం సుమారు రూ.4.50 కోట్లకు మాత్రమే అనుమతి రాగా, మిగతా రూ.1.90 కోట్ల నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు.

గుట్టపై ఎకరన్నర స్థలమే..

రూ.కోట్లు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపట్టిన దాసారంగుట్టపై ఎకరన్నర స్థలం మాత్రమే ఉంది. అది అందుబాటులోకి రాకపోవడంతో భక్తులకు అనువైన వసతి కల్పించని పరిస్థితి నెలకొంది. రోడ్డు కోసం వెచ్చించిన వ్యయంతో ఆలయ పరిసరాల్లో 6-8 ఎకరాల స్థలం లభించడంతో పాటు భక్తులకు ఆశించిన వసతి గదులు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. గత దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్ కొద్దిరోజుల క్రితం జాతర ఏర్పాట్ల పరిశీలనకు ఆలయానికి వచ్చిన క్రమంలో దాసారంగుట్ట పనులను పరిశీలించారు. రూ.కోట్లు కుమ్మరించినా ఆశించిన ప్రయోజనం చేకూరకపోవడాన్ని గుర్తించారు. అదనంగా ప్రతిపాదించిన రూ.1.90 కోట్ల విడుదలకు అనుమతించబోమని తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో రోడ్డు పనుల నీలినీడలు కమ్ముకున్నాయి.

ఆలయ నిధుల నుంచి 4.38 కోట్లు చెల్లించాం

దాసారంగుట్ట అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి దేవాలయ నిధుల నుంచి రూ.4.38 కోట్లు చెల్లించాం. పెండింగ్ పనుల కోసం ఇంకా రూ.1.85 కోట్లకు పంచాయతీరాజ్ అధికారులు చేసిన ప్రతిపాదనలను దేవాదాయశాఖ కమిషనర్‌కు పంపించాం. వారి నిర్ణయం ప్రకారం చర్యలు తీసుకుంటాం.

- ఈవో బాలాజీ శర్మ

'మిస్ టీన్ గెలాక్సీ యూకే'గా

సిద్దిపేట జిల్లా యువతి




బెజ్జంకి, ఏప్రిల్ 1: 'మిస్ టీన్ గెలాక్సీ పెజెంట్ యూకే' టైటిల్ తెలంగాణకు చెందిన సుహానీరావు అనే యువతికి దక్కింది. ఈ టైటిల్ గెలిచిన మొదటి దక్షిణాసియా వాసిగా ఆమె రికార్డు సృష్టించారు. సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన బోయినపల్లి ప్రమోద్‌రావు- సరిత దంపతుల కుమార్తె సుహానీరావు. వీరి కుటుంబం 14 ఏళ్ల క్రితం యూకే వెళ్లి బకింగ్‌హామ్ షేర్‌లో స్థిరపడింది. గతనెలలో యూకేలో జరిగిన 'మిస్ టీన్ గెలాక్సీ పెజెంట్ యూకే' టైటిల్ పోరులో యూకే నలుమూలల నుంచి వచ్చిన 25 మంది ఫైనలిస్ట్ యువతులతో పోటీపడి సుహానీరావు టైటిల్ సాధించారు. ఆగస్టులో యూఎస్ఏ ఫ్లోరిడాలో జరగనున్న గెలాక్సీ ఇంటర్నేషనల్ పెజెంట్‌లో యూకే తరఫున ఆమె ప్రాతినిధ్యం వహించనున్నారు. అంతర్జాతీయ మిస్ టీన్ కిరీటం కోసం ఆమె పోటీ పడనున్నారు. భరతనాట్యంలో డిప్లొమా చేసిన సుహానీరావు నృత్యకారిణిగా మంచి పేరు పొంది నాట్యకళాజ్యోతి బిరుదును పొందారు. సుహానీరావు 'మిస్ టీన్ గెలాక్సీ పెజెంట్ యూకే' టైటిల్ గెలవడం పట్ల తోటపల్లి గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

విలక్షణ చిత్రకారుడు 'దాసి' సుదర్శన్ కన్నుమూత

- గుండెపోటుకు గురై చికిత్స పొందుతూ మృతి
- దాసి చిత్రానికి కాస్ట్యూమ్ డిజైనర్‌గా జాతీయ అవార్డు
- నేడు మిర్యాలగూడలో అంత్యక్రియలు





మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 1: విలక్షణ చిత్రకారుడు, ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్, సాహితీవేత్త పిట్టంపల్లి సుదర్శన్ అలియాస్ దాసి సుదర్శన్(72) కన్నుమూశారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని తన స్వగృహంలో సోమవారం గుండెపోటుకు గురయ్యారు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. సుదర్శన్ చిత్రకళ, సాహితీరంగంలో విశేష సేవలందించారు. నాగార్జునసాగర్ జూనియర్ కళాశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేసిన ఆయన ఎంతోమంది విద్యార్థులను కళలు, సాహిత్యంవైపు మళ్లించారు.. సాహితీవేత్తగానే కాకుండా సినీరంగంలోనూ రాణించారు. ప్రముఖ సినీ దర్శకుడు నర్సింగరావుతో కలిసి పలుచిత్రాల్లో పనిచేశారు. నర్సింగరావు దర్శకత్వంలో 1988లో తెరకెక్కిన 'దాసి' సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు. అప్పట్లో విశేష ప్రజాదరణ పొందిన ఈ చిత్రానికి ఐదు జాతీయ అవార్డులు వచ్చాయి. కాస్ట్యూమ్ డిజైనర్‌గా సుదర్శన్ జాతీయ అవార్డు రావడంతో దాసి సుదర్శన్‌గా ప్రఖ్యాతిపొందారు. జాతీయ అవార్డు జూరీలో ఆయన సభ్యుడిగా సేవలందించి చిత్ర పరిశ్రమలో సుపరిచితుడిగా నిలిచారు. సుదర్శన్ మృతి పట్ల పలువురు కవులు, కళాకారులు సంతాపాన్ని వ్యక్తం చేశారు. సుదర్శన్ మృతి కళారంగానికి తీరని లోటని మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. సుదర్శన్ అంత్యక్రియలు మంగళవారం మిర్యాలగూడలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

బాలికపై నీళ్లు పోసి.. నిలదీసిన తండ్రి గొంతు కోసి!

- నార్సింగ్‌లో పోకిరీల ఘాతుకం.. ఇద్దరి అరెస్టు

నార్సింగ్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్‌కు వెళ్లే బాలికపై కన్నేసిన ఓ యువకుడు.. ఆమె ఒంటరిగా వీధిలో కనిపించడం చూసి బకెట్‌తో ఆమెపై నీళ్లు పోసి చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం తెలిసి నిలదీసిన ఆమె తల్లిదండ్రులపై మరికొందరితో కలసి కత్తితో దాడి చేసి వీరంగం సృష్టించాడు. ఈ దాడిలో బాలిక తండ్రి గొంతు తెగగా.. తల్లి చేతికి గాయమైంది. ఈ ఘటన నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెమలీనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పుప్పాల్‌గుడా గ్రామం పరిధిలోని నెమలీనగర్‌లో సదరు బాలిక తన తల్లిదండ్రులతో కలసి ఉంటోంది. ఆదివారం మధ్యాహ్నం సరుకుల కోసం ఆమె స్థానికంగా ఉండే దుకాణానికి వెళ్లింది. అయితే ఆమెపై కన్నేసిన అదే ప్రాంతానికి చెందిన సురేశ్.. 'హోలీ పండుగ నుంచి దొరకడం లేదు.. ఇప్పుడెక్కడికి వెళ్తావ్' అంటూ బకెట్‌తో ఆమెపై నీళ్లు పోసి చేయి పట్టుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. అతడి నుంచి తప్పించుకొని పరుగుపెట్టిన బాలిక తల్లిదండ్రుల వద్దకు వెళ్లి విషయం చెప్పింది. దీంతో వారు తమ బంధువులతో కలసి వెళ్లి సురేశ్‌ను నిలదీశారు. ఈ క్రమంలోనే సురేశ్ బాలికను జడ పట్టుకొని తన్నడంతో పాటు.. తన స్నేహితులతో కలసి తల్లిదండ్రులపై కత్తులతో దాడి చేశాడు. ఈ క్రమంలోనే తన గొంతు తెగిందని.. తన భార్యకు తీవ్ర గాయమైందని బాలిక తండ్రి నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సురేశ్‌తోపాటు ప్రవీణ్ అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుల నుంచి కత్తులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో ప్రమేయమున్న ఎవరినీ విడిచిపెట్టబోమని పోలీసులు తెలిపారు.

భక్తుల ఇంటికే రాములోరి కల్యాణ తలంబ్రాలు

- రూ.151 చెల్లించి నమోదు చేసుకోవాలి: సజ్జనార్

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో ఏప్రిల్ 17న జరగనున్న శ్రీ సీతారామచంద్రుల కల్యాణోత్సవ తలంబ్రాలను భక్తులకు అందించేందుకు టీఎస్ఆర్టీసీ సిద్ధమైంది. ఈమేరకు ముషీరాబాద్ బస్ భవన్‌లో సోమవారం భద్రాద్రి శ్రీ సీతారాముల కల్యాణ తలంబ్రాల బుకింగ్ పోస్టర్‌ను సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ఆవిష్కరించి తలంబ్రాల బుకింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాదిలాగే ఈసారి రాష్ట్ర దేవాదాయ శాఖ సహకారంతో రాములోరి కల్యాణ తలంబ్రాలను భక్తుల ఇంటికి చేర్చే కార్యక్రమానికి టీఎస్ఆర్టీసీ శ్రీకారం చుట్టిందన్నారు. ఈ తలంబ్రాలు కోరుకునే భక్తులు టీఎస్ఆర్టీసీ లాజిస్టిక్స్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని, కల్యాణోత్సవం అనంతరం ఈ తలంబ్రాలు భక్తులకు ఆర్టీసీ హోం డెలివరీ చేస్తుందని తెలిపారు. తలంబ్రాలను పొందాలనుకునే భక్తులు ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-23450033, 040-69440000, 040-69440069ను సంప్రదించవచ్చన్నారు.

నంద్యాల టీడీపీ ఇన్‌చార్జికి హైకోర్టులో ఊరట

- నేటి వరకు అరెస్టు చేయకూడదని ఆదేశం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఓ భూ వివాదం కేసులో ఏపీలోని నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఐపీఎస్ మాండ్ర శివానందరెడ్డి, ఆయన కుటుంబ సభ్యులకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఉపశమనం లభించింది. వారిని మంగళవారం వరకు అరెస్ట్ చేయరాదని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. అక్రమ పత్రాలను సృష్టించి, రాజేంద్రనగర్ మండలం బుద్వేల్‌లో 26ఎకరాల ప్రభుత్వ భూములను కబ్జాచేశారనే ఆరోపణలపై కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు.. వారిని అరెస్ట్ చేసేందుకు నంద్యాల వెళ్లారు. ఈ నేపథ్యంలో శివానందరెడ్డి, ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్క హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ విజయ్‌సేన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై పోలీసుల వైఖరి తెలియజేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 2 వరకు పిటిషనర్లను అరెస్టు చేయరాదని.. ఒకవేళ అరెస్టుచేసే పక్షంలో వ్యక్తిగత బాండ్లపై విడుదల చేయాలని పేర్కొంది. పిటిషనర్లు సీసీఎస్ పోలీసులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేసింది. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ప్రభుత్వ భూములు కబ్జాచేశారని శివానందరెడ్డి, ఆయన కంపెనీ, కుటుంబ సభ్యులపై 2022లో కేసు(క్రైమ్ నంబర్ 194/22) నమోదైంది. కాగా.. ఈ కేసులో కనిష్క, ప్రశాంత్‌రెడ్డి, ఉమాదేవిని సీసీఎస్‌కు తీసుకువచ్చామని పోలీసులు వివరించారు. శివానందరెడ్డిని అరెస్టు చేసేందుకు నంద్యాలలోని అల్లూరుకు వెళ్లగా కొంతమంది తమను అడ్డుకున్నారని, శివానందరెడ్డి పారిపోయేందుకు సహకరించారని తెలిపారు. దీనిపై బ్రాహ్మణ కొట్కూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని వెల్లడించారు. నిందితులను కోర్టు ఆదేశాలతో వ్యక్తిగత బాండ్‌పై విడిచిపెట్టామని, మంగళవారం ఉదయం 11.30కు వారు సీసీఎస్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

వివేకం సినిమా ప్రదర్శనను ఆపండి

- హైకోర్టులో వివేకా హత్య కేసు నిందితుడు దస్తగిరి వ్యాజ్యం

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి బయోపిక్‌గా చెబుతున్న 'వివేకం' సినిమాను యూట్యూబ్, ఓటీటీలలో ప్రదర్శించకుండా నిలుపుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వివేకా హత్య కేసు నిందితుడు షేక్ దస్తగిరి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను సీబీఐ, పులివెందుల కోర్టులో ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఆ సినిమా తీశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనను అభాసుపాలు చేసేలా సినిమాలో తన పేరు వాడారని, తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున ఆ సినిమా ప్రదర్శనను నిలుపుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్ మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఎదుట విచారణకు రానుంది.

ఏపీకి ఐదు టీఎంసీలు ఇవ్వండి

- కేఆర్‌ఎంబీని కోరిన జల వనరుల శాఖ

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాలను కేటాయింపుల కంటే తక్కువగా వినియోగించినందున ఏపీకి రావాల్సిన వాటా మేరకు ఐదు టీఎంసీలను నాగార్జున సాగర్ కుడి కాలువ ద్వారా విడుదల చేయాలని కేఆర్ఎంబీని రాష్ట్ర జల వనరుల శాఖ కోరింది. ఈమేరకు కేఆర్ఎంబీ ఛైర్మన్‌కు రాష్ట్ర జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ సి.నారాయణరెడ్డి సోమవారం లేఖ రాశారు. ఈనెల 8 నుంచి రోజుకు 5500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేయాలని కేఆర్ఎంబీని ఏపీ అభ్యర్థించింది. 2023 అక్టోబరు నుంచి 2024 ఏప్రిల్ దాకా శ్రీశైలం జలాశయం నుంచి ఏపీ 26.98 టీఎంసీలు, తెలంగాణ 17.60 టీఎంసీలు వినియోగించాయని వెల్లడించింది. నాగార్జునసాగర్ నుంచి ఏపీ 15.477 టీఎంసీలు, తెలంగాణ 24.791 టీఎంసీలు.. మొత్తంగా ఏపీ 42.457 టీఎంసీలు, తెలంగాణ 42.391 టీఎంసీలు వినియోగించాయని ఏపీ వెల్లడించింది. కేటాయించిన 45 టీఎంసీల కంటే ఏపీ తక్కువగా వినియోగిస్తే, తెలంగాణ మాత్రం కేటాంపులు 35 టీఎంసీల కంటే 7.391 టీఎంసీలను అధికంగా వినియోగించిందని కేఆర్ఎంబీకి ఏపీ వివరించింది.

బీఆర్ఎస్ కోసం స్పెషల్ టాస్క్!

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. "ప్రభాకర్‌రావు బాధ్యతలు చేపట్టాక.. ఒక క్రమ పద్ధతిలో ఒకే సామాజిక వర్గానికి చెందిన అధికారులను తన కోటరీ(ఇంటెలిజెన్స్, ఎస్ఐబీ, టాస్క్‌ఫోర్స్)లో నియమించుకున్నారు. రాధాకిషన్ 2017లో టాస్క్‌ఫోర్స్ డీసీపీగా బాధ్యతలు చేపట్టారు. 2020 ఆగస్టులో పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత రెండుసార్లు ఆయన పదవీకాలాన్ని ప్రభుత్వం పొడిగించింది. 2023 ఆగస్టులోనూ మూడేళ్లపాటు ఆయన టాస్క్‌ఫోర్స్ డీసీపీగా కొనసాగేలా ఉత్తర్వులిచ్చింది. రాధాకిషన్‌కు ఈ గౌరవం దక్కడానికి ప్రభాకర్‌రావే కారణం. అంతేకాదు.. తన కోటరీలో మాజీ అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, వేణుగోపాల్‌రావు, డీఎస్పీ ప్రణీత్‌రావును నియమించుకున్నారు. రాధాకిషన్‌కు అనుకూలంగా ఉండే గట్టుమల్లును టాస్క్‌ఫోర్స్ వెస్ట్‌జోన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. రాధాకిషన్‌కు పరిచయం ఉన్న ఓ వ్యక్తిద్వారా ప్రణీత్‌రావును ఎస్ఐబీలో తీసుకున్నారు. ప్రణీత్‌రావు కోసం ఎస్ఐబీలో 'స్పెషల్ ఆపరేషన్స్ టీమ్'ను ఏర్పాటు చేశారు. ప్రభాకర్‌రావు వద్ద ప్రణీత్‌రావు పనిచేసేవారు. ఫోన్ ట్యాపింగ్‌లో.. బెదిరింపుల్లో.. ఎన్నికల సమయంలో నగదు పట్టివేతలో వీరు కీలక పాత్ర పోషించారు. ఎన్నికల సమయంలో వీరిని 'స్పెషల్ ఆపరేషన్ టీం'గా పేర్కొన్నారు. ఈ నలుగురిని వేర్వేరు జిల్లాలు/నగరాలు/కమిషనరేట్లకు ఇన్‌చార్జులుగా నియమించారు. అలా హైదరాబాద్ నగరంలో తిరుపతన్న, రాచకొండలో భుజంగరావు, సైబరాబాద్‌లో వేణుగోపాల్‌రావు, నల్లగొండలో ప్రణీత్‌రావు టీమ్‌లు పనిచేశాయి. ప్రభాకర్‌రావు నుంచి వచ్చే ఆదేశాల మేరకు వీరు తమ బృందాలతో దాడులు చేసి, ప్రత్యర్థి పార్టీల నేతలకు చెందిన నగదును సీజ్ చేశారు" అని దర్యాప్తు అధికారులు రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేశారు. వీరంతా స్నాప్ చాట్, సిగ్నల్ యాప్, వాట్సాప్‌లోనే సమాచారాన్ని అందిపుచ్చుకునేవారని వివరించారు. వీరి మధ్య ఫోన్ కాల్స్ సిగ్నల్ యాప్‌లోనే జరిగేదని, ప్రభాకర్‌రావు కూడా తరచూ క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందో



తెలుసుకునేందుకు ఫోన్ చేసేవారని రాధాకిషన్ అంగీకరించినట్లు పేర్కొన్నారు.

ప్రత్యర్థుల ఆర్థిక మూలాలపై దెబ్బ

బీఆర్ఎస్‌కు తిరుగులేని మెజారిటీ కట్టబెట్టేందుకు ప్రభాకర్‌రావు అహరహం శ్రమించేవారని, తమ టీమ్‌లలో ఎవరు ఆయనను కలిసినా.. బీఆర్ఎస్‌ను గెలిపించుకోవాలని చెప్పేవారని రాధాకిషన్ పేర్కొన్నట్లు రిమాండ్ రిపోర్టు చెబుతోంది. "2018 ఎన్నికల్లో శేరిలింగంపల్లి టీడీపీ అభ్యర్థి ఆనంద్‌సాయికి చెందిన రూ.70 లక్షల నగదును సికింద్రాబాద్ ప్యారడైజ్ వద్ద సీజ్ చేశారు. దుబ్బాక ఉప ఎన్నిక సమయంలో రఘునందన్‌రావు(బీజేపీ) బంధువులకు చెందిన చిట్‌ఫండ్ కంపెనీలో రూ.కోటిని సీజ్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహచరుల నుంచి రూ.3.5కోట్ల నగదు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలోని గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సీజ్ చేశారు. ఫోన్‌ట్యాపింగ్‌ల ద్వారానే ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్‌లో చేరేలా చేశారు. బీఆర్ఎస్‌లోనూ అనుమానాస్పద నేతలు అనుకున్న వారి ఫోన్లను ట్యాప్ చేశారు" అని కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో పోలీసులు వెల్లడించారు.

తమ వారి కోసం నగదు చేరవేత

ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ నేతల కోసం పదుల సంఖ్యలో టాస్క్‌ఫోర్స్ వాహనాలను ఉపయోగించుకుని, నగదును వేర్వేరు ప్రాంతాలకు చేరవేసినట్లు రాధాకిషన్ ఒప్పుకొన్నట్లు పంజాగుట్ట పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. "బీఆర్ఎస్‌కు చెందిన ఓ ఎమ్మెల్సీకి టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఒకరు స్వయంగా డబ్బు అందజేశారు. 2023 ఎన్నికల సమయంలో టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు నగదు తరలింపులో కీలక పాత్ర పోషించారు. రాధాకిషన్‌కు బాల్య స్నేహితుడైన ఓ ఎమ్మెల్సీ కోసం రాజ్‌పుష్ప సంస్థ నుంచి భారీ ఎత్తున నగదును తరలించారు" అని ఆ రిమాండ్ రిపోర్టులో స్పష్టం చేశారు.

నా ఫోన్ ట్యాప్ చేశారు: కాంగ్రెస్ నేత

ఫోన్ ట్యాపింగ్‌పై సిరిసిల్లకు చెందిన కాంగ్రెస్ నేత కె.కె.మహేందర్‌రెడ్డి సోమవారం హైదరాబాద్ సీపీ శ్రీనివాస్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులు తన ఫోన్‌ను కూడా ట్యాపింగ్ చేశారని, తనపై నిఘా పెట్టి, కుట్రపన్నారని భావిస్తున్నట్లు వివరించారు. సిరిసిల్ల వార్‌రూమ్ ద్వారా తనను ఓడించడానికి కుట్ర చేశారని ఆరోపించారు.

సూత్రధారి ఎవరు?

ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టయిన పోలీసులంతా.. "ప్రభాకర్‌రావు చెప్పినట్లు చేశాం" అని వాంగ్మూలమిచ్చారు. ప్రభాకర్‌రావుతో ఫోన్‌ట్యాపింగ్‌లు చేయించిందెవరు? అనే ప్రశ్నకు మాత్రం దర్యాప్తు అధికారులు సమాధానాలను రాబట్టలేకపోయారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌రావును విచారిస్తే తప్ప.. అసలు 'బాస్' ఎవరు అనేది తెలియదని స్పష్టమవుతోంది. ఆయన నోరు తెరిస్తే తప్ప.. ఈ కేసులో ఉన్న కీలక సూత్రధారులైన రాజకీయ నాయకులు ఎవరనేది తెలిసే అవకాశాలు లేవు. కాగా.. ఈ కేసులో అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న పోలీసు కస్టడీ మంగళవారం సాయంత్రంతో ముగియనుంది. రాధాకిషన్ కస్టడీకి పంజాగుట్ట పోలీసులు వేసిన పిటిషన్‌పై తీర్పును నాంపల్లి కోర్టు న్యాయమూర్తి మంగళవారానికి రిజర్వ్ చేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే

కఠిన చర్యలు

- యాసంగి ధాన్యం సేకరణ వేగవంతం
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్

హైదరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతమవుతున్నదని, సేకరణ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రకటించారు. నిరుడు 66.84 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా ఈసారి 75.40 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల సంఖ్య గతంలో 7,037 ఉండగా... ఈసారి 7,149కి పెంచినట్లు వెల్లడించారు. మార్చి 25న కొనుగోళ్లు ప్రారంభించామని, ఇప్పటి వరకు 121 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సెంటర్లకు తీసుకురావాలని కోరారు. నిర్వాహకులు కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కు కొనుగోలు చేయాలని, అంతకంటే తక్కువ ధరకు కొనుగోలు చేయకూడదని సూచించారు. రైతులు మధ్యవర్తుల దోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకోవాలని కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు, అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చౌహాన్ తెలిపారు. రైస్‌మిల్లర్లు, వ్యాపారులు కనీస మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యం కొనుగోలు చేయవద్దని, ఒకవేళ కొనుగోలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాల వద్దే విక్రయించాలని, సాధారణ వరికి క్వింటాలుకు రూ. 2,183, గ్రేడ్- ఏ రకానికి రూ. 2,203 చొప్పున ఎమ్మెస్పీ నిర్ణయించినట్లు తెలిపారు. ఏమైనా సమస్యలు ఉంటే.. టోల్ ఫ్రీ నెంబరు- 1967కు గానీ, 1800 4250 0333 నెంబర్లకుగాని ఫోన్ చేసి రైతులు ఫిర్యాదు చేయవచ్చని కమిషనర్ తెలిపారు. కాగా, జీలుగ, జనుము, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు వచ్చే ఖరీఫ్ సీజన్‌కుగాను 1.30 లక్షల క్వింటాళ్ల విత్తనాలు సరఫరాకు రూ. 75 కోట్లు అవసరమని వ్యవసాయ కమిషనరేట్ ప్రతిపాదనలు పంపింది.

కోకో రైతులకు లాభాల పంట

- భారీగా పెరుగుతున్న కోకో గింజల ధర
- ప్రస్తుతం కిలో రూ.750లకు కొనుగోళ్లు



దమ్మపేట, ఏప్రిల్ 1: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయిల్‌పామ్, కొబ్బరితోటల్లో అంతర పంటగా సాగవుతున్న కోకో పంట రైతులకు లాభాల రుచి చూపిస్తోంది. చాక్లెట్ల తయారీలో వినియోగించే కోకో గింజలకు అంతర్జాతీయంగా మంచి డిమాండ్ ఉండడంతో రైతులు అదనపు ఆదాయం పొందుతున్నారు. గత పదేళ్లలో ఏన్నడూ లేని విధంగా ప్రస్తుతం మార్కెట్‌లో కోకో గింజల ధర కిలో రూ.750లుగా ఉంది. ఒక్క ఏడాదిలోనే కిలో రూ.500వరకు పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో పామాయిల్, కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో పంటను రైతులు సాగు చేస్తున్నారు. కోకో గింజల ధర రికార్డు స్థాయిలో పెరుగుతుండటంతో రైతులకు భారీగా ఆదాయం సమకూరుతోంది. గత ఏడాది అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో ధర ఎక్కువగా ఉన్నా మన రాష్ట్రంలో కోకోకు మార్కెట్ సౌకర్యం లేకపోవటంతో స్థానికంగా కంపెనీలు నామమాత్ర ధరకే పంటను కొలుగోలు చేశాయి. గతంలో కిలో కోకో గింజలకు రూ.150 మాత్రమే చెల్లించేవారు. అదికూడా ఏపీకి తీసుకెళ్లి విక్రయించాల్సి వచ్చేంది. ఈ గింజలను ఎక్కువగా క్యాడ్‌బరీ కంపెనీ మాత్రమే కొనుగోలు చేసేది. కానీ ఈ సంవత్సరం పలు కంపెనీల ప్రతినిధులు, మధ్యవర్తులు రైతుల వద్దకే వచ్చి కోకో గింజలు కొనుగోలు చేస్తున్నారు. కోకో పంటను భద్రాద్రి జిల్లా దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో సుమారు రూ.8వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

థర్మల్‌కు స్వస్తి..!

- సంప్రదాయేతర ఇంధన వనరులపైనే దృష్టి
- సోలార్, పంప్డ్‌స్టోరేజీ, జలవిద్యుత్తువైపే మొగ్గు
- కొత్త విద్యుత్తు పాలసీపై రేవంత్ సర్కారు నజర్



హైదరాబాద్, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): థర్మల్ విద్యుత్తుకు స్వస్తి పలికి.. గ్రీన్ ఎనర్జీ వైపు అడుగులు వేయాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోంది. థర్మల్ విద్యుత్తుతో ఏ మాత్రం గిట్టుబాటు కాదని, గ్రీన్ ఎనర్జీతో కొనుగోలు ధర తగ్గుతుందని భావిస్తోంది. దాంతో ముందు థర్మల్ కేంద్రాల వైపు వెళ్లకుండా.. తక్కువ ధరకే సోలార్/పంప్డ్‌స్టోరేజీ/పవన/జలవిద్యుత్తు కేంద్రాల వైపు అడుగులు వేస్తోంది. దేశవ్యాప్తంగా సౌరవిద్యుత్తుకు యూనిట్ ధర రూ.2నుంచి రూ.2.82లోపే ఉంది. థర్మల్ విషయానికి వస్తే యూనిట్ ధర కనిష్ఠంగా రూ.5గా ఉంది. దాంతో సౌర విద్యుత్తువైపు ప్రభుత్వం దృష్టి పెట్టింది. థర్మల్‌తోపాటు సౌర విద్యుత్తును కలుపుకొంటే.. సగటు కొనుగోలు వ్యయం తగ్గుతుందని భావిస్తోంది. ప్రస్తుతం సగటు విద్యుత్తు కొనుగోలు వ్యయం యూనిట్‌కు రూ.4.46 నుంచి రూ.4.50దాకా ఉంది. ఇప్పుడు సౌరవిద్యుత్తు వాటాను భారీగా పెంచితే యూనిట్‌కు రూ.1దాకా తగ్గుతుంని అంచనా వేస్తోంది. అదే జరిగితే విద్యుత్తు కొనుగోలు వ్యయం తగ్గి.. క్రమంగా ప్రభుత్వం డిస్కమ్‌లకు ఇచ్చే సబ్సిడీ కూడా గణనీయంగా తగ్గే అవకాశాలుంటాయి. కాగా, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అవసరాలకు గాను 2,400 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుత్తు ప్లాంట్లను నిర్మించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎన్టీపీసీతో ఒప్పందం కుదుర్చుకోవాలి. ఆ ప్లాంట్లు వద్దని తెలంగాణ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఆ మేరకు సోలార్ ప్లాంట్ల నిర్మాణానికి సిద్ధమేనన్నట్లు కేంద్రం సూత్రప్రాయంగా రాష్ట్రానికి సమాచారం ఇచ్చింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

తెలంగాణ పవర్ పాలసీ

విద్యుత్తు రంగంలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని, నష్టాల నుంచి బయట పడేందుకు కొత్త పాలసీ తీసుకురావాలని సర్కారు యోచిస్తోంది. విద్యుదుత్పత్తి వ్యయాన్ని తగ్గించుకుంటూనే.. పునరుత్పాదక విద్యుదుత్పత్తి, సరఫరాను ప్రోత్సహించడం, తక్కువ ధరకు విద్యుత్తు సరఫరా చేసే ప్రైవేటు కంపెనీలను ఆహ్వానించడం, పీపీపీ పద్ధతిలో విద్యుదుత్పత్తి, సరఫరా వ్యవస్థలను బలోపేతం చేయాలనే లక్ష్యాలతో కొత్త పాలసీని రూపొందిస్తున్నారు. భవిష్యత్తులో వినియోగదారులపై కరెంట్ చార్జీల భారం పడకుండా దేశానికి ఆదర్శంగా ఉండేలా తెలంగాణ పవర్ పాలసీ ఉండేలా ముసాయిదాను సిద్ధం చేసినట్లు తెలిసింది. తక్కువ ధరతో ఎక్కువ మొత్తంలో పునరుత్పాదక విద్యుదుత్పత్తి, సరఫరాకు ముందుకు వచ్చే ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. పునరుత్పాదక విద్యుదుత్పత్తి ప్లాంట్లు రెండేళ్లలోనే అందుబాటులోకి వస్తాయి. సౌర విద్యుత్తును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు గరిష్ఠంగా పెరిగే విద్యుత్తు డిమాండ్‌ను తీర్చడానికి సౌర విద్యుత్తుపై అధికంగా ఆధారపడాలని ప్రభుత్వం భావిస్తోంది.

సబ్‌స్టేషన్ల పరిధిలో సోలార్ ప్లాంట్లు

రాష్ట్రంలోని అన్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో సోలార్ ప్లాంట్లను నెలకొల్పేందుకు కొత్త పాలసీలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల(ఎస్‌హెచ్‌జీ) ఆధ్వర్యంలో సోలార్ ప్లాంట్లు నెలకొల్పాలని ప్రభుత్వం భావిస్తోంది. సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే ప్రైవేటు కంపెనీలు, వ్యక్తులకు ఇందులో భాగస్వామ్యం కల్పించనుంది. రాష్ట్రంలో ఉన్న మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టుల ద్వారా పంప్ స్టోరేజీ విద్యుత్తును ఉత్పత్తి చేసే అవకాశాలను కూడా అధ్యయనం చేస్తోంది. ఇప్పటికే ఉన్న రిజర్వాయర్లతోపాటు నిర్మాణంలో ఉన్న వాటి పరిధిలో 6,732 మెగావాట్ల పంప్ స్టోరేజీ విద్యుత్తు ఉత్పత్తికి అవకాశాలున్నాయని విద్యుత్తు సంస్థలు గతంలోనే అంచనా వేసిన విషయం తెలిసిందే.!

జప్తుకు నోటీసులిచ్చిన భూముల్ని అమ్మేశారు!

- నోటీసులిచ్చిన తహసీల్దారే పట్టా మార్చేశారు!!
- రైతు బీమా సొమ్ము రికవరీకి కలెక్టర్ ఆదేశాలు
- ఆ భూములనే పక్కదారి పట్టించిన ఘనులు
- మంచిర్యాల జిల్లా దండేపల్లిలో అక్రమాలు
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్

మంచిర్యాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలతో రైతు బీమా సొమ్మును కాజేసిన వ్యక్తుల నుంచి సొమ్ము రికవరీ కోసం వారి భూములను జప్తు చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆ ఆదేశాల మేరకు తహసీల్దారు డిమాండ్ నోటీసు ఇచ్చారు. తమ భూములను జప్తు చేసేస్తారని భావించిన అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా ఆ భూములను ఇతరులకు అమ్మేశారు. అయితే జప్తు చేస్తామంటూ నోటీసులిచ్చిన తహసీల్దారే ఆ భూములకు ఇతరుల పేరిట పట్టాలు ఇచ్చేయడం విశేషం! ఆలస్యంగా వెలుగుచూసిన ఈ బాగోతం మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. దండేపల్లి మండలం కొర్విచెల్మ గ్రామానికి చెందిన గోపతి రాజయ్య సవరించిన ఆధార్ నంబర్ 748865295542 ద్వారా పుట్టిన తేదీని 01-01-1970గా చూపుతూ 14-08-2020న రైతు బీమాకు దరఖాస్తు చేసుకున్నారు. రాజయ్య 28-08-2020న అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో రాజయ్య పేరిట తయారు చేసిన తప్పుడు ఆధార్‌కార్డు, ఇతర ధ్రువీకరణ పత్రాలతో ఆయన కుమారుడు గోపతి నారాయణ రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోగా 29-09-2020న రూ.5 లక్షలు మంజూరయ్యాయి. మరో ఘటనలో దండేపల్లి మండలం ముత్యంపేటకు చెందిన బత్తుల రాజలింగయ్య ఆధార్ నంబర్ 672964446204 ద్వారా 01-01-1970 పుట్టిన తేదీని సవరిస్తూ 05-11-2018న రైతు బీమాకు దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం రాజలింగయ్య 05-05-2019న వడదెబ్బకు గురై మృతి చెందగా.. ఆయన కుమారుడు తిరుపతి రైతు బీమాకు దరఖాస్తు చేసుకోగా 09-07-2019న రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ రెండు ఘటనల్లో అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో 'రైతు బీమా పక్కదారి' శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన నాటి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అప్పటి కలెక్టర్ భారతీ హోళికేరి ఆదేశాల మేరకు మంచిర్యాల ఆర్డీవో విచారణ చేపట్టారు. దండేపల్లి తహసీల్దార్ హన్మంతరావు, ఎంపీడీవో శ్రీనివాస్ సమక్షంలో రైతుబీమా పొందిన బత్తుల రాజలింగయ్య, గోపతి రాజయ్య కుటుంబ సభ్యులను వేర్వేరుగా విచారించారు. అక్రమ మార్గంలో రూ.5 లక్షల చొప్పున రైతు బీమా సొమ్ము పొందినట్లు గుర్తించారు. వెంటనే లబ్ధిదారుల కుటుంబ సభ్యులతోపాటు దళారులుగా వ్యవహరించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రికవరీకి నోటీసులు..

అక్రమంగా బీమా సొమ్ము కాజేసిన బత్తుల రాజలింగయ్య, గోపతి రాజయ్యలకు నామినీలుగా ఉన్న బత్తుల రాజేశ్వరి, గోపతి నారాయణల నుంచి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.10 లక్షలు రికవరీ చేయాలన్న ఆర్డీవో ఆదేశాలతో దండేపల్లి తహసీల్దార్ హన్మంతరావు నోటీసులు జారీ చేశారు. నోటీసులకు స్పందించకపోవడంతో వారి భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా తహసీల్దార్ హన్మంతరావు వారికి సెక్షన్-7 కింద డిమాండ్ నోటీసులు జారీ చేశారు. కొర్విచెల్మలోని గోపతి నారాయణకు సంబంధించిన సర్వే నంబర్లు 52/6/1లో 1.2 ఎకరాలు, 236/5/1లోని 0.22 ఎకరాల భూములతోపాటు ముత్యంపేటలోని బత్తుల రాజేశ్వరికి సంబంధించిన సర్వే నంబర్లు 5/అ.లో 0.4 ఎకరాలు, 39/అ.లో 0.1 ఎకరాలు, 39/ఆ.లో 0.32 ఎకరాలను జప్తు చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు.

చేతులు మారిన భూములు..

జప్తు చేస్తామంటూ తహసీల్దారు నోటీసులిచ్చిన భూములు ప్రస్తుతం చేతులు మారాయి. గోపతి నారాయణకు చెందిన సర్వే నంబరు 52/6/1లోని 1.2 ఎకరాలు కార్కూరి శ్రీనివాస్ పేరిట పట్టాగా మారగా, ధరణి పోర్టల్‌లో నమోదు కూడా అయ్యాయి. అయితే, జప్తు చేస్తామంటూ నోటీసు ఇచ్చిన తహసీల్దారే స్వయంగా పట్టా మార్పిడి చేయడం కొసమెరుపు. ప్రస్తుతం సదరు భూముల ధర ఎకరాకు రూ.50 లక్షల మేర పలుకుతోంది. అధికారుల ప్రోత్సాహంతోనే ఇతరులకు విక్రయించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపి ప్రభుత్వ సొమ్ము రికవరీ చేయడంతోపాటు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● మంగళవారం 2 ఏప్రిల్ 2024



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి- పోస్ట్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏపీ పీజీ సెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్‌ను విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ నిర్వహిస్తోంది. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు సహా ప్రభుత్వ, ప్రైవేట్, అనుబంధ, మైనారిటీ కళాశాలల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంసీజే, ఎం.లైబ్రరీ సైన్స్, ఎంఈడీ, ఎంపీఈడీ, ఎమ్మెస్సీ టెక్నాలజీ కోర్సులు ఉన్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు అలాగే తెలుగు రాష్ట్రాలు మినహా ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ప్రతి కోర్సులో 10 శాతం సూపర్‌న్యూమరరీ సీట్లు ప్రత్యేకించారు.

ఏపీ పీజీ సెట్ నోటిఫికేషన్

అడ్మిషన్స్ ఇచ్చే యూనివర్సిటీలు: ఆంధ్ర, శ్రీ వేంకటేశ్వర, శ్రీ కృష్ణదేవరాయ, ఆచార్య నాగార్జున, శ్రీ పద్మావతి మహిళ, యోగి వేమన, రాయలసీమ, విక్రం సింహపురి, ద్రవిడియన్, కృష్ణ, ఆది కవి నన్నయ, డా.బీ.ఆర్.అంబేద్కర్, డా.అబ్దుల్ హక్ ఉర్దు, క్లస్టర్, ఆంధ్ర కేసరి, జేఎన్‌టీయూఏ - ఓటీపీఆర్ఐ, స్విమ్స్-తిరుపతి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్నవారు కూడా అర్హులే. ఎంఏ ఎకనామిక్స్‌లో ప్రవేశానికి బీకాం అభ్యర్థులు; ఎంఏ(లాంగ్వేజెస్)లో ప్రవేశానికి బీఈ, బీటెక్, బీఫార్మసీ అభ్యర్థులు అనర్హులు.

ఏపీ పీజీ సెట్ 2024 వివరాలు: పీజీసెట్ 2024ను మూడు కేటగిరీల్లో నిర్వహిస్తారు. మొదటి కేటగిరీలో ఆర్ట్స్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్; రెండో కేటగిరీలో కామర్స్, ఎడ్యుకేషన్; మూడో కేటగిరీలో సైన్సెస్ సంబంధిత సబ్జెక్టుల్లో పరీక్షలు ఉంటాయి.

- **మొదటి కేటగిరీ టెస్ట్‌లు:** ఇంగ్లీష్, జనరల్, తెలుగు, లిటరేచర్, సంస్కృతం, హిందీ, ఉర్దూ, తమిళం, బీఎఫ్ఏ, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్ అండ్ మ్యూజిక్, పర్ఫామింగ్ ఆర్ట్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్, టూరిజం
- **రెండో కేటగిరీ టెస్ట్‌లు:** కామర్స్, ఎడ్యుకేషన్, ఫిజికల్ ఎడ్యుకేషన్
- **మూడో కేటగిరీ టెస్ట్‌లు:** లైఫ్ సైన్సెస్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్సెస్, బోటనీ, సెరీకల్చర్, జువాలజీ, మేథమెటికల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్, ఫిజికల్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, కెమికల్ సైన్సెస్, పాలిమర్ సైన్స్, జియాలజీ, సైకాలజీ, కంప్యూటర్ సైన్స్, జాగ్రఫీ
- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అనాలజీస్, క్లాసిఫికేషన్, మ్యాచింగ్, కాంప్రహెన్షన్ ఆఫ్ రిసెర్చ్ స్టడీ, ఎక్స్‌పెరిమెంటల్, థియరిటికల్ ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే కనీసం 35 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఎంపీఈడీ కోర్సుకు మాత్రం అభ్యర్థులు క్రీడల్లో సాధించిన విజయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. దీనికి కూడా 100 మార్కులు కేటాయించారు. అభ్యర్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయుల్లో సాధించిన విజయాలకు సంబంధించిన సర్టిఫికెట్లను దరఖాస్తుకు జతచేయాలి.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.850; బీసీ అభ్యర్థులకు రూ.750; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.650
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 4
- **కరెక్షన్ విండో ఓపెన్:** మే 27 నుంచి 29 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మే 31 నుంచి
- **ఏపీ పీజీ సెట్ 2024 తేదీలు:** జూన్ 10 నుంచి 14 వరకు
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in

రైల్వేలో టెక్నీషియన్లు

మొత్తం ఖాళీలు: 9144

దేశ వ్యాప్తంగా వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్ నోటిఫికేషన్ విడుదల చేసింది. రాత, వైద్య పరీక్షల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఆర్ఆర్‌బీ రీజియన్లు: అహ్మదాబాద్, అజ్మీర్, బెంగళూరు, భోపాల్, భువనేశ్వర్, బిలాస్‌పూర్, చండీగఢ్, చెన్నై, గువాహటి, జమ్మూ అండ్ శ్రీనగర్, కోల్‌కతా, మాల్డా, ముంబయి, ముజఫర్‌పూర్, పట్నా, ప్రయాగ్‌రాజ్, రాంచీ, సికింద్రాబాద్, సిలిగురి, తిరువనంతపురం, గోరఖ్‌పూర్.

1. **టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: 1,092 పోస్టులు**
2. **టెక్నీషియన్ గ్రేడ్-3: 8,052 పోస్టులు**

- మొత్తం ఖాళీల్లో ఆర్ఆర్‌బీ సికింద్రాబాద్ పరిధిలో 744 పోస్టులున్నాయి.

అర్హతలు

టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్: బీఎస్సీ, బీఈ/బీటెక్, డిప్లొమా(ఫిజిక్స్/ఎలక్ట్రానిక్స్/కంప్యూటర్ సైన్స్/ఐటీ/ఇన్‌స్ట్రుమెంటేషన్) ఉత్తీర్ణులై ఉండాలి.

టెక్నీషియన్ గ్రేడ్-3: మెట్రిక్యులేషన్/ఎస్ఎస్ఎల్‌సీ, ఐటీఐ(ఎలక్ట్రీషియన్/ వైర్‌మన్/ఎలక్ట్రానిక్స్ మెకానిక్/మెకానిక్ పవర్ ఎలక్ట్రానిక్స్/మెకానిక్/ఫిట్టర్/వెల్డర్/పెయింటర్ జనరల్/మెషినిస్ట్/ కార్పెంటర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/మెషినిస్ట్/మెకానిక్/మెకానిక్ మెకట్రానిక్స్/మెకానిక్ డీజిల్/మెకానిక్(మోటార్ వెహికిల్)/టర్నర్/ఆపరేటర్ అడ్వాన్స్‌డ్ మెషిన్ టూల్/గ్యాస్ కట్టర్/హీట్ ట్రీటర్/ఫౌండ్రీమన్/ప్యాటర్న్ మేకర్/మౌల్డర్ తదితరాలు). లేదా 10+2(ఫిజిక్స్, మేథ్స్) ఉత్తీర్ణులై ఉండాలి.

ప్రారంభ వేతనం: నెలకు టెక్నీషియన్ గ్రేడ్-1 సిగ్నల్ పోస్టులకు రూ.29,200. టెక్నీషియన్ గ్రేడ్-3 పోస్టులకు రూ.19,900.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికోద్యోగులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్, మైనారిటీ, ఈబీసీ అభ్యర్థులకు రూ.250. ఇతరులకు రూ.500.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష(కంప్యూటర్ బేస్డ్ ఆప్టిట్యూడ్ టెస్ట్), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 8

వెబ్‌సైట్: https://indianrailways.gov.in/

సిపెట్ అడ్మిషన్ టెస్ట్

చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సిపెట్)- అడ్మిషన్ టెస్ట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా డిప్లొమా, పీజీ డిప్లొమా, పోస్ట్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. వయో పరిమితి నిబంధనలు లేవు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి. హైదరాబాద్ క్యాంపస్‌లో అన్ని ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. విజయవాడ క్యాంపస్‌లో పోస్ట్ డిప్లొమా ప్రోగ్రామ్ లేదు. మహిళలకు, పురుషులకు విడివిడిగా వసతి సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్‌లకు ఏఐసీటీఈ, ఎన్‌బీఏ గుర్తింపులు ఉన్నాయి. వీటిలో ప్రధానంగా పాలిమర్స్, ప్లాస్టిక్స్, పెట్రోకెమికల్స్, మాన్యుఫాక్చరింగ్, మెకానికల్ విభాగాలకు సంబంధించి ప్రొఫెషనల్/టెక్నికల్ ట్రెయినింగ్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా స్టయిపెండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్‌లు కూడా ఉంటాయి. ప్లేస్‌మెంట్ సౌకర్యం ఉంది.

డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ, ప్లాస్టిక్స్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. ప్రస్తుతం పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే.

పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ-పీపీటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: బీఎస్సీ ఉత్తీర్ణులు/చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ తరవాత రెండేళ్ల వ్యవధి గల కోర్సులు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు.

పోస్ట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ డిజైన్ విత్ క్యాడ్/క్యామ్ (పీడీ-పీఎండీ-క్యాడ్/క్యామ్): ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. మూడు సెమిస్టర్లు ఉంటాయి.

అర్హత: మూడేళ్ల డిప్లొమా(మెకానికల్/ప్లాస్టిక్స్/పాలిమర్/టూల్/టూల్ అండ్ డై మేకింగ్/ప్రొడక్షన్/ఆటోమొబైల్ ఇంజనీరింగ్-మెకట్రానిక్స్/ఆటోమొబైల్/పెట్రో కెమికల్స్/ఇండస్ట్రియల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/టెక్నాలజీ) లేదా సిపెట్ నుంచి డీపీఎంటీ/డీపీటీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అర్హులే.

సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024 వివరాలు: దీనిని కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. అర్హత కింద నిర్దేశించిన కోర్సు సిలబస్, జనరల్ నాలెడ్జ్ అంశాల నుంచి మొత్తం 50 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. జనరల్ నాలెడ్జ్ కింద స్పోర్ట్స్, హిస్టరీ, పాలిటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, కరెంట్ అఫైర్స్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. డీపీటీ, డీపీఎంటీ ప్రోగ్రామ్‌లకు నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్ నుంచి 25, సైన్స్ సబ్జెక్ట్ నుంచి 20, ఇంగ్లీష్ నుంచి 5 ప్రశ్నలు అడుగుతారు. పీజీ డిప్లొమా ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో జనరల్ నాలెడ్జ్ నుంచి 20 ప్రశ్నలు; సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10 ప్రశ్నలు; కెమిస్ట్రీ, ఫిజిక్స్, బయాలజీ, మేథ్స్ అంశాలనుంచి మరో 10 ప్రశ్నలు ఇస్తారు. పోస్ట్ డిప్లొమాకు నిర్వహించే ఎగ్జామ్‌లో జనరల్ నాలెడ్జ్ నుంచి 20; సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10; ప్లాస్టిక్స్/పాలిమర్స్ టూల్స్ రూం, ఇండస్ట్రియల్ అంశాలనుంచి మరో 10 ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష సమయం గంట. నెగెటివ్ మార్కులు లేవు.


ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **సిపెట్ అడ్మిషన్ టెస్ట్ 2024 తేదీ:** జూన్ 9
- **ఎంపికైన అభ్యర్థులకు కౌన్సెలింగ్&అడ్మిషన్ లెటర్స్ విడుదల:** జూన్ 14న
- **హైదరాబాద్ క్యాంపస్ చిరునామా:** ఐడీఏ ఫేజ్-2, చర్లపల్లి, హైదరాబాద్-500051
- **విజయవాడ క్యాంపస్ చిరునామా:** సర్వే నెం.377, సూరంపల్లి విలేజ్, గన్నవరం మండలం, విజయవాడ-521212
- **వెబ్‌సైట్:** https://cipet24.onlineregistrationform.org/CIPET/

జమిలి ఎన్నికలు

అనుకూల - ప్రతికూల వాదనలు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



(నిన్నటి దిక్సూచి తరువాయి)

అనుకూల వాదనలు

1. మూడుస్థాయిల్లోని ప్రభుత్వాలకు విడివిడిగా ఎన్నికలు నిర్వహించేకన్నా, ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం మంచిది. తద్వారా ఎన్నికల నిర్వహణకు మూడుసార్లు అయ్యే అనేక ఖర్చులు తగ్గుతాయి. దేశంపై ఆర్థికభారం తగ్గుతుంది. ఇది ప్రభుత్వంతోపాటు రాజకీయ పార్టీలకు, వాటికి నిధులిచ్చే వాణిజ్య సంస్థలకు భారం తగ్గిస్తుంది.
2. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది మొదలు, పూర్తయ్యేవరకూ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వస్తుంది. ప్రభుత్వాలు దైనందిన పాలనా కార్యక్రమాలు మినహా, కొత్త పథకాలు/ కొత్త విధానాలు చేపట్టడానికి అవకాశం ఉండదు. రెండు మూడు నెలలపాటు ఈ పరిస్థితి నెలకొంటుంది. ఏటా ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు ఒక్కోసారి లోక్‌సభ ఎన్నికలు కూడా జతయై సంవత్సరంలో సగంరోజులపాటు ఈ క్రియాశూన్యత కనిపిస్తూ ఉంటుంది. జమిలి ఎన్నికలతో అయిదు సంవత్సరాలకు ఒకసారి కొన్ని నెలలకే దీనిని పరిమితం చేయవచ్చు.
3. మానవ వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. ఎన్నికల సమయంలో భారీఎత్తున భద్రతా బలగాల తరలింపు, ప్రభుత్వాధికారులకు అదనపు పని ఒత్తిడి ఉంటుంది. జమిలి ఎన్నికల వల్ల వారిపై ఈ భారం ఒక్కసారికే పరిమితం అవుతుంది.
4. తరచూ, ఏదో ఒక స్థాయిలో ఎన్నికలు జరుగుతున్నప్పుడు నాయకులు నిరంతరం గెలుపు కోసం ప్రచారాలు, వ్యూహరచనలు చేయడంలో నిమగ్నమైపోతారు. ప్రజా సంక్షేమానికి పనిచేసే సమయం ఉండదు. అందువల్ల ప్రజలు ఎన్నకున్న ప్రతినిధుల చేతుల్లోంచి ప్రభుత్వోద్యోగుల చేతుల్లోకి పాలన వెళ్లి అది ప్రజాస్వామ్యాన్నే ప్రశ్నిస్తుంది.
5. అన్ని స్థాయిల్లో ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల దేశవ్యాప్త అంశాలపై ఎక్కువగా చర్చ జరిగి జాతీయ దృక్పథం అలవడుతుంది. సంకుచిత ప్రాంతీయవాద ఓటుబ్యాంకు రాజకీయాలకు తెరపడి, దేశ సమైక్యతకు, సమగ్రతకు తోడ్పడుతుంది.
6. తాత్కాలికంగా ఎన్నికల కోసం వైరుధ్య సిద్ధాంతాలున్న పార్టీలు అసంబద్ధ పొత్తులు పెట్టుకోవడం జమిలి ఎన్నికలతో తగ్గుతుంది. సిద్ధాంతపరమైన నిజాయితీకి పార్టీలు కట్టుపడతాయి.
7. పార్టీ ఫిరాయింపులు, ఎమ్మెల్యేల బుజ్జగింపులు వంటివి తగ్గి పాలనలో స్థిరత్వం పెరిగి పాలకులు పాలనపై దృష్టిపెట్టడానికి అవకాశం ఉంటుంది.
8. ఏవైనా కఠిన నిర్ణయాలు ప్రజాసంక్షేమం దృష్ట్యా తీసుకోవాల్సి వచ్చినప్పుడు ప్రభుత్వాలు నిర్భీతిగా వ్యవహరించవచ్చు. అయిదేళ్లకు గానీ ఎన్నికలు మరలా రానందున పదే పదే ప్రజాకర్షక ఉచిత పథకాలు వంటివి ప్రకటించాల్సిన అవసరం రెండు స్థాయిల్లోని అధికార పార్టీలకు ఉండదు. ఫలితంగా పెద్దఎత్తున ప్రజాధనం నిర్మాణాత్మక కార్యక్రమాలకు మళ్లుతుంది.
9. జమిలితో ఒకేసారి అన్నిస్థాయిల ఎన్నికల్లో ఓటు వేసే సౌలభ్యం ఉంటుంది. ఓటుహక్కు వినియోగించుకోవాలనే నైతిక ఒత్తిడి కూడా ప్రజలపై ఉండి ఓటింగ్ శాతం పెరుగుతుంది.
10. ఓటర్ల జాబితాలో సవరణలు పదేపదే చేయాల్సిన అవసరం ఎలక్షన్ కమిషన్‌కు ఉండదు. ఓటర్లు కూడా తమ ఓటుహక్కును తరచూ తనిఖీ చేసుకోవాల్సిన శ్రమ ఉండదు.
11. ఎన్నికల సమయంలో మత, సైద్ధాంతిక, ప్రాంతీయపరమైన ఉద్రిక్తలు పార్టీల ప్రయోజనాల కోసం రెచ్చగొట్టబడుతూ ఉంటాయి. ఇటువంటి వాటి సంభావ్యత జమిలి ఎన్నికల వల్ల తగ్గుతుంది.

ప్రతికూల వాదనలు

1. దేశవ్యాప్తంగా ఒకేసారి జమిలి ఎన్నికలు నిర్వహించడం అంటే పెద్దఎత్తున రవాణా, ఎన్నికల సామగ్రి అవసరమవుతుంది. ఉదాహరణకు ఇప్పుడున్న ఈవీఎంలకు రెండింతలు ఈవీఎంలు అవసరమవుతాయి. భద్రతా దళాల, మానవ వనరుల కొరత ఏర్పడుతుంది. ఈవీఎంల భద్రత కూడా ప్రశ్నార్థకం అవుతుంది. శాంతిభద్రతలు అదుపుతప్పినప్పుడు వెంటనే కట్టడి చేయడం కష్టం.
2. భారతదేశ జనాభాలో సాంకేతిక అవగాహన లేనివారు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఒకేసారి మూడు నాలుగు ఈవీఎంలను వినియోగించాలంటే వీరు గందరగోళపడి తప్పులు జరగడానికి అవకాశం ఉంది. తదుపరి ఎన్నికలప్పుడు అసలు ఓటు వేయడానికే వీరు ఉత్సాహం చూపకపోవచ్చు.
3. విడివిడిగా ఎన్నికలు జరిగినప్పుడే కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల పనితీరులపై ప్రత్యేకంగా ప్రజలు దృష్టి సారించడానికి వీలవుతుంది. ఒకేసారి ఎన్నికలు జరిగినప్పుడు జాతీయస్థాయి చర్చే ప్రధానంగా జరిగి రాష్ట్రాల్లో కూడా జాతీయ పార్టీల ప్రభావం పడే అవకాశం ఉంది. లేదా ప్రాంతీయ పార్టీల వల్ల వర్గ, మత, ప్రాంతీయ అభిమాన ప్రభావాలకు ప్రజలు గురైనప్పుడు వాటికి అనుగుణంగా ఉన్న జాతీయ పార్టీల వైపు మొగ్గు ఏర్పడుతుంది. ఏతావతా ఆయా ప్రభుత్వాల పనితీరు విస్మరించబడుతుంది.
4. ఏదో ఒక ఎన్నికలు ఉండటం వల్ల ప్రభుత్వాలు జాగరూకతతో ఉంటాయి. లేకుంటే నియంతృత్వ పోకడలకు అవకాశం ఉంది.
5. నిధులు సమకూర్చుకోవడంలో, ఎన్నికల ఖర్చులో జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడలేవు. అందువల్ల ప్రాంతీయ పార్టీల ఉనికికి ప్రమాదం ఏర్పడి ప్రాంతీయ సమస్యలు, ఆకాంక్షలు గుర్తింపునకు నోచుకోవు. ఇది అశాంతికి దారితీస్తుంది.
6. జమిలి విధానంలో రాష్ట్రాల ముఖ్యమంత్రులు సభ రద్దు, ముందస్తు ఎన్నికలను కోరే అధికారం కోల్పోతారు. కేవలం కేంద్ర ప్రభుత్వానికే ఎలక్షన్ సంబంధిత నిర్ణయాలు తీసుకొనే అవకాశం ఉండి సమాఖ్య లక్షణం ప్రశ్నార్థకమవుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్



బీర్బల్ చాతుర్యం!


అక్బర్ రాజ్యమది. అక్కడ కొలువులో ఉండే బీర్బల్‌కి మంచి పేరుంది. ఆయననే అక్బర్ ఇష్టపడేవారు. ఇది చూసి ఇద్దరికి అసూయ కలిగింది. వారిలో చాంద్ అనే వ్యక్తి అక్బర్ దగ్గర తాను ఉండాలనుకున్నాడు. ఇందుకోసం ఓ ఆలోచన వచ్చింది. దాన్ని అమలు చేయాలనుకున్నాడు. అక్బర్ తన సభలో ఆసీనులై ఉండగా అందరూ చూస్తున్నారు. అంతలోనే చాంద్ లేచి నిలబడ్డాడు. ఒక ప్రశ అడుగుతా? మీరు సమాధానం చెప్పగలరా? అసలు మీకు తెలుసా? అని బీర్బల్‌ను అడిగాడు చాంద్. తాను మనసులో 'అక్బర్ ఇది చెప్పలేడు. కచ్చితంగా తన స్థానం నాకే దక్కుతుంది' అని విర్రవీగాడు మనసులో.

'చాంద్‌గారూ అడగండి' అన్నారు బీర్బల్. 'ఏమీ లేదు. చిన్న ప్రశ్న. ఈ ఆగ్రా నగరంలో ఎన్ని పిచ్చుకలు ఉన్నాయి?' అని అడిగాడు. బీర్బల్ కంగారు పడలేదు. సహనంతో ఇలా అన్నాడు. 'అంతేనా మిత్రమా... రేపటివరకూ సమయం ఇవ్వండి' అన్నాడు. అందరూ ఆశ్చర్యంగా చూశారు. చాంద్ మాత్రం మనసులో సంతోషపడ్డాడు. మరుసటి ఉదయమే సభ ప్రారంభమైంది. రాజుతో సహా మంత్రులు, సేనాధిపతులు,



ప్రజలు ఆసీనులయ్యారు. బీర్బల్ లేచాడు. నిన్నటి ప్రశ్నకు నా జవాబు- 19, 537 అన్నాడంతే. వెంటనే చాంద్ లేచి 'ఇది అబద్ధం. వాటిని లెక్కించలేదు' అన్నాడు కోపంతో. ఒకవేళ అంతకంటే తక్కువా ఉండొచ్చు? ఎక్కువ ఉండొచ్చు? అన్నాడు. బీర్బల్ సహనంతో ఇలా అన్నాడు. '19,537 కంటే తక్కువ ఉంటే మన ఊరి పిచ్చుకలు వేరే నగరంలోని తన బంధువుల ఇంటికి వెళ్లినట్లు. ఒకవేళ ఎక్కువ పిచ్చుకలు ఉంటే ఇతర నగరాల్లోని పిచ్చుకలు మన నగరానికి వచ్చినట్లు' అన్నాడంతే. సభంతా పగలబడి నవ్వారు. శభాష్ అంటూ అక్బర్ చప్పట్లు కొట్టాడు. అందరూ చప్పట్లు కొట్టారు. బీర్బల్ చాతుర్యం, తెలివికి అందరూ ఆశ్చర్యపోవడమే కాదు ఆనందపడ్డారు. బీర్బల్‌కు బంగారు నాణెం ఇచ్చి సత్కరించాడు అక్బర్.

ఏవి ఎన్ని?




10 తేడాలు గుర్తించండి



సరైన నీడ ఏది?





డైలీ సుడోకు - 270

	3				8	4		
			5		9	1		
1	5			7		6		
					7			8
	4		3		1		2	
7			4					
		7		1			5	4
		1	7		2			
		9	8				1	

సుడోకు - 269 సమాధానం

4	8	6	5	9	7	1	2	3
3	2	9	1	6	4	5	8	7
7	5	1	3	8	2	4	9	6
5	6	4	7	1	8	9	3	2
8	9	2	4	3	6	7	5	1
1	3	7	2	5	9	6	4	8
6	1	8	9	4	3	2	7	5
2	4	3	6	7	5	8	1	9
9	7	5	8	2	1	3	6	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.